# అన్నమయ్య కృతులపై విశిష్టాద్వైత ప్రభావము



డా॥ శేషభట్టర్ వసుమతీదేవి

# అన్నమయ్య కృతులపై
# విశిష్టాద్వైత ప్రభావము

డా॥ శేషభట్టర్ వసుమతీదేవి
M.A., Ph.D.

THIS BOOK IS PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE OF
TIRUMALA TIRUPATI DEVASTHANAMS UNDER THEIR SCHEME
"AID TO AUTHORS TO PUBLISH RELIGIOUS BOOKS"

కాకతీయ విశ్వ విద్యాలయం నుండి 1999లో
డాక్టరేట్ పట్టం పొందిన సిద్ధాంత వ్యాసం

**ANNMAYYA KRUTHULAPAI VISISHTADVAITHA PRABHAVAMU**

**by Dr. S.B. VASUMATHIDEVI**

No. of Copies : 1000

First Edition : July, 2002

© Author

**Price : Rs. 75-00**

*Published by :*

**Vasumathi Publications**
Hanamkonda - Wgl.

*For Copies :*

**Dr. S.B. Vasumathidevi**
H.No. 2-6-1217, K.L.N. Reddy Colony
Subedari, Hanamkonda
Warangal. Ph. 552087

*Printed at :*

**Keshava Graphics**
Bommalagudi Street
Mattewada, Warangal
Ph. 429866

# అంకితము

అన్నమయ్య పాట అమృత సరస్సట
పద్మనాభ నీవె పద్మమయ్య
పట్టుకొంటిమి మిము బంగారు తామర
విశ్వరూప దేవ వేంకటేశ

అన్నమయ్య కృతియె అది విశిష్టాబ్జమ్ము
నీటిలోని తూడు నెరుగ ప్రకృతి
వేల రేకులన్ని వెలయంగ జీవులే
నడిమి దుద్దు నీవె నలిననాభ

తెల్లకాగితమ్ము తెలియంగ ప్రకృతియె
అక్షరాలు జీవులట్లుగాగ
అర్థభావములుగ అక్షరమ్ముల నుండి
వెలుగుతున్న దేవ వేంకటేశ

అసలు నేనె, గ్రంథ మందింతు వడ్డిగ
స్వీకరింపుమయ్య వేంకటేశ
అసలు సిసలు నిజము అంతరాత్మవు నీవె
భక్తి కొలుతు అసలు ముక్తివరకు

నిజము నీవు నేను నిజము ప్రకృతిగూడ
స్థూల సూక్ష్మ రూప సూత్రమెరిగి
అంతరంగ విభుడు ఆనంద నిలయుడే
అనుచు మనుచు భక్తి కనుచు వినుచు . . .

డా॥ వసుమతీరంగాచార్యులు

శ్రీమతే నారాయణాయ నమః

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య

## శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామివారి

# మంగళాశాసనములు




శ్రీమతి వసుమతీ దేవిగారి "[illegible]పై
విశిష్టాద్వైత ప్రభావం' గ్రంథం బాగుంది. 'విశిష్టాద్వైతం,
వైష్ణవం' అనే రెంటికీ తేడా ఉన్నదనుకొనుట చాలమందికి
క్రొత్త. శ్రీవైష్ణవ సంప్రదాయాచార్యులుగ ఆళ్వార్లు -
ఆచార్యులు ఉన్నత స్థానం పొందారు. వారి విశిష్టతను పూర్తిగా
ఆకళింపు చేసుకొని, వాటన్నింటిని కర్తవ్యాలుగా తెలియజేసిన
మీ రచన ప్రశస్తమైనది. ఈ సందర్భాన్ని సర్వేశ్వరుని [illegible]
[illegible] ఉండుగాక.

[illegible] [illegible] 4/6/02



డా॥ వఝ్ఝల రంగాచార్యులు - డా॥ వసుమతీదేవి



11-3-2000 రోజు జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం
14వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ ఛాన్సలర్ మరియు రాష్ట్ర గవర్నర్
డా॥ సి. రంగరాజన్‌గారి నుండి డాక్టరేట్ స్వీకరిస్తున్న రచయిత్రి



మాన్ శేషభట్టర్ వేంకటనరసింహాచార్యులుగారు - శ్రీమతి ఆండాళమ్మగా
రచయిత్రి తల్లిదండ్రులు



శ్రీమాన్ వ జ్ఝల రత్నమాచార్యులుగారు - శ్రీమతి రాధమ్మగారు
రచయిత్రి అత్తమామలు

మహామహోపాధ్యాయ, కవిశాబ్దికకేసరి
**శ్రీ న.చ. రఘునాథాచార్యులు**
అధ్యక్షులు,
సత్సంప్రదాయ పరిరక్షణ సభ, వరంగల్

# అనుమోదము

తాళ్ళపాక వారి వంశము శ్రీవేంకటేశ్వరుని ఉపాసించు శ్రీవైష్ణవ కుటుంబమునకు చెందినది. వారు నిర్గుణ బ్రహ్మోపాసకులుకారు. తమ కీర్తనలలో వేంకటేశ్వరుని దివ్య విగ్రహమును ఆయన యొక్క కళ్యాణ గుణములను వర్ణించి తాము సగుణసాకార బ్రహ్మోపాసకులమేనని నిరూపించుకొనిరి. తత్త్వమిట్లుండగా తద్వంశీయుడైన అన్నమాచార్యుని గేయములలో అద్వైత స్ఫూర్తి కలదని కొందరు ఊహించుట మరుమరీచికలను జూచి జల భ్రాంతిని పొందుట వంటిదే. అట్టి వారి అపోహలను తొలగించుటకు కొంత పరిశీలనాత్మకమగు గ్రంథమును వ్రాయుట అత్యంతావసరమే. ఆ అవసరము "అన్నమయ్య కృతులపై విశిష్టాద్వైత ప్రభావము"ను ప్రతిపాదించిన ఈ విపుల వ్యాసము తీర్చినది.

మరియొక సూక్ష్మము ఇచట గుర్తింపదగినది కలదు. అన్నమాచార్యుడు శ్రీవేంకటేశ్వరుడి పైనను - అమ్మవారి పైనను తన హృదయములోని మధురభక్తి ఉప్పొంగి బహిః ప్రసారము నొందగా ఏర్పడినవి ఈ కృతులు. జగత్తునందంతయు అతడు పరమాత్మతో తాదాత్మ్యమును ప్రహ్లాదుని వలె దర్శించెను. అంతేగాని అద్వైత మతమున చెప్పబడినట్లు ప్రపంచ మిథ్యాత్వమునో, నిర్గుణ బ్రహ్మమునో అతడు స్థాపించుటకు ప్రయత్నించలేదు. భక్తి భరితమైన అతని హృదయమున ఈ తత్త్వాన్వేషణకు అవకాశమే లేదు. శ్రీవేంకటేశ్వరుడే పరతత్త్వమని సద్గురూపదేశముతో గ్రహించి విశ్వసించి యుండుటచే ఆ వివాదముల జోలికి పోకుండ సాకార సగుణ శ్రీనివాసమూర్తినే ధ్యానమున అతడాస్వాదించి తన కీర్తనలలో పొందుపరచుకొనెను.

ఈ కృతులను వెలుగులోనికి తెచ్చిన మహామహులు ఇద్దరు. ఒకరు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు కాగా, రెండవవారు అనంతకృష్ణశర్మగారు. మొదటివారు భాషా పరమైన సంస్కరణలను చేసిరి. రెండవవారు వాటికి రాగతాళ స్వరకల్పన పూర్వకముగా గాన పద్ధతిని ప్రతిపాదించిరి. ఆ ఇద్దరు ఈ కృతులలో కానరాని ఆ తత్త్వాన్వేషణ జోలికి పోలేదు. ఆ మహనీయులిద్దరి కృషిచే వెలుగుచూచి నేడు విపుల ప్రచారము నొందిన అన్నమాచార్యుల కృతులపై, వాటిలోగల వివిధ వైష్ణవ సంప్రదాయ

రహస్యములను, ఆనాటి ఆచార వ్యవహారాదులను విశదీకరించుచూ సప్రమాణముగా చేయబడిన ఈ పరిశీలనము నిర్మత్సర బుధజన గ్రాహ్యమైనది అనుటలో సందేహములేదు. సావధానముగా పలు ప్రమాణ గ్రంథములను పరిశీలించి ఈ కృతులలోని విశిష్టాద్వైత తత్త్వమును ఆవిష్కరించిన చి.ల.సౌ. శేషభట్టరు వసుమతీదేవికి శ్రీనివాసుడు సమస్త సన్మంగళములను ప్రసాదించుగాక. ఈ విషయమున పరిశీనలకై ఈమెను ప్రేరేపించి మార్గదర్శకులైన ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు అభినంద నీయులు.

మావద్ద భాష్య భగవద్విషయాది గ్రంథములను శ్రద్ధతో అధికరించిన శ్రీమాన్ శేషభట్టర్ వేంకటనర్సింహాచార్యులవారి సంప్రదాయ సంస్కారము వారి పుత్రికయగు ఈ రచయిత్రిలో సంక్రమించి పరిమళించినందులకు మా అనుమోదమును తెలుపుచున్నాము. సహృదయులైన పాఠకులకు ఈ గ్రంథము భక్తి భరితమైన మధురోపహారము.

స్వస్తి.

వరంగల్,

8-3-2002.

శ్రీ న.చ. రఘునాథాచార్యః

**K.V. RAMANA CHARY,** IAS.,
Vice-Chairman & Housing Commissioner
Andhra Pradesh Housing Board

లక్ష్మీనాథ సమారంభాం నాథయామునమధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరామ్ ॥


తాళ్ళపాక అన్నమయ్య భక్తి భావావేశపూరితుడై ఉపాసించిన నృసింహ మంత్రములోని ఒక్కొక్క అక్షరమునకు వెయ్యి చొప్పున ముప్పైరెండువేల సంకీర్తనలను రచించినారు. శ్రీ వేంకటేశ్వరుని దివ్యమంగళ విగ్రహమును, కల్యాణగుణగణములను వర్ణించడమే అన్నమయ్య ఆశయం. భక్తిభరితమైన అన్నమయ్య హృదయమున విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారము ఒక అంశమే కాదు. కాని ఎద నిండా వైష్ణవమే. అద్వైతులుగా ఉన్న తమ పూర్వీకుల మతమును వీడి 'చెలగి శ్రీపతి తలచి వైష్ణవుడ నైతినని' ప్రకటించుకొని, 'ప్రపన్నులకిది వరమాచారమని' ప్రబోధించినారు. వైష్ణవమే విశిష్టాద్వైతము. తీర్థప్రసాదములు, కైంకర్యము, సర్వాపరాధి భావము, తిరుమంత్రము, ద్వయమంత్రము, తిరుమణి, చక్రాంకితములు, ధనుర్మాసము ఇత్యాది విశిష్టాద్వైత పదగుంఫనముతో అన్నమయ్య కృతులు విశిష్టాద్వైత ప్రభావితము లను విషయమును సప్రమాణముగా సాదృశ్యమానము గావించిన శ్రీమతి వసుమతి గారు ధన్యజీవులు. సంప్రదాయము, పాండిత్యము, సంస్కారము ముప్పేటలా పెనవేసుకొన్న వైష్ణవ కుటుంబాలకు ప్రతీక ఈ రచయిత్రి అని గ్రంథావలోకనము చేసినవారికి అవగత మవుతుంది. 'మకారార్థో జీవః' అని పూర్వాచార్యులు పేర్కొన్న విషయానికి రచయిత్రి అందించిన వివరణ హృద్యంగమముగా నున్నది. సంగీత, సాహిత్య సరస సమ్మేళనము అన్నమయ్య పదము. పదము పదమునకనుబంధం విష్ణుపథం. అష్టాక్షరీమంత్ర వైశిష్ట్యం అణువణువునా గోచరిస్తుంది అన్నమయ్య పదాల్లో. డాక్టర్ వసుమతి భావమువనుసరించియే అన్నమయ్య కృతులున్నాయానన్నంత సుందరంగా, స్పష్టంగా రచింపబడిన ఈ గ్రంథం ప్రతి వైష్ణవునికీ ప్రీతిపాత్రమవుతుందనుట నిస్సంశయం.

భార్యాభర్తలగు డాక్టర్ వజ్ఝల రంగాచార్యులు, డాక్టర్ వసుమతీదేవిలిరువురిని పరిశోధక విద్యార్థులుగా స్వీకరించి వారిచేత ఉత్తమ గ్రంథాల రచింపచేసిన ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులుగారి కృషి అభినందనీయము.

శ్రీమతి వసుమతీదేవిగారికి ఆచార్య మంగళాశాసనములతోపాటు శ్రీనివాసుని దివ్యానుగ్రహము నిత్యముండుగాక!

అభినందనలతో ..

- కె.వి. రమణాచారి



# శ్రీ చకిలం ఆగయ్యగారు

శ్రీ వేంకటేశ్వర దేవస్థానం చైర్మన్, కరీంనగర్

వీరు ఈ పుస్తక ప్రచురణకు తమవంతు ఆర్థిక సహాయం అందించినారు.

వీరికి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆయురారోగ్య

ఐశ్వర్యములనిచ్చి కాపాడుగాక

## ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు
విశ్రాంతాచార్యులు
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

# మంగళాశాసనము

సాహిత్యము మానవుని సమగ్ర అనుభవముల సంపుటి. స్వభావ జగత్తులో విడిగా సంక్లిష్టముగా కన్పించు జీవన వైవిధ్యము సాహితీజగత్తులో సహస్రదళ పద్మముగా బహుముఖమైన ఏకతత్త్వముగా ప్రకాశించుట సత్యమైన అంశము. అందుకే శంకరుల స్తోత్రములుకాని, రావణుని తాండవ వర్ణనముగాని, రాయలవారి ఆముక్త మాల్యదకాని, మూకకవి పంచశతిగాని, సర్వేతర కవుల సర్వభాషా కావ్యములు ఏవైనను సాహిత్య భూమికపై సౌందర్య పరివేషముతో నర్తించుట మనము గుర్తించవలసిన అంశము. తాత్త్వికుడైనను ఆర్తితో గొంతెత్తి శరణాగతి వేడుకొన్నపుడు శ్రీరామనుజాల వాక్కులోని గద్యమైనను, ఛందోగంధియై ప్రకాశించును. సరస్వతీదేవి కేవలము శబ్దార్థ రూపిణియైనను వాని పరస్పర లంఘన స్పర్థనముల చేత వైభవ స్ఫాలనముల చేత రసజగత్తునకు ముఖద్వారమై ఆనందమార్గ నియంతయగుచున్నది.

ఆంధ్రభాషా భాషీయుల పూర్వజన్మ పుణ్య విశేషముచేత 15వ శతాబ్దము ఒక పోతనను, ఒక అన్నమయ్యను ఇంచుమించు సమకాలికులుగా తెలుగు సరస్వతి కనగలిగినది. పోతన భాగవతము ఒక పురాణమై, కావ్యమై, ప్రబంధమై జనుల నిత్య పారాయణములో కొనసాగగా, తిరుమల శ్రీనివాసుని సన్నిధిలో పొంగెత్తిన అన్నమయ్య సాహిత్యము ఇంచుమించు 400 సంవత్సరము వరకు కొండదిగి రానేలేదు. శ్రీ పురందరదాసు భజనలు దాస సంప్రదాయముగా వ్యాప్తిలోనికి రాగా, అన్నమయ్య రచనలు తత్కాలమున గీత ఫణితులుగా స్వరసంపుటులుగా కొన్ని చేయబడినను వ్యాప్తిలోనికి రాకపోవుటకు ఆ గీతసంప్రదాయము శిష్యాయత్తము కాకపోవుటచేత స్వామి పుష్కరిణి తీరంలో ఘనీభవించినట్లున్నది. ఏది ఏమైనను స్వామి తన పరిష్వంగమును వదలు చేయుటచేత కదలివచ్చి అన్నమయ్య సాహిత్యపు దేవేరి సుమారు 80 సంవత్సరముగా లోకములో విహరించుచున్నది.

ఆవిష్కృతమైన అన్నమయ్య సాహిత్య జగత్తు ఒకేఒక్కసారి తెలుగు సాహిత్యములోని పూర్వపు అంచనాలను సిద్ధాంతములను, భావనలను తలక్రిందులు

చేసినది. సిద్ధపీఠములు కదలి పోయినవి. తెలుగు కవిత్వ భాషలో అభివ్యక్తి అలంకార శోధనము, కవిసమయముల నొదిగించుటలో అపూర్వమైన అనంత విశాల జగత్తు కానవచ్చినది. సాహిత్య తీర్థములోనికి దిగువారికి పదబంధము లేరుకొనుటలో, భాషను పరీక్షించుటలో, అలంకారములను లెక్కించుటలో నూతన ఉపమా, ఉత్ప్రేక్ష, రూపక సామగ్రి జమచేయుటలో కాలము గడిచిపోయినది. మనసులు అలసిపోయినవి. సంగీత జగత్తు ఆతని శ్రుతి మాధుర్యమును, లయ విన్యాసమును, రాగ ప్రస్తారమును గతకాలపు గనిలోనుండి చేదుకొనుటకు పూర్తిగా సాధ్యముకాకున్నది. రెండు దారులలో నుండి అనేకులైన ప్రయత్నశీలురు నిరంతరము కొనసాగించిన తపశ్శక్తిచేత ఇంతకాలమునకు కొంతలో కొంత అన్నమయ్య చైతన్యము స్ఫురణకు నోచుకొన్నది. అయినను విస్తృతమైన రచనా జగత్తును, పాతబడ్డ మాటల గతిరోధమును దాటి, సంప్రదాయపు పరిభాషల గూఢతనుదాటి, ఆయన తత్త్వము ఇప్పటి వరకు స్పష్టమైన రీతిలో అవగతము కాలేదు. సంపాదకత్వము వహించిన వారికే తొందరపాటు, పొరపాటు తప్పలేదు. విజయనగర సామ్రాజ్యమున ఆ రోజులలో భక్తి ధర్మము సర్వవర్ణ సామాన్యముగా మాధుర్య వైరాగ్య ఉభయ పక్షములు కల్గినదిగా తీర్చిదిద్దిన శఠగోపయతి ఆ యుగమునకు తాత్త్వికముగా ప్రభువు. రాయలుగానీ, పెద్దనగానీ, తాళ్ళపాకవారు గానీ, ఇతరులైన మహామహులు ఎందరైనను ఆయన తాత్త్విక, భావుక సంగతిలో లీనము కానివారు లేరు. ఆయన పాదసేవ వలన అధీతమైన వేదాంత శాస్త్రము కలిగినవారు వీరు ముప్వురు. అందువలననే వారి రచనలలో విశిష్టాద్వైత తత్త్వము, శ్రీవైష్ణవ సంప్రదాయము సమన్వితమై ఉభయ వేదాంత సారమై తళతళలాడుచుండుట విజ్ఞులైన సహృదయులకు పరిచితమైన అంశము. ఆభాసములైన విరోధములను జూచి భ్రమపడుట శాస్త్రసారము లెరిగినవారు చేసెడి పనికాదు.

శ్రీమతి వసుమతీదేవి అన్నమాచార్య సాహిత్య సముద్రమును తలస్పర్శిగా ఈదవలసి వచ్చినది. స్పష్టమైన అవగాహనము, చిత్తశుద్ధితోడి అన్వేషణము, భీతిలేని విచారణ కల్గిన ఈమెకు శ్రీమద్రామానుజుల సిద్ధాంత స్వరూపమునకు, భగవద్విషయ తాత్పర్యమునకు మణిదర్పణముగా అన్నమయ్య కీర్తన సందోహము దర్శనమిచ్చినది. తత్త్వము సంప్రదాయము, భావ, ఆచరణ రూపములే అయినను చంద్రజ్యోతులవలె

విడదీయరానివి. తీర్థమునకు తీర్థముగా, ప్రసాదమునకు ప్రసాదముగా చూచిన చోట అనేకముగా అనైక్యముగా కనిపించు, ఈ అంశములను సమన్వితములైన విశిష్టాద్వైతముగా ఈ రచయిత్రి దర్శించగలిగినది.

మానవ జీవితములో చరితార్థము చేయగలిగిన ఒక పని చేసినను బ్రతుకు చివర వరకు పాథేయముగా అది కొనసాగగలదు. శ్రీమతి వసుమతీదేవి చేసిన కృషి "అహం స్మరామి మద్భక్తం" అన్న వాగ్దానమును స్వామి నెరవేర్చు కొనునట్లు శ్రీ తిరుమల క్షేత్రాధిపతియైన శ్రీ వరాహస్వామికి మెప్పు కలిగించునదిగా రూపొందినది. ఆమెకు, ఆమె కుటుంబమునకు అనేక మంగళాశాసనములు.

తేది : 25-5-2002

**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య**

## డా॥ శేషభట్టర్ తోతాద్రిస్వామి

శ్రీనివాసా క్లినిక్, వర్ధన్నపేట

# ప్రతిభా ప్రదీప్తి

శ్రీమతి వసుమతీదేవి "అన్నమయ్య కృతులపై విశిష్టాద్వైత ప్రభావము" అను విషయమును ఎంపిక చేసికొని, ఆ కృతులను పరిశీలించి, విశిష్టాద్వైత సిద్ధాంత తత్త్వము వాటిలో ఎట్లు ఇమిడి యున్నదో సప్రమాణముగా నిరూపించినది. ఆ నిరూపణము జిజ్ఞాసువులందరికీ ఎరుక పరచుటకై గ్రంథ రూపమున ప్రకటించు చున్నది. ముద్రణకు పూర్వమే మహాపండితులెందరో లిఖిత ప్రతిని తిలకించి, పఠించి, ఆనందించి తమ అభినందన, ఆశీర్వాదములు అందించిరి.

రచయిత్రి మాతామహ, పితామహులందరు శ్రీవైష్ణవ సంప్రదాయ నిష్ఠా గరిష్ఠులు. బహుశాస్త్ర కోవిదులు. పితామహులు శ్రీమాన్ శేషభట్టర్ శ్రీనివాసాచార్యుల వారు సంస్కృతాంధ్ర సాహిత్యములందు పండితులేగాక శ్రీవైష్ణవ సంప్రదాయ రహస్యములనేకములు తెలిసినవారు. వీరు తెలంగాణా ప్రాంతమునందేగాక ఆంధ్ర, మహారాష్ట్ర, తమిళ ప్రాంతములు పర్యటించి తమ పురాణ ప్రవచనముల చేత ఆకర్షితులైన అనేకులకు శ్రీవైష్ణవ దీక్షనిచ్చి, సమాశ్రయణము కలిగించి తిరుమంత్రార్థ ఉపదేశములు చేసిరి. ప్రతి సంవత్సరము శిష్య సంచారము చేయుచు యథాశక్తి శ్రీవైష్ణవ మత ప్రసార ప్రచారములను చేసినారు.

వీరి రెండవ కుమారులు శ్రీమాన్ శేషభట్టర్ వేంకట నరసింహాచార్యులవారు ఈ రచయిత్రి తండ్రిగారు. వారు తమ తండ్రిగారివలె సంస్కృతాంధ్ర సాహిత్యము లందు, ఉభయ వేదాంతములందు గొప్ప వైదుష్యమును సంపాదించి, మహా మహోపాధ్యాయ, కవిశాబ్దికకేసరి శ్రీమాన్ న.చ. రఘునాథాచార్యస్వామివారి వద్ద శ్రీభాష్య, భగవద్విషయములను సేవించి, ఆంధ్రదేశములోని అనేక సభలలో మహో పన్యాసములు చేసిరి. నిరంతర సాహిత్య విద్యా వ్యాసంగములు, ద్వైతాద్వైత విశిష్టాద్వైత వేదాంత చర్చలతో హన్మకొండలోని వీరి గృహము శ్రీవైష్ణవ బంధు జనులతో నిత్యము కళకళలాడుచుండెడిది. వేంకటనరసింహాచార్యులవారి వాదనా ప్రౌఢికి ఎదురు నిలిచిన వారులేరు. వాదనలందు ఓడిపోయినను వారి యింట తృప్తిగా సాపాటు చేయని వారు తెలంగాణా ప్రాంతమునందు లేరు. వీరి ఉపన్యాస సారాంశములేవియు గ్రంథస్థము చేయబడలేదు. ఆ తండ్రికి పుత్రిక అయిన ఈ రచయిత్రి తన సిద్ధాంత గ్రంథము ద్వారా ఆ లోటును తీర్చినది.

రచయిత్రి మాతామహులు శ్రీమాన్ కండ్లకుంట లక్ష్మీనరసింహాచార్యులవారు భాష్య, భగవద్విషయాది వేదాంతములందేగాక, వాస్తు, జ్యోతిష్య, ముహూర్తాది లౌకిక

విద్యలయందు కూడా ప్రసిద్ధులు. ఈ మాతామహుల శ్రీవైష్ణవ సంప్రదాయ పవిత్రానుష్ఠానము చిన్ననాటి నుండి రచయిత్రికి పరిచితమైనది. ఈ తండ్రి తాతల ప్రతిభా పాండిత్య, సంప్రదాయ లక్షణము రచయిత్రిలో ప్రతిఫలించి, అన్నమయ్య కీర్తనలలో విశిష్టాద్వైత సిద్ధాంతము ప్రతిపాదించుటకు హేతువైనది.

రచయిత్రి భర్త డా॥ వర్ఝుల రంగాచార్యులు. వీరు కూడా "పుట్టపర్తి నారాయణాచార్యులవారి ఖండకావ్యములు-శివతాండవము-పరిశీలనము" అను శీర్షికతో సిద్ధాంత గ్రంథమును రచించి, 1987లోనే డాక్టరేట్ పొందిరి. శతపుష్కర, భార్గవీ, దీపరేఖ వంటి పద్య కావ్యములను రచించిరి. వీరు అనేక సాహిత్య సమావేశములలో పాల్గొని తమ ఉపన్యాసముల ద్వారా అందరి మన్ననలు పొందుతూ "మంచివక్త"గా పేరు తెచ్చుకున్నారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘమువారు హన్మకొండలో ఏర్పాటు చేసిన సభలో 'దీపరేఖ' పుస్తకావిష్కరణ సందర్భమున, ఆచార్య లక్ష్మణమూర్తి గారి అధ్యక్షతన శ్రీహరి విఠల్ (RJD) గారు వీరి పద్యకవితా సౌందర్యమునకు ముగ్ధులై వీరికి "కవిమందారం" అనే బిరుదును ప్రదానం చేసిరి. 'సారస్వత జ్యోతిమిత్ర మండలి' - కరీంనగర్ జిల్లా రచయితల సంఘము వారి "వానమామలై జగన్నాథాచార్యుల వారి స్మారక పద్య సాహితీ పురస్కారం" 2000 సంవత్సరమునకు గాను వీరిని వరించినది. జన్మభూమి సందర్భమున నిర్వహింపబడిన జిల్లాస్థాయి అధ్యాపక ఉపన్యాస పోటీలో వీరు ప్రథమ స్థానమున నిలిచి బంగారు పతకమును పొందిరి. ఇట్టి వీరి సాహచర్యము మా వసుమతీదేవిని పరిశోధన మార్గము వైపునకు నడిపి డా॥ వసుమతీదేవిగా తీర్చిదిద్దినది. తాను డాక్టరేటును పొంది, తన భార్యను కూడా డాక్టరేటు పట్టభద్రురాలిగా నిలిపిన చి॥ రంగాచార్యులు ప్రశంస నీయుడు. ఈనాటి తెలుగు సాహిత్యమున, అందున భక్తి వేదాంత సాహిత్యమున భార్యాభర్తలిరువురు డాక్టరేట్‌ను సాధించుట అరుదైన విషయము.

భార్యాభర్త లిరువురిని పరిశోధక విద్యార్థులుగా స్వీకరించి, వారి చేత ఉత్తమ గ్రంథములను రచింపజేసిన మార్గదర్శకులు ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులవారు ఎంతేని అభినందనీయులు.

వసుమతి గృహిణిగా, ఉపాధ్యాయినిగా బాధ్యతలు నిర్వహించుచూ, లభించిన కొద్దిపాటి సమయమున విశ్రాంతి మరచి దాదాపు ఆరు సంవత్సరములు శ్రమించి ఈ గ్రంథమును రచించినది. మా శేషభట్టర్ వంశమునకు ఆడుబిడ్డయై సిద్ధాంత పరమైన ఇంత చక్కని గ్రంథమును రచించి విశిష్టాద్వైత మత ప్రచారముతో పాటు మా వంశకీర్తి ప్రతిష్ఠలను దశదిశలా వ్యాపింప జేసినందుకు పిన తండ్రిగా నేను గర్వపడుతూ అభినందించి, ఆశీర్వదించుచున్నాను.

# కృతజ్ఞతలు

అమృతమయమైన అన్నమాచార్యుల కృతులను విని ఆనందించడమేగాని విమర్శించు ఆలోచనను నేనెప్పుడు చేయలేదు. గురువుగారైన శ్రీ కోవెల సుప్రసన్నా చార్యగారి సూచనకు, ఆనువంశికముగా వచ్చు మా ఇంటి శ్రీవైష్ణవ ఆచార సంప్రదాయ బలము తోడు కాగా, డాక్టరేట్ పొందిన శ్రీవారున్నారన్న ధైర్యముతో అన్నమాచార్యుల కృతులపై విశిష్టాద్వైత ప్రభావమునుగూర్చి పరిశోధనకు ఉపక్రమించాను.

ఈ పరిశోధనలో తత్త్వత్రయమువలె మూడు మార్గములను సమన్వయము చేసికొనవలసి వచ్చింది. అందు మొదటిది - అన్నమయ్య సంకీర్తన సంపుటములు మరియు శాస్త్ర, సంప్రదాయ గ్రంథసేకరణ. రెండవది - వాటి అవగాహన. అన్నమయ్య కీర్తనలను ఆడియో క్యాసెట్లలో విని ఆనందింపవచ్చు, కాని చదివి అర్థము చేసుకొనుట కష్టసాధ్యం. అనేకమైన తత్సమ-దేశి పద సమ్మిశ్రితమై, నేడు వాడుకలో లేని పదాలతో కలిసి ఉండే కీర్తనల ప్రకృష్టార్థమును తెలిసికొనుట చాలా కష్టం. ఒక కీర్తనను బహు జాగ్రత్తతో నాలుగైదుసార్లు చదివినపుడే అర్థము తెలియగలదు. శాస్త్ర, సంప్రదాయ గ్రంథములు చదివి అవగాహన చేసికొనుట, మరియు శాస్త్ర సంప్రదాయ గ్రంథాలలోని లక్షణాలు అన్నమయ్య కీర్తనలకు సమన్వయం చేయుట - మూడవ ప్రయత్నం.

ఇట్లు నా యీ ప్రయత్నాలన్నీ శ్రీ వేంకటేశ్వరస్వామి కృపవల్ల నిర్విఘ్నంగా ఫలించి, ఈనాటికి నా ఈ సిద్ధాంత గ్రంథ పరిశోధన వ్యాసమును పూర్తిచేసి ముద్రించ గలిగాను.

వ్యాసశీర్షికను సూచించి మార్గోపదేశము చేసిన పర్యవేక్షకులు ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులుగారికి, పరిశోధనకు ప్రవేశార్హత కల్గించిన ఆచార్య శ్రీపెరుంబుదూరు లక్ష్మణమూర్తి గారికి, ఆచార్య హరిశివకుమార్‌గారికి, ఈ పరిశోధన వ్యాసంగమునకు అనుమతినిచ్చిన కాకతీయ విశ్వవిద్యాలయాధికారులందరికీ నమస్కారములు, కృతజ్ఞతలు.

అలభ్యమైన కొన్ని అన్నమయ్య సంకీర్తన సంపుటములనందించిన డా॥ మాదిరాజు బ్రహ్మానందరావుగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

కొన్ని శాస్త్ర సంప్రదాయ గ్రంథములు నాకొరకే అన్నట్లుగా నిలువచేసి ఉంచిన మా నాన్నగారైన కీ.శే. ఎస్.బి.వి.ఎన్. ఆచార్యులుగారిని ప్రతినిత్యం ఈ గ్రంథంలో దర్శించుకుంటాను.

ఈ పరిశోధన గ్రంథమునకు మంగళాశాసనమును అనుగ్రహించిన పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారికి, అనుమోదముతో ఆశీర్వదించిన మహామహోపాధ్యాయ, కవిశాబ్దికకేసరి శ్రీమాన్ న.చ. రఘునాథాచార్యస్వామివారికి, మంగళాశాసనముతో ఈ గ్రంథమును ముందుకు నడిపిన మార్గదర్శకులు ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యుల వారికి, ప్రతిభాప్రదీప్తితో మా పూర్వికులను స్మరించి, మమ్ములను అభినందించిన మా పినతండ్రి డా॥ తోతాద్రిస్వామిగారికి నా వినయపూర్వక నమస్సులు.

నా యీ పరిశోధనాపర్వంలో తగిన సలహాలనిస్తూ, నన్ను ప్రోత్సహించిన డా॥ కండ్లకుంట వేంకటాచార్యులుగారికి, మా బాబాయి డా॥ గోవర్ధనం స్వామినాథా చార్యులుగారికి, మా మేనమామ డా॥ కండ్లకుంట నరసింహమూర్తిగారికి కృతజ్ఞతా పూర్వక వందనములు.

ఈ సందర్భంగా నన్ను అభినందించి, ఆశీర్వదించిన పెద్దలు శ్రీ కె.వి. రమణాచార్య, I.A.S. గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సిద్ధాంతగ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయమును అందించిన శ్రీ చకిలం ఆగయ్య, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం ఛైర్మన్, కరీంనగర్ గారికి హార్దిక కృతజ్ఞతలు.

పుస్తకాన్ని అందంగా ముద్రించిన కేశవ గ్రాఫిక్స్ యజమానులు శ్రీ మరింగంటి శ్రీకాంత్‌గారికి ధన్యవాదములు.

ఈ పరిశ్రమలో ఆరంభం నుండి పరిశోధన గ్రంథ సమర్పణ, ముద్రణముల వరకు వెంట ఉండి నడిపించిన శ్రీవారు - డా॥ వఝ్ఝల రంగాచార్యులుగారికి నా యీ జీవితమే అంకితం.

అన్నమయ్య కీర్తనలపై ఈ విధమైన విశిష్టాద్వైత తత్త్వ పరిశోధనా గ్రంథరూపంగా కైంకర్యం చేయించుకున్న కలియుగ ప్రత్యక్షదైవం, నా ఇష్టదైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రతినిత్యం స్మరించుకుంటాను. స్వామి ఈ గ్రంథ సంబంధులందరినీ, పఠితలను అనుగ్రహించాలని కోరుకుంటున్నాను.

**- రచయిత్రి**

# విషయ సూచిక


అధ్యాయం - 1 : భూమిక ........ 1

అధ్యాయం - 2 : అన్నమయ్య జీవిత విశేషములు ........ 11

అధ్యాయం - 3 : విశిష్టాద్వైత దర్శన వైశిష్ట్యము ........ 18

అధ్యాయం - 4 : అన్నమయ్య కీర్తనలలో తత్త్వత్రయము ........ 68

అధ్యాయం - 5 : తత్త్వవిచారము ........ 152

అధ్యాయం - 6 : అన్నమయ్య కీర్తనలలో శ్రీవైష్ణవ ఆచార సంప్రదాయములు ........ 181

అన్నమయ్య కీర్తనలలో ఆచార్యనిష్ఠ ........ 190

అన్నమయ్య కీర్తనలలో శ్రీవైష్ణవ పారిభాషిక పదములు ........ 237

# అధ్యాయము - I

# భూమిక

శ్రీవైష్ణవ మతము అతి పురాతనమైనది. ఈ మతమునకు నారాయణీయ మతమనియు, విశిష్టాద్వైత మతమనియు వ్యవహారము. ఇందు శ్రీమహావిష్ణువు ప్రధానదైవము. అందుకే వైష్ణవ మతమని ప్రత్యేక వ్యవహారము కలిగినది. వైష్ణవ మత పురాతనత్వమును గూర్చి రాధాకృష్ణ పండితులు "ఈ మతమునకు బీజములు ఋగ్వేదమున కలవ"[1]ని పేర్కొనిరి. యజుర్వేదమున విష్ణువు ప్రధాన దైవముగా చెప్పబడెను. శతపథ బ్రాహ్మణము విష్ణువును యజ్ఞమూర్తిగా వర్ణించినది. సర్వ ప్రపంచము యజ్ఞోద్భవమని బ్రాహ్మణములు చెప్పుచున్నవి[2].

## శ్రీవైష్ణవ మతోదయము

బ్రహ్మసూత్రకర్తయగు వేదవ్యాసుడు విష్ణు సహస్రనామ సంకీర్తనము, భగవద్గీతా ప్రబోధములచే శ్రీవైష్ణవ మత విశిష్టతను వెల్లడించెను. శుకమహర్షి శ్రీవైష్ణవ మతమందలి ప్రధాన సాధనములైన భక్తిప్రపత్తులను భాగవత గాథల రూపమున లోకమున కుపదేశించి తరింపజేసెను. వాల్మీకి మహర్షి తన సుధామయ వాక్కులచే శ్రీమద్రామాయణ రూపమున శ్రీవైష్ణవ మతమునకు అగ్రాసనమిచ్చెను.

ఈ విధముగా మహర్షుల ప్రవచనములలో ప్రాచీనకాలము నుండి నేటివరకు ప్రచారములో నుండి వైదిక మతములన్నింటిలో మేటియై ప్రకాశించుచున్నది.

"వైష్ణవ" అను పదమునకు "తస్యేదం" అను పాణినీయ సూత్రమునుబట్టి "విష్ణోరిదం వైష్ణవమ్" - విష్ణువునకు సంబంధించినది అను అర్థము సిద్ధించును. రెండవ పదము "మతము" - ప్రమాణ సిద్ధమైన సిద్ధాంతము మతమనబడును. శ్రీ మహావిష్ణువునకు సంబంధించిన ప్రమాణసిద్ధమైన సిద్ధాంతమే "శ్రీవైష్ణవ మతము". విష్ణుశబ్దము సర్వవ్యాపకత్వమును బోధించుచూ సర్వేశ్వరునియందు రూఢమైనది. "సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్"[3] అని కఠ, శాండిల్య ఉపనిషత్తులు పేర్కొనినవి. అనగా విజ్ఞానశీలియైన జీవుడుసంసార సాగరమును దాటించు పరమాత్మ యైన విష్ణువు యొక్క స్థానమును, పరమపదమును పొందుచున్నాడు అని అర్థము.

ఇట్టి వైష్ణవములోని రామానుజ సంప్రదాయము విశిష్టాద్వైత సిద్ధాంతముగా పేర్కొనబడు చున్నది.

## విశిష్టాద్వైత శబ్ద వ్యుత్పత్తి

ద్వితైవ=ద్వైతమ్ అని ద్వైతశబ్ద నిష్పత్తి. రెండింటియొక్క ప్రత్యేక స్థితి ద్వితా అనబడును. ద్వితా అనెడి శబ్దముపై "స్వార్థే అణ్" ప్రత్యయము వచ్చి "ద్వైతమ్" అను పదము ఏర్పడినది. ద్వితా అనినను, "ద్వైతమ్" అనినను అర్థము ఒక్కటే. ఇట్లు ద్వైత శబ్దమునకు రెండు వస్తువుల ప్రత్యేక స్థితి. అనగా భేదము అను అర్థము సిద్ధించును.

న+ద్వైతమ్=అద్వైతమ్. భేదము లేకుండుట అద్వైతమనవలెను. రెండవ వస్తువు లేని ఏకత్వమే అద్వైత శబ్దమునకు అర్థము.

"విశిష్టస్య+అద్వైతమ్=విశిష్టాద్వైతమ్" - "జీవ ప్రకృతులు అనబడు చేతనా చేతనములతో నిత్యమును విశిష్టమైయుండు బ్రహ్మము - ఏకము" అని నిరూపింపబడుటచేత విశిష్టాద్వైత సిద్ధాంతమని పిలువబడుచున్నది.

ప్రకృతి-జీవములనెడి రెండు తత్త్వములు లేవనియు, అవి అవిద్యా కల్పితము లనియు, బ్రహ్మము ఒక్కటే సత్యమనియు చెప్పెడి అద్వైతమునకంటే భేదము "విశిష్ట" అను శబ్దముచే సూచింపబడుచున్నది.

ప్రకృతి-జీవులు రెండును పరమాత్మతోపాటు సత్యములే గనుక ఇందు తత్త్వత్రయము అంగీకరింపబడినది. ప్రకృతి-జీవులతో పరమాత్మ నిత్య విశిష్టుడై ఉండును కావున అట్టి విశిష్టమైన పరమాత్మయొక్క ఐక్యమును చెప్పుటయే ముఖ్యాంశము. అట్లు విశిష్టమైన మరొక బ్రహ్మము లేనందున విశిష్టాద్వైతములోని "అద్వైత" అను పదము కూడ సమంజసమైనది. ఇట్టి విశిష్టాద్వైత మతమున విష్ణువే పరదైవము. వేదములందు అంతర్లీనముగా నుండి వేదాంతములలోని సంభాషణల ద్వారా, ఉపదేశములద్వారా, ప్రశ్నోత్తరములద్వారా విష్ణు తత్త్వము ప్రకటింపబడినది. ఇతిహాసములందు విష్ణు పారమ్యము బహుళ ప్రచారము నొందినది.

కలియుగాన వైష్ణవ మతమునకు ఉన్నతమైన స్థానమును కల్పించినవారు ఆళ్వారులు. తమిళ దేశమున వీరు తమ భక్తిగీతములద్వారా వైష్ణవమత వ్యాప్తికి

శ్రీకారము చుట్టిరి. క్రీ.పూ. మొదటి ఏడు శతాబ్దాలలో జైన బౌద్ధముల వంటి అవైదిక మతములు తమిళదేశమున ప్రవేశించినవి. ఇవి ప్రధానముగా వైదికమతములోని యజ్ఞ యాగాది కర్మకలాపములను, వర్ణవ్యవస్థను తీవ్రముగా వ్యతిరేకించినవి. ఈ నూతన మతములను రాజులు ఆదరించుటచే అవి ఎక్కువగా వ్యాప్తి పొంది వైదిక ధర్మము నశించిపోవు స్థితి సంభవించినది. ఆ పరిస్థితులలో ఆళ్వారులు అవతరించిరి.

వీరు మతము సామాన్య ప్రజలకు చేరుటకై ప్రాంతీయభాషను ఊతగాగొని భక్తిగీతములాలపించి ప్రజామోదభాషలో మత ప్రచారము గావించిరి. అంతవరకు మత ధార్మిక విషయములకు వాహికగా ఉంటున్న సంస్కృతభాషను విడచి భక్తిని-వేదాంతమును కలిపి తమిళభాషలో విరివిగా పాటలు వ్రాసి ప్రచారము చేసిరి. వీరి కృషివల్లనే వైదికధర్మము పునరుజ్జీవనము పొందినది.

ఆళ్వారులు వివిధ కులములలో జన్మించిరి. వీరు అపార విజ్ఞానమును, విశుద్ధ జీవనమును కలిగినవారు. ఆళ్వారుల మత ప్రబోధము కుల సంప్రదాయ పరిధులను అధిగమించి బహుళ ప్రచారము పొందినది. దక్షిణ దేశములోభక్తి మార్గమునకు ప్రారంభకులు ఆళ్వారులే అని చెప్పవచ్చును.

"ఆళ్వారులు" అను పదమునకు "గంభీరమైన లోతులలోనికి చొచ్చుకొనిపోవు వారు" అని అర్థము. భగవంతుని అనుగ్రహము, సర్వసంగ పరిత్యాగము చేసే ఏ కొద్దిమందికో గాక భక్తిపూర్వకముగా భగవంతుని శరణుజొచ్చిన వారందరికిని లభించునని వీరి గాథల వలన తెలియుచున్నది.

ఆళ్వారులలోని శ్రీ శఠగోపులు (నమ్మాళ్వార్) రచించిన "తిరువిరుత్తము", "తిరువాశిరియమ్", "తిరువందాది", "తిరువాయ్మొళి" అను కృతులకు శ్రీవైష్ణవమున చతుర్వేదములతో సమాన ప్రతిపత్తి కలదు. ఆళ్వారుల రచనల సంకలనమును "నాలాయిరమ్" అను పేరుతో వ్యవహరించెదరు. నాలాయిర దివ్యప్రబంధము ఉపనిషత్సారముతో నిండియున్నది.

భగవత్తత్త్వపు లోతులలోనికి పోయి దైవ సాంగత్య తన్మయత్వముతో తాము పొందిన దివ్యమైన అనుభూతిని మధుర భక్తిగీతములుగా ఆళ్వారులు ఆవిష్కరించగా తరువాత వచ్చిన ఆచార్యులు ఈ భక్తిగేయములకు తాత్త్విక వ్యవస్థను ఏర్పాటు చేసి తమ తమ ఆధ్యాత్మికమైన అనుభూతులను మేళవించి సిద్ధాంత ప్రతిపాదన చేసినారు.

శ్రీవైష్ణవ సిద్ధాంతములో గురుపరంపరకు విశిష్టస్థానము కలదు. భక్తి సంప్రదాయమున శరణాగతి పద్ధతియందు ఆసక్తిగల శిష్యునకు గురువు వాత్సల్యముతో నుపదేశించవలెను. ఇట్టి ఉపదేశ పద్ధతిని లోకమునందు అవతరింప జేయుటకు బదరికాశ్రమమున నారాయణునిగా మహావిష్ణువే అవతరించి, తన అంశను నరునిగా సృజించి, తత్త్వోపదేశమును చేసెను. వైష్ణవ గురు శిష్య పరంపరలో ఆద్యులు నరనారాయణులు అందుకే ప్రతి శ్రీవైష్ణవుడు

**"లక్ష్మీనాథ సమారంభాం నాథయామున మధ్యమామ్ ।**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరామ్ ॥"**

అని లక్ష్మీనాథునితో ప్రారంభమైన గురుపరంపరకు నమస్కరించెదరు.

దక్షిణ భారతమున వైష్ణవ మతమును వ్యాప్తిగావించిన మహాపురుషులను రెండు తెగలుగా విభజించవచ్చును. మొదటి తెగకు చెందినవారు ఆళ్వారులు. రెండవ తెగకు చెందినవారు ఆచార్యులు. ఆళ్వారుల తరువాత వైష్ణవమత సిద్ధాంత ప్రచారము నకు కృషిచేసినవారు ఆచార్యులే.

ఆచార్యులలో ప్రథములు నాథమునులు. వీరు ఆళ్వారుల నాలుగువేల పాశురములను సంకలనము చేసిరి. తంజావూరు జిల్లాలోని "మన్నార్గుడి" గ్రామములో క్రీ.శ. 824లో వీరు జన్మించిరి[4]. అప్పటికే ఆళ్వారుల రచనలు విస్మృతములైనవి. దక్షిణదేశపు భక్తులు కొందరు నమ్మాళ్వారుల ద్విపదను పాడగా విని, ఆ స్తోత్రపు విలువను గ్రహించి అది మహత్తర నిధిలోని భాగమని గుర్తించి, నాథమునులు దానిని అన్వేషించుచూ ఆళ్వారులు నివసించిన ప్రదేశముల నన్నింటిని పవిత్ర తీర్థయాత్రా స్థలములుగా సంచరించి కష్టపడి నాల్గువేల పాశురములను సేకరించిరి. ఆచార్యుడనగా "ఆచినోతి హి శాస్త్రార్థాన్ - ఇతి ఆచార్యః" అను వ్యుత్పత్తి ననుసరించి శాస్త్రార్థములను సేకరించి రక్షించువాడని అర్థము. ఆళ్వారులు నిరతిశయ ప్రీతిచేత భగవద్గుణాను భవము చేయగా ఆ అనుభవము అక్షరరూపము దాల్చి నాలాయిర దివ్య ప్రబంధముగా ఆవిష్కరింపబడినది. ఆ స్తోత్రములు సేకరించి, పఠించి, తద్గత రహస్యార్థములను గ్రహించి వ్యాఖ్యాన వివరణ చేసిన మహనీయుడగుటవలన నాథమునిని ప్రథమాచార్యు డనిరి. అందువలననే "నాథోపజ్ఞమ్ ప్రవృత్తిమ్" అనెడి ప్రశస్తి విశిష్టాద్వైత సిద్ధాంతము నకు కలిగినది. నాథమునుల తరువాత వీరి మనుమలు యామునాచార్యులు

"ఆళవందారు"గా ప్రసిద్ధికెక్కి వైష్ణవమతమును ప్రజ్వలింపజేసిరి. వీరు ఈశ్వరమునికి పుత్రులు. చోళదేశమునందలి వీరనారాయణపురమునందున్న "కొత్తమన్నార్" కోవెలలో యామునులు క్రీ.శ. 918లో జన్మించిరి. శ్రీరామమిశ్రులవద్ద వేదాధ్యయనము చేసిరి. మహాభాష్యభట్టరువద్ద శాస్త్రములను పఠించి, పన్నెండు వత్సరముల వయస్సున వేదశాస్త్ర పారంగతులైరి. వీరు బాల్యముననే తమ పాండిత్యముతో పాండ్యరాజా ఆస్థానమున నున్న విద్వాంసుల నోడించి విష్ణుపారమ్యమును స్థాపించినారు. యామునులు శ్రీరంగమున స్థిరపడి సన్యాసమును స్వీకరించి శ్రీమద్విశిష్టాద్వైత సిద్ధాంతపరమైన గ్రంథములను సంస్కృతములో రచించిరి. తమ తాతగారగు నాథమునులు ద్రావిడ దివ్య ప్రబంధముల ప్రాధాన్యమును నిరూపించిన విధముగా వీరును ద్రావిడ ప్రబంధములను ప్రచారము గావించిరి. యామునులు చార్వాకమత మును ఖండించిరి. బౌద్ధమును, శంకరాద్వైతమును శాస్త్రప్రమాణములచే వాదించి ఓడించిరి. వాసుదేవుడు పరబ్రహ్మమనియు భక్తుల సగుణోపాసనకు, ఆ వాసుదేవుడే విషయమనియు బోధించిరి. వీరు దాస్యభక్తికి అధిక ప్రాధాన్యమునిచ్చిరి. ఈ విషయము వీరి స్తోత్రరత్నము అను గ్రంథము వలన తెలియుచున్నది. అట్లే ప్రపత్తిని భవతారక మార్గముగా బోధించి విశిష్టాద్వైత సిద్ధాంతమునందు దాస్యభక్తికి, ప్రపత్తికిని ఉన్నతస్థానమును కల్పించిరి. వీరు క్రీ.శ. 1037లో పరమపదించినట్లు తెలియుచున్నది.

క్రీ.శ. 1017[5]లో జన్మించిన శ్రీ రామానుజులు - నాథమునులు, యామునా చార్యులు నిరూపించిన మార్గమును ప్రమాణబద్ధముగ, తార్కికముగ, సిద్ధాంతపరముగ నిరూపించి వైష్ణవమతమును విశిష్టాద్వైతముగ వ్యాప్తికి తెచ్చినారు. వీరి సిద్ధాంతము వేదోపనిషత్, బ్రహ్మసూత్రాది సమన్వయముతో పరిపుష్టమైనది. వీరివలననే విశిష్టాద్వైతమునకు రామానుజ దర్శనమని ప్రసిద్ధి కలిగినది. రామానుజులు తొమ్మిది గ్రంథములను రచించిరి. అవి 1) వేదాంతసంగ్రహము, 2) వేదాంతసారము, 3) వేదాంతదీపము, 4) శరణాగతి గద్యము, 5) శ్రీరంగ గద్యము, 6) వైకుంఠ గద్యము, 7) నిత్యగ్రంథము, 8) గీతాభాష్యము, 9) శ్రీభాష్యము.

రామానుజులు శాస్త్రపాండిత్యము కలవారేగాక మహోదాత్త గుణసంపన్నులు. సంఘ సంస్కరణాభిలాషి. వీరు ఆదిశేషుని అవతారమని భావింపబడిరి. రామానుజులు పెరియనంబి వద్ద ద్రవిడవేదమును, వ్యాసకృత బ్రహ్మసూత్రములను అభ్యసించిరి. వీరు కంచిలోని వరదరాజస్వామివారినుండి ఆశ్రమదీక్షా స్వీకారము చేసినారు. కంచిలో

మఠమును స్థాపించి విఖ్యాతి పొందిన వీరిని శ్రీరంగములోని వైష్ణవులు అచ్చటికి రప్పించుకొనిరి.

రామానుజులు శ్రీరంగము చేరుకొని అక్కడి ఆలయమును సంస్కరించిరి. వేదపఠనముతోపాటు ఆలయములో దివ్యప్రబంధ పఠనమునకు సమానమైన ప్రాముఖ్యమును కల్పించిరి. వీరి కాలమున వైష్ణవము మహోద్యమముగా పరిణమించినది. వీరికి గోష్ఠీపూర్ణులు ద్వయమంత్రమునుపదేశించిరి. ఈ మంత్ర రహస్యార్థమును ఎన్నడును, ఎవ్వరికిని చెప్పకూడదని, అతిరహస్యముగా నుంచవలెనని మాట తీసుకొనిరి. ద్వయమంత్రములోని రహస్యార్థము తెలిసిన మోక్షము కరతలామలకమగునని రామానుజులు గ్రహించిరి. ఆ మోక్షము కొద్దిమంది ప్రత్యేక వ్యక్తులకు మాత్రమే పరిమితమగుట భావ్యము కాదని భావించి మరునాడు "తిరుకోట్టియూర్" ఆలయ గోపురమును అధిరోహించి, జనులందరిని సమావేశపరచి తాము గ్రహించిన మహామంత్రములోని విజ్ఞానమునంతటిని ప్రజలకు బోధించిరి.

రామానుజుల వేదాంత బోధనల ద్వారా ప్రతివాదులైన భిన్నమతస్థులెందరో ప్రభావితులైరి.

అద్వైత వేదాంతియగు యజ్ఞమూర్తి యను పండితునకు, రామానుజులకు మధ్య 18 రోజులపాటు తీవ్రమైన శాస్త్ర చర్చ సాగినది. చివరకు యజ్ఞమూర్తి వాదనలో ఓడిపోయి రామానుజులకు పాదాక్రాంతులయినారు.

రామానుజులు శ్రీరంగ దేవాలయ నిర్వహణాధిపత్యమును పొంది, వైష్ణవోద్యమ వ్యాప్తికి ఆ ఆలయమును కేంద్రముగా చేసిరి. ఆలయ నిర్వహణాధికారిగా 'అకలంగుడు' అను చోళ సామంతరాజును నియమించిరి[6].

రామానుజులు తమ మేనమామ అయిన "తిరుమలైనంబి" వద్ద రామాయణాధ్యయనము చేయుటకు తిరుపతి వెళ్ళిరి. అప్పుడే వారు శ్రీవేంకటేశ్వర స్వామికి శంఖచక్రములను అమర్చిరను ప్రతీతి గలదు. రామాయణాధ్యాయనము తర్వాత రామానుజులు బ్రహ్మసూత్రములకు భాష్యరచన చేయవలెనని నిశ్చయించుకొనిరి. శంకరులు తమ భాష్యమున ప్రశంసించిన బోధాయనవృత్తినిగూర్చి రామానుజులు విని, దాని ప్రతి కాశ్మీరమున మాత్రమే లభించునని తెలుసుకొనిరి. కొంతమంది శిష్యులతో కలిసి కాశ్మీరమునకు వెళ్ళిరి. అచటి పండితులు

రామానుజాలకు బోధాయన వృత్తిని చూపుటకు ఇష్టపడలేదు. అపుడు రామానుజులు తమ వ్యక్తిత్వ-పాండిత్యములతో కాశ్మీరరాజును మెప్పించి బోధాయనవృత్తిని పొందిరి. తిరుగు ప్రయాణమున బోధాయనవృత్తి అపహరణమునకు గురియైనది. రామానుజుల శిష్యుడొకరు అపహరణకు ముందే బోధాయన వృత్తిని కంఠస్థము చేసియుండుటవలన రామానుజులు ఆ శిష్యునిద్వారా సూత్రములను గ్రహించిరి. తరువాత బ్రహ్మ సూత్రములకు విశిష్టమగు భాష్యమును రచించి కాశ్మీరదేశమున ప్రసిద్ధిగాంచిన సరస్వతీ పీఠమునుండి "శ్రీభాష్యకారులు" అను బిరుదుతోపాటు శ్రీ లక్ష్మీహయగ్రీవ విగ్రహమును బహుమాన పురస్సరముగా పొందిరి. ఈశ్వరుడు సాకారుడనియు, విశిష్టుడనియు, ఆతడొక్కడే సర్వప్రపంచమునకు మూలమనియు ప్రతిపాదించు విశిష్టాద్వైత మత సిద్ధాంతమును శ్రీభాష్యము సమగ్రముగా నిరూపించినది.

ఆళ్వారులు తమ గీతములలో వర్ణించిన పుణ్యక్షేత్రములను రామానుజులు దర్శించి ఆయా ఆలయములలో అనేక సంస్కరణములు చేసిరి. వీరు దక్షిణదేశ దిగంతముల వరకు యాత్రను ముగించుకొని శ్రీరంగము చేరునాటికి శ్రీవైష్ణవము గొప్ప మతములలో ఒకటైనది. రామానుజాలు క్రీ.శ. 1017 నుండి 1137 వరకు జీవించిరి[7].

రామానుజుల కాలంలో చోళదేశమును ప్రథమ రాజేంద్రుని నుండి విక్రముని వరకు ఐదుగురు రాజులు పరిపాలించిరి. వీరి కాలమున చోళులు మహోన్నత దశను అనుభవించుచుండిరి. రాజరాజు విస్తృతమైన సామ్రాజ్యమును సాధించెను. ఈయన కాలమున ఆళ్వారుల భక్తిగీతములకు, మతసాంప్రదాయమునకు రక్షణ లభించినది. చోళుల కాలముననే మత సంబంధమైన పునరుద్ధరణ జరిగి మహోన్నత ఆలయములు నిర్మింపబడినవి.

తిరునారాయణపురంలో రామానుజులు దేవాలయములోనికి అస్పృశ్యులను అనుమతించి ఆనాడే హరిజనులకు ఆలయ ప్రవేశార్హత కల్పించినారు. రామానుజులు తమ అనంతరము వైష్ణవమత ప్రచార నిర్వహణములు సక్రమంగా సాగుటకు డెబ్బదినాలుగుమంది నాయకులను నియమించిరి.

రామానుజుల వేదాంతము ఇతర వేదాంతములను ప్రభావితము చేసినది. ఉత్తరదేశములో బయలుదేరిన నూతనోద్యమములన్నియు రామానుజుల ప్రభావ

మును తప్పించుకోలేకపోయినవి. రామానుజుల తరువాత కొన్ని శతాబ్దములకు పుట్టిన రామానందులు, చైతన్య ప్రభువు, రామదాసు మొదలగువారు భక్తిని మహోద్యమముగా నడిపిరి. ఆ కారణముగా ఇతర మతముల ప్రాభవము తగ్గినది. రామానుజులు విశిష్టాద్వైత మతమును అవిచ్ఛిన్నముగా కొనసాగించుటవలన భారతీయ మత ధార్మిక చరిత్రలో విశిష్టాద్వైత సిద్ధాంతము మహత్తర శక్తిగా రూపొందినది.

రామానుజుల తరువాత వేదాంతదేశికులు, వారి శిష్యులు, ఆ తరువాత ఆదివన్ శఠగోపయతులు (1430-1510) వైష్ణవమతవ్యాప్తి గావించినవారిలో ముఖ్యులు. శ్రీవైష్ణవమును మధురమైన కవిత్వముద్వారా పవిత్రము చేసిన వేదాంతదేశికులు అత్యుత్తమాచార్యులుగా కీర్తిగాంచిరి.

భారతదేశమున బయలుదేరిన అనేక మతోద్యమములపై రామానుజుల ప్రభావము ప్రసరించినది. తెలుగు బ్రాహ్మణులైన నింబార్కులు రామానుజులకు సమకాలికులు. వీరి భక్తి ఉద్యమములో శ్రీకృష్ణభక్తి ప్రధానమైనది. వీరు ఉత్తరదేశమున శ్రీకృష్ణభక్తిని ప్రచారము చేసినారు.

ద్వైత దర్శన ప్రవర్తకులైన మధ్వాచార్యులు రామానుజుల తరువాత కొంతకాలమునకు వచ్చిరి. వీరి వేదాంతమున రామానుజుల ప్రభావము స్పష్టముగా కన్పించును. విశిష్టాద్వైత సిద్ధాంతమునందలి జీవేశ్వరుల విశిష్ట ఐక్యమును వీరు ఒప్పుకొనలేదు. మాయావాదమును వ్యతిరేకించుటలో విశిష్టాద్వైతముతో ఏకీభవించిరి.

క్రీ.శ. 14వ శతాబ్దికి చెందిన రామానందుల మూలముగానే ఉత్తర భారతములో భక్తి ఉద్యమము బయలుదేరినది. వీరు శ్రీరామ భక్తిసంప్రదాయమును ప్రతిపాదించిరి.

వంగదేశమున వైష్ణవమును స్థాపించిన చైతన్యులు శ్రీకృష్ణ పరమాత్మ నారాధించిన మహాభక్తులు. వీరివలననే కృష్ణమతము దేశమునందు బహుధా వ్యాపించినది.

రాధాకృష్ణ భక్తి ప్రధానమైన వల్లభ సంప్రదాయము ఉత్తరదేశము గుజరాత్, మధ్యదేశములలో ప్రచారమైనది. మతౌజ్జ్వల్యమునకు ప్రాణభూతమైనది ప్రేమ

మాధుర్యమే అని చైతన్యుల అభిప్రాయము. స్వచ్ఛమైన ప్రేమానుభూతిని పొందుటకు రాధాకృష్ణ భావనను ప్రబోధించిన చైతన్య, వల్లభ భక్తి సిద్ధాంతములలో రామానుజుల ప్రాభవమును గమనింపవచ్చును.

ఈ మధురానుభూతినే జయదేవుడు తన గీతగోవిందమున రాధాకృష్ణ ప్రేమ వర్ణనా రూపముగను, మధురభక్తిపరముగను వర్ణించెను.

మహారాష్ట్రమునకు చెందిన వామదేవ ఏకనాథ, తుకారామ్ మొదలగువారు మహోజ్జ్వలమైన భక్తి సంప్రదాయ పరంపరకు చెందినవారే[4].

గురునానక్ స్థాపించిన నీతి ప్రధానమైన సిక్కుమతము ఆచార్యాభిమానమునకు అధిక ప్రాధాన్యమిచ్చిన వైష్ణవ మతమునకు రూపాంతరమే. మానవుడు దైవమునకు చెందినట్లే దైవము మానవునకు చెందినవాడు అను భావనలో కూడా సిక్కు మతము రామానుజుల బోధనలతో సాదృశ్యము వహిస్తున్నది. ఆధునిక కాలమున వైష్ణవాచార్యుల మహోపదేశములవలన ప్రభావితులైనవారిలో గాంధీ మహాత్ముడొకరు. గాంధీజీకి వైష్ణవముపై అత్యంతాభిమానమున్నదని, ఆయన అభిమానించిన "వైష్ణవజనతో" అనెడి ప్రసిద్ధ గేయమునుబట్టి తెలియుచున్నది.

ఈ విధముగా నాథముని, యామునాచార్యులు నిరూపించిన మార్గమును రామానుజులు సిద్ధాంతీకరించిరి. విశిష్టులచే విశిష్ట క్రమమున నుపదేశింపబడిన ఉపనిషత్ సిద్ధమగు అద్వైతమగుటచేతను, ఈ మతము "విశిష్టాద్వైతము" అని వ్యవహరింపబడుచున్నది.

## అధస్సూచికలు

1. పేజి. 55. భారతీయ తత్త్వశాస్త్రము, తెలుగు అనువాదము, మొదటి భాగము, బులుసు వేంకటేశ్వర్లు. టి.టి.డి. ప్రచురణ.
2. పేజి. 56-57. భారతీయ తత్త్వశాస్త్రము, తెలుగు అనువాదము, మొదటి భాగము, బులుసు వేంకటేశ్వర్లు. టి.టి.డి. ప్రచురణ.
3. మంగళ శ్లో. 4, వల్లి-3, అధ్యా-1, కఠోపనిషత్.
4. పేజి - 11. రామానుజాచార్యులు - ఆర్. పార్థసారథి.

5. పేజి - 12. రామానుజాచార్యులు - ఆర్. పార్థసారథి.

6. పేజి - 37. రామానుజాచార్యులు - ఆర్. పార్థసారథి.

7. పేజి - 51. రామానుజాచార్యులు - ఆర్. పార్థసారథి.

8. పేజి - 78. జాతీయ జీవిత గ్రంథమాల - నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా.

# అధ్యాయము - 2

# అన్నమయ్య జీవిత విశేషములు

వేదకాలం నుండి సాగివచ్చిన వైష్ణవమతమును ఆళ్వారులు పాశురములుగా పాడి కులమత భేదరహితముగా ప్రజలకు విష్ణుమత పారమ్యమును బోధించినట్లుగా తెలుగునాట తాళ్ళపాక అన్నమాచార్యులు అమృతమయమైన తన వాగ్గేయములతో విష్ణుమూర్తిని వేంకటేశ్వరునిగా దర్శించి, తన జీవితకాలములో ముప్పదిరెండువేల కీర్తనలు పాడి, వైష్ణవమత ధర్మములను ప్రజలకు సన్నిహితమొనర్చినాడు. సంగీత సాహిత్యములకు భక్తిజ్ఞానములు కూడుకొని అన్నమయ్య కీర్తనలకు ఒక వైలక్షణ్యమును ఆపాదించినవి. తత్సమభాషకు ప్రజల వాడుక భాషను కలిపి, జానపద బాణులను పల్లవులుగా కట్టి, అప్రయత్నముగ, అలవోకగ, అప్పటికప్పుడు భక్తిరసాత్మకముగ పాడిన పాటలలో వేదాంతము అంతర్వాహినిగా వెంట వచ్చినది. అన్నమయ్య పాడిన పాటలన్నియును వేంకటేశ్వరాంకితములే. అర్చాస్వరూపములందు వేంకటేశ్వరుని తర్వాత నృసింహస్వామిని, రామకృష్ణాద్యవతారములను, హనుమంతాది భక్తబృంద మును అన్నమయ్య వర్ణించినాడు. ఆయన రచించిన కీర్తనలన్నియును విష్ణు పారమ్యములే. ఏతావతా అన్నమయ్య వాగ్గేయ సాహిత్యమున ప్రధాన వస్తువు వైష్ణవమే అని తెలియుచున్నది.

"అక్షరాణామకారోస్మి" అని గీతలో భగవానుడు అక్షరములలో తాను అకారమునని చెప్పినట్లుగానే, అకారాద్యక్షరము కలిగిన అన్నమయ్యగా తన ఆయుధాంశమును అవతరింపజేసి లోకమున తనను తాను అనేక కీర్తనలయందు ఆవిష్కరించుకున్నాడు. గురుశిష్య ఉపదేశ పరంపరకు భగవంతుడు తానే ఆచార్యుడై, తన అంశ శిష్యునిగా అవతరింపజేసి సంప్రదాయమును నిలబెట్టినట్లుగా, "కలౌ కేశవకీర్తనమ్" అను మోక్షోపాయమును ప్రచారము చేయుటకు భగవంతుడు తన అంశనే అన్నమయ్య రూపంలో అవతరింపజేసి కీర్తించి, ఆచరించి సర్వమానవులకు మార్గదర్శకుడయి ఆచార్యస్థానమును వహించినాడు.

కృష్ణపరమాత్మ భగవద్గీతను ప్రసాదించి జగద్గురువు అయినట్లుగా భక్తిరస ప్లావితములైన, జ్ఞాన కాంతి పుంజములైన అనేక వేల కీర్తనలను అన్నమయ్య ప్రసాదించి

ప్రజలు తరించుటకు మార్గదర్శకుడైనాడు. అన్నమయ్య కీర్తనలలోని మధురభక్తి, అనేక తాత్త్వికాంశములు కృష్ణుని కాలమునాటి గోపికల మధురభక్తిని, భగవద్గీతకును సరిపోలియున్నవి. అందుకే పెదతిరుమలాచార్యులు అన్నమయ్యను "హరి అవతారమీతడు" (2-100) అని కీర్తించినాడు.

అన్నమయ్య జీవిత విశేషములను తెలుసుకొనుటకు ఆయన మనుమడైన చిన తిరువేంగళనాథుడు (చిన్నన్న) రచించిన "అన్నమాచార్యుల జీవిత చరిత్రము" అను ద్విపదకావ్యము ఆధారమగుచున్నది.

**"బిరుదు గజ్జియల ముప్పిడి కఠారంబు**
**కలలోన నొసగ నక్కజమంది తపము**
**ఫలియించెననుచు దంపతులేగిరంత"** (పేజి-9)

అని నారాయణసూరి, లక్కమాంబలకు వేంకటేశ్వరస్వామి కలలో నందకమును అనుగ్రహించినట్లుగా చిన్నన్న వర్ణించినాడు. ఈ విషయమునే మరొకచోట "హరినందకాంశజాండగుట"గా. అన్నమయ్యను ప్రకటించినాడు.

**"చక్కని గ్రహము లుచ్చమున మూడలర**
**అనుపమ లగ్నంబు నందు వైశాఖ**
**మున విశాఖను జగంబున నుల్లసిల్ల**
**జనియించె నన్నమాచార్యుండు శక్తి**
**మునికి - బరాశరముని పుట్టినటులు"** (పేజి-9)

అని విశాఖ నక్షత్రమును, వైశాఖ మాసమును అన్నమయ్య జననకాలముగా పేర్కొనబడినవి. కాని సంవత్సరము చెప్పబడలేదు. అన్నమయ్య జననకాలమును గూర్చి పండిత లోకమున వివిధ అభిప్రాయములు గలవు.

అన్నమయ్య 1424లో జన్మించి క్రీ.శ. 1503లో పరమపదించినట్లు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు[1], డా॥ వేటూరి ఆనందమూర్తిగారు[2] నిర్ణయించిరి. అబ్బూరి గోపాలకృష్ణగారు[3] కూడా క్రీ.శ. 1424వ సంవత్సరముననే అన్నమయ్య జనన కాలముగా అభిప్రాయపడిరి. తరువాతి విమర్శకులు 1424వ సంవత్సరమును అన్నమయ్య సంకీర్తన ప్రారంభ కాలముగా గుర్తించిరి.

గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు, అన్నమయ్య క్రీ.శ. 1408వ సంవత్సరంలో జన్మించినట్లు అనేకాధారములతో నిరూపించినారు[4]. కామిశెట్టి శ్రీనివాసులుగారు[5], ఆచార్య గంగప్పగారు[6], డా॥ సర్వోత్తమన్‌గారు[7], డా॥ పొన్నా లీలావతమ్మగారు[8], డా॥ గుమ్మా సాంబశివరావుగారు[9] మొదలగు అన్నమయ్య సాహిత్య పరిశోధకులు క్రీ.శ. 1408వ సంవత్సరమునే అన్నమయ్య జనన కాలముగా నిర్ణయించిరి.

సర్వధారి నామ సంవత్సర వైశాఖమాసం విశాఖ నక్షత్రయుక్త పూర్ణిమా తిథికి సరియగు తేది 9-5-1408ని జన్మతేదిగా నిర్ణయించి తిరుమల తిరుపతి దేవస్థానము వారు 1978 నుండి అన్నమయ్య జయంతి ఉత్సవములను నిర్వహించుచున్నారు[10].

పరిష్కరింపబడిన పండితాభిప్రాయములనుబట్టి, తిరుమల తిరుపతి దేవస్థానమువారి జయంత్యుత్సవ నిర్ణయమునుబట్టి అన్నమయ్య జననకాలము క్రీ.శ. 1408 అని భావించుటయే సమంజసమనిపించుచున్నది.

అన్నమయ్య పూర్వీకులు కడప జిల్లా తాళ్ళపాక గ్రామమునకు చెందినవారు. నందవరీక బ్రాహ్మణులు, ఆశ్వలాయనసూత్రులు, భారద్వాజ గోత్రికులు, బ్రాహ్మణ సంప్రదాయానుసారముగా నారాయణసూరి అన్నమయ్యకు ఉపనయనము చేసెను. వేదవిద్యలన్నియును అన్నమయ్య నాలుకపై నర్తనమాడినవి. అన్నమయ్య,

**"ఆడినమాటెల్ల నమృతకావ్యముగా**
**పాడిన పాటెల్ల పరమగానముగా"** (పేజి-11)

ఎనిమిదేండ్ల ప్రాయమునుండే వేంకటేశ్వరునిపై సంకీర్తనలు వెలయించెను.

తల్లిదండ్రులు - అన్నావదినలు చెప్పిన ఇంటిపనులు విడిచి విరక్తితో అన్నమయ్య,

**నెన్నటిచుట్టము లిటువంటివార**
**లెన్నటిజందుండ నేను వారలకు**
**నీవట్టి వెట్టి నాకేల కావింప**
**భావింప నాలోన బాయకెల్లపుడు**
**తల్లియు దండ్రియు దైవంబు గురువు**

నెల్ల సంపదలునై యెల్ల చందముల
నను బ్రోచు శేషాద్రినాథుని గొలిచి
మనియెద ననుచు ........." (పేజి-12)

భక్తబృందముతో కలసి తిరుపతికి వెళ్లెను. మోకాళ్ళ పర్వతమువద్ద అన్నమయ్యకు అలివేలుమంగ ప్రత్యక్షమై "పడుచ యేమిటికిట పడియున్నాడవు" (పే.16) అని ప్రశ్నించగా "కందర్పజనకుని గనజేయుమమ్మ" (పే.16) అని ఆమెను అన్నమయ్య ప్రార్థించెను. వైష్ణవ సంప్రదాయ లక్షణము తెలియకపోయినను పురుషకార స్వరూపిణి అయిన అలివేలుమంగనే అన్నమయ్య మొదట ప్రార్థించెను. ఆమె అనుగ్రహముననే తిరుమలను, రామ-కృష్ణ-లక్ష్మీనృసింహాది మూర్తులను దర్శించెను (పే.17). ఆమె అనుగ్రహించిన ప్రసాదమును స్వీకరించి అన్నమయ్య తిరుమలను చేరుకొనెను. మార్గమధ్యమున అలివేలుమంగ ప్రసాదప్రభావమున ఆమెపై నొక శతకమును "వేంకటేశ్వరా" అను మకుటముతో ఆశువుగా చెప్పెనట. అదే "మంగాంబికా" శతకమని కొందరి అభిప్రాయము11. దానికి కారణము -

"అమ్మకు తాళ్ళపాక ఘనుడన్నడు పద్యశతంబు చెప్పె గో
కొమ్మని వాక్ప్రసూనముల కూరిమితో నలమేలు మంగకున్"[12]
(శ్రీ వేంకటేశ్వరశతకము-100)

అని చివరి పద్యమున ఉండుటవలన కావచ్చును.

అన్నమయ్య తిరుమలకు చేరిన తదుపరి స్వామిపై మరొక శతకము చెప్పెనట. కాని అది నేడు లభించుటలేదు. మంగాంబికా శతకమే "వేంకటేశ్వరా" అను మకుటము కలిగి ఉండుటచేత వేంకటేశ్వరశతకముగా ప్రసిద్ధికెక్కినది.[13]

అన్నమయ్య కోనేటిలో స్నానముచేసి ఆదివరాహస్వామిని దర్శించి వేంకటేశ్వరుని సేవించెను. ద్వాదశినాడు మరల స్వామిని దర్శించుటకు రాగా "తలుపులు-బీడముల్ దాచి యున్నెడను" (పే.25) అనగా తలుపులు వేసియుండగా అన్నమయ్య వేంకటేశునిపై సవిస్తరముగా వేంకటశతకము విన్నవించెను. అపుడు తాళములు పటంతట అవే ఊడిపోయిన లక్షణమును జూచి వైఖానసార్చకులు అన్నమయ్య మహిమను గుర్తించి భక్తితో ఆతనిని లోనికి తోడ్కొని పోయిరి. స్వామిని

దర్శించినపుడు అన్నమయ్య ఇదివరకు తాను విన్నవించిన వేంకటశతక పద్యములను మరల స్వామిముందు వినిపించగా, అన్నమయ్య పద్యసాహిత్యమునకు పరవశత్వము పొందిన స్వామి తన మెడలోని ముత్యాలహారమును అన్నమయ్యకు అనుగ్రహించెను.

స్వామి తిరుమలలోని ఘనవిష్ణుడను ముని కలలోనికి వచ్చి తన భక్తుడొకడు సంకీర్తనము చేయుచు తిరుగుచున్నాడని, ఆతనికి పంచసంస్కారదీక్షనీయమని తన ముద్రికలనిచ్చెను. ఆ యతి తెల్లవారి అన్నమయ్యను గుర్తుపట్టి వేదమార్గానుసారముగా శంఖచక్రాంకితుని జేసెను. అన్నమయ్యయు కృతార్థుడనైతినని భావించెను.

తల్లిదండ్రులు తిరుమలకు వచ్చి కేశవ నామములుపాడు భక్తిదాసుడైన అన్నమయ్యను చూచి తమ ఊరికి తీసుకొని వెళ్లిరి. తిరుమలమ్మ, అక్కలమ్మ అను ఇరువురి కన్యలతో అన్నమయ్యకు వివాహము చేసిరి. పుట్టుకతో వచ్చిన భక్తి, ఉపనయనానంతరము నేర్చుకొనిన విజ్ఞానముతో సంతృప్తిచెందక అన్నమయ్య సకల వేదాంతజ్ఞాన సముపార్జనమునకై అహోబల మఠ పీఠాధిపతియైన ఆదివన్ శఠగోప మునిని ఆశ్రయించెను. శఠగోపయతి అన్నమయ్యకు నృసింహ మంత్రమునుపదేశించె ననియు, ఆ మంత్రమునకు ముప్పదిరెండు బీజాక్షరములు కలవనియు, అక్షరమునకు వేయి చొప్పున ముప్పదిరెండువేల సంకీర్తనములను రచించెననియు కొందరి అభిప్రాయము[14]. ఈ అభిప్రాయమునకు అనుగుణముగానే అన్నమయ్య అహోబల నృసింహస్వామిని అనేక కీర్తనలలో ఉపాసించినట్లు కనిపించును.

అన్నమయ్య వాల్మీకి రామాయణమును కూడా గానము చేసినట్లు, ఆ గానమును విని ప్రజలు నారదతుంబురులవంటివాడు ఈ అన్నమయ్య అని కీర్తించినట్లు తెలియుచున్నది.

సాళువ నరసింహరాయడు అన్నమయ్య కాలములోనివాడు. అన్నమయ్య సంకీర్తనములు విని పరవశుడై ఆతనిని సేవించుకొని తన రాచనగరుకు తీసుకొని వెళ్ళెను. నరసింగరాయని సమక్షమున అన్నమయ్య వేంకటేశ్వరునిపై శృంగార సంకీర్తనములు వినిపించగా, రాయడు సంతసించి సత్కరించెను. తనపైకూడ శృంగార కీర్తనలను చెప్పమని రాయడు కోరగా, అన్నమయ్య -

> "హరిముకుందుని కొనియాడు నా జిహ్వా
> నిను కొనియాడంగ నేరదెంతైనా" (పే.37)

అని తిరస్కరించెను. రాయడు కోపించి అన్నమయ్యకు సంకెలలు వేయించగా,

> "సంకెల లిడువేళ - జంపెడు వేళ
> నంకిలి ఋణదాతలాగెడువేళ
> వదలక వేంకటేశ్వరుని నామంబె
> విదలింప గతిగాని వేరొండు లేదు" (పే.38)

అని భగవంతుని శరణాగతి చేయగా సంకెలలు ఊడిపోయెను. రాయడు పంతముతో మరల బంధించగా హరిసంకీర్తనమే అన్నమయ్యకు శరణమై సంకెలలు మరల విడిపోయెను. రాయడు పశ్చాత్తప్తుడై అన్నమయ్య మహిమను గ్రహించి, ఆతనికి బంటుగానయి అన్నమయ్య ఎక్కిన పల్లకి మోసెను.

అన్నమయ్య సాళువ నరసింగరాయని క్షమించి, తాను తిరుమల చేరి, శ్రీనివాసుని సేవించి శృంగారమంజరిని రచించెను. ఈ కావ్యమున అలమేలుమంగా శ్రీనివాసుల శృంగారము మంజరీద్విపదలో వర్ణింపబడినది.

అమలిన భక్తితో నిరంతరము వేంకటేశ్వరుని వర్ణించుటవలన అన్నమయ్యకు "సకలవాచాశుద్ధి" కలిగినది (పే.42). ఆయన వరకృత్యంబులు ఎన్నియో చేసినాడని, అవి తనకు లెక్కింపశక్యముగాదని, నాటి పెద్దలు వాటినెరుగుదురని అట్లెరిగినవారు తన కాలములోగలరని, వారు అవి తనకు తెలుపగా తాను వానిని వివరించు చున్నానని" చిన్నన్న అన్నమయ్య మహిమలను కొన్నింటిని పేర్కొనినాడు. అవి, పుల్లని మామిడిపండ్లు తియ్యగా మారుట, పేద బ్రాహ్మణునకు అన్నమయ్య వశ్యవాక్కు వలన ధనసహాయము లభించుట మొదలగునవి.

ఆ కాలమున అన్నమయ్య పురందరదాసులు కలుసుకొని పరస్పరము సంభావించుకొనిరని చిన్నన్న తెలిపెను.

అన్నమయ్య రచనలుగా 12 శతకములు, శృంగారమంజరి, వేంకటాచల మాహాత్మ్యము, ద్విపద రామాయణము, ముప్పదిరెండువేల అధ్యాత్మ, శృంగార

సంకీర్తనలు, సంస్కృతములో సంకీర్తన లక్షణము మొదలగునవి చిన్నన్న పేర్కొనెను. అందు వేంకటేశ్వరశతకము, శృంగారమంజరి, అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు మాత్రమే నేడు లభించుచున్నవి. అన్నమయ్య సంస్కృతమున రచించిన లక్షణగ్రంథమును చినతిరుమలాచార్యుడు తెలుగులోనికి అనువాదము చేసెను.

అన్నమయ్య రచించిన అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు 2289 రాగిరేకులపై చెక్కించి తిరుమలలోని "తాళ్ళపాక అర"లో ఏర్పాటు చేసిరి. ఈ అరను సంకీర్తన భాండాగారముగా గుర్తించి దీప ధూప నైవేద్యములు సమర్పించుట అచ్యుతరాయల కాలము నుండి నేటివరకు సంప్రదాయముగా వచ్చుచున్నది. నిత్య తిరుమంజనోత్స వములోను, బ్రహ్మోత్సవ, రథోత్సవములలోను ఈ సంకీర్తనలు ఆలపించు పద్ధతిని ఏర్పాటు చేసిరి. క్రీ.శ. 1530, 1545, 1558 నాటి శాసనములలో సంకీర్తన భాండాగార వ్యవస్థను గూర్చి ప్రస్తావన గలదు[15]. సంకీర్తన భాండాగార ద్వారమునకిరువైపుల అన్నమయ్య - పెదతిరుమలయ్యల శిల్పమూర్తులున్నవి. ఈ పద్ధతిని పరిశీలించగా వైష్ణవాలయములలో ఆళ్వారుల విగ్రహములు - దివ్య ప్రబంధ గాన వ్యవస్థ ఎట్లేర్పడి యున్నదో అట్లే భాగవతోత్తముడైన అన్నమయ్య సంకీర్తనలు కూడ తిరుమలలో ఉత్సవములందు ఆలపించెడి వ్యవస్థ ఉన్నట్లు, ఆ కీర్తనలు పూజార్హతను కలిగి యున్నట్లు తెలియుచున్నది.

ఇట్టి అన్నమయ్య సంకీర్తనలు శృంగార భక్తి భావ భరితములు, అధ్యాత్మ భావకోశములు, వేదమంత్రార్థ ప్రదీప్తములునై జిజ్ఞాసువులకు అనేక తాత్త్విక విషయములను తెలియజేయుచున్నవి.

## అధస్సూచికలు

1. పీఠిక - అన్నమాచార్య చరిత్రము, వేటూరి ప్రభాకరశాస్త్రి, 1949.
2. పేజి-60,65 - "తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు" - వేటూరి ఆనందమూర్తి, 1974.
3. గోపాలకృష్ణ అబ్బూరి - "అన్నమయ్య జనన వత్సర నిర్ణయము" వ్యాసము - భారతి, ఫిబ్రవరి, 1981.
4. "ఉపోద్ఘాతము" పేజి-6, 8, శృంగార సంపుటము-12 - గౌరిపెద్ది రామసుబ్బశర్మ.

5. "ఉపోద్ఘాతము" పేజి-7,8, డా॥ ముట్నూరి సంగమేశంగారి "అన్నమాచార్య సాహితీ కౌముది" - 1931.

6. పేజి-9, "అన్నమాచార్య సంకీర్తన సుధ", గంగప్ప, 1995.

7. పేజి-2, "అన్నమయ్య-త్యాగయ్య" సర్వోత్తమన్, కె. 1983.

8. పేజి-7, "అన్నమయ్య సంకీర్తనలలో జానపదగేయ ఫణితులు" పొన్నా లీలావతమ్మ- 1986.

9. పేజి-4, "అన్నమాచార్య సంకీర్తనలలోని వర్ణనలు" సిద్ధాంతవ్యాసము, 1990.

10. పేజి-11, "శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర", కె. వాణి, తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ, 1997.

11. పేజి-28, "శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య జీవిత చరిత్ర", కె. వాణి.

12. "అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర శతకము" - అన్నమయ్య పరిశీలన, గార్లపాటి దామోదర్‌నాయుడు, 1989.

13. పేజి-28, "తాళ్ళపాక అన్నమాచార్య జీవిత చరిత్ర" - కె. వాణి.

14. "పీఠిక" - పేజి.52, అధ్యాత్మ సంకీర్తనములు, సంపుటి-2, గౌరిపెద్ది రామసుబ్బశర్మ.

15. పేజి-70, "తాళ్ళపాక అన్నమాచార్య జీవిత చరిత్ర", కె. వాణి.

# అధ్యాయము - 3

# విశిష్టాద్వైత దర్శన వైశిష్ట్యము

శ్రీమద్విశిష్టాద్వైత మతము ఉపనిషత్తులు మొదలగువానిచే ప్రమాణ బద్ధముగా నిరూపింపబడిన సిద్ధాంతము. చిత్-అచిత్ తత్త్వములతోడి విశిష్టమైన బ్రహ్మమును గూర్చి చెప్పునది గనుక "విశిష్టాద్వైతము" అనబడుచున్నది.

ఇట్టి విశిష్టాద్వైతమున ముఖ్యముగా "ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞానమ్" అను ఏకత్వ ప్రతిపాదక వాక్యవివరణము, చిత్-అచిత్-ఈశ్వరులనెడి తత్త్వత్రయ స్వరూప నిరూపణము, జీవాత్మ-పరమాత్మల శరీర-శరీరి భావ సంబంధము, పరమాత్మకు గల అశేష విశేష గుణ నిరూపణము, పరమాత్మ ప్రాప్త్యుపాయము, అందలి భక్తి ప్రపత్తుల స్వరూప సంధాన విధానము మొదలగునవి పేర్కొనదగియున్నవి.

"ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞానమ్" అను శ్రుతికి మూలపదార్థ జ్ఞానమువలన సర్వమైన విజ్ఞానము కలుగును అని అర్థము. "సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్" "ఏకమేవా ద్వితీయమ్"[1] అనెడి ఛాందోగ్యోపనిషత్తునందలి శ్రుతి "ఏక" "అద్వితీయమ్" అను పదములతో నిమిత్త కారణమగు మరొక పదార్థమేదియు లేదనియు, జగత్తునకు నిమిత్త ఉపాదాన కారణములు ఈశ్వరుడే అనియు తెలుపుచున్నది. కనుక "ఏక" అను శబ్దమునకు పరబ్రహ్మము అని అర్థము. అట్టి పరబ్రహ్మము యొక్క జ్ఞానముచేత అతనితో అపృథక్సిద్ధ సంబంధము కలిగి విశేషమై యుండు సర్వప్రపంచము యొక్క జ్ఞానము కలుగుతుందని పై శ్రుతికి అర్థము.

ఈ వాక్యమునుబట్టి దృశ్యమానమగు సర్వప్రపంచమునకు "ఏక" శబ్ద వాచ్యమగు పరబ్రహ్మము ఉపాదాన కారణమని తేలుచున్నది. ఏ మూల పదార్థము రూపాంతరము చెందునో అది ఉపాదాన కారణము. ఆ రూపాంతరములు కార్యములు.

భగవద్గీతయందు శ్రీకృష్ణుడు "తనయందు అపరప్రకృతియనబడు భూమ్యాది జడరూప ప్రకృతియు, పరప్రకృతియనబడు జీవవర్గమును సూక్ష్మరూపమున లీనమై యుండుననియు, ఆ ఉభయ చిదచిద్రూప సూక్ష్మ ప్రకృతులద్వారా తాను ఈ స్థూల

దృశ్య ప్రపంచమును సృష్టింతుననియు[2], తదుభయ విశిష్టుడగు తాను సంకల్పకర్తయై సృష్టి ప్రళయములను చేయుచున్నానని "ఏతద్యోనీని"[3] అను పదముచేత సూచించెను.

మరియు మనుస్మృతియందు ప్రథమాధ్యాయమున మనువు సృష్ట్యారంభ మును చెప్పుచు, "తనయందు సూక్ష్మరూపమున లీనమై సుప్త ప్రాయమై తన శరీరమైన తమశ్శబ్దవాచ్యమగు మూలప్రకృతినుండి భగవంతుడు సర్వప్రపంచమును సృష్టించెనని[4] తెలిపియున్నాడు.

సుబాలోపనిషత్తు కూడా "ప్రళయదశయందు పృథివ్యాది సర్వపదార్థములకు లయమును చెప్పుచూ తమశ్శబ్దవాచ్యమగు మూలప్రకృతి పరమాత్మయందు ఏకీభావమును పొందునని[5] చెప్పుచున్నది.

ఇట్లు సూక్ష్మరూపమున తనయందున్న చిదచిత్పదార్థములను స్థూల రూపమున సృష్టించిన తర్వాత కూడా పరమాత్మ ఈ ప్రపంచమంతట తాను వ్యాపించి యుండుననియు ఏకరూపముగనున్న పరమాత్మ, బహువిధములనొంది జగద్రూపముగ తనను తాను సృష్టించుకొనునని తెలియుచున్నది.

ఈ విధముగా బ్రహ్మమునకు చిదచిత్తులకు విశిష్టమైన ఐక్యమేగాని పృథక్ స్థితి రూపభేదము లేదు. కనుక ఉపాదాన కారణభూతమగు సూక్ష్మచిదచిద్విశిష్ట బ్రహ్మముయొక్క జ్ఞానముచేత స్థూల చిదచిత్ప్రపంచ జ్ఞానము కూడా కలుగునని "ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞానమ్" అను శ్రుతికి తాత్పర్యము.

ఇందుకు మృత్పిండ దృష్టాంతమును చెప్పవచ్చును. ఒకే మట్టిముద్ద కుండలు, చిప్పలు, ఇటుకలు మొదలగు వస్తువులుగా మార్చబడినపుడు, ఆ మట్టి ముద్దను మొదట చూచినవాడు, ఈ కుండలు మొదలగునవి ఆ మట్టిచే చేయబడిన వస్తువులే" అని ఇతరులు చెప్పకనే తానే తెలుసుకొనగలడు. అట్లే ఒక లోహపు ముద్దను మొదట చూచినవాడు తర్వాత ఆ లోహముచే నిర్మితములగువానిని చూచి ఇవన్నియు లోహపు వస్తువులే[6] అని స్వయముగా గ్రహించగలడు. కనుక సర్వప్రపంచ మును తెలుసుకొనుటకు ముందు దానికి మూలాధారమగు ఒక వస్తువును తెలుసుకున్నచో చాలుననియు, దానిచేతనే దాని కార్యమగు సర్వప్రపంచము తెలియు ననియు "ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానమ్" అను శ్రుతికి అర్థము.

## తత్త్వత్రయము :

సంసార బంధము నుండి బయటపడవలెననెడి సంకల్పము, జీవన ప్రయోజనము పొందవలెనను కోరికగల విలక్షణాధికారికి "మోక్షము" అను పురుషార్థమును సాధించుటకు తత్త్వత్రయమును తెలుసుకొనుట అత్యంతావశ్యకము.

తత్త్వత్రయమనగా చిత్తు (జీవుడు), అచిత్తు (జగత్తు-ప్రకృతి-అచేతనము), ఈశ్వరుడు (పరంబ్రహ్మ పరమాత్మ, పరబ్రహ్మ).

ఈ చిదచిదీశ్వరులు నిత్యులు. చిద చిత్తులతో కూడిన పరమాత్మ నారాయణుడు. చిదచిత్తులకు నారాయణునితో అపృథక్సిద్ధ సంబంధము కలదు. చిత్తు అనబడెడి జీవుడు భగవంతునికి శరీరము. ప్రకృతి జీవునకు శరీరము. జీవ ప్రకృతులకు ఆత్మ శ్రీమన్నారాయణుడు. సంబంధము శరీరాత్మ సంబంధము. ఒక మామిడిపండు నందు గుజ్జు, టెంకె, పీచు, రంగు, రుచి, వాసనలు వేరువేరుగా గుర్తించదగియు, వేరు చేయలేనివై అన్నియు కలసి మామిడిపండు అయినట్లు చిదచిదీశ్వరులకు వేర్పాటు ఉండియు వేరు చేయుటకు వీలులేదు.

"సృష్టికి పూర్వము సూక్ష్మరూపములోనున్న చిదచిత్తులు సృష్ట్యనంతరము స్థూల రూపమును పొందును. ప్రళయ కాలమందు చిదచిత్తులు సూక్ష్మరూపమును పొంది పరమాత్మతో ఏకీభావమును పొందును" - అని భగవద్గీత, ఉపనిషత్తులు, మనుస్మృతి మొదలగునవి పేర్కొనినవి.

## తత్త్వత్రయము నందలి చిత్ స్వరూప నిరూపణము :

చిత్తు అనగా జీవుడు. దేహేంద్రియ మనః ప్రాణముల కంటె వేరుగా నుండునదై, జడముకానిదై, ఆనందరూపమై, అణువై, అవ్యక్తమై, అచింత్యమై, నిరవయవమై, నిర్వికారమై, ఈశ్వరునకు శరీరమై ఉండునది చిత్తు. అనగా జీవాత్మ.

ముండకోపనిషత్తు జీవాత్మను అణు పరిమాణముగలదిగా[7] పేర్కొన్నది. అణురూపముగల జీవాత్మకు ఆకాశాది పంచభూతములు దేహాది సృష్టికి కారణ పదార్థములు.

ఈ జీవాత్మ అత్యంత సూక్ష్మము. నాశరహితము. సర్వవ్యాపకమగు ఆ పరబ్రహ్మమునందు స్థితుడైయుండునని[8] ప్రశ్నోపనిషత్తు వాక్యము. "కార్యకారణ

రూపోపాధియందు నిండియున్న ఈ జీవుడు చూచువాడు, స్పృశించువాడు, వినువాడు, వాసన చూచువాడు, జిహ్వతో రుచిచూచువాడు, మనస్సుతో ఆలోచించువాడు, బుద్ధితో తెలుసుకొనువాడు, కార్యములు చేయువాడు, విజ్ఞాన స్వరూపుడు"[9] అని కూడా ప్రశ్నోపనిషత్తు పేర్కొన్నది.

జీవాత్మ ఆవిర్భావమును, లయమును గూర్చి చెప్పుచు ముండకోపనిషత్తు "ప్రకాశవంతముగా ప్రజ్వలించుచున్న అగ్ని నుండి - ఆ అగ్నితో సమానమైన రూపములు గల నిప్పురవ్వలు వేలకొలది ఎట్లు పుట్టుచున్నవో, అట్లే అక్షర పరబ్రహ్మము నుండి అనేక విధములైన జీవులు జన్మించుచున్నారు. తిరిగి అందేలీనమగుచున్నారు"[10] అని పేర్కొన్నది.

"సర్వభూతాంతరాత్మా"[11] అనియు "హృదిహ్యేష ఆత్మా"[12] అనియు, పరమాత్మను శ్రుతులు పేర్కొనుట వలన, తనయందు పరమాత్మ ఉండుటచేత జీవాత్మ తాను పరమాత్మకు శరీరమగుచున్నాడు.

"అత్రాయం పురుషః స్వయం జ్యోతిర్భవతి"[13] అను శ్రుతి వలన జీవాత్మకు స్వయం ప్రకాశత్వము కలదని తెలియుచున్నది. స్వయం ప్రకాశత్వమనగా అనన్యాధీన ప్రకాశత్వము. అజడత్వమనగా నిదియే. జ్ఞానత్వము, అణుత్వము, అమలత్వము, జీవాత్మ యొక్క స్వరూప నిరూపక ధర్మములు.

జీవాత్మ నాశము లేనట్టిది. అప్రమేయమైనది. శాశ్వతమైనది.[14] ఈ జీవాత్మకు మార్పులేదు.[15] జీవాత్మ అణుత్వమును గూర్చి శ్వేతాశ్వతరోపనిషత్తు "కేశాగ్రము యొక్క పదివేలవ భాగమంత పరిమితి గలిగియుండునది"[16] అని పేర్కొన్నది. వేదవాఙ్మయ భాగములన్నిటియందు అణు రూపమయిన ఆత్మ నిర్మాణము అంగీకరింపబడినది. ముండకోపనిషత్తుననుసరించి ప్రతి జీవియందును అణురూపమయిన ఆత్మయుండును. పరమాత్మతోపాటు అణురూపమైన ఈ జీవాత్మ ప్రతి హృదయమున ఉండును.

భగవద్గీత "నేను జీవించని సమయమెప్పుడును లేదు, నీవుకాని, ఈ రాజులు కాని జీవించి యుండని సమయము లేదు. భవిష్యత్తులో కూడా మనమెవ్వరము జీవింపకుండ ఉండబోము"[17] అని జీవాత్మ యొక్క నిత్యత్వమును చాటి చెప్పినది.

ఇదే విషయమును కఠోపనిషత్తు కూడా "నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానాం"[18] అని పేర్కొన్నది.

"ఆత్మకెప్పుడును జననముకాని మరణముకాని లేదు. ఆత్మ ఒకప్పుడుండి మరియొకప్పుడుండకపోదు. అది అజడము, నిత్యము, శాశ్వతము, పురాతనము. దేహము చంపబడినను అది చంపబడదు."[19] అని భగవద్గీత, కఠోపనిషత్తులు పేర్కొన్నవి.

ఇంకను "జీవాత్మ భేదించుటకు వీలులేనిది. నీటిలో కరిగించుటకు వీలు లేనిది. దానిని దహించుటకుగాని, ఎండించుటకుగాని శక్యముగాదు. అది నిత్యము. సర్వవ్యాపకము, మార్పులేనిది, కదిలించరానిదై, శాశ్వతముగా ఒకే విధముగా నుండును."[20] అని కూడా భగవద్గీత వివరించినది.

ఇంకను జీవాత్మ అవ్యక్తము[21] అనియు, జీవాత్మ అనునది సృష్టికి పూర్వము కూడా ఉండెను. దేవాది దేవుడైన విష్ణువునందు లీనమై యుండును. జీవులు భగవంతునియందు అవ్యక్తముగా సృష్టికి పూర్వమే ఉందురు"[22] - అనియు, జీవాత్మ అనశ్వరమైనది, దివ్యమైనది, నిత్యము, ప్రకృతి గుణాతీతమైనది[23] - అనియు,

జీవోత్పత్తిని గూర్చి "బ్రహ్మమనబడు భౌతిక వస్తు సముదాయమంతయు జననమునకాధారము, సర్వజీవుల జననమును సాధ్యము చేయుచు, నేనా బ్రహ్మము నందే బీజము నాటుదును"[24] అనియు భగవద్గీతయందు చెప్పబడియున్నది.

భౌతికవస్తు సర్వస్వమైన మహతత్త్వమే వేదవాఙ్మయమున బ్రహ్మమని వర్ణింపబడినది. "తస్మాదేతత్ బ్రహ్మనామ రూపమన్నంత జాయతే"[25] - అనగా ఈశ్వరుడు జీవ బీజములచే బ్రహ్మమును గర్భవంతమొనరించును. పృధివ్యప్తేజో వాయువులతో ఆరంభించుచూ ఇరువది నాలుగు తత్త్వములు కలిసి భౌతికశక్తియగును. దీని కతీతమైన జీవాత్మ ఈశ్వరుని సంకల్పముచే భౌతిక ప్రకృతితో కలుపబడును. తరువాత ఈ భౌతిక ప్రకృతి నుండి జీవులన్నియు జన్మించును. భౌతిక ప్రపంచము నుండి ఉద్భవించినట్లుగా కన్పించును. ఈ విధముగా తన పూర్వ కర్మముల ననుసరించి జీవుడు ప్రకృతిచే సృజింపబడి వివిధ దేహములను పొందును. నిత్యమైన జీవాత్మకు త్రిగుణాత్మకమైన భౌతిక ప్రకృతితో సంసర్గము కలిగినపుడు జీవాత్మ కూడా త్రిగుణబద్ధుడగును.

జీవాత్మ భగవంతుని కౌస్తుభమణివలె పరిశుద్ధుడైనను కర్మ సంబంధము వలన సర్వజ్ఞత్వమును కోల్పోవుచున్నాడు. జ్ఞాన రాహిత్యము వలన దుఃఖమును పొందుచున్నాడు. భగవత్కృపచే కటాక్షితుడై సదాచార్యునాశ్రయించి, ఆయన కృపచే జ్ఞానము పొంది ఉపాయానుష్ఠానము చేత స్వస్వరూపమునందుచున్నాడు. నిత్యసూరి నిర్వాహకుడైన, అవిచ్ఛిన్న జ్ఞానానందమయుడైన, సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుని హృదయస్థుడు, కుమారుడు, శిష్యుడు, శేషభూతుడు, దాసభూతుడు, జీవాత్మ. జీవాత్మ కర్మానుసారము భ్రమించుచు గర్భ, జన్మ, జరా, మరణ నరకాది సంసార చక్రములో పడుచున్నాడు. ఈ జీవాత్మ పరతంత్రుడు. తన సుఖదుఃఖములకు ఇతడు నియామకుడుకాడు. భగవంతునిచే ప్రేరితుడై ఈ జీవాత్మకర్మానుగుణముగా స్వర్గ నరకాదులను పొందుచున్నాడు. పవిత్రమూర్తియైన పరమాత్మను పొంది, జీవాత్మ ఆతని గుణములను, పవిత్రత్వమును, విమలత్వమును, స్వీకరించుచున్నాడు. జీవాత్మ పరమాత్మను పొందుటకు అవిద్యాకర్మ వాసనాదులు ప్రతిబంధకములగు చున్నవి. కర్మ పరిపాకమునంది కల్పాంతర, మన్వంతర, యుగాంతర, జన్మాంతర ములందు ఏదైన ఒక సమయమున మోక్షమునకు అనుకూల పరిస్థితులు ఏర్పడినవుడు, భగవంతుని వశము చేసుకొనుటకు సమర్థమైనది శరణాగతియే అని నమ్మి, జీవాత్మ భగవత్కృపచే సంసారచక్రము నుండి విముక్తుడగుచున్నాడు.

## జీవాత్మ భేదములు :

ఇట్టి జీవాత్మ మూడు విధములు. అవి,

1. బద్ధులు 2. ముక్తులు 3. నిత్యులు

### I. బద్ధులు :

అనాది కర్మ పరంపరా ప్రభావము చేత సంసార సాగరమందు నిబద్ధులైనవారు. పదునాలుగు లోకములతో కూడియున్న అండకటాహము నందు బ్రహ్మ మొదలు కీటకము వరకున్న సమస్త చేతనులు బద్ధులు. ఈ బద్ధ జీవులు మరల దేవ, మనుష్య తిర్యక్, స్థావరములని నాల్గు విధములు. శ్రీమన్నారాయణుని నాభి కమలము నుండి బ్రహ్మ జన్మించెను. ఆతని నుండి రుద్రుడు జన్మించెను. ఆతని నుండి సనకాదులగు మునులు, నారదుడు మొదలగు వారు, బ్రహ్మర్షులు, పులస్త్యుడు, మరీచి, కశ్యపుడు

మొదలగు ప్రజాపతులు కూడా జన్మించిరి. వారి నుండి దేవతలు, దిక్పాలురు, పదునాలుగురు ఇంద్రులు, పితరులు, సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, విద్యాధరాదులు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు, అశ్వినీ దేవతలు, రాక్షస గుహ్యకాదులును జన్మించిరి. వీరందరు దేవయోనులు.

మానవులతోపాటు, శార్దూల సింహాది మృగములు, గోమహిషాది పశువులు, పక్షులు, పాములు మున్నగు సరీసృపములు, ఉడుతలు మున్నగు పతంగములు, పురుగులు మున్నగు తిర్యక్ జంతువులు, తిర్యక్ విభాగమునకు చెందిన జీవాత్మలు. ఇట్టి బద్ధులు అనాది కాలమునుండి వచ్చుచున్న అవిద్య, కర్మ వాసన, ప్రకృతి సంబంధము అను వానికి లోనై చక్రము వలె పరిభ్రమించుచూ, గర్భవాసము, పుట్టుక, బాల్యము, యౌవనము, నిద్రించుట, మేల్కొనుట, స్వప్నము, మూర్ఛ, ముసలితనము, మరణము, స్వర్గనరక గమనము మొదలగు అవస్థలు కలవారై, అత్యంతము సహింప రానివైన తాపత్రయములచే పీడితులై, భగవదనుభవమునకు దూరులై యుందురు.

ఈ బద్ధులు శాస్త్రవశ్యులు, తదవశ్యులు అని మరల రెండు రకములు. ఇంద్రియాధీన జ్ఞాన బద్ధులగు మనుష్యులను శాస్త్ర వశ్యులందురు. తిర్యక్ స్థావరములకు వశ్యత్వము లేదు. శాస్త్ర వశ్యులలో బుభుక్షువులు, ముముక్షువులు అని రెండు తెగలు.

**బుభుక్షువులు :**

అనగా ధర్మార్థ కామములనెడి పురుషార్థములు మూడింటియందు ఆసక్తులైనవారు. వీరిలో అర్థకామాసక్తులు, ధర్మాసక్తులు అని మరల రెండు రకములు. అర్థకామపరులు దేహాత్మాభిమానము కలిగి యుందురు. ధర్మపరులు యజ్ఞము, ధర్మము, తపస్సు, తీర్థయాత్ర మొదలగు ధర్మములందాసక్తి కలిగియుందురు. ధర్మములను గుర్తించి దేహాతిరిక్తమగు ఆత్మ కలదనియు, పరలోకము కలదనియు తెలిసిన వారు ధర్మాసక్తులు.

ధర్మపరులలో దేవతాంతర పరులు, భగవత్పరులు అని మరల రెండు విధములు. బ్రహ్మాది దేవతలను ఆరాధించువారు దేవతాంతర పరులు. భగవంతుడగు శ్రీమన్నారాయణుని మాత్రమే నమ్మినవారు భగవత్పరులు. మరల

భగవత్పరులలో ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు అని నాలుగు రకములు. ఆర్తుడనగా పోయిన ఐశ్వర్యమును కోరెడివాడు. అర్థార్థి అనగా నూతనైశ్వర్యమును కోరువాడు. జిజ్ఞాసువు అనగా ప్రకృతి విముక్తాత్మస్వరూపమును పొందగోరువాడు. జ్ఞానులనగా భగవత్ప్రాప్తిని కాంక్షించువారు.

**ముముక్షువులు** : అనగా మోక్షమును కోరువారు.

వీరు కైవల్యపరులు - మోక్షపరులు అని రెండు విధములు. జ్ఞాన యోగము నవలంబించి, ప్రకృతి బంధము నుండి విడివడిన ఆత్మ స్వరూపానుభవము కైవల్య మనబడును. ఈ అనుభవము కలవారు కైవల్యపరులు.

మోక్షపరులు - భక్తులు, ప్రపన్నులు అని రెండు విధములు. భక్తులనగా వేదవేదాంగ వేదాంతాధ్యయనానంతరము పూర్వోత్తర మీమాంసా జ్ఞానము చేత చిదచిత్తుల విలక్షణత్వమును, అత్యంతానంద స్వరూపుడును, నిఖిల హేయ ప్రత్యనీకుడును, అనంత కళ్యాణ గుణాత్మకుడును అయిన పరమాత్మ స్వరూపము నెరిగి ఆ పరమాత్మను పొందుటకు ఉపాయమైన భక్తితో మోక్షమును కోరెడివారు.

భక్తులు - సాధన భక్తి నిష్ఠులు, సాధ్య భక్తి నిష్ఠులు అని రెండు విధములు. వ్యాసాదులు సాధన భక్తి నిష్ఠులు. నమ్మాళ్వార్లు మొదలగువారు సాధ్య భక్తినిష్ఠులు.

**ప్రపన్నులు** :

అకించనత్వము, అనన్యగతికత్వము అను ధర్మములు కలిగి, మరొక రక్షకుడు లేడు అను ఆత్మ విశ్వాసముతో శ్రీమన్నారాయణుని ఆశ్రయించువాడు ప్రపన్నుడు. ప్రపన్నులు త్రైవర్ణిక పరులు. అనగా భగవంతుని వలననే ధర్మార్థ,కామములను అభిలషించువారు. ప్రపన్నులలో మరల ఏకాంతి, పరమైకాంతి అను భేదములు కలవు. ఏకాంతి అనగా మోక్ష ఫలముతోపాటు యితర ఫలితములను కూడా శ్రీమన్నారాయణుని వలననే పొందగోరువాడు. పరమైకాంతియనగా భక్తి జ్ఞానముల కంటె వేరొక ఫలమును భగవంతుని నుండి అయినను కోరనివాడు. పరమైకాంతులగు ప్రపన్నులలో దృప్త ప్రపన్నులు, ఆర్త ప్రపన్నులు అని రెండు భేదములున్నవి. దృప్త ప్రపన్నులనగా చేసిన కర్మలు తప్పక అనుభవింపవలయునను భావనతో ప్రారబ్ధ కర్మమును అనుభవించుచూ, దేహావసాన సమయమునకై నిరీక్షించువారు. ఆర్త

ప్రపన్నులగా, ఘోరముగ మండుచున్న అగ్ని మధ్యముననున్నట్లు సంసారము నందుండుటను భరించలేక, ప్రపత్తి లక్షణమూని మోక్షము కావలెనని కోరువారు. వీరు ప్రపత్తి నాశ్రయించి పరమాత్ముని చేరెదరు. దీనినే మోక్షమందురు. ఈ మోక్షము నాలుగు విధములు. 1. సాయుజ్యము 2. సాలోక్యము 3. సామీప్యము 4. సారూప్యము.

1. **సాయుజ్యము** : మోక్షమనగా సాయుజ్యమే. అనగా పరమాత్మతో సమానముగా భోగములు అనుభవించుట. "సమానోయుక్ యోగో యస్యసః సయుక్, తస్యభావః సాయుజ్యమ్" అని వ్యుత్పత్తి.
2. **సాలోక్యము** : భగవంతునితోపాటు సమానమైన లోకనివాసము.
3. **సామీప్యము** : భగవంతుని సమీపము నందుండుట.
4. **సారూప్యము** : భగవంతునితో సమానమైన రూపమును పొందుట.

సాయుజ్య, సాలోక్య, సామీప్య, సారూప్యములు సాయుజ్య మందలి (మోక్షము నందలి) అంశములే. ఈ మూడును స్వర్గాదులవలె తాత్కాలికములైనవి. పరమాత్మతో సమానమైన భోగములను అనుభవించు దశను పొందుటయనెడి సాయుజ్యమే మోక్షము. ఇట్టి మోక్షమును పొందినవాడు ముక్తుడగును.

## 2. ముక్తులు :

భక్తి ప్రపత్తులను గ్రహించి, నిత్యనైమిత్తికము లనబడు భగవదాజ్ఞా కైంకర్యములు చేయుచు, భగవద్భాగవత అపచారములు చేయక పరమాత్మయందు మనస్సును విశ్రమింపజేసి, ముక్తి ద్వారమనదగిన సుషుమ్న అనునాడి యందు ప్రవేశించి, బ్రహ్మ రంధ్రము నుండి వెడలి వచ్చిన జీవుడు సూర్యకిరణముల ద్వారా అగ్నిలోకమునకు ప్రవేశించును. దిన, పూర్వోత్తరాయణ, సంవత్సరాది కాలాభిమాన దేవతలచే, వాయువుచే మార్గమునందు సత్కరింపబడి, సూర్యమండలమును ఛేదించు కొని, ఆకాశ రంధ్రము ద్వారా సూర్యమండలమునకు వెళ్ళి, చంద్రుడు, విద్యుత్తు, వరుణుడు, ఇంద్రుడు ప్రజాపతి అనెడి మార్గదర్శకులతో కూడా ఆయా లోకములందు వారివారిచే సత్కరింపబడుచు లోకముల దాటును. ప్రకృతికి వైకుంఠమునకు హద్దుగా నున్న విరజానదిని దాటి, దివ్య మంగళ శరీరముతో నాల్గు భుజములు కలవాడై,

బ్రహ్మాలంకారమును పొంది, ఇంద్రనగరము, ప్రజాపతి నగరము అను పేర్లుగల పట్టణములను దాటి వైకుంఠమనెడి దివ్యనగరమును ప్రవేశించును. పతాకములతో నలంకరింపబడి దీర్ఘ ప్రాకార సహిత గోపురమును దాటి, ఐరమ్మదమను పేరుగల అమృత సరస్సును, సోమస వనమను పేరుగల అశ్వత్థ వృక్షమును జూచి, అయిదు వందలమంది దివ్యాప్సరగణములచే ఉపచారములను పొంది, 'బ్రహ్మగంధి' అనబడు దివ్యచందనముచే అలంకృతుడై, అచ్చట ఉన్న అనంత, గరుడ, విష్వక్సేనాదులకు నమస్కరించి, వారిచే గౌరవింపబడి, మహామణి మండపమనబడు సభాభవనమునకు జీవుడుచేరును. అచ్చట పర్యంక సమీపమందున్న స్వాచార్యులకు ప్రణమిల్లి, దాని వద్దకు చేరును.

అక్కడ ధర్మాధిపతి పీఠము యొక్క ఉపరిభాగమునందలి అనంతునియందు విమలమున్నగు చామర గ్రాహిణులచే సేవింపబడుచున్నట్టివాడును, శ్రీభూనీలాదులచే పరిచర్యలను పొందుచున్నవాడును, శంఖచక్రాది దివ్యాయుధములను ధరించి, అత్యంత ప్రకాశముగల కిరీటమును, మకరకుండలములను, కంఠహారములు, భుజకీర్తులు హస్తభూషణములు, శ్రీవత్సలాంఛనము, కౌస్తుభమణి, ముక్తాహారములు, పీతాంబరము, నూపురాద్యనేక దివ్యాలంకార భూషితుడైనట్టియు, అపరిమిత కళ్యాణగుణగణ సముద్రుడైనట్టి శ్రీమన్నారాయణుని దర్శించి, అతని పాదపద్మములకు ప్రణమిల్లి పర్యంకము నెక్కగా, స్వామి ప్రేమతో పిలచి తన తొడపై కూర్చుండబెట్టుకొని ఆ జీవునితో "నీవెవ్వరవు" అని ప్రశ్నించును. దానికి సమాధానముగా "బ్రహ్మశేషభూతుడను" అని పలికి అతని కరుణా కటాక్షమునకు పాత్రుడై, శ్రీ వైకుంఠవాసుని అనుభవించుటచే గలిగిన సంతోషాతిశయముచే సర్వదేశములకు, సర్వకాలములకు సర్వావస్థలకును ఉచితములగు భగవత్కైంకర్య ములందాసక్తుడై పరబ్రహ్మానుభవము గలవాడు ముక్తుడనబడును.

ముక్తునకు బ్రహ్మముతో సమానమగు భోగము కలదు. కాని జగత్ సృష్ట్యాది వ్యాపారము మాత్రము ముక్తునకు నిషేధింపబడినది. ముక్తుడు భగవత్సంకల్పము ననుసరించి స్వేచ్ఛతోనంతటను సంచరించును.

### 3. నిత్యులు :

నిత్యులనగా భగవంతునకు ఇష్టముగాని గుణాచరణములను చేయక, జ్ఞాన సంకోచమును పొందు ప్రసంగమే లేక ఉండెడి అనంత, గరుడ, విష్వక్సేనాదులు.

వారి వారి అధికారములు భగవంతుని నిత్యేచ్ఛననుసరించి నియమింపబడినవి. ఇట్టి నిత్యుల అవతారములు భగవంతుని అవతారములవలె సంభవించినవేగాని కర్మ కృతములుగావు.

ఈవిధముగా బద్ధ, ముక్త, నిత్యులుగా జీవాత్మ అనబడెడి చిత్తత్త్వము విభజింపబడినది.

## అచిత్తత్త్వము :

అచిత్ అనగా చిద్భిన్నమైన ప్రకృతి. "ప్రధానము" అని కూడా దీనికి నామాంతరము. చిత్ అనెడి జీవాత్మకు ప్రకృతి (అచిత్) శరీరము. ఈ ప్రకృతికి జీవుడు శరీరి. జ్ఞాన శూన్యమైనది, వికారాస్పదమైనది ప్రకృతి. "వికారాన్ ప్రకరోతి ఇతి ప్రకృతిః" అని వ్యుత్పత్తి. అనగా వికారములను కలిగించునది కావున దీనికి ప్రకృతి అని పేరు.

"సత్త్వం రజస్తమ యితి గుణాః ప్రకృతి సంభవాః"[26] అని సత్త్వరజస్తమో గుణాత్మకమైనది ప్రకృతి అని భగవద్గీత పేర్కొన్నది. ఈ గుణ త్రయము అవ్యక్తమనబడును. అనగా సూక్ష్మావస్థలో ప్రకృతి అవ్యక్తముగానే యుండును. ఇది నిత్యమైనది. అనాది[27]. జ్ఞానమునకు విరోధి, కావున ప్రకృతికి అవిద్య అనియు, పేరు. సృష్టికి హేతువు మాయ.

దీనినే శ్రీకృష్ణుడు గీతయందు "మమ మాయా దురత్యయా"[28] అని పేర్కొనెను. "జ్ఞాన శూన్యత్వే సతి వికారాస్పదత్వమ్" అని దీని లక్షణము.

ప్రకృతి మార్పు కలదయ్యును నిత్యమైనది. కావున "అక్షర"మనియు నామాంతరము.[29] ప్రకృతిని అక్షరముగా ముండకోపనిషత్తు పేర్కొనినది. సుబాలోపనిషత్తు ప్రకృతిని అవ్యక్తము, అక్షరము, తమస్సు[30] అని చెప్పినది. సత్త్వరజస్తమో గుణముల సామ్యావస్థ కలిగిన ప్రకృతికి అవ్యక్తము అనిపేరు. గుణత్రయముల సామ్యము అస్పష్టముగా నుండి చేతన వర్గముతో కూడిన భాగము అని చెప్పుటకు వీలుకాని సూక్ష్మదశ కలిగి పరమాత్మలో లీనమైన ప్రకృతికి "తమస్సు" అని పేరు.[31] ప్రళయస్థితి యందు ప్రకృతి అవ్యక్త రూపమున ఉండును. (గుణత్రయ సామ్యావస్థ) పరమేశ్వరేచ్ఛ చేత మూల ప్రకృతి నుండి త్రిగుణాత్మక మహత్తు, దాని

నుండి సాత్విక, రాజస, తామసాహంకారములు గల అహంకారము పుట్టును. జీవజాతులన్నియు భౌతిక ప్రకృతిలో సంభవించును.[32] ఈ ప్రకృతి, మాయ, మిధ్య అయినను, సర్వ నియామకుడును, మహేశ్వరుడు, దేవాది దేవుడు అయిన దివ్య ఐంద్ర జాలికుడే దానిని వెనుక నుండి నడిపెడివాడు.[33] భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము, ఈ ఎనిమిది కలిసి ప్రకృతి యొక్క రూపములు[34].

జీవాత్మ భోక్తయనియు, అచిత్ పదార్థము భోగ్య వస్తువు అనియు, సర్వేశ్వరుడు ఈ రెంటిని నియమించువాడనియు, తెలియుచున్నది.[35]

పరమాత్మకు భోగ్యము, భోగోపకరణము, భోగ స్థానము ప్రకృతి. "భోక్తా భోగ్యం ప్రేరితారంచ మత్వా" మొదలగు ప్రమాణముల వలన చిత్ అనబడు జీవాత్మ పరమాత్మచే ప్రేరేపించబడినవాడై, భోగ్యభూతమైన ప్రకృతిని భుజించుచున్నా డనియు, ఆ భోజనము వలన బంధింపబడుచున్నాడనియు, స్పష్టమగుచున్నది. పరమాత్మ ప్రకృతి అనెడి సాధనముచే జగత్తును సృజించుచున్నాడు. పరమాత్మ కంటె అన్యుడైన జీవుడు ప్రకృతి అనెడి సాధనముచే బంధించబడుచున్నాడు. కట్టివేసెడివాడు పరమాత్మ. ప్రకృతిచే కట్టివేయబడువాడు జీవుడు.

మహత్తు, అహంకారము, ఏకాదశేంద్రియములు, పంచభూతములు, పంచతన్మాత్రలు, మొదలగు ఇరువది నాలుగు తత్త్వములతో కూడకున్నది అచిత్తు. ఈ విడదీయుటకు వీలులేని విధముగా ప్రకృతి అను అచిత్తు, చిత్తు అనే జీవాత్మకు శరీరమనబడుచున్నది. ఇరువది నాలుగు తత్త్వములు సృష్టి అనబడును.అది సమిష్టి సృష్టియే. సమిష్టి సృష్టి అనంతరము, పంచీకృత పంచభూతములచే బ్రహ్మాండ సృష్టి ఆరంభమగును.

## అచిద్భేదములు :

ఈ విధమగు అచిత్తు శుద్ధసత్వము, మిశ్రసత్వము, సత్వశూన్యము అని మూడు విధములు.

**శుద్ధ సత్వము** : రజస్తమో శూన్యమైన ద్రవ్యవృత్తి సత్వము. ఈ శుద్ధ సత్వము అప్రాకృత మండలము. ఇదియే నిత్య విభూతి. లేదా పరమపదము. ప్రకృతి భాగము

లీలా విభూతి యనబడును. భగవంతుని క్రీడలకు ఉపయోగించునది లీలా విభూతి. భోగ విభూతి అని కూడా దీనికి వ్యవహారము. ఉభయ విభూతులు శ్రీమన్నారాయణు నకు శరీర భూతము. ఈ శుద్ధ సత్త్వము కోటి సూర్య ప్రకాశ జ్యోతిర్మయమై భగవత్సంకల్పానుసారముగా రథ, గోపుర, మండప, విమాన, ఉద్యాన పద్మిన్యాదులుగా పరిణమించుచున్నది. శుద్ధ సత్త్వమును చేరిన జీవులకు పునరావృత్తి లేదని శ్రుతులు చెప్పుచున్నవి. శుద్ధ సత్త్వము నందుటకు అర్చిరాది మార్గము సాధనము.

**మిశ్రసత్త్వము** : రజస్తమస్సులతో కూడిన సత్త్వగుణము కలది మిశ్రసత్త్వము. ఇదియే ప్రకృతి అనియు, అవిద్య అనియు, మాయ అనియు వ్యవహరింపబడుచున్నది. ఈ మిశ్ర సత్త్వమే ప్రాకృత మండలము. ఇది జగత్ సృష్టికి మూలము. మహదాది భూత పర్యంతము సృష్టి సర్వమును మిశ్ర సత్త్వము వల్లనే సంభవించుచున్నది. ఇది మూడు గుణములు కలియుటచే ఏర్పడినందువలన, రజస్తమో గుణముల యొక్క అంశము చేత సంసారుల జ్ఞానానందములను మరుగుపరచజాలినదై ఉండును.

**సత్త్వశూన్యము** : సత్త్వశూన్యమైనది కాలము. అనగా సత్త్వగుణము లేనిదని భావము. సత్త్వశూన్య శబ్దము చేత గుణత్రయ శూన్యమైనదని అర్థము. సూక్ష్మదశయందు ప్రకృతి అవ్యక్తము. పరిణామమునందు వ్యక్తమై అది ప్రాకృతముగ మారును. ఈ పరిణామమునకు హేతువు కాలము.

## ఈశ్వర తత్త్వము :

రామానుజ దర్శనమను నామాంతరముగల విశిష్టాద్వైత దర్శనమందు ప్రధానమైన తత్త్వము ఈశ్వరతత్త్వము. ఈశ్వరుడనగా పరమాత్మ. చిత్ - అచిత్తులకు ఆత్మ అయినవాడు. సర్వ నియామకుడు. స్వతంత్రుడు. చేతనుడు. శక్తిమంతుడు, నియంత.

పరమాత్మకు సర్వేశ్వరత్వము సర్వశేషిత్వము, సర్వకర్మ సమారాధ్యత్వము, సర్వఫల ప్రదత్వము, సర్వాధారత్వము, సర్వకార్యోత్పాదకత్వము, సర్వశబ్ద వాచ్యత్వము, సర్వజ్ఞాన విషయత్వము మొదలగు లక్షణములుండును. జగత్తునకు ఉపాదాన కారణము, నిమిత్తకారణము ఈశ్వరుడే. విశిష్టాద్వైతమున అట్టి పరమాత్మ నారాయణుడు. అతడొక్కడే[36]. "సహస్రశీర్షం దేవం విశ్వాక్షం విశ్వశంభువమ్ విశ్వం

నారాయణమ్ దేవం అక్షరం పరమం పదమ్" అని పరతత్త్వ ప్రతిపాదన పరములయిన అక్షర, పరంబ్రహ్మ, పరంజ్యోతి, పరమాత్మాది శబ్దములన్నియు నారాయణుని యందే ప్రయుక్తములగుచున్నవి.

బ్రహ్మాదులు అంగభూతులని, నారాయణుడు అంగి అని తెలియుచున్నది[38]. అట్టి పరబ్రహ్మ వాచ్యుడయిన నారాయణుని స్వరూప వైలక్షణ్యమిట్లుండును. ఆతని స్వరూపము సమస్తహేయ ప్రత్యనీకమై, త్రివిధ పరిచ్ఛేద రహితమై, స్వయం ప్రకాశత్వ, సుఖ రూపత్వ లక్షణయుక్తమై, జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజో, దయా, వాత్సల్య, సౌశీల్యాది కల్యాణ గుణములచే అలంకృతమై యుండును. పరబ్రహ్మ ఆర్తులకు, జిజ్ఞాసువులకు, అర్థార్థులకు, జ్ఞానులకు, భజింపదగినవాడు. ధర్మార్థ కామమోక్ష చతుర్విధ పురుషార్థములను ఇచ్చువాడు. పరమాత్మ సంకల్పమాత్రముననే సర్వములను సృజించి, నామరూపములు కల్పించి, వానిలో తాను ప్రవేశించి బహు విధములుగా మారును[39]. ఇట్లు సంకల్పించుకొను నిమిత్త కారణమును సృజించుకొని, పరమాత్మ తానే సృష్టి యందు ప్రవేశించుట చేత ఉపాదాన కారణమును కూడ అగుచున్నాడు.

ఈశ్వరుడు అంతటను ఆవహించి ప్రవర్తించుట చేత "అంతర్యామి" అనబడుచున్నాడు. ఈ విషయమును గూర్చి శ్రీమద్భాగవతము "అహం సర్వభూతేషు భూతాత్మవస్థిత: సదా"[40] - అని పేర్కొనినది. "జీవులందరి హృదయములందు పరమాత్మ ఉండును. సర్వజీవుల యొక్క ఆది, మధ్యము, అంతమును అతడే[41]. అతడు తన దివ్యధామమునందే యున్నను సర్వాంతర్యామి. సర్వమును అతనియందే - అతని అధీనముననే ఉండును"[42] అని భగవద్గీత వక్కాణించినది.

ఈశావాస్యోపనిషత్తు పరబ్రహ్మను "స్వయంభువు, సర్వవ్యాపి, అశరీరి, అస్నాయువు, పాపకళంకరహితుడు, ఉజ్జ్వలుడు, పరిపూర్ణుడు, స్వచ్ఛమైనవాడు, సర్వదర్శి, సర్వవిదుడు, సర్వపరిచ్ఛేదకుడు"[43] అనియు, "ఆ పరబ్రహ్మ చలించును, చలించదు, ఆ ఆత్మ దూరముగానున్నది, దగ్గరగాన్నుది. ఆత్మయే సర్వవ్యాపకముగా నున్నది. ఈ అంతట, వెలుపల, లోపల కూడ ఉన్నది"[44] అనియు పేర్కొన్నది. "ఈ ఆత్మ సమస్త ప్రాణులయందు నిగూఢమైనది"[45] - అని కఠోపనిషత్తు చెప్పినది. పరమాత్మను సర్వేశ్వరుడిగా, సర్వజ్ఞునిగా, అంతర్యామిగా, కారణభూతునిగా, ఉత్పత్తి లయములకు స్థానముగా మాండూక్యోపనిషత్తు తెలిపినది.[46]

"తేనేదం పూర్ణంపురుషేణ సర్వమ్"[47] - (అట్టి పురుషుని చేత ఈ ప్రపంచ మంతయు వ్యాపించబడి యున్నది) అనియు "ఏషః సర్వభూతాంతరాత్మా"[48] - ( ఈ బ్రహ్మమే సర్వప్రాణులకు అంతరాత్మ) అనియు, "పురుష ఏ వేదం విశ్వమ్"[49] - (ప్రపంచమంతయు ఈ పురుష స్వరూపమే) అనియు ముండకోపనిషత్తు పరమాత్మ అంతర్యామిత్వమును పేర్కొన్నది. కృష్ణ పరమాత్మ స్వయముగా "సర్వస్యచాహం హృది సన్నివిష్టః"[50] - (నేను అందరి హృదయములందు ఉందును) అని భగవద్గీత యందు చెప్పినాడు.

ఇట్టి ఈశ్వరుని నుండి, సాలెపురుగు తనలో నుండి దారములను సృజించి, తిరిగి తనలోనే ఇముడ్చుకున్నట్టుగా, ఓషధులు భూమియందు పుట్టినట్లుగా, జీవించియున్న పురుషుని నుండి తల వెంట్రుకలు, శరీర రోమములు పుట్టినట్లును, ఈ దృశ్యమాన ప్రపంచము పుట్టుచున్నది"[51] అని ముండకోపనిషత్తు పేర్కొన్నది.

"దారముతో కూర్చబడిన మణులన్నియు దానిపైనే ఆధారపడియున్నట్లు ఈ విశ్వమంతయు అంతర్యామియైన ఈశ్వరునిపై ఆధారపడియున్నది"[52] అని భగవద్గీత పేర్కొన్నది.

"ఈ సమస్త జగత్తు ఈశ్వరుని అధీనముననున్నది. అతని సంకల్పము ననుసరించి అప్రయత్నముగా అది మరల మరల వ్యక్తమగుచు, అతని సంకల్పము ననుసరించియే చివరకు లయమును పొందుచున్నది"[53] అనియు,

"సర్వ ప్రపంచములు అతని నుండే పుట్టును. అతడే అన్ని ప్రపంచములకు కారణభూతుడు"[54] అనియు,

"అన్ని జీవులను పుట్టించు బీజము పరబ్రహ్మమే. జంగమ స్థావరములయిన, వస్తువులలో బ్రహ్మము లేనిది లేదు"[55] అనియు భగవద్గీత పేర్కొనినది. అంతేగాక "సమస్త జగత్తునకు స్థావర జంగమములకు పరబ్రహ్మము తండ్రి"[56] అని కూడా నిర్ధారించినది. "సర్వస్య ప్రభుమీశానాం"[57] - (పరమాత్మ సమస్త జీవులకు ప్రభువు) అని శ్వేతాశ్వతరోపనిషత్తు పరమాత్మ ప్రభుత్వము ఒప్పుకొన్నది.

"అతడు సర్వజీవులకును, మిగిలిన దానికంతకును, మూలాధారుడు. సృష్టి అనంతరము సర్వము సర్వశక్తి మంతుడయిన ఆతనిని ఆశ్రయించియుండి, ప్రళయానంతరము మరల అతనిని ఆశ్రయించుటకే తిరిగి వచ్చును"[58] - అని శ్వేతాశ్వతరోపనిషత్తు ఉగ్గడించినది.

"పరబ్రహ్మము నాశనము లేనట్టిది. దివ్యమైనది"[60]. "నశ్వరమైన దాని కంటెను, అనశ్వరమైన దాని కంటెను, పరబ్రహ్మము అతీతము, ఉత్తమోత్తమము"[61] - అని గీతా వాక్యము.

"సత్యం జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ"[62] - అని సత్యత్వ జ్ఞానత్వ, అనంతత్వ లక్షణము గలది బ్రహ్మమని తైత్తిరీయము వర్ణించినది. ఛాందోగ్యోపనిషత్తు పరమాత్మను పరంజ్యోతి రూపముగా, ఉత్తమ పురుషునిగా[63] పేర్కొన్నది.

గీత "సర్వజ్ఞుడుగను, అతిప్రాచీనుడుగను, శాసించువాడుగను, అణువు కంటె మిక్కిలి చిన్నవాడుగను, సర్వమును పోషించువాడుగను, భౌతిక భావాతీతుడుగను, ఊహాతీతుడుగను, పురుష రూపుడుగను, తేజస్సుగలవానిగను, భౌతిక ప్రకృతికి అతీతుడుగను"[64] పరమాత్మను గూర్చి పేర్కొన్నది. ఇంకను పరబ్రహ్మము పుట్టుకలేని వాడుగను, అనాది అయినవాడిగను, సర్వలోక దివ్య ప్రభువుగను[65], గీతయందు వర్ణింపబడినాడు.

"పరబ్రహ్మమే దేవాది దేవుడు, పరంధాముడు, పరమ పవిత్రుడు, సత్య స్వరూపి, శాశ్వతుడు, ఆది దేవుడు, పుట్టుకలేనివాడు"[66] - అనియు, "జీవుల దేహములందు ప్రభువుగను, దివ్యయజమానుడుగను, పర్యవేక్షకుడుగను, అంగీకర్తగను, పరమాత్మగను ప్రసిద్ధినొందినవాడగు దివ్యానుభోక్త యింకొకడు ఉండడు. ఇతడే భోక్త"[67] అనియు గీతా వాక్యములు.

"ప్రకాశించు ఆ పరబ్రహ్మము యొక్క తేజస్సుననుసరించియే సూర్య చంద్రాది తేజో వర్గమంతయు ప్రకాశించును"[68] అనియు "ఏది తేజోమయమో, ఏది అణువుల కంటె మిక్కిలి సూక్ష్మమైనదో, చతుర్దశ లోకములు, ఆలోకవాసులును దేనియందు ఆధారపడి యున్నారో, అట్టి మహాశక్తి కలదే బ్రహ్మము. సర్వజీవ నాధారమగు ప్రాణము నదియే. వాక్కు, మనస్సు కూడ అదియే. ఆ బ్రహ్మము సత్యమైనది. అది అమృతమువలె భోగ్యమైనది"[69] అని పరమాత్మ స్వరూపమును గూర్చి ముండకోపనిషత్తు పేర్కొనినది.

"ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్"[70] అని పరమాత్మను ఆనంద స్వరూపుడని తైత్తిరీయము ప్రస్తుతించినది. ఈ విధములైన లక్షణములు కలది ఈశ్వర తత్త్వము.

## పరబ్రహ్మ నివాస స్థానము :

"దేనిని వేదాంతులు అవ్యక్తమనియు అక్షరమనియు వర్ణింతురో, ఏది పరమ లక్ష్యమని చెప్పబడుచున్నదో, ఏ ప్రదేశమును పొంది మానవుడు తిరిగి రాడో అది నా

దివ్య నివాసము"[71] - అని భగవద్గీతయందు పరమాత్మ స్వయముగా తన నివాస స్థానమును గూర్చి తెలిపినాడు.

ఇట్టి పరమాత్మ నివాస స్థానమగు దివ్య పదమును గూర్చి రామానుజులు తమ వైకుంఠ గద్యయందు[72] - "పదునాలుగు లోకములు (భూః, భువ, సువర్, మహర్, జనో, తపో, సత్య, అతల, వితల, సుతల, మహాతల, తలాతల, రసాతల, పాతాళ) గల అండముపై పదింతలు ఎక్కువగా వ్యాపించిన ఏడు ఆవరణములు (మహత్ - అహంకారం - భూమి - నీరు - తేజస్సు - వాయువు - ఆకాశము)ను, ఆపైగల సమస్త కార్య కారణ సమూహమును దాటిన తర్వాత అవతల ప్రకాశించు చున్నది, బ్రహ్మ మొదలగు వారి యొక్క మాటలకుగాని, మనస్సునకుగాని అందనిది శ్రీవైకుంఠము. వేలకొలది ప్రాకారములుగలదై, ప్రకృతి సంబంధము లేని కల్పవృక్షముచే ప్రకాశించునదై, అనేక వేల ఉద్యానవనములచే చుట్టబడినదై, పొడవు, వెడల్పును లెక్కింపరానిదైయున్న దేవాలయమున అనేక విధములైన దివ్యరత్నము లచే వెలుగొందు ఒక సభామంటపమున నూర్ల వేల కోట్ల దివ్య మాణిక్య స్తంభములచే ప్రకాశించునదై, అప్రాకృతమైన అనేక విధముల రత్నములు పొదిగిన భూమిగలదై, ఆ పరమాకాశము ప్రకాశించుచుండును" అనియు "దివ్యాలంకారములచే అలంకరింప బడినదై నాలుగు ప్రక్కలను సువాసనలు వెదజల్లు పూలతోటలతో ప్రకాశించుచున్నదై, ఒక దానితో ఒకటి కలిసియుండు పారిజాతము మొదలగు కల్పవృక్షములచే ప్రకాశించునని"యును "రత్న పుష్పాదులచే అలంకరింపబడిన ఆట పందిళ్ళు గలదీ క్రీడా పర్వతములు, అమృతమయమగు, రసవంతమును అగు నీటిచే నిండిన దిగుడు బావులు, దివ్య పుష్ప చందన కర్పూరాదుల సువాసనలతో, మందమలయ మారుతము లతో ఆనందమే రూపముగా కలిగియున్న శ్రీవైకుంఠమున ఆది శేషుడను సర్పరాజుపైన పరబ్రహ్మ ప్రకాశించుచుండును" అనియు , "ఆ దివ్య లోకమున విష్వక్సేనుడు మొదలగు సేవకులు లక్ష్మీదేవితోనున్న భగవంతునికి దాస్యము చేయుచుందురు. భగవానుడు కిరీటాది ఆభరణములు, కౌస్తుభరత్నమును, శంఖ చక్రాది దివ్యాయుధము లను ధరించి, సాంసారిక స్వభావము లేనివారగు గరుత్మంతుడు మొదలగు నిత్యసూరులచే సేవించబడుచుండున"నియు వర్ణించియున్నారు.

ఈ విధముగా "ఉజ్జ్వల సౌందర్యము కలదియు, పరమానందమునకు నిధి వంటిదియునగు పరమాకాశమనబడు పరమపదమున సత్త్వరజస్తమో గుణాతీతమును,

నిరవయవమును, నిర్దోషమును, సూర్యాది తేజస్సులకు కూడా ప్రకాశమును కల్గించునది అగు ఆ పరబ్రహ్మము కలదు"[73] అని ముండకోపనిషత్తు పేర్కొనినది.

## పరమాత్మ కళ్యాణ గుణములు :

పరమాత్మయగు శ్రీమన్నారాయణునికి సర్వ శబ్ద వాచ్యత్వము, సర్వాంత ర్యామిత్వము, సర్వకళ్యాణ గుణాకరత్వము, సకల జగదుదయ, విభవ, లయ, లీలత్వములు కలవని శ్రుతుల వలన తెలియుచున్నది.

సత్యత్వ, జ్ఞానత్వ, అనంతత్వ, ఆనందత్వ, అమలత్వాదులు పరమాత్ముని నిరూపక ధర్మములు. జ్ఞాన, శక్తి, బల, వీర్య, తేజో, ఐశ్వర్యములు నిరూపిత స్వరూపము యొక్క ధర్మములు. పరమాత్మ జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజస్సులను ఆరు గుణములచే నిండినవాడని[74] పేర్కొనబడినాడు.

పరబ్రహ్మము స్వభావము చేతనే కళ్యాణగుణములకు సముద్రము వంటివాడు. సౌశీల్య, కారుణ్య, మాధుర్య, ఔదార్య, స్థైర్య, ధైర్య, శౌర్య, పరాక్రమ, సత్యకామ, సత్యసంకల్ప, కృతిత్వ, కృతజ్ఞత్వాది అసంఖ్యేయ కళ్యాణ గుణములు కలవాడు[75].

అన్ని లోకములకు ఆధారమైనవాడు, అన్ని లోకములకు సొమ్ము అయిన వాడు, కోరినవన్నియు ఇచ్చువాడు, మంచి సంకల్పము కలవాడు, విశేషమగు లక్షణములు కలవాడు, కోరిన వారికి కల్పవృక్షమువంటివాడు, కష్ట సమయములందు స్నేహితునివలె సహాయ పడువాడు పరమాత్మ[76].

సర్వవస్తువులను సాక్షాత్కరించుకొను జ్ఞాన లక్షణమును, అఘటిత ఘటనా సామర్థ్యమను శక్తి లక్షణమును, ధారణ, నియమన సామర్థ్యమను లక్షణముగల ఐశ్వర్యమును, వికారము చెందకుండెడి వీర్యమును, ఇతరులను తిరస్కరించెడి తేజస్సును, అంతటిని ధరింపగలిగెడి బలమును కలిగినవాడు పరమాత్మ.

గొప్పవారు, తక్కువవారు అనుభేదము లేకుండా నిస్సంకోచముగా కలిసియుండు స్వభావమైన సౌశీల్య లక్షణమును, దోషములందు దోషముల గణించని వాత్సల్యము, ఆశ్రిత విరహాసక్తమైన మార్దవము, మనోవాక్కాయముల వ్యాపార మొక్కటే రీతిగా నుండెడి ఆర్జవము, తన ఉనికిని గూడా లక్ష్య పెట్టక పరుని

రక్షణమందు ఆసక్తి చూపెడి సౌహార్దము, జ్ఞానము- జాతి-నడవడి-గుణములుమొదలగు వాటిని గణింపక అందరి చేతను ఆశ్రయింపతగిన సామ్యమును, ఆశ్రితుల దోషములను కప్పి పుచ్చెడి చాతుర్యము, ఎవ్వరి చేతను కదల్పబడకుండెడి స్థైర్యమును, చేసిన ప్రతిజ్ఞ విడువకుండెడి ధైర్యమును, పరసైన్యము మధ్యన ప్రవేశింపగల శౌర్యమును, పరబలమును నిరాకరించెడి పరాక్రమమును, స్వార్థాపేక్ష రహితమును, పరదుఃఖ నివారణత్వమును లక్షణముగాగల కారుణ్యమును, పాలవలె స్వాదువుగా నుండెడి మాధుర్య గుణమును, భక్తానుగ్రహమను గాంభీర్యమును, దానమీయగల ఔదార్యమును ఇంకను ఇటువంటి అసంఖ్యాకమైన కళ్యాణగుణములు కలవాడు పరమాత్మ.

## పరమాత్మ ప్రభేదములు :

పరమాత్ముడైన శ్రీమన్నారాయణుడు పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారములను పేర్లతో అయిదు విధములగా అనుగ్రహించు చున్నాడు.

### I. పర స్వరూపము :

త్రిపాద్విభూతి అనబడు శ్రీవైకుంఠమునందున్న. దివ్యాలయమున దివ్య మహామణిమండపమున శేషశాయియైన నారాయణుడు పరతత్త్వము. ఆ వైకుంఠ ధామము కుముద, కుముదాక్ష, పుండరీక, వామన, శంకుకర్ణ, సర్పనేత్ర, సుముఖ, సుప్రతిష్ఠాదులచే, దివ్యాయుధ, దివ్యభూషణ, దివ్యపరిజన, దివ్యపరిచ్ఛేదములతో కూడిన నగరపాలకులచే రక్షింపబడుచుండును. అందలి దివ్యాలయము చండ, ప్రచండ, భద్ర, సుభద్ర, జయ, విజయాది ద్వారపాలకుల చేత రక్షితమగు చుండును. త్రిపాద్విభూతి యందలి సింహాసనమునకు ధర్మాది అష్టపాదములుండును. అందలి నారాయణుడు దివ్యమంగళ విశిష్టుడును, చతుర్భుజాడును, శ్రీభూనీళా సమేతుడును, శంఖ చక్రాది దివ్యాయుధములతో కూడియున్నవాడును, కిరీటాది దివ్య విభూషణము లతో నలంకరింపబడిన వాడును, .నిత్యులగు అనంత, గరుడ, విష్వక్సేనాదుల చేత, సామగానము చేయుచున్న ముక్తుల చేత, అనుభవింపబడుచున్నవాడును, షాడ్గుణ్య, అనంత కళ్యాణ గుణములతో కూడియున్నవాడును, పరబ్రహ్మము, పరవాసుదేవుడు మొదలగు పదములతో చెప్పబడువాడును అయివుండును[77].

## 2. వ్యూహస్వరూపము :

పరుడే ఉపాసనోపయోగమునకు, జగత్ సృష్ట్యాది కార్యమునకు, వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, భేదములచే నాల్గువిధములయ్యెను[78].

**వాసుదేవ వ్యూహము :**

వాసుదేవ వ్యూహము సర్వభూతములయందు వసించుచుండును. జ్ఞాన శక్త్యాది షాడ్గుణ్య పరిపూర్ణము.

**సంకర్షణ వ్యూహము :**

జ్ఞాన, బలములుండును. ఈ వ్యూహము పాతాళమున నుండి రుద్ర, యమ, మృత్యు, ప్రభృతులను నియమించుచుండును. మోక్ష సాధనమైన జ్ఞానమును ఈ వ్యూహము ప్రబోధించుచుండును.

**ప్రద్యుమ్నవ్యూహము :**

జగత్ సృష్టి నిమిత్తమే ఈ వ్యూహము. వీర్య, ఐశ్వర్య గుణములతో బ్రహ్మలోకమునందుండి, బ్రహ్మ ప్రజా పతులను సృష్టి కర్మలయందు ప్రవర్తింప జేయుటయే ప్రద్యుమ్న వ్యూహలక్షణము.

**అనిరుద్ధ వ్యూహము :**

శక్తి, తేజోగుణ పూర్ణుడు అనిరుద్ధుడు. తత్వ, జ్ఞాన రక్షణము అనిరుద్ధుని కర్తవ్యము.

## 3. విభవస్వరూపము :

లోకోద్ధరణమునకు, ధర్మ సంస్థాపనమునకు, భగవంతుడు దాల్చిన అవతారములు విభవ స్వరూపము. లెక్కించి ముగించరాని విధముగ నుండెడి గుణములు కలది విభవము. ఇది మొదట రెండు విధములు. 1. గౌణము 2. ముఖ్యము. గౌణము అనునది అప్రధానమైనది లేదా చిన్నది. ముఖ్యము అనగా శ్రేష్టమైనది. వీనిలో ఆవేశావతారములు గౌణమనియు, సాక్షాదవతారములు ముఖ్యమనియు చెప్పబడును.

ఆవేశావతారము రెండు విధములు 1. స్వరూపావేశము, 2. శక్త్యావేశము. తనదైన రూపముతో ఆవేశించుట స్వరూపావేశము. కార్య సమయమున ఏథ, శివాదుల

మూర్తులందు నిల్చి చేతనుల యెడ వారు శక్తి మాత్రముగా స్ఫురించుట శక్త్యావేశ మనబడును.

## 4. అంతర్యామి స్వరూపము :

అంతర్యామి అనగా జీవునియందు సాక్షిగనుండి స్వర్గ నరకాదులందు కర్మానుభవమును అతనికి పొందించునట్టివాడు. సుహృత్ ధర్మముతో యోగులకు మాత్రము చూడదగియుండెడి రూపముతో హృదయమునందు వసించెడి భగవద్రూపము అంతర్యామి. జీవునిలో ఉన్నను జీవగత దోషములు అంతర్యామికి అంటవు.

## 5. అర్చావతార స్వరూపము :

ఆశ్రితులకు అభీష్టములైన లోహ, శిల, దారు, విగ్రహములందు అప్రాకృత రూపముతో ఆవేశించియుండి, భక్తులననుగ్రహించు దేవాలయములోని ప్రతిమలు అర్చావతారములుగ చెప్పబడును. షాడ్గుణ్య పరిపూర్ణమైనది అర్చావతారము. అర్చావతారమూర్తి అర్చక పరాధీనుడై స్నానాశనాది సమస్త వ్యాపారములు గలవాడగును. తనయందు వైముఖ్యముగల చేతనుల మనస్సులను మార్చి, తన విగ్రహ సౌందర్యము మొదలగు గుణములచే వారి మనస్సులను దొంగిలించి, తన నాశ్రయించు వారి కంటికి, మనస్సునకు భోగ్యమై ఉండునట్లు, శుభాశ్రయమై దివ్యదేశములందు, యితర స్థలములందుండు అవతారము అర్చావతారమనబడును. ఈ రూపమున గృహ, గ్రామ, నగర, శైలాది ప్రదేశములందుండి పరిపూర్ణుడగుచుండును. దేశకాల నియమములు లేక సర్వ ప్రదేశములందున అర్చామూర్తిని అర్చించవచ్చును.

పరవ్యూహములు దేవ విప్ర కృష్టములు. విభవములు కాల విప్రకృష్టములు అనగా అన్ని కాలముల ఉండునవిగావు. అంతర్యామి సామాన్యులకగోచరము. అర్చారూపము, అన్ని కాలములందును, అన్ని ప్రదేశములందును, అందరకును సులభముగా అందుబాటులో నుండును. ఈ అర్చారూపము స్వయంవ్యక్తము, దైవము, సిద్ధము, మానుషము అని నాలుగు విధములు.

ఇట్టి పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారములందును పరమాత్మ లక్ష్మీదేవితో కూడియేయుండును[79]. ఉపాసకుడు ముందుగా అర్చావతారమును ఉపాసించిన తరువాత క్రమముగా విభవ, వ్యూహ, పర అంతర్యాములను అర్చించుట సులభమగును.

## మోక్ష నిర్వచనము :

జ్ఞాన శక్త్యాది అనంత కళ్యాణ గుణగణరూపుడైన భగవంతుని పొందుటయే మోక్షము. జీవునికి మోక్షమే పరమ పురుషార్థము. 'ముక్తి'యను నామాంతరము మోక్షమునకు గలదు. పరమాత్మానుభవమే మోక్షము. దుఃఖము లేని నిరతిశయమైన ఆనంద రూపమయిన భగవదనుభవమే మోక్షము. ఇట్టి భగవత్ప్రాప్తికి జీవునకు కర్మ జ్ఞాన యోగాంగక భక్తి యోగము సాధనము. భక్తి యోగము అన్నింటిలో శ్రేష్ఠమైనది. భక్త్యేక సులభుడు నారాయణుడు. ఐకాంతిక ఆత్యంతిక భక్తి యోగముచే భగవంతుని ప్రాప్తికలుగును. జ్ఞానయోగ, కర్మయోగములచే అంతఃకరణము సంస్కృతీకరింప బడగా భక్తి సాధ్యమగునని రామానుజ భాష్యము స్పష్టీకరించినది. వర్ణాశ్రమ ధర్మ నిర్వహణము కర్మయోగము. ఆత్మానాత్మ వివేకము, పరమాత్మ స్వరూపావగాహనము జ్ఞానయోగము. పరమ పురుషుడైన నారాయణుని తెలుసుకొని ఇతరములందు ఆసక్తిని వదిలి అనవరత నిరతిశయ ధ్యానము చేయుటయే భక్తియోగము. ఈ భక్తి యోగము కంటె ప్రపత్తి మార్గముసులభమైనది. ఇదియును మోక్షసాధనమే. జీవులకు మోక్షము నందించగల సాధనములు బహువిధములగా నున్నవి. అట్టివానిలో కర్మ జ్ఞాన, భక్తి ప్రపత్తి యోగములు ఉత్తమములైనవి.

### కర్మయోగము :

గురూపదేశము వలన జీవాత్మ పరమాత్మల యదార్థ జ్ఞానమును గ్రహించిన వాడై శక్తికి తగిన విధముగా చేయదగినవియు, ఫలాపేక్ష లేనివియు, శాస్త్రములందు చెప్పబడినవియు అగు కామ్యకర్మములను, నిత్యకర్మలను, నైమిత్తిక కర్మలను ఆచరించుట కర్మయోగము. అనగా దేవపూజలు, తీర్థయాత్రలు, తపస్సులు, దానములు, యోగములు మొదలగు కర్మలనాచరించుట. ఇట్టి కర్మయోగము వలన పరమాత్మ జీవునియందుగల గుణ దోషములను తొలగించి, జ్ఞాన యోగ ద్వారమున గాని సాక్షాత్తుగాగాని భక్తియోగము కలుగజేయును.

### జ్ఞానయోగము :

కర్మయోగాచరణము వలన జీవుడు నిర్మలమైన అంతఃకరణము కలవాడగును. అట్లు నిర్మలత్వమును పొంది "నేను పరమాత్మ దాసుడను, శేషభూతుడను, కింకరుడను" అని జీవాత్మ-పరమాత్మల సంబంధములను గ్రహించి, సంశయ మోహాది దుర్గుణములను జయించి, జ్ఞాన యోగమును భక్తి యోగమునకు అంగముగా చేసుకొని పరమాత్మను పొందుటకు ప్రయత్నించును.

**భక్తియోగము :**

శ్రీమద్రామానుజులు కర్మజ్ఞాన యోగములు భక్తియోగమునకు అంగ భూతములని నిరూపించిరి. జీవుడు సమస్త కర్మలను భగవంతునియందు సమర్పించి, పరమాత్ముడే పరమగతి అని నమ్మినవాడై, ఆతనియందే చిత్తమును నిల్పి శ్రద్ధతో ధర్మమును అనుష్ఠించిన ఆ పరమాత్ముడే జీవుని కాపాడగలడు. పరమాత్మను ఆకర్షింపగల మహత్తరశక్తి భక్తియోగమునకు మాత్రమే కలదని చెప్పవచ్చును.

## భక్తిని గూర్చి రామానుజుల అభిప్రాయము :

ఈ భక్తి, వివేక, విమోక, అభ్యాస, క్రియా, కళ్యాణ, అనవసాద, అనుద్ధర్షము లనెడి సాధన సప్తకము నుండి జనించి, అష్టాంగ యోగములతో కూడుకొని,తైలధారవలె అవిచ్ఛిన్నమగు భగవంతుని స్మృతి పరంపరగా సాగుచుండును. ఇదియే భక్తియోగము. ఈ భక్తి వేదన అనియు, ధ్యానమనియు, ఉపాసనమనియు చెప్పబడుచున్నది.

## సాధన సప్తక వివరణము.

1. **వివేకము** : జాతిచేతను, ఆశ్రయముచేతను, కారణముచేతను, కాలము చేతను, దోషము లేని ఆహారము వలన శరీర శుద్ధిని సాధించుట.

2. **విమోకము** : అన్యములగు కోరికలు లేకుండుట.

3. **అభ్యాసము** : అనుక్షణము ఉపాస్యదైవమును స్మృతి యందు ఉంచుకొనుట.

4. **క్రియ** : శక్త్యనుసారము ప్రతిదినము పంచమహాయజ్ఞములను (బ్రహ్మ, దేవ, పితృ, భూత, మనుష్య యజ్ఞములు) ఆచరించుట.

5. **కళ్యాణము** : సత్యము, దయ, దానము, అహింస మొదలగు గుణములు కలిగియుండుట.

6. **అనవసాదనము** :దైన్యము లేకుండుట.

7. **అనుద్ధర్షము** : అతి సంతోషము పొందకుండుట.

## అష్టాంగ యోగ వివరణము :

1. **యమము** : అహింస, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అను అయిదు గుణములు కలిగియుండుట.

అహింస : ఏ ప్రాణికిని హింస చేయకుండుట.
సత్యము : మనోవాక్కాయ కర్మల సత్యమునాచరించుట.
ఆస్తేయము : పరద్రవ్యమును అపహరించకుండుట.
బ్రహ్మచర్యము : పరస్త్రీలయందు దోషదృక్కులు లేకపోవుట.
అపరిగ్రహము : విషయములను స్వీకరింపకుండుట

2. **నియమము** : అనగా శౌచము. ఇది సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అని అయిదు గుణములు కలిగి యుండును.

3. **ఆసనము** : అనగా కూర్చుండుట. బ్రహ్మ, స్వస్తిక్, పద్మ, గోముఖ, సింహ, ముక్త, వీర భద్ర, మయూరాసనములు అని తొమ్మిది విధములు.

4. **ప్రాణాయామము** : ప్రాణా పానములకు సమాన యోగము. ఇది రేచక, పూరక, కుంభములని త్రివిధము.

5. **ప్రత్యాహారము** : ఇంద్రియములను వాని వ్యాపారముల నుండి బలవంతముగా మరలించుకొని, చిత్తమునకు అనుగుణముగా చేసుకొనుట. ప్రాణాయామము చేత వాయువును, ప్రత్యాహారము చేత ఇంద్రియములను జయించుట.

6. **ధారణ** : పరమాత్మయందు చిత్తము లగ్నము చేయుట.

7. **ధ్యానము** : పరమాత్మను గురించి జీవాత్మ చేయుచింతనము. భగవ ద్విషయక స్మృతి తైలధారవలె అవిచ్ఛిన్నముగానుండుట.

8. **సమాధి** : జీవాత్మకు పరమాత్మతో సమానమైన అవస్థా విశేషము. పరమాత్మను సాక్షాత్కరించుకొని ఆనందము అనుభవించుట.

## నారద భక్తి సూత్రములు (భక్తిని గూర్చి నారదుల అభిప్రాయము) :

సర్వాత్మ సమర్పణము లేదా అఖిలాచార సమర్పణము, భగవద్వియోగ దుస్సహత్వము అను రెండు పద్ధతులు కలిగియుండుటయే భక్తి లక్షణమని నారదుల అభిప్రాయము. దీనినే పరాభక్తి అనవచ్చును. జీవుని పరతత్త్వమునకు చేర్చజాలిన శక్తిగలది.

భగవద్గుణ శ్రవణ కీర్తనములు భక్తికి సాధనములని నారదుడు పేర్కొనెను. ఈ భక్తి గుణత్రయ రాహిత్యమును పొంది, కామనా రహితమై, ప్రతిక్షణము

అధికమగుచు ఉండవలెను. ఇది శుద్ధ భక్తి. భగవద్భక్తుల విషయమున జాతి, విద్యా, రూప, కుల, ధన, క్రియల వలన భేదముండదని నారదుని అభిప్రాయము. భగవద్భక్తులు తమ మార్గమున నడచుచునే, అహింసా, శౌచ ,దయా, ఆస్తిక్యాది కృత్యములను ఆచరించవలెనని నారదులనిరి.

నారదులు భక్తికి ఆసక్తి అను నామాంతరమునిడి, దానిని పదకొండు భేదములతో వివరించిరి.

1. **గుణమాహాత్మ్యాసక్తి** : భగవంతుని దివ్యగుణములను వినుటయందు ఆసక్తి కలిగి యుండుట.

2. **రూపాసక్తి** : భగవంతుని రూపమునందు ఆసక్తి కలిగియుండుట.

3. **స్మరణాసక్తి** : భగవన్నామస్మరణయందు ఆసక్తి కలిగియుండుట.

4. **పూజాసక్తి** : భగవంతుని పూజించుటయందు ఆసక్తి ఉండుట.

5. **దాస్యాసక్తి** : భగవంతుని దాసభావముతో సేవించుటయందు ఆసక్తి కలిగి ఉండుట.

6. **సఖ్యాసక్తి** : స్నేహితునివలె భగవంతుని ప్రేమించుటయందు ఆసక్తి కలిగిఉండుట.

8. **కాంతాసక్తి** : భగవంతుని నాయకునిగా దలచి భక్తుడు నాయికవలె సేవ చేయుటయందాసక్తి కలిగి ఉండుట.

9. **ఆత్మనివేదనాసక్తి** : భగవంతునికి తనను పూర్తిగా సమర్పించుకొనుటయందు ఆసక్తి కలిగి ఉండుట.

10. **తన్మయతాసక్తి** : భగవంతునితో ఐక్యమును పొందుటయందు ఆసక్తి కలిగి ఉండుట.

11. **పరమ విరహాసక్తి** : పరమాత్మను విడచి ఒక్క క్షణమైనను ఉండలేక, భరింపలేని మహావిరహాసక్తిని కలిగి ఉండుట.

అన్నిటియందు చివరిది గొప్పది. కృష్ణావతారమున గోపికలు ఈ విధముగ పరమ విరహాసక్తిని కలిగి ఉండిరి.

**శాండిల్యభక్తి సిద్ధాంతము :** (భక్తిని గూర్చి శాండిల్యుని అభిప్రాయము.)

శాండిల్యుడు నారదుని కన్న పూర్వీకుడు. ఈయన 100 సూత్రములను వ్రాసెను. ఈ నూరు సూత్రములను 1. భక్తికి భూమిక 2. భక్తి వివరణము 3. భక్తి లక్షణము 4. భక్తి సాధనములు 5. భక్తికాశ్రయుడు పరమేశ్వరుడు, అని ఐదు విధములుగా విభాగించినాడు.

**1. భక్తి భూమిక :** ఈశ్వరునియందు పరాను రక్తియే భక్తి[80] అని భక్తికి వ్యాఖ్యానము చేసెను.

**2. భక్తి వివరణము :** పరమాత్మునియందు అనన్య భక్తి భావనతో కేంద్రీకరించిన శ్రేష్ఠమైన అనురాగమే భక్తి. జ్ఞాన కర్మయోగములు దీని కంగములైనందున ఇదియే ముఖ్యమైనది[81] - అనెను.

**3. భక్తి లక్షణము :** "ఈశ్వరునియందు పరానురక్తియే. కర్మ, జ్ఞాన, యోగముల కన్న భక్తినాశ్రయించుట శ్రేష్ఠము"[82] అనెను.

**4. భక్తి సాధనములు :** భక్తి మార్గమునందున్న జీవుడు శ్రవణ, కీర్తన, వందన, అర్చనాది మార్గములనే అనుసరింపవలెనని, అట్టి ధృఢమైన కృషి గమ్యము చేర్చుననియు చెప్పెను.

**5. భక్తికాశ్రయుడు పరమేశ్వరుడు :** ఈశ్వరుడు అందరి కన్నను గొప్పవాడు. అతనిని ఆశ్రయించి భక్తిని పొందిన యెడల మోక్షము[83] అనియు, మనుష్యుడు తన బుద్ధిని ఆత్మైక పరముగా మరలించి భక్తిని అనుష్ఠింప వలెనని[84] వ్యాసుని వాక్యముగా శాండిల్యుడు సూచించెను.

భక్తికి పరమేశ్వరుడు ఆశ్రయుడైనపుడు, అతడు ప్రకృతితో కూడ సంగతుడై యుండుననియు, అట్టి సంయుక్త స్వరూపమే భక్తుడాశ్రయింపవలెననియు[85] శాండిల్యుని అభిప్రాయము.

భగవద్గుణ విశేషములను స్మరించుట అనెడి భక్తిని తనకంటె పూర్వులు వెలువరించిన విధమును శాండిల్యుడు తన భక్తి సూత్రములలో వివరముగా తెల్పియున్నాడు. ఆ విధమిది.

1. **సమ్మానము** : శ్రీకృష్ణుని అర్జునాదులవలె సమ్మానించుట

2. **బహుమానము** : ఇక్ష్వాకులవలె భగవత్సదృశ నామాదులయందు గౌరవముంచుట.

3. **ప్రీతి** : కృష్ణునియందు విదురాదులవలె ప్రేమకలిగియుండుట.

4. **విరహము** : గోపికలవలె భక్తులు శ్రీకృష్ణుని ఎడబాటు సహింపకుండుట.

5. **ఇతరారుచి** : భగవద్భిన్న వస్తువులయందు రుచిలేకపోవుట.

6. **మహిమఖ్యాతి** : నిరంతరము భగవంతుని మహిమలు వర్ణించుట.

7. **భగవదర్థ ప్రాణస్థానము** : గోపికలవలె భగవంతుని కొరకే ప్రాణములను ధరించుట.

8. **తదీయతా సర్వము** : భగవంతుని కొరకై సర్వము సమర్పింపవలెననుకొనుట.

9. **తద్భావ-అప్రాతికూల్యము** : భగవంతునికి ప్రతికూలమైన పనులు చేయకుండుట.

శాండిల్యుడు నవ విధ భక్తులను కొద్ది రూపాంతరములతో చెప్పినప్పటికి భగవంతుని శరణాగతి పొందుటయే సర్వవిధముల లాభదాయకమని[86] చెప్పెను. భాగవతమునందు 'ప్రహ్లాదుని' ద్వారా నవవిధ భక్తులు వివరింపబడినవి. అవి,

"శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణమ్ పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్"[87]

**శ్రవణము** : భగవద్రూప గుణగణ కథా శ్రవణము - శ్రవణభక్తి.

**కీర్తనం** : నామమును, రూపమును, లీలలను కీర్తించునది - కీర్తనభక్తి.

**స్మరణము** : నామ, రూప, స్వరూపములను సదా స్మరించుట - స్మరణభక్తి.

**పాదసేవనము** : అర్చావతారమునందున్న తమతమ దైవతములకు పాదార్చనలు చేయుట - పాదసేవన భక్తి.

**అర్చనభక్తి** : అర్చామూర్తులను పూజించెడిది - అర్చన భక్తి.

**వందనము** : కాయిక, వాచిక, మానసిక అహంకారములు లేకుండ దేవునికి, గురువులకు, సాధు సత్పురుషులకు చేసెడి నమస్కారము వందన భక్తి.

**దాస్యభక్తి** : ప్రభువు కార్యములను ఎంతో జాగ్రత్తగ నెరవేర్చెడి వానికి దాసుడని పేరు. అతడు చేయు కృత్యము దాస్యము. దీనికే కైంకర్యము అని మరియొక పేరు. మనోవాక్కాయ కర్మలచే హరి దాస్యము చేయుట - దాస్యభక్తి.

**సఖ్యభక్తి** : భగవంతుని స్నేహ భావముతో సేవించుట - సఖ్యభక్తి.

**ఆత్మనివేదనము** : ఈ పద్ధతికిని శరణాగతికిని తేడా లేదు.

భగవంతుని రక్షణను కోరుతూ తనను తాను సమర్పించుకొనుట ఆత్మ నివేదనము. దీనికే న్యాసము, ఆత్మనిక్షేపము, ప్రపత్తి, శరణాగతి - అను నామాంతరములు గలవు.

## ప్రపత్తి యోగము :

మోక్ష ప్రాప్తికి కర్మ జ్ఞాన, భక్తి, యోగముల కన్న ప్రపత్తి యోగము గొప్పదని భాగవత సిద్ధాంతము.

"నన్ను కాపాడుకొనుటకు నా వద్ద శక్తి లేదు. బ్రహ్మ రుద్రాదులు అల్పఫల దాతలు. నీవే నాకుగతి. నేను పొందవలసినది నిన్నే. నిన్ను నేను పొందునట్లు చేసుకొనువాడవు నీవే[88]" - అను భావము కలిగియుండుట ప్రపత్తియోగము.

ఈ ప్రపత్తికే శరణాగతియని నామాంతరము. ఆత్మ రూపమైన భక్తి విభాగములో ఇది చేరును. ఈ ప్రపత్తి యోగమును వేదములు, ఉపనిషత్తులు, పురాణములు, భగవచ్ఛాస్త్రమనబడు "పాంచరాత్రాగమము" మొదలగు ప్రామాణిక గ్రంథములు ప్రతిపాదించినవి. ఈ యోగము నారద, శాండిల్యుల వంటి మహర్షుల అనుష్ఠించినది.

వైష్ణవ సిద్ధాంతానుయాయులైన ఆళ్వారుల చేతను, ఆచార్యుల చేతను, ఈ ప్రపత్తి యోగము జన ప్రచారములోనికి తీసుకొనిరాబడినది.

యజుర్వేదమునందు "పుణ్యభాజనులగు మహాజనులకే ప్రవేశింపదగినదియు, త్రిపాద్విభూతి యనబడు నీ సన్నిధిని పొందుటకై ఓ స్వామీ! మా స్త్రీల తోడను, మా సంతానము తోడను, నిన్నే శరణు వేడుచున్నాము"[89] అని ప్రపత్తి ధర్మమును గూర్చి - మానవుడు తన సర్వస్వము భగవదర్పణము చేసి శరణాగతి చేయవలెనని చెప్పబడెను.

బ్రహ్మవిద్య, పురుష విద్య అనెడి పేర్లతో ప్రసిద్ధికెక్కిన ఆత్మార్పణ రూపమైన ఈ న్యాస విద్య తైత్తిరీయారణ్యకములో స్పష్టముగా నిరూపించబడినది.

ప్రజాపతి పుత్రుడైన ఆరుణి అనెడి తత్త్వ జిజ్ఞాసువు "ఆత్మోద్ధరణమునకు సాధనములెవ్వి" అని తన తండ్రిని ప్రశ్నించగా తండ్రి పన్నెండు సాధనములను చెప్పినాడు. అవి. 1. సత్యము 2. తపము 3. దమము 4. శమము 5. దానము 6. ధర్మము 7. ప్రజోత్పత్తి 8. అగ్నిపూజ 9. అగ్నిహోత్రము 10. యజ్ఞము 11. మానసోదానము 12. న్యాసము. పుత్రుడు " ఈ పన్నెండు సాధనములలో శ్రేష్ఠమైనది ఏది?" అనగా తండ్రి "ఈ చెప్పిన వానిలో సత్యము మొదలు మానసోదానము వరకు గల పదకొండు సాధనములును సహకార సాధనములే. న్యాసమను పేరుగల భగవచ్ఛరణాగతియే ముక్తికి ముఖ్యోపాయముగా గుర్తింపుము"[90] అని బోధించెను. పాంచరాత్రాగమము ప్రపత్తినే ఉత్తమమైన సాధనముగా పేర్కొన్నది. "మోక్షసాధన రూపములైన నిష్ఠలన్నింటిలోను, న్యాసమనునది మేటియైనది. సన్యాసము, త్యాగము, శరణాగతి అని నామములు గలవు."[91]

"పార్థా! నన్ను శరణు పొందినవారు స్త్రీలైనను, వశ్యులైనను, శూద్రులైనను, పాపయోనులైనను, పరమపదమును పొందెదరు"[92] అని భగవద్గీత యందు కృష్ణపరమాత్మ శరణాగతిని గూర్చి తెలిపియున్నాడు.

ఈ శరణాగతికి భరన్యాసము, సిద్ధభక్తి, త్యాగము అని కూడా పర్యాయ పదములు.

శరణాగతి అనగా "శరణం గృహరక్షిత్రోః" అని నిఘంటువు ననుసరించి "రక్షకుని తలంచి వెళ్ళుట", "శరణా + ఆగతి - శరణాగతి, నీవే రక్షకుడవు అను భావముతో వచ్చి చేరుట".

"ప్రకృష్టం యథా తథా పద్యతే - ఇతి ప్రపత్తిః" అని విగ్రహము. అనగా గొప్ప ఆశ్రయమని అర్థము. ప్ర+పత్తి=తిరిగి విడిపోని విధముగా గట్టిగా పట్టుకొనుటయే ప్రపత్తిలోని అంతరార్థము.

నన్ను నేను రక్షించుకోజాలను అను భావముతో తన రక్షణ భారమునంతయు ఈశ్వరునిపైనుంచుట భరన్యాసము.

ఆత్మ+అర్పణము-తను అర్పించుకొనుట. అహంకారజన్యమైన తన స్వాతంత్ర్యమును విడిచి, భగవత్పరతంత్రుడై వర్తించుట తన స్వరూపమని తలచి, తనను భగవదధీనము ఒనర్చుకొనుటయే ఆత్మార్పణము.

సిద్ధభక్తి యనగా స్వప్రయత్నముచే సాధింపబడినదిగాక భగవంతుని సాత్విక కటాక్ష ప్రసారము చేత జన్మతః సిద్ధించిన భక్తి.

ఉపాసనాత్మకమై, పురుష ప్రయత్న సాధ్యమైన భక్తియోగమునకు సాధ్య భక్తియోగమని, భగవత్కటాక్ష సిద్ధమైన ఈ ప్రపత్తి భావనకు సిద్ధభక్తి అనిపేరు.

త్యాగమనగా యితరులపై రక్షకత్వ భావమును త్యజించుట -

"ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే"[93] అని శ్వేతాశ్వతరము, "బ్రహ్మణే త్వామహసీ ఓ మిత్యాత్మానం యుంజీత"[94] అని తైత్తిరీయము, "మామేకం శరణం వ్రజ"[95] అని భగవద్గీత శరణాగతి ధర్మమును గూర్చి పేర్కొన్నవి.

## శరణాగతి అంగములు :

శరణాగతికి ఆరు అంగములు. అవి 1. ఆనుకూల్య సంకల్పము, 2. ప్రాతికూల్య పరివర్జనము, 3. రక్షింపగలడను విశ్వాసము, 4. గోప్తృత్వ వరణము, 5. ఆత్మ నిక్షేపణము, 6. కార్పణ్యము.

### 1. ఆనుకూల్య సంకల్పము :

భగవద్విభూతిలో చేరిన సర్వస్వము తనకు అనుకూలమని భావించుట. భగవత్సాన్నిధ్యమే తనకు అనుకూలమను భావమును కలిగియుండు.

### 2. ప్రాతికూల్య పరివర్జనము :

భగవంతునియందు, భాగవతులయందు వహించిన అహంకార బుద్ధిని విసర్జించుట. తనకు ప్రతికూలముగానున్న దారా, పుత్ర, గృహారామ క్షేత్రాది, ప్రాకృత వస్తువులపై సంబంధమును వదులుట.

### 3. రక్షింపగలడను విశ్వాసము :

తనను భగవంతుడు తప్పక రక్షింపగలడను మహావిశ్వాసము కలిగి యుండుట.

### 4. గోప్తృత్వవరణము :

"స్వామీ! నన్ను రక్షింపుము" అని కోరుట. ప్రపన్నుని నుండి ఎప్పుడు ఇటువంటి కోరిక వెలువడునా అని భగవంతుడు ఎదురుచూచునట. ప్రపన్నునిలో ఇట్టి ప్రార్థనా బుద్ధి కలుగునంత వరకు భగవానుడు ఉదాసీనుడై ఉండునట.[96]

### 5. ఆత్మ నిక్షేపణము :

అనుచితమైన స్వాతంత్య్రమును మీదికి తెచ్చుకొని, అనాదిగా భగవంతునికి దూరమై వర్తించుచున్న తనను భగవదధీనము చేయుటను ఆత్మ నిక్షేపణమందురు. తనకు స్వార్థమైన ఫలాంతరము లేదనుచు, తన దాస్యముచే భగవన్ముఖోల్లాసము కలిగించుటయే ఇందు పరమావధి.

### 6. కార్పణ్యము :

నీవే తప్ప నాకు వేరేగతి లేదను దైన్యమును ప్రదర్శించుట. స్వరక్షణమందు తన అసమర్థతను తెలియజేయుచు దీన పరిస్థితిని నివేదించుట.

భగవంతుని అనుగ్రహము పొందుటకు కర్మజ్ఞాన భక్తి మార్గములకన్న శరణాగతి మార్గము సులభము. సద్యః ఫల దాయకము కనుక శ్రీవైష్ణవ సిద్ధాంత వేత్తలు దీనిని ముఖ్యోపాయమని తెలియజేసిరి.

## బ్రహ్మప్రాప్త్యుపాయము :

నిరతిశయమైన పుణ్యముచే సమస్తపాపములు నశించగా, జీవుడు పరమాత్మ చరణారవిందములందు చేసిన శరణాగతి వలన ఆతనికి ఆభిముఖ్యము జనించును. అప్పుడు జీవుడు సదాచార్యులను ఆశ్రయించి శాస్త్రజ్ఞానమును విశదముగా పొందును. తత్త్వ, ఆధ్యాత్మిక, జ్ఞాన పూర్వకముగా అనుదినము అభివృద్ధి చెందుచున్న శమదమాది సదాచారములు, క్షమ, ఆర్జవము మొలగు ఆత్మ గుణములతో కూడి ఉన్న జీవుడు తన వర్ణాశ్రమములకు తగినట్లు పరమ పురుషారాధన రూపములగు నిత్యనైమిత్తిక కర్మల నాచరింపవలెను. నియమ నిష్ఠలను పాటించుచూ పరమ పురుషుని చరణారవిందములయందు, ఆత్మీయ భావము నుంచి, భగవద్భక్తి, కీర్తన, గుణ శ్రవణ, గుణవచన, ధ్యానార్చన, ప్రణామముల నాచరింపవలెను. ఇట్టి సదాచారము చేత ప్రీతుడయిన పురుషోత్తముడు అనుగ్రహించి చేతనునిలోని అజ్ఞానమును నశింప జేయును. అప్పుడా జీవుడు అనన్య ప్రయోజనమైన భక్తిచేత పరబ్రహ్మమైన శ్రీమన్నారాయణుని పొందగల్గును. అదియే అత్యుత్తమ పరమపద ప్రాప్తి అగును. అచ్చట దివ్యలోకమునందు, దివ్య సూరుల సన్నిధానమునందును, ఈ జీవునకు కలిగిన పరమాత్మ సాయుజ్యమే సర్వశ్రేష్ఠమని భగవద్రామానుజులు తమ వేదార్థ

సంగ్రహమునందు విశదపరచిరి. అట్టి పరమాత్మ సాయుజ్యమును పొందగోరు శ్రీవైష్ణవునకు పంచ సంస్కార దీక్ష అత్యంత ప్రధానమని నిర్ణయించిరి.

## పంచసంస్కారములు :

**1. తాపము :**

శ్రీవైష్ణవుడు సదాచార్యుని ఆశ్రయించి అతని వలన భుజద్వయముపై ముద్రలనొందును. దీనికి "సమాశ్రయణము" అని పేరు.

**2. పుండ్రము :**

ముఖాది ద్వాదశ స్థానములందు భగవత్పాద ఆకృతిలో తిలకమును, శ్వేతమృత్తికతోను, మధ్యన హింద్రాచూర్ణముతోను ఊర్ధ్వాకృతిగా ఆచార్య నిర్దేశము ప్రకారము దేహమునందు ధరించుట పుండ్రము.

**3. నామము :**

భగవద్భాగవత దాస్యమే తన స్వరూప మనుటకు సూచకముగా సమాశ్రయణము పొందినది మొదలుకొని తన పేరు తెలుపవలసి వచ్చినపుడు, రామానుజదాసుడు, శఠగోపదాసుడు, వేంకటదాసుడు మొదలగు నామములను ఆచార్యులు నిర్ణయించినట్లు ధరించుట.

**4. మంత్రము :**

"మననాత్ త్రాయత ఇతి మంత్రః" అని వ్యుత్పత్తి. తనను మననము చేసెడి వారిని రక్షించు శక్తి మంత్రమునకున్నది. శ్రేష్ఠములైన అష్టాక్షరి, ద్వయము, చరమములను మంత్రములను ఆచార్యోపదేశము వలన పొంది గురుపరంపర పూర్వకముగా వాటిని నిత్యమును అనుసంధించుట.

**5. యాగము :**

అనుగ్రహ పూర్వకముగా ఆచార్యులచే ప్రసాదింపబడిన సాలగ్రామమును, తామ్రాది (మయ) భగవన్మూర్తులను నిత్యము త్రికాలములయందు షోడశోప చారములచే పూజించుట.

## అష్టాక్షరీ మంత్రము :

**"ఓం నమో నారాయణాయ"** అనునది. ఈ మంత్రమునకు మహామంత్రమనియు, మంత్రరాజమనియు పేర్లు. విశిష్టాద్వైతమున ఈ తిరుమంత్రమునకు అత్యున్నత స్థానముకలదు. ఈ మంత్రము నందు ఎనిమిది అక్షరములున్నవి.

నారాయణోపనిషత్తునందు "మొదట ప్రణవమును, పిమ్మట "నమః" పదమును, తరువాత "నారాయణాయ" అను పదమును పలుకవలెను. ప్రణవమొక అక్షరము, నమః పదము రెండక్షరములు. నారాయణాయ అను పదము ఐదక్షరములు గలది. కావుననే ఈ మంత్రమునకు అష్టాక్షరీ మహామంత్రమని పేరు"[97] అని కలదు.

సర్వవేద సారమును, సర్వ వేదసంగ్రహమును, సర్వ వేదాద్యంతోచ్చారితము ఐన ప్రణవము ఈ మంత్రము నందు ప్రధానమైన భాగము. ఇదియే మంత్రసారము.

'ఓం' అను అక్షరము అ+ఉ+మ్ అను అక్షరములతో కలసి ఏర్పడుచున్నది. అకారము ప్రథమాక్షరము. ఉకారము ద్వితీయ, 'మ్'కారము తృతీయాక్షరములు. ప్రణవము అఖండముగ ఉన్నపుడు ఒకే అక్షరము. అది సఖండముగ ఉన్నపుడు మూడక్షరముల కలయిక. ఈ అకార, ఉకార, మకారములు క్రమముగా ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదముల నుండి గ్రహింపబనవి. మూడు వేదముల నుండి మూడు పదములు ఆవిర్భవించినవి. ఋగ్వేదము నుండి 'భుః' అనెడి, యజుర్వేదము నుండి 'భువః' అనెడి, సామవేదము నుండి 'సువః' అనెడి వ్యావృతులు జన్మించినవి. ఈ వ్యావృతుల నుండి అకార, ఉకార, మకారములు ఏర్పడినవని పూర్వాచార్యులు నిర్ణయించిరి. అందు చేతనే 'ఓం' అనెడి ప్రణవాక్షరము వేదత్రయ సారముగా నిర్ధారణ చేయబడినది. "భూః" అను పదమునకు "భవతి ఇతి భూః" అని వ్యుత్పత్తి కలదు. అనగా కారణభూతమగు పరమాత్మ కార్యరూపమును దాల్చునని భావము.

"భువః" అను పదమునకు "భవః సంసారః తం అస్యతి క్షిపతి ఇతి భవః" అని తను ఆశ్రయించిన వారికి సంసార దుఃఖము తొలగించి మోక్షమును ప్రసాదించునని అర్థము.

"సువః" అను పదము "సూః ప్రసూతిః" - షూజ్ ప్రాణిగర్భ విమోచనే అనెడి ధాతువు నుండి ఆవిర్భవించినది. అనగా ఇది జగత్తును పుట్టించునది అని భావము.

## అకారార్థము :

"అక్షరాణామకారోస్మి" అని గీతాచార్యుడు భగవద్గీతయందు ప్రవచించినాడు. అనగా శ్రీమహావిష్ణువు అకారస్వరూపుడని భావము. సంస్కృత వ్యాకరణము అకారమునకు కంఠస్థానమును చెప్పినది. కావున సర్వశబ్దములకు అకారము ఆధారస్థానము.

అకారమునకెట్లు సర్వశబ్ద కారణత్వమున్నదో అట్లే నారాయణుడు సర్వ కారణభూతుడు. "అవి రక్షణే" అనెడి ధాతువు ప్రకారం అకారమునకు ధాత్వర్థము రక్షకత్వమని చెప్పబడినది. సర్వ సృష్టికి రక్షకుడు నారాయణుడుగా పేర్కొనబడినాడు. కనుక 'ఓం' అనెడి ప్రణవమునకు ఆధారమైన అకారమునకు, సర్వ సృష్టికి ఆధారభూతుడయిన నారాయణునికి సామ్యము. కనుక అష్టాక్షరియందున్న "నారాయణాయ" అను పదమునకు - 'అ'కారము సంగ్రహ స్వరూపముగా భావింపవచ్చును.

## ఉకారార్థము :

ఉకారమునకు స్థాన ప్రమాణము చేత 'అవధారణమని' అర్థము. మకార వాచ్యుడయిన చేతనుడు, అకార వాచ్యుడయిన నారాయణుని కొఱకేయని నిర్ధారణ చేయుచున్నది. మకారమునకు ఏ అర్థముండునో, ఉకారమునకు కూడ అదే అర్థమును స్ఫురింపజేయునని వేదములలో గలదు. దీనిననుసరించి మకారార్థ వాచ్యుడైన చేతనుడు నారాయణునికే శేషభూతుడు - అన్యులకు కాడు అను అర్థము ఉకారము చేత సిద్ధించుచున్నది.

## మకారార్థము :

కవర్గాది అయిదు వర్గములలో మకారము ఇరవై అయిదవ అక్షరమై ఉన్నది. 'క'కారము మొదలుకొని 'భ'కారము వరకున్న ఇరువది నాలుగు అక్షరములవలెగాక ఇరువది అయిదవ అక్షరమగు 'మ'కారము "మనజ్ఞానే మన అవబోధనే" అను ధాతువుల నుండి పుట్టినదగుట చేత ఇది జ్ఞానమును తెల్పుచున్నదనవచ్చును. "విజ్ఞానాత్మా పురుషః" అని ప్రశ్నోపనిషత్తు చెప్పుచున్నది. జ్ఞానమునకాధారమైనవాడు జీవుడు,

జీవునకు మరొక పేరు ఆత్మ. ఆత్మ - జ్ఞానమను గుణము కలిగి యుండును. "మకారార్థో జీవః" అని పూర్వాచార్యులు పేర్కొనిరి.

క వర్గము - పంచభూతములు (పృథివ్యప్తేజోవాయు రాకాశములు)
చ వర్గము - జ్ఞానేంద్రియములు
ట వర్గము - కర్మేంద్రియములు
త వర్గము - గంధాదులు
ప కారము - మనస్సు
బ, భ - అనగా ప్రకృతి
మ - అనగా ఆత్మ

అని పద్మోత్తర పురాణము చెప్పుచున్నది.

అష్టాక్షరీ మంత్రమునందున్న రెండవ పదము 'నమః' అనునది. ఇందు 'న', అనియు 'మః' అనియు రెండు పదములున్నవి. 'మః' అనునది "తనకు తానుగా దాసుడన"ని అర్థము చెప్పుచున్నది. 'న' అనునది నిషేధ వాచకమగు 'నఙ్' చే అట్టి స్వ దాసత్వమును నిషేధించుచున్నది. దీని వలన 'న' నిషేధ రూపమై "నేను నా కొఱకు గాదు" అను విశేషార్థమును ఇచ్చుచున్నది. 'మః' అనునది షష్ఠీ విభక్త్యంతము. ఇది అహంకార మమకారములతో కూడిన "నాకు-నేను" అనెడి అర్థమును చెప్పుచున్నది.

భగవదనుభవము అనెడి ఫలమును అనుభవించవలెనన్నచో విరోధములైన అహంకార మమకారములను తొలగించవలెను. ఈ 'నమః' పదముచే శేషత్వ విరోధియైన స్వాతంత్ర్యము నివర్తింపచేయబడుచున్నది. విరోధను మూడు విధములు. 1. స్వరూపవిరోధము 2. ఉపాయవిరోధము 3. ఫలవిరోధము.

'సర్వము నీవే - నేను దాసుడనే' అని స్వరూప విరోధమును నివర్తింపచేయుచు, ఆత్మార్పణము చేయుట - స్వరూపవిరోధ నిరాసనము.

ఈ సంసార సాగరము నుండి రక్షించినను, లేకపోయినను, యితరుల రక్షకత్వమును మాత్రము కోరను అనుట ఉపాయవిరోధ నిరాసనము.

'తనకొరకు' అనెడి బుద్ధితో చేయుటచే వచ్చునది ఫలవిరోధము. అది పోవుట అనగా "నీ సేవను మించిన నా యొక్క ప్రాకృత వాంఛలన్నిటినీ పోగొట్టుమ"ని అడుగుట, అట్లే పడియుండుట ఫలవిరోధ నిరాసనము.

ఈ విధముగా 'నమః' పదము స్వరూప, ఉపాయ, ప్రాప్య, విరోధములను నివర్తింపజేయుటయేగాక స్వరూపమును ప్రకాశింపజేయుచున్నది. దీనినే స్వరూపోజ్జీవనమందురు. అనగా ఆత్మ స్వరూపమునకు ఉజ్జీవనము కలుగుట. అహంకార మమకారములనెడి, రెండంశములున్నపుడు చేతనుని ఆత్మ స్వరూపము నశించి పోవును. ఆ రెండింటితో సంబంధము లేనపుడు ఆత్మ స్వరూపమునకు ఉజ్జీవనము కలుగును.

## నారాయణపద వివరణము :

నారాయణ అను పదమునకు, రెండు విధములుగా, "నారాణాం అయనం యః సః నారాయణః" - అనగా "నార పదార్థములకు ఆధారము ఎవ్వడో వాడు" అనియు, - నారాః అయనం = నారములకు ఆధారము, యస్య=ఎవ్వనికో, సః=వాడు, అనియు అర్థము చెప్పవచ్చు.

"రిజ్ క్షయే" అను ధాతువు నుండి 'ర' అను పదము జన్మించినది. దానికి 'నశించుట' అని అర్థము. నశించు వస్తువునకు 'ర'పదము వాచకమైనపుడు దానిని నిషేధించుటకు 'న' పదము మొదట వచ్చి 'నర' పదము ఏర్పడినది. ఈ 'నర' పదము నశింపని నిత్య వస్తువులను తెలుపును. సమూహార్థమునందు ఈ పదము చివర 'అణ్' ప్రత్యయము వచ్చి, ఆద్యచ్చునకు వృద్ధియగును. దీర్ఘము వచ్చి 'నార' అని బహువచనముతో నిత్యవస్తు బాహుళ్యము వ్యక్తమగును. అపుడు "నారాః" అనునది "నిత్య వస్తువుల సమూహములు" అను అర్థము కలిగించుచున్నది.

నారాణాం = నారములకు, అయనం = నివాసమైనవాడు అని షష్ఠీ తత్పురుష సమాసార్థము.

అక్షయములైన వస్తుసమూహములు, నిత్య విభూతి, లీలా విభూతి యందలి ప్రతి అణువు నారమే.

"సర్వేశ్వరునకు శేషభూతుడనగు నేను, నాకు శేషభూతడను కాకుండ ఉండవలెను. సర్వశేషియగు నారాయణునికే సర్వ కైంకర్యములు చేసికొనుచు, ఉండవలెను. అని నిరంతర ధ్యానము చేతనునికి అమరవలయును" అనునది తిరుమంత్రమైన అష్టాక్షరీ మహామంత్ర సారము.

ఈ మహామంత్రమునందు అర్థపంచక జ్ఞానము నిబిడీకృతమైయున్నది. అర్థపంచక జ్ఞానమనగా,

1. పొందవలసినది భగవంతుని స్వరూపము.
2. అతనిని పొందునట్టి జీవుని స్వరూపము.
3. అట్లు పొందుటకు ఉపాయ స్వరూపము.
4. అనుభవించు ఫల స్వరూపము.
5. పురుషార్థ విరోధి స్వరూపము.

'ఓం' అను ప్రణవము చేత, ఆత్మ స్వరూపమును, 'నమః' శబ్దము చేత విరోధి స్వరూపమును, ఉపాయస్వరూపమును, 'నారాయణ' శబ్దముచేత భగవత్ స్వరూపమును, 'అయ' శబ్దము చేత ఫల స్వరూపమును ప్రకాశించుచున్నవి.

## ద్వయమంత్రము :

తిరుమంత్రమును ప్రథమముగాను, ద్వయ మంత్రమును మధ్యమముగను, చరమ శ్లోకమును చివరిగను అనుసంధానము చేసుకొనుట శ్రీవైష్ణవ సంప్రదాయము నందు ఆచారము. తిరుమంత్రమునకు ద్వయమంత్రము వివరణము. ద్వయ మంత్రమునకు చరమశ్లోకము వివరణము అగుచున్నవి. తిరుమంత్రములోని 'నమః' పదము, 'నారాయణాయ' అను ఈ రెండింటికిని అర్థమును ప్రతిపాదించుట చేత దీనికి ద్వయమంత్రమని అర్థము.

సర్వేశ్వరునికి విశేషముగా నుండునట్టి లక్ష్మీదేవి మూలముగా పురుషార్థము కలుగునని ద్వయమంత్రము తెలుపుచున్నది. లక్ష్మీదేవి పురుషకారములేని సమయమున చేతనునకు పురుషార్థ లాభము కలుగదు. సకలలోక కళ్యాణ కాంక్షచే నిరంతరము మగ్న చిత్తుడైన సర్వేశ్వరుడు, తనను విశ్వసించిన భక్తుని మొరవినుటకు ప్రేరేపణ చేయునది లక్ష్మీదేవియే.

ఈ ద్వయమంత్రమునకు పూర్వఖండము **"శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే"** అని ఉండును. శ్రీమత్ + నారాయణ చరణౌ + శరణం ప్రపద్యే అని విభాగము. ద్వితీయ ఖండము **"శ్రీమతే నారాయణాయ నమః"** అనునది.

శ్రీమత్ అనగా లక్ష్మీదేవిని పురుషకారముగాగొని, నారాయ చరణౌ - సర్వేశ్వరుని శ్రీ పాదములను, శరణం ప్రపద్యే - రక్షణకై పట్టుకొనుచున్నాను. అని సాధారణార్థము.

శ్రీ అనగా లక్ష్మీదేవికి పేరు, 'శ్రీఞ్ సేవాయామ్' అను ధాతువు నుండి 'శ్రీః' అను శబ్దముత్పన్నమగును. 'శ్రీయతే యితి శ్రీః' అని వ్యుత్పత్తి. 'శ్రీయతే' - సేవింపబడునది అనగా అందరి చేతను సేవింపబడునది అని అర్థము. సకల చేతనులకు ఈమెను బట్టి తమ తమ శేషత్వ స్వరూపము లభించును.

సర్వేశ్వరునికి ఉపాయత్వమనియు, ఉపేయత్వమనియు రెండు ఆకారము లున్నట్లు, లక్ష్మీదేవికి కూడా చేతనుల విషయమునందు పురుషకారముగను, ప్రాప్యత్వమునందు సర్వేశ్వరునితో కలిసి అనుభవించు స్వభావము గలదు. 'మత్' అను ప్రత్యయము నిత్యయోగమును తెలుపును. సర్వకాల సర్వావస్థలయందు లక్ష్మీదేవి - నారాయణుడు కలిసియే ఉందురు. నారాయణుని యదార్థతత్త్వము లక్ష్మితో కూడి యుండుట. 'శ్రియః పతిః' అనెడి విష్ణు నామము నందు మొదట వచ్చునది శ్రీదేవి నామమే. నారాయణునకున్న పరత్వము లక్ష్మీదేవితో కలిసి యుండుట వల్లనే కలిగినది. లక్ష్మీదేవికి రెండు విధములైన దాస్యము చేయు స్వభావమున్నది. 1. స్వరూప ప్రయుక్తి దాస్యము, 2. గుణ ప్రయుక్తి దాస్యము

స్వరూప ప్రయుక్తి దాస్యమనగా ఒక్క క్షణమైననూ స్వామిని ఎడబాయక సర్వకాల సర్వావస్థలయందు సర్వేశ్వరుని కైంకర్యము చేయుట.

గుణ ప్రయుక్తి దాస్యమనగా సర్వేశ్వరుడు సర్వ స్వతంత్రుడు. అతడేమి చేసినను అడ్డు ఉండదు. ఈ సర్వ స్వతంత్రత ఏ సమయములోనైనను చేతనుని విషయమునందు క్రోధముగ మారినపుడు, కృపా విగ్రహమైన లక్ష్మీదేవి ఆతని స్వతంత్రతను తగ్గించి, చేతనుని విషయములో కరుణ రసమును పుట్టించి, ఆత్మలను రక్షణ చేయును. ఈ విధముగా చేతనేశ్వరులను దిద్దుచు, యిద్దరి సంబంధము కాపాడెడి సంబంధము కలది లక్ష్మీదేవి.

పురుషకారము లక్ష్మి. ఉపాయము నారాయణుడు. ఉపేయము లక్ష్మీనారాయణుల కైంకర్యము. ఉపాయములో ఈ జంట నుండి ఏ ఒక్కరిని కోరినను ప్రమాదము. లక్ష్మిని వదలి నారాయణుని కోరిన శూర్పణఖ, నారాయణుని వదలి లక్ష్మిని కాంక్షించిన రావణుడు నశించుట ఇందుకు దృష్టాంతము.

"చరణౌ" అను పదమునకు చరణద్వయమును అనగా శ్రీపాదములను అని అర్థము. ఇట్టి శ్రీపాదములు లక్ష్మీదేవికి నివాస స్థానములు. ఇవి చేతనునకున్న ద్వేషాదులను సమసింప జేసి తన వద్దకు చేర్చుకొనునట్టి స్వభావము కల్గియున్నవి.

'శరణం' అనగా "ఇష్టప్రాప్తికిని, అనిష్టనివృత్తికిని తప్పని ఉపాయముగా" - అని అర్థము. 'శరణ' శబ్దమునకు 'రక్షకుడు' 'ఉపాయము' అను అర్థములున్నవి. ఈ ద్వయమంత్రము నందు "శరణ" శబ్దమునకు 'ఉపాయ'మనియే అర్థము. ఉపాయకృత్యము ఇష్టమును కలుగజేయవలెను. అనిష్టమును తొలగించవలెను. ఇష్టప్రాప్తి అనగా పరమాత్మ దర్శనము. గుణానుభవ కైంకర్యము. అర్చిరాది మార్గమున ప్రయాణము, పరమ పదప్రాప్తి అని చెప్పుదురు. అనిష్ట నివృత్తి అనగా, అవిద్యను దాని మూలముగా వచ్చెడి రాగద్వేషములను, పుణ్య పాపరూప కర్మలను, నానావిధ శరీర ధారణమును, ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్మాత్మికాది దుఃఖ పరంపరలను, తొలగించుకొనుట అని అర్థము. పరమాత్ముని శరణు వేడిన యెడల ఈ కష్టములు తొలగుటయేగాక ఇష్ట ప్రాప్తి సంభవించును. భగవత్సన్నిధికి చేరుటకు సాధనము పాదయుగళమే. భగవత్సన్నిధిలో కైంకర్యము చేయవలసినది పాదపద్మములకే. అందుకే ప్రాప్య ప్రాపక రూపములైన పాదపద్మములే శరణము.

"శ్రీమత్ = లక్ష్మితో కూడియుండిన, నారాయణ = కళ్యాణగుణ స్వరూపుడైన నారాయణుని, చరణౌ = దివ్య పాదపద్మములను, శరణం = ఉపాయమముగా, ప్రపద్యే = ఆశ్రయించుచున్నాను" అని ద్వయమంత్ర పూర్వఖండికకు భావము. "పదగతౌ" అనెడి ధాతువు నుండి 'పద్యే' అను ధాతు రూపము కలిగినది. 'ప్ర' అనునది ఉపసర్గ -

"శ్రీమతే నారాయణాయ నమః" అను ద్వయమునందలి రెండవ ఖండికలోని మొదటి పదము 'శ్రీమతే' అనునది. శ్రీ శబ్దముపై "మతుప్" ప్రత్యయము చేర్చి చతుర్థీ విభక్తి కలుపగా "శ్రీమతే" అగుచున్నది. "శ్రీయత ఇతి శ్రీః", "శ్రీయతి ఇతి శ్రీః" అనెడి రెండు వ్యుత్పత్తులు ఇచట కూడ అను సంధించుకోవలసియున్నది. సందర్భము ననుసరించి 'శ్రీమతే' అను పదమునకు "లక్ష్మీదేవితో కూడియున్నట్టి వానికి" అని అర్థము చెప్పవలెను. మొదటి పాదము నందలి 'శ్రీమత్' శబ్దమునకు "పురుష కారణభూతురాలగు లక్ష్మీదేవితో కూడియున్నట్టి వానికి" అని అర్థము చెప్పబడినది.

ద్వితీయ ఖండమునందున్న "శ్రీమత్" శబ్దముచే ప్రతిపాద్యురాలైన లక్ష్మీదేవి, సర్వేశ్వరుడు చేతనుల నుండి కైంకర్యమును గొనుచు, ప్రాప్యుడైయుండునపుడు తాను

కూడా ప్రాప్యురాలై, వీరొనర్చు కైంకర్యములను, వారి మనస్సులకు మిక్కిలి రుచించునట్లు చేయునదైయుండి, కైంకర్య వర్ధకురాలు అగుచున్నది. క్షణకాలము కూడ సర్వేశ్వరుని వీడక ఉండునట్టి స్థితిని కూడ ఈ శబ్దము తెలియజేయుచున్నది. దాసులు చేయునట్టి కైంకర్యము దంపతులు ఇరువురు అనుభవించుచున్నారని అర్థము కలుగుచున్నది. చేతనునకు స్వరూపము లక్ష్మీనారాయణుల కైంకర్యము. అష్టాక్షరి యందు "నారాయణాయ" అను పదమునకు తెలియజేయబడిన అర్థవివరణ మంతయు ఇచ్చట కూడ అనువర్తించును.

"నమ"శ్శబ్దమునకు తిరుమంత్రార్థ వివరణమునందు చెప్పినట్లుగనే "అహంకార మమకారములను దూరముగా నుంచి, కైంకర్య బుద్ధికలవాడుగా చేతనుడు ఉండవలయును" అని అర్థము. "లక్ష్మీదేవితో కూడుకొనియున్నట్టి నారాయణునికి నమస్కారము" అని ద్వయములోని ద్వితీయ ఖండమునకు అర్థము.

## చరమశ్లోకము :

ద్వయ మంత్రమునకు వివరణము వంటిది -

"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిశ్యామి మాశుచః"

ఈ శ్లోకమును కృష్ణపరమాత్మ అర్జునునకు ఉపదేశించెను. శ్రీకృష్ణుడు అర్జునునకు సారథిగా నిలచి, కర్మ, జ్ఞాన, భక్తి యోగములన్నింటిని వివరముగా చెప్పెను. సౌలభ్యమూర్తియై విశ్వరూపమును ప్రదర్శించెను. అర్జునుడు భయకంపితుడై కర్మ, జ్ఞాన, భక్తి మార్గములు తనకు ఆచరించుటకు శక్తిలేదని ప్రార్థించగా, సులభమార్గమైన చరమోపాయమును (చివరి ఉపాయమును) నిరూపించి తెలియజెప్పెను.

ఈ శ్లోకము పూర్వార్థమునందు ఆరు పదములున్నవి. ఈ పదములలో అధికారియైనవాడు ఉపాయభూతుడైన ఈశ్వరునికి చేయు కృత్యమును చెప్పుట జరిగినది. ఉత్తరార్థమునందు ఉపాయమైన ఈశ్వరుడు అధికారికి చేసెడి కృత్యము కూడ ప్రతిపాదింపబడినది.

"సర్వధర్మాన్" అనగా సకల ధర్మములను అని అర్థము. ధర్మమనగా ఒక ఫలమునకు సాధనమైనది. సకల ధర్మములనగా, పుత్ర, ధన, అన్నాది లౌకిక ఫలములకు

సాధనములైనవి, మరియు నిత్య నైమిత్తికములైన సంధ్యావందన, పంచమహాయజ్ఞాది కృత్యములును, మోక్షోపాయమునకు సాధనములైన భక్తి, కర్మ, జ్ఞానాది మార్గములును గ్రహించబడుచున్నవి. సర్వ శబ్దములోని బాహుళ్యార్థము, 'ధర్మాన్' అను శబ్దములోని బహువచనము చేత పైన చెప్పిన "సకల ధర్మములను" అను అర్థము సిద్ధించుచున్నది.

"పరిత్యజ్య" అనగా సంపూర్ణముగా విడచి అని అర్థము. 'త్యజ్' ధాతువునకు 'ల్యప్' ప్రత్యయము చేరగా త్యజ్య అగును. దీనికి పూర్వము 'పరి' అనెడి ఉపసర్గ ఉండుట చేత సంపూర్ణముగా, త్యజ్య - విడిచి అనెడి అర్థము నిష్పన్నమగుచున్నది.

'మామ్' అనగా సర్వ రక్షకుడనైన నన్ను అని అర్థము. 'ఏకమ్' అను పదమునకు 'ఒక్కనినే' అని అర్థము. సర్వ ధర్మ స్వరూపుడు తానే గనుక తనను ఒక్కని శరణు వేడినచో చాలునని విశేషము.

'శరణమ్' అను శబ్దమునకు ఉపాయార్థమునే గ్రహించవలెను. "సర్వ ధర్మములను విడనాడి తననే ఉపాయముగా",

'వ్రజ' = నిశ్చయించుకొనుము అని అర్థము. ఇది 'వ్రజగతౌ' అనెడి ధాతువు. ఆ నిశ్చయము త్రికరణశుద్ధిగా నుండవలెను. త్రికరణ శుద్ధిగా చేసెడి స్వీకారము అధికార పూర్తికుపయోగబడును. కాని ఈ సందర్భమున త్రికరణములలోని కాయిక వాచికానుష్ఠానముల వదలి 'నిశ్చయబుద్ధికి' అని మానసికానుష్ఠానమునే చెప్పుటకు కారణము "జ్ఞానాన్మోక్షః" అని ఉండుట వలన, జ్ఞాన విశేషరూపమైన మానసిక అనుష్ఠానమే మిక్కిలి అపేక్షితము కాన ఇచ్చటి 'వ్రజ' పదమునకు బుద్ధియందు అధ్యవసాయము చేయుము, అని చెప్పుటయే ప్రయోజనము.

"అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" అనెడి రెండవ పాదమున ఆరు పదములున్నవి.

'అహమ్' అనుపదమునకు 'నేను' అని సాధారణార్థము. ఈ పాదమునందు సర్వేశ్వరుడు చేయబోవు అంశమును వివరించుచున్నాడు. 'అహమ్' అనగా, సర్వజ్ఞుడనైన, సర్వశక్తిగలవాడనైన, బాధ్యతగలవాడనైన నేను - అని విశేషార్థము. భగవంతుడు 'శేషి' అగుట వలన బాధ్యత కలవాడని తెలియుచున్నది.

'త్వా' = నిన్ను, అనగా అజ్ఞుడవై, అశక్తుడవై, ప్రాప్తిలేనివాడవై, నన్నే ఉపాయముగా గొనినట్టి 'నిన్ను' అని విశేషార్థము.

'సర్వపాపేభ్యః' = అన్ని పాపముల నుండి అని అర్థము. ఇష్ట విరోధియు, అనిష్ట హేతువు అయినది పాపమనబడును. ఇచ్చట ఇష్ట విరోధులు అనతగినవి భగవత్ప్రాప్తికి విరోధులైన అంశములే.

శరీరమునే ఆత్మయనుకొనెడి దేహాత్మాభిమానము, తన్మూలకముగా జరిగెడి సాంసారిక దుష్కృత్యములు, అకృత్యముల విషయమున జరిగెడి ప్రవృత్తి, అవిద్య, కర్మ, వాసన, రుచి ప్రకృతి సంబంధము, మొదలగు వాటిని "పాపేభ్యః" అను శబ్దము వలన గ్రహించవలెను.

'అవిద్య' అనగా జ్ఞానము పుట్టని, అన్యథా జ్ఞాన రూపమైన, విపరీత జ్ఞాన రూపమైన అజ్ఞానము. 'కర్మ' అనగా పుణ్య పాపములు. మోక్ష విషయమున పాపములతోపాటు పుణ్యము కూడా త్యాజ్యమే. 'వాసన' యనగా అజ్ఞాన, ప్రకృతి సంబంధ, కర్మ వాసనలని అనేక విధములుగా ఉండును. ప్రకృతి సంబంధము అనగా సూక్ష్మ, స్థూల శరీరములతోగల సంబంధము. వీటి కారణముగా చేయబడెడి పాపములన్నియు "పాపేభ్యః" అను వాని క్రిందికి వచ్చును.

'మోక్షయిష్యామి' - అనగా "ముక్తునిగా చేయగలను" అని అర్థము. "ఇంతకాలము వరకును మన పనిని మనమే చేసుకొనగలమని నీవు తలచియున్నందున తన పనిని చేసుకొమ్మని నేను ఊరక ఉంటిని. నీవు నాకు శరీరముగాను, శేషభూతుడ ననుకొని, భారమునంతయు, నాపై వదలిన పిమ్మట నిన్ను విడనాడను. నాకు శరీర భూతుడవైన నీ యొక్క అవిద్య రూపమగుమాలిన్యమును శరీరియగు నేనే తుడిచి వేసికొందును" - అని విశేషార్థము.

'మాశుచః' = దుఃఖింపకుము. "నీ కార్యమును నేనే నెరవేర్చెదను" అని భావము. ఈ విధముగా ఈశ్వరుని స్వాతంత్ర్యమును ప్రతిపాదించుటచే ఈ శ్లోకమునకున్న వైశిష్ట్యము విశదమగుచున్నది. శాస్త్ర విహితములైన సకల ధర్మములను సవాసనగ విడిపించి, చేతనునకు తానే నిరపేక్ష సాధనమై, స్వప్రాప్తి ప్రతిబంధకములైన సకల పాపములను తొలగించి, స్వప్రాప్తిని కలిగించు స్వాతంత్ర్యము, జీవ శరణాగతి కారణముగా ఈశ్వరుడు తానే గైకొనునని చరమశ్లోక తాత్పర్యము.

## అథస్సూచికలు

1. శ్లో॥ "సదేవ సోమ్యేద మగ్ర ఆసీదేకమేవా ద్వితీయం"
శ్లో-1, ఖండ-2, ప్రపాఠకః-6, ఛాందోగ్యోపనిషత్తు.
2. "అపరేయ మితి స్త్వన్యాం ప్రకృతిం విద్ధిమే పరామ్ ।
జీవ భూతాం మహాబాహో యమేదం ధార్యతే జగత్॥" శ్లో-5, అధ్య-7, భగవద్గీత
3. "ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ ।
అహం కృత్స్న స్యజగతః ప్రభవః ప్రలయస్తదా ॥" శ్లో-6, అధ్య-7, భగవద్గీత
4. "సోభిధ్యాయ శరీరాత్స్వాత్ సిసృక్షుర్విధా ప్రజాః ।
అపయేవ ససర్జాదౌ తాను వీరమపాస్సృజత్ ॥" శ్లో-8, అధ్య-1, మనుస్మృతి
5. ".......... పృథివ్యప్సు ప్రలీయత ఆపస్తేజసి ప్రలీయంతే తేజో వాయౌ విలీయతే వాయురాకశే విలీయత, ఆకాశమింద్రియే ........ తమసి విలీయతే తమః పరౌదేవ ఏకీభవతి" శ్లో-2, ఖండ-2, సుబాలోపనిషత్తు
6. "యథా సోమ్యైకేన మృత్పిండేన, సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాదాచారమ్భణం వికారో నామధేయం మృత్తికే వసత్యమ్ యథా సోమ్యైకేన లోహమణినా సర్వమ్ లోహమయం విజ్ఞాతం స్యాద్యాచారమ్భణం వికారో నామధేయం లోహమిత్యేవ సత్యమ్" - మం॥శ్లో॥ 4, 5; ఖండ-1, ప్రపాఠకః-6, చాందోగ్యోపనిషత్తు.
7. "ఏషోణురాత్మా చేతసా వేదిత వ్యోయస్మిన్ .........."
మం॥,శ్లో॥ 9, ఖండ-1, ముండపి-3, ముండకోపనిషత్తు.
8. శ్లో॥ "విజ్ఞానాత్మా పురుషః సపరీఽక్షరీ ఆత్మని సంప్రతిష్ఠతే"
శ్లో-9, ప్రశ్న-4, ప్రశ్నోపనిషత్తు.
9. "ఏషహిద్రష్టా స్ప్రష్టా శ్రోతాఘ్రాతా రసయితా మన్తాబోద్ధా కర్త విజ్ఞానాత్మా"
శ్లో - 9, ప్రశ్న - 4, ప్రశ్నోపనిషత్తు.
10. "ఓం తదేతత్సత్యం యధా సుదీప్తాత్ పావకాద్విస్ఫులింగాః సహస్రశః ప్రభవంతే సరూపాః తథాక్షరాద్వివిధాః సోమ్య భావాః ప్రజాయంతే తత్రచైవాపి యన్తి" - మం-1, ఖం-1, ముండపి-2, ముండకోపనిషత్తు.
11. "ఏకస్తదా సర్వభూతాంత రాత్మా ....."
మం. శ్లో -9, వల్లి -5, అధ్యా-2, కఠోపనిషత్తు.

12. "హృదిహ్యేష ఆత్మా ......." శ్లో-6, ప్రశ్న-3, ప్రశ్నోపనిషత్తు.
13. "అత్రాయం పురుషః స్వయం జోతిర్భవతి" - శ్లో-6, ప్రశ్న-3, ప్రశ్నోపనిషత్తు.
14. "అన్తవన్త ఇమేదేహ నిత్యస్యోక్తా శరీరణః ।
అనాశినో ప్రమేయస్య తస్మాత్ యుధ్యస్య భారత ॥" శ్లో - 18, అధ్యా-2, భగవద్గీత.
15. "నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోన్త స్త్వనయోస్తత్త్వదర్శిభిః॥" శ్లో-16, అధ్యా-2, భగవద్గీత.
16. "వాలాగ్రశత భాగస్య శతధాకల్పితస్యచ ।
భాగోజీవ స్సవిజ్ఞేయ స్సచానంత్యాయ కల్పతే ॥" శ్లో-9, అధ్యా-5, శ్వేతాశ్వతరోపనిషత్తు.
17. "నత్వేవాహం జాతునాసం నత్వం నేమే జనాధిపాః ।
నచైవ న భవిష్యామః సర్వేవయమతః పరమ్॥" శ్లో-12, అధ్యా-2, భగవద్గీత.
18. "నిత్యోఽనిత్యానాం చేతనశ్చేత నానా మేకో బహునాం యో విదధాతి కామాన్ ......." మం-13, వల్లి-2, అధ్యా-2, కఠోపనిషత్
19. "నజాయతే మ్రియతే వా కదాచి న్నాయం భూత్వా భవితా వాన భూయః ।
అజోనిత్యః శాశ్వతోయం పురాణోన హన్యతే హన్యమానే శరీరే ॥"
శ్లో-20, అధ్యా-2, భగవద్గీత.
20. "అచ్ఛేద్యోయ మదాహ్యోయ మక్లేద్యోశోష్యఏవచ ।
నిత్యస్సర్వగతః స్థాణు రచలోయం సనాతనః ॥" శ్లో-24, అధ్యా-2, భగవద్గీత.
21. "అవ్యక్తోయ మచిన్త్యోయ ........." శ్లో-25, అధ్యా-2, భగవద్గీత.
22. "ప్రకృతి పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి" శ్లో-20, అధ్యా-13, భగవద్గీత.
23. "అనాదిత్వాన్నిర్గుణ త్వాత్పరమాత్మాయ మవ్యయః" శ్లో-32, అధ్యా-13, భగవద్గీత.
24. "మమ యో నిర్మ హద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।
సమ్భవ స్సర్వభూతానామ్ తతోభవతి భారత ॥" శ్లో-3, అధ్యా-14, భగవద్గీత.
25. "తస్మాదేతత్ బ్రహ్మనామరూప మన్నంచ జాయతే" శ్లో-9, ఖండ-1, ముండపి-1, ముండకోపనిషత్తు.
26. "సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సమ్భవాః ।
నిబధ్నన్తి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్ ॥" శ్లో-5, అధ్యా-14, భగవద్గీత.
27. "ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ విభావపి" శ్లో-20, అధ్యా-13, భగవద్గీత.

28. "మమ మాయా దురత్యయా" శ్లో-14, అధ్యా-7, భగవద్గీత.
29. "అక్షరాత్ పరతః పరః" మం-2, ఖండ-12, ముండపి-2, ముండకోపనిషత్తు.
30. "మహానవ్యక్తే విలీయతే అవ్యక్త మక్షరే విలీయతే అక్షరంతమసి విలీయతే తమః పరేదేవ ఏకీ భవతి" మం-2, ఖండ-2, సుబాలోపనిషత్తు.
31. పేజి-85, ఖండ-3, మం-2, ముండకోపనిషత్ వ్యాఖ్యానము.
వ్యాఖ్యాత - న.చ. రఘునాథాచార్యులు. శ్రీమత్ ఉభయవేదాంత ఆచార్యపీఠం ట్రస్టుచే (శ్రీరంగము) ప్రకటితము 1973.
32. "సర్వయోనిషు కౌంతేయ మూర్తయ సమ్భవన్తియాః" శ్లో-4, అధ్యా-14, భగవద్గీత.
33. మం-10, అధ్యా-4, శేతాశ్వతరోపనిషత్.
34. "భూమిరాపోనలో వాయుః ఖంమనోబుద్ధిరేవచ ।
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥" శ్లో-4, అధ్యా-7, భగవద్గీత.
35. "భోక్తా భోగ్యం ప్రేరితారంచ మత్వాసర్వం ప్రోక్త త్రివిధం బ్రహ్మమేతత్" మం,శ్లో-12, అధ్యా-1, శ్వేతాశ్వతరోపనిషత్.
36. "ఏకోహివై నారాయణ ఆపేత్ న బ్రహ్మనేశానో" శ్లో-1, అధ్యా-1, మహోపనిషత్.
37. మంత్రపుష్పము.
38. "అజ్ఞానన్యాదేవతా" శ్లో-1, అనువాకం-5, అధ్యా-1, శిక్షావల్లి తైత్తిరీయోపనిషత్తు.
39. "సోవామయత బహుస్యాం ప్రజాయేయేతి ........"
శ్లో-1, అనువాకం-6, అధ్యా-2, తైత్తిరీయోపనిషత్తు.
40. "అహం సర్వభూతేషు భూతాత్మ వస్థితః సదా" 3-29-21, శ్రీమద్భాగవతము.
41. "అహమాత్మా గుడాకేశా సర్వభూతాశయస్థితః ।
అహమాదిశ్చ మధ్యంచ భూతానామంత ఏవచ ॥" శ్లో-20, అధ్యా-10, భగవద్గీత.
42. "పురుషః సపరః పార్థభక్త్యా లభ్యస్త్వనన్యయా ।
యస్యాన్తః స్థానిభూతాని యేన సర్వమిదం తతమ్ ॥" శ్లో-22, అధ్యా-8, భగవద్గీత.
43. "........ సపర్యగాచ్ఛుక్రమకాయ మవ్రణ మస్నావిర ఓం శుద్ధ మపాప విద్ధమ్. కవిర్మనీషీ పరిభూః స్వయంభూర్యాథా తథ్య తోऽర్థాన్ వ్యదధా చ్ఛాశ్వతీభ్యః సమాభ్యః" మం.శ్లో.-8, ఈశావాస్యోపనిషత్తు.

44. "తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే ।
తదంతరస్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యత: ॥"
45. "ఏష సర్వేషు భూతేషు గూఢో<sup></sup>ఽత్మా" శ్లో-12, అధ్యా-1, వల్లి-3, కఠోపనిషత్తు.
46. "ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషొంతర్యామేష ।
యోని: సర్వస్య ప్రభవాప్య యౌహి భూతానామ్ ॥" మం.శ్లో.-5, ఈశావాస్యోపనిషత్తు.
47. "తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్" ముండపి-1, ఖండ-1, మం-7, ముండకోపనిషత్ వ్యాఖ్యానము. వ్యాఖ్యాత : న.చ. రఘునాథాచార్యులు.
48. "హ్యేష సర్వభూతాంతరాత్మా" మం-4, ఖం-1, ముండపి-2, ముండకోపనిషత్తు.
49. "పురుష ఏ వేదం విశ్వం కర్మతపో(బ్రహ్మ పరామృతమ్" శ్లో-10, ఖండ-1, ముండపి-2, ముండకోపనిషత్తు.
50. "సర్వస్యచాహం హృదిసన్నివిష్టో" శ్లో-15, అధ్యా-15, భగవద్గీత.
51. "యధోర్ణనాభి: సృజతే గృహ్ణతే చయధా పృధివ్యాయోషధయ: సంభవన్తి యధాసత: పురుషాత్కేశలోమాని తధాక్షరాత్సమ్భవతీహ విశ్వమ్" శ్లో-8, ఖండ-1, ముండపి-1, ముండకోపనిషత్తు.
52. "మత్త: పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రేమణి గాణాఇవ ॥" శ్లో-7, అధ్యా-7, భగవద్గీత.
53. "ప్రకృతిం స్వా మవష్టభ్య విస్సృజామి పున: పున: ।
భూతగ్రామ మిమం కృత్స్నమవశం ప్రకృతేమశాత్ ॥" శ్లో-8, అధ్యా-9, భగవద్గీత.
54. "అహం సర్వస్య ప్రభవో మత్త: సర్వం ప్రవర్తతే" శ్లో-8, అద్యా-10, భగవద్గీత.
55. "యచ్చాపి సర్వభూతానం భీజం తదహ మర్జున ।
న తదస్తి వినా యత్స్యా న్మయా భూతం చారాచరమ్ ॥". శ్లో-39, అధ్యా-10, భగవద్గీత.
56. పైదానివలెనే.
57. "సర్వస్య ప్రభు మీశాన గ్ం ......" శ్లో-17, అధ్యా-3, శ్వేతాశ్వతరోపనిషత్తు.
58. "యతోవా ఇమాని భూతాని జాయన్తే! యేన జాతాని జీవన్తి! యత్ప్రయన్త్యభిస విశన్తి ......" మం-1, అను-1, అధ్యా-3, తైత్తిరీయోపనిషత్తు.
59. "నతస్య కార్య కరణం చ విద్యతే నతత్స మశ్చాభ్య ధికశ్చ దృశ్యతే" శ్లో-18, అధ్యా-6, శ్వేతాశ్వతరోపనిషత్తు.

60. "అక్షరం బ్రహ్మ పరమం స్వభావో ధ్యాత్మ ముచ్యతే" శ్లో-3, అధ్యా-8, భగవద్గీత.

61. "యస్మాత్ క్షరమతీతోహ మక్షరాదపి చోత్తమః" శ్లో-18, అధ్యా-15, భగవద్గీత.

62. "సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ" అధ్యా-2, అను-1, తైత్తిరీయోపనిషత్తు.

63. "............ పరంజ్యోతిరూప సమ్పద్య" - 2 & "స ఉత్తమ పురుషః" - 3
మం. - 2,3 ఖండ-12, ప్రపాఠకః-8, ఛాందోగ్యపనిషత్తు.

64. "కవిం పురాణ మనుశాసితా రమణో రణీయాంస మనుస్మరేద్యః ।
సర్వస్య ధాతార మచిన్త్యరూప మాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥"
శ్లో-9, అధ్యా-8, భగవద్గీత.

65. "యో మా మజ మనాదించ వేత్తిలోక మహేశ్వరమ్" శ్లో-3, అధ్యా-10, భగవద్గీత.

66. "పరంబ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్ ।
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్ ॥" శ్లో-12, అధ్యా-10, భగవద్గీత.

67. "ఉపద్రష్టాను మన్తాచ భర్తా భోక్తా మహేశ్వరః
పరమత్మేతి చాప్యుక్తో దేహేస్మిన్ పురుషః పరః"

68. నతత్ర సూర్యోభూతి న చంద్ర తారకం నేమా విద్యుతోభాన్తి కుతోయమగ్నిః ।
తమేవ భాన్త మనుభూతి సర్వం తస్య భాసా సర్వమిదం విభూతి ॥"
మం-11, ఖండ-2, ముండపి-2, ముండకోపనిషత్తు.

69. "యదర్చి మద్యదణు భ్యోణుచ యస్మిన్లోకాని హితా లోకినశ్చ తదేత దక్షరం బ్రహ్మస ప్రాణస్తదు వాఙ్మనః తదేతత్సత్యం తదమృతం తద్వేద్దవ్యం సోమ్యవిద్ధిం"
మం -2, ఖండ-2, ముండపి-2, ముండకోపనిషత్తు.

70. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" మం-1, అనువాకం-6, అధ్యా-3, భృగువల్లి, తైత్తిరియోపనిషత్తు.

71. "అవ్యక్తోక్షర ఇత్యుక్తస్తమాహుః పరమాంగతిమ్ ।
యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥ శ్లో-21, అధ్యా-8, భగవద్గీత.

72. "చతుర్దశ భువనాత్మక ................ అనంత భోగినీ" - 4,
"శ్రీమద్వైకుంఠై .................... హాసీనమ్" - 5,
"ప్రత్యగ్రోన్మీలిత సరసీ .................. మనసన్దాయ" - 6
4,5,6 శ్లోకములు శ్రీవైకుంఠగద్య - రామానుజులు.

73. "హిరణ్మయే పరేకోశే విరజం బ్రహ్మ నిష్కలమ్ తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిం" మంత్రము - 10, ఖండ-2, ముండపి..2, ముండకోపనిషత్తు.

74. "జ్ఞాన బలైశ్వర్య వీర్యశక్తి తేజః" - 7, శరణాగతి గద్య.

75. "సౌశీల్య వాత్సల్య మార్దవార్దవ సౌహార్ద, సామ్యకారుణ్య మాధుర్య గాంభీర్యౌదార్య చాతుర్య స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ సత్యకామ సత్యసంకల్ప, కృతిత్వ, కృతజ్ఞత్వాద్య సంఖ్యేయ కళ్యాణగుణ గణౌఘ మహార్ణవ" -7, శరణాగతి గద్యమ్.

76. "నిఖిల జగదాధార, అఖిల జగత్స్వామిక" -4, శరణాగతిగద్య.

77. "తత్ర పరోనామ త్రిపాద్విభూతే ........ నారాయణః" పేజి-135, నవమోవతారః, యతీంద్రమతదీపిక. తెలుగు అనువాదము - శ్రీ భాష్యం వేంకట నర్సింహా భాష్యకారాచార్య.

78. "వ్యూహోనామ - ఏవమేవ ఉపాసనార్థం జగత్సృష్ట్యాద్యర్థంచ
వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధ భేదేన చతుర్ధావస్థితః"
పేజి-135, నవమోవతారః, యతీంద్రమతదీపిక.

79. "ఏవముక్త పంచావస్థాస్వపి శ్రీ విశిష్టఏవ భగవాన్వర్తత ఇతి శృత్యాది ప్రమాణ సిద్ధో౽ర్థః" - పేజి-140, నవమోవతారః, యతీంద్రమతదీపిక.

80. "సాపరానురక్తిరీశ్వరా" (సూ) - సూ॥2, శాండిల్యుడు.

81. "తత్సంస్థ స్యామృతత్వోపదేశాత్" (సూ) - శాండిల్యుని భక్తి సూత్రములు-3.

82. "తదేవ కర్మజ్ఞానియోగభవః ఆధిక్యశబ్దాత్..........." - శాండిల్యుని భక్తి సూత్రములు-22.

83. "తామైశ్వర్య పరాంకాశ్యపః పరత్వాత్ ......" - శాండిల్యుని భక్తి సూత్రములు-29.

84. "ఆత్మైక పరాం బాదరాయణః" - శాండిల్యుని భక్తి సూత్రములు-30.

85. "ప్రకృత్యాంత రాళాద వైకార్యం చిత్సత్త్వేనామ వర్తనాత్" (సూ) - శాండిల్యుని భక్తి సూత్రములు-37.

86. "లఘ్వపి భక్తాధికారే మహత్ క్షపకః" - శాండిల్యుని భక్తి సూత్రములు-76.

87. "శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్"
"ఇతి పుంసార్పితా విష్ణౌ భక్తిశ్చేన్నవలక్షణా" - 7-5-23-24 శ్రీమద్భాగవతమ్.

88. "అకించనో౽ నన్యగతిః శరణ్యః త్వత్పాదమూలం శరణం ప్రపద్యే"
- స్తోత్రరత్నములు, యామునాచార్యులు.

89. "తం పత్నీభిరనుగచ్ఛేమ దేవాః
పుత్రిః భ్రాతృభి రుతవాహిరణ్యైః
నాకం గృహ్ణానా సుకృతస్య లోకే
తృతీయేపృష్టే అధిరోచకేచ" - యజుర్వేదము 15-15, పేజి-47,
"రామానుజ కీర్తి కౌముది" - చలమచర్ల రంగాచార్యులు.

90. పేజి-59, ఆముక్తమాల్యద - తత్వావలోకము. సిద్ధాంతవ్యాము (అముద్రితము)
- డా॥ కె. వేంకటాచార్య.

91. "ప్రపత్తిం తపసామేకాం న్యాసాభ్యా మాహురుత్తమమ్
సన్న్యాస స్త్యాగ ఇత్యుక్తః శరణాగతి రిత్యపి" - పేజి-62, శ్రీవైష్ణవాచార్య నిర్ణయము.

92. "మాం హిపార్థ వ్యపాశ్రిత్య మేపిస్సుః పాపయోనయః
స్త్రియో వైశ్యా స్తథాశూద్రాస్తేపి యాన్తి పరాంగతిమ్" శ్లో-32, అధ్యా-9, భగవద్గీత.

93. "ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే" మంత్ర-18, అధ్యా-6, శ్వేతాశ్వతరోపనిషత్తు.

94. "బ్రహ్మణేత్వా మహ్సాసే ఓమిత్యాత్మానం యుంజీత"
పేజి-63, ఆముక్తమాల్యద-తత్త్వలోకము - డా॥ కె. వేంకటాచార్య.

95. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" - శ్లో-66, అధ్యా-18, భగవద్గీత.

96. పేజి-370, శ్రీవైష్ణవాచార నిర్ణయమ్.

97. మం., శ్లో. - 3, నారాయణోపనిషత్తు.

## అధ్యాయము - 4

# అన్నమయ్య కీర్తనలలో తత్త్వత్రయము

"దేహాత్మేశ వివేకో
త్సాహంబును లోక వేద ధర్మాధర్మా
ద్యూహా పోహంబులు, గల
యాహరి సంకీర్తనంబు లధ్యాత్మంబుల్".[1]

"దేహము, ఆత్మ, ఈశ్వరుడు అను మూడింటిని వివేచించే ఉత్సాహముగలవి, లోకవ్యవహారమునందు చెప్పబడిన ధర్మాధర్మాది చింతనము గలవియగు హరి సంకీర్తనములు ఆధ్మాత్మిక సంకీర్తనములు" అని సంకీర్తన లక్షణమున పేర్కొనబడినది.

అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనములను వివరించు సందర్భమున గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు "శరీర జీవాత్మ, పరమాత్మల చర్చయే ప్రధానముగా వేదాంతమునకు సంబంధించినది. తక్కిన లోకనింద మొదలైనవి తనకున్న విరక్తికి సూచకములగా, హేతువులుగా మాత్రమే ఉపయోగపడుచుండును. జన్మము, మరణము, జ్ఞానము ఇవన్నీ అన్నమయ్య కీర్తనలలో విపులముగా చర్చింపబడినవి. ఈ వేదాంత చర్చ అన్ని వేదాంతములకును సమమైనను, ముక్తి స్వరూపము, దానికి సంబంధించిన సాధన సంపత్తి మాత్రము ప్రతి మతమునందును భిన్న భిన్నముగా మారుచుండును. మతము లెన్నియో పుట్టినవి - పుట్టుచున్నవి. చచ్చినవి-చచ్చుచున్నవి. కాని స్మృతి శ్రుతి ప్రమాణములతో నిలిచిన మతములు ద్వైతాద్వైత విశిష్టాద్వైతములు మూడే. జీవాత్మ పరమాత్మలు శాశ్వతముగ వేరువేరని చెప్పినది ద్వైతము. జీవాత్మ పరమాత్మలకు దశాభేదమే గాని వస్తువు ఒక్కటే అనునది అద్వైతము. "జీవాత్మ-పరమాత్మలు ఒక్కటే అయినను వాటి సంబంధము శరీర-శరీరి భావముతో కూడినది. శరీరి ప్రధానము. శరీరమప్రధానము. శరీరము శరీరిని ఆశ్రయించి యుండునది అని చెప్పునది విశిష్టాద్వైతము. ఇదియే అన్నమయ్య మతము"[2] అని పేర్కొనిరి. ఇదే అభిప్రాయమును గంగప్పగారు కూడ ఇట్లు వివరించిరి. "రామానుజులు పరిపుష్ట మొనరించిన విశిష్టాద్వైత సిద్ధాంతమును మనసా వాచా కర్మణా త్రికరణశుద్ధిగా విశ్వసించి, తదుచిత రీతిని అన్నమాచార్యులు శాశ్వతుడైన భగవంతునిపై తన జీవితాన్నే కైంకర్యము జేసి తరించాడు"[3] అని.

ఈ విధంగా విమర్శకులు భావించిన అన్నమయ్య కీర్తనలలోని విశిష్టాద్వైత సిద్ధాంతము ఈ వ్యాసమున నిరూపించబడుచున్నది.

విశిష్టాద్వైత సిద్ధాంతమున చిత్-అచిత్-ఈశ్వర తత్త్వములు ప్రధానమైనవి. వీటికే తత్త్వత్రయము అని పేరు. అన్నమయ్య తత్త్వత్రయ తత్త్వమును అనేక కీర్తనలలో ఆవిష్కరించినాడు.

**ఓహో డేం డేం వొగి బ్రహ్మమిదియని**
**సాహసమున శ్రుతి చాటెడిని ॥పల్లవి॥**

**పరమును న పరము బ్రకృతియు ననగా**
**వెరవు దెలియుటే వివేకము**
**పరము దేవుడును అపరము జీవుడు**
**తిరమైన ప్రకృతియె దేహము ॥ఓహో॥**

**జ్ఞానము జ్ఞేయము జ్ఞాన గమ్యమును**
**పూని దెలియుటే యోగము**
**జ్ఞానము దేహాత్మ జ్ఞేయము పరమాత్మ**
**జ్ఞాన గమ్యమే సాధించు మనసు ॥ఓహో॥**

**క్షరము నక్షరమును సాక్షిపురుషుడని**
**పరవి దెలియుటే సాత్త్వికము**
**క్షరము ప్రపంచ మక్షరము కూటస్థుడు**
**సిరి పురుషోత్తముడే శ్రీవేంకటేశుడు ॥ఓహో॥ (1-396)**

అను ఈ కీర్తన యందు పల్లవిలో - బ్రహ్మమును శ్రుతి చాటినదని చెప్పుచూ అట్టి బ్రహ్మము యొక్క విశిష్ట స్వరూపమును తర్వాతి మూడు చరణముల యందు అన్నమయ్య వివరించినాడు.

మొదటి చరణమున పరము-అపరము-జీవులను గూర్చి పేర్కొనినాడు. పరాపరముల గూర్చి భగవద్గీత

"అపరేయ మితస్త్వన్యాం ప్రకృతిం విద్ధిమే పరామ్
జీవ భూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్"
(భగవద్గీత, అధ్యా-7, శ్లో-5)

తాత్స॥ "ఓ అర్జునా! ఇదియే (పంచభూతములు - బుద్ధ్యాదులతో కూడినది) నా యొక్క అపరా ప్రకృతి. దీనికంటె ఇతరమైనది, జీవభూతమైనది నా యొక్క పరాప్రకృతిగా నెరుంగుము. దీని చేతనే జగము ధరించబడుచున్నది" అని తెలిపినది.

ఈ శ్లోకమునకు వ్యాఖ్యానము చేయుచు భగవద్రామానుజులు "ఇదియే నా యొక్క అపరా ప్రకృతి. దీని కంటె ఇతరమైనది అనగా అచేతన రూపమై, చేతనభోగ్య భూతమైన ఈ అపరా ప్రకృతి కంటె వేరై విసజాతీయ కారణము జీవభూతమైనది పరాప్రకృతి. దీని యొక్క భోక్తృత్వ లక్షణము వలన ప్రధాన భూతమైనది. చేతన రూపమైన నా యొక్క ప్రకృతిగా దీనిని తెలుసుకొనుము. దీని చేతనే ఈ అచేతనమైన సర్వజగత్తు ధరింపబడుచున్నది."[4] అని తెలిపినారు. దీని వలన "అపరము" అనగా భౌతికమైన ప్రకృతి, అచేతనము, జీవులకు భోగ్య వస్తువు - అనియు, 'పరము' అనగా విసజాతీయ కారణము, జీవరూపము, చేతనమైన ప్రకృతి - యనియు, దీని చేతనే సర్వజగత్తు ధరింపబడుచున్నది, ఇవి రెండును భగవంతుని శక్తులే అనియు తెలియుచున్నది.

**"పరమును నపరము బ్రకృతియుననగా**
**వెరవు తెలియుటే వివేకము"**

- అని మొదటి పాదమున అన్నమయ్య "పరమును" భగవద్గీత చెప్పిన భగవంతుని యొక్క చేతన రూపమైన, జీవరూపమైన పరాప్రకృతిగా తెలిపినాడు.

తర్వాత "అపరము ప్రకృతియు" అని పంచభూతాత్మకమైనది, బుద్ధ్యాదులతో కూడినదియు అగు అపరా ప్రకృతిని పేర్కొనినాడు.

మూడవ పాదమునందు "పరముదేవుడును" అని పరాప్రకృతియను ఉన్నతమైన శక్తిగల భగవంతుని గూర్చి వర్ణించినాడు. తర్వాత "అపరము జీవుడు" అని అన్నమయ్య ప్రయోగించినాడు. గీతా వాక్యము ప్రకారము అపరమనగా భౌతిక ప్రకృతి. ఇచ్చట అన్నమయ్య జీవుని అపరముగా వర్ణించుట వలన అపార్థము కలుగుచున్నది. ఈ అపార్థమును తొలగించుటకు "అపరమును" రెండు రకములగా అన్వయించవచ్చును.

**మొదటివిధానము :**

"అపరము జీవుడు తిరమైన ప్రకృతియే దేహము" అను దానిని జీవునకు నెలవై దేహమైన ప్రకృతియే అపరము అని అన్వయము చేసికొనవచ్చును. ప్రకృతిని దేహరూపమైన దానిగా ఇచ్చుట అన్నమయ్య వర్ణించుట వలన భౌతికము, అహంకారాదులచే కూడినదైన అపరాప్రకృతి స్ఫురించుచున్నది. కనుక అన్నమయ్య వర్ణించిన అపరము ప్రకృతియే అనవచ్చును.

**రెండవ విధానము :**

**"పరము దేవుడు నపరము జీవుడు**
**తిరమైన ప్రకృతియే దేహము"**

అను దానియందు "పరముదేవుడు" అనుట వలన పరాత్పరుడైన పరమాత్మను గూర్చి చెప్పినాడని భావించవచ్చును. పరము కన్న భిన్నమైనది, పరము కానిది అపరము. పరమాత్మ - జీవులు భిన్నుల కనుక అన్నమయ్య పరమాత్మను 'పరముగా', పరమాత్మ కంటె భిన్నమైన జీవుని 'అపరముగా' వర్ణించినాడని చెప్పవచ్చును. ఇట్లు చెప్పుట వలన జీవేశ్వరుల భిన్న తత్త్వము వెల్లడియగుచున్నది.

పరమాత్మ కన్న భిన్నుడైన జీవునికి ప్రకృతియే దేహము అని చివరి పాదమున వర్ణించి, ఈశ్వరుడు-జీవుడు - ప్రకృతుల తత్త్వమును వివరించినాడు.

కీర్తనలోని రెండవ చరణమున అన్నమయ్య జ్ఞానమును, జ్ఞేయమును, జ్ఞాన గమ్యమును తెలుసుకొనుటయే యోగమని తెలిపినాడు. భగవద్గీత ఈ విషమయును గూర్చి

"జ్యోతిషామపి తజ్జ్యోతిస్తమసః పరముచ్యతే
జ్ఞానం జ్ఞేయం జ్ఞాన గమ్యం హృది సర్వస్య విష్టితం"
(భగవద్గీత అధ్యా-13, శ్లో-18)

తాత్ప॥ అతడే జ్ఞానము - జ్ఞాన విషయము, జ్ఞాన గమ్యమును ఆతడే. అందరి హృదయములలో ప్రతిష్ఠితుడై ఉన్నాడని" తెలిపినది.

ఇట్లు చెప్పబడిన జ్ఞాన జ్ఞేయ, జ్ఞాన గమ్యమైన పరమాత్మను తెలుసుకొనుట యోగమని తెలిపినాడు. చరణములోని రెండవ భాగమున,

**"జ్ఞానము దేహాత్మ జ్ఞేయము పరమాత్మ**
**జ్ఞాన గమ్యమే సాధించు మనసు"**

- అని వర్ణించినాడు. జీవాత్మ జ్ఞాన స్వరూపమున పరమాత్మతో సమానుడు. అందువలన అన్నమయ్య "జ్ఞానము దేహాత్మ"గా తెలిపినాడు. అట్టి జ్ఞాన స్వరూపుడైన జీవునిచే తెలుసుకొనబడిన జ్ఞేయము పరమాత్మగను, జ్ఞాన గమ్యము కూడ పరమాత్మయే కనుక, అట్టి పరమాత్మ హృదయ స్థితుడు గనుక దానిని సాధించునది మనసని చెప్పినాడు. ఈ విధముగా అన్నమయ్య ఈ చరణములో పరమాత్మ-జీవాత్మల లక్షణము తెలిపినాడు. మూడవ చరణమున,

**"క్షరము-నక్షరము సాక్షి పురుషుడని**
**సరవి తెలియుటే సాత్వికము**
**క్షరము ప్రపంచ మక్షరము కూటస్థుడు**
**సిరి పురుషోత్తముడే శ్రీ వేంకటేశుడు -"**

అని ఈ మొదటి భాగమున క్షరము-అక్షరమును సాక్షిగా పురుషుని - తెలుసు కొనవలెనని చెప్పినాడు.

క్షరాక్షరములను గూర్చి భగవద్గీత

"ద్వా విమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవచ ।
క్షరః సర్వాణి భూతాని - కూటస్థోఽక్షర ఉచ్యతే ॥

(భగవద్గీత, అధ్యా-15, శ్లో-16)

తాత్ప॥ "లోకమునందు క్షరాక్షరములని రెండు రకముల పురుషులు గలరు. సమస్తభూత ప్రాణి క్షరము. కూటస్థుడు అక్షరమనబడును" - అని తెలిపినది.

ఇట్లు తెలుపబడిన విషయమునకు అనుగుణముగనే అన్నమయ్య ఈ చరణము రెండవ భాగమునందు, "క్షరము ప్రపంచ మక్షరము కూటస్థుడు" అని భౌతికమైన ప్రకృతినశించునది కనుక అది క్షరమనియు, వికారములేని రూపము గలవాడైన కూటస్థుడు అనగా జీవుడు అక్షరమనియు తెలిపినాడు. ఇట్లు ప్రకృతిని జీవుని తెలిపి, చివరగా "సిరి పురుషోత్తముడె శ్రీ వేంకటేశుడు" అని అన్నమయ్య ఈశ్వరుని వర్ణించినాడు.

భగవద్గీత యందు పురుషోత్తమ తత్త్వమును గూర్చి,

"యస్మాత్ క్షరమతీతోహ మక్షరాదపిచోత్తమః
అతోస్మి లోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః"

(భగవద్గీత, అధ్యా-15, శ్లో-18)

తాత్ప॥ అందువల్ల క్షరము కంటె అతీతమైనవాడను. మరియు అక్షరము కంటె ఉత్తముడను. అందువలన లోకమునందు వేదమునందు పురుషోత్తమునిగా ప్రసిద్ధుడను" - అని చెప్పబడినది.

నశించునదైన ప్రపంచముకంటెను, నాశనము లేని కూటస్థునికంటెను వేరైనవాడు పురుషోత్తముడని అన్నమయ్య తత్త్వత్రయములోని పరమాత్మ ఆధిక్యమును స్పష్టీకరించెను.

ఇచ్చట అన్నమయ్య "సిరిపురుషోత్తముడే శ్రీవేంకటేశుడు" అని 'సిరి' పదము ద్వారా క్షరము కంటె అక్షరము కంటె శ్రేష్టమైన వాడనియు, పురుషోత్తముడు శ్రీ వేంకటేశుడనియు, వివరించినాడు. ఈ విధముగా అన్నమయ్య శ్రుతులలో చెప్పబడిన పరబ్రహ్మ వైశిష్ట్యమును వర్ణించినాడు.

**జీవ స్వరూపము చింతించి యంతటాను**
**దేవుని ప్రకృతి సంపద యిది యెరుగుటే**
**వేవేలు విధముల వేదాంత రహస్యము** (2-233)

అని జీవాత్మ తత్త్వమును, భగవంతుని విభుత్వమును, ప్రకృతి విభూతి లక్షణమును తెలుసుకొనుటయే వేదాంత రహస్యమని -

**తొల్లి నీవు గలవు తోడనే నేను గలను**
**యెల్లగా నీ ప్రపంచము యింతా గలదు** (2-518)

"తొల్లి నీవు" అని ఈశ్వరుని అనాదిత్వమును, "తోడనే నేను గలను" అని జీవుని అనాదిత్వమును, "యెల్లగా నీ ప్రపంచము యింతా గలదు" అని ప్రకృతి నిత్యత్వమును తెలుపుచు -

**వెలగి జగత్తులకు జీవులకు బ్రాణమై**
**నెలవై వుండే యాతనికి శరణు**
**తెలివై మఱపై దేహాలలో సూత్రమై**
**వలనై రక్షించే యట్టివానికి శరణు** (2-282)

అని జీవులకు - జగత్తులకు (ప్రకృతికిని) పరమాత్మ ప్రాణాధారామై నెలవైన వాడనియు, దేహములలో సూత్రమై రక్షించేవాడనియు, అన్నమయ్య జీవేశ్వర ప్రకృతుల విశిష్టమైన అద్వైతమును వివరించినాడు. ఇంకను

**చెనకి మాయకు మాయై జీవునికి జీవమై**
**మొనపి పూసల దారము వలెనున్నాడు (2-232) అనియు,**

**"యితనైన ప్రాణమవట యీ చరాచరములకు" (2-298) అనియు,**

**"అతని లోనే అణగెనన్నియును" (3-568) అనియు,**

**"యెట్టు దలచినా చిత్తా ఇత్తమై వున్నాడవు**
**వొట్టి ప్రకృతి పురుషులొగి నీ దేహములు" (3-524)**

అనియు, ప్రకృతి జీవులకు పరమాత్మతో గల ఐక్య సంబంధమును, దేహాత్మ సంబంధములను అన్నయ్య స్పష్టపరచినాడు.

ఉపనిషత్తులు ప్రతిపాదించిన చిత్-అచిత్-ఈశ్వర తత్త్వములను విడివిడిగా అన్నమయ్య అనేక కీర్తనలలో వర్ణించినాడు.

## అన్నమయ్య కీర్తనలలో చిత్ స్వరూపము :

దేహి నిత్యుడు దేహము లనిత్యాలు
యీ హల నా మనసా యిది మరువకు మీ ॥పల్లవి॥

గుదిబాత చీరమాని కొత్త చీర గట్టినట్లు
ముది మేను మాని దేహి మొగి కొత్తమేను మోచు
అదన జంపగ లేవు ఆయుధము లీతని
గదిపి అగ్నియు నీరు గాలియు చంపగలేవు ॥దేహి॥

ఈతడు నరకు వడ డీతడగ్ని గాలడు
యీతడు నీటమునుగడీతడు గాలిబోడు
చేతనుడై సర్వగతుండౌ చెలియించ దేమిటను
యీతల ననాది యీత డిరవు గదలడు ॥దేహి॥

చేరి కానరాని వాడు చింతించరానివాడు
భారపు వికారాల బాసిన వాడే యాత్మ
ఆరయ శ్రీ వేంకటేశు నాధీన మీతడని
సారము దెలియుటయే సత్యం జ్ఞానము ॥దేహి॥ (2-419)

ఈ కీర్తన పల్లవియందు ఆత్మ నిత్యత్వమును, దేహముల అశాశ్వతత్త్వమును పేర్కొనుచు, మొదటి చరణమున వస్త్రములను మార్చిన విధముగా, ఆత్మ దేహములను ధరించుననియు, ఆత్మను ఆయుధములు, అగ్ని, నీరు, గాలి చంపలేవనియు తెలిపినాడు. ఉపనిషత్తులు వింగడించిన జీవాత్మ యొక్క చేతనత్వమును, సర్వగమనత్వమును, అనాదిత్వమును రెండవ చరణమున ఉత్తరార్థముగ వర్ణించినాడు.

మూడవ చరణమున "కానరానివాడు" అని ఆత్మ యొక్క అవ్యక్తరూపమును, "చింతించరానివాడు" అని అచింత్యత్త్వమును, "భారపు వికారాలు బాసినవాడు" అని నిర్వికారత్వమును వర్ణించినాడు. "వాసాంసి జీర్ణాని ........", "నాను శోచితు మర్హసి ............"[5] అను గీతా శ్లోక భావములను ఈ కీర్తనయందు అన్నమయ్య అనుసరించి భగవద్గీతపై తనకు గల పరమ విశ్వాసమును ప్రకటించినాడు.

విశిష్టాద్వైతమున ఆత్మ పరమాత్మ కంటె భిన్నమైనది. ప్రత్యేక తత్త్వము. పరమాత్మతో కలసియుండునది. ఈ విషయమునే అన్నమయ్య

నిన్నూ నన్నూ నెంచుకొని నేరమిగాక
పన్నిన సూర్యుని కాంతి ప్రతి సూర్యుడౌనా ॥పల్లవి॥

జలధిలోపల మీను జలధి తానౌనా
జలము లాధారమైన జంతువు గాక
నెలవై నీలోని వాడ నీవే నేనౌదునా
పొలసి నీయ్యాధరువు బొమ్మనింతేగాక ॥నిన్ను॥

రాజు వద్దనున్న బంటు రాజే తానౌనా
రాజసపు చనవరి రచనే కాక
సాజమై నిన్ను గొలిచి సరిగద్దెమందునా
వోజతో నిన్ను సేవించి వుందు నింతేగాక ॥నిన్ను॥

ముత్తెపు చిప్పల నీరు మున్నీటివలె మండునా
ముత్తెములై బలిసి లో మొనవుగాక
నిత్తెపు శ్రీవేంకటేశ నీ శరణాగతులము
మొత్తపు లోకులమా ముక్తులము గాము ॥నిన్ను॥

అని సూర్యుని కాంతి మరియొక సూర్యుడెట్లు కాడో, అట్లే పరమాత్మ యందలి జీవుడు తానే పరమాత్మ కాడనియు, జలమును ఆధారముగా చేసుకొని జీవించు చేప తాను జలము కానట్లే పరమాత్మ యందలి జీవుడు పరమాత్మ కాడనియు, రాజభటుడు స్వయంగా తాను రాజు కానట్లు పరమాత్మను కొలిచే ఆత్మ పరమాత్మతో సమానముగాక సేవకుడనియు, నీరు ముత్యపు చిప్పలలోని ముత్యములై తిరిగి నీటివలె నుండనట్లుగా జీవాత్మ పరమాత్మతో సంబంధము కలిగియుండునని విశిష్టమైన భేదమును, జీవాత్మ యొక్క ప్రత్యేకత్వమును తెలిపినాడు. మరొకచోట,

**బెరసి జీవేశ్వరుల భేదము గలుగుటకు**
**సారి బ్రహ్మాదుల పూజలే సాక్షి** (3-287)

అని జీవేశ్వరుల భేదమునకు ప్రమాణమును చూపినాడు. ఇంకను జీవాత్మ యొక్క వివిధ లక్షణములను అనేక విధముల తన కీర్తనలయందు అన్నమయ్య వర్ణించినాడు.

## జీవాత్మ పంచేంద్రియముల కంటె వేరైనది :

**"వొక్కడినే జీవుడను వోహో హరీ**
**పెక్కు బహు రూపాలే పెంచి యాడితి**
**తక్కిన యింద్రియములే తగు మేళము"** (2-150)

అని ఒక్కడైన జీవుడు అనేక రూపములు పెంచుకొని (అనగా జన్మలెత్తి) ఆడెననియు (జీవించెననియు), ఇంద్రియములు మేళము (వాద్యముల) వలె జీవితమనెడి ఆటకు కారణములైనవని వర్ణించెను. ఈ వర్ణన ద్వారా ఇంద్రియముల కంటే జీవాత్మ వేరని స్పష్టమైనది. మరియు,

**ప్రపంచమధీనము పాలుబడ్డ దేహమిది**
**ప్రపంచముతోడి పాటు పరగీని**
**యెపుడు నీయాతుమ ఈశ్వరాధీనము.** (3-384)

అని జీవుని యొక్క దేహము ప్రకృతి ఆధీనములోనిది. కనుక పాంచభౌతికమైన దేహము గల జీవుడు ప్రభావితుడై ప్రపంచముతోపాటు భౌతిక గుణములు కలిగియుండుననియు, దేహములోని ఆత్మ మాత్రము ఎప్పుడును భగవంతుని అధీనమున ఉండుననుచు అన్నమయ్య "పాతకపు దేహమిది ప్రకృతి అధీనము" (3-53) అని దేహమె ప్రకృతి అధీనమని తెలిపి, జీవాత్మ పంచేంద్రియముల కంటె వేరైనది అని స్పష్టపరచినాడు.

## జీవాత్మ నిత్యమైనది :

పుట్టును పొదలును భువి బహురూపుల
పుట్టేటి యాతడు పొరినొకడే
వొట్టుక ఈదును వుభయ కర్మములు
చట్టెడు సంసార సాగరములను (2-118)

అని ఒక్కడే అయిన జీవుడు పాపపుణ్యములనెడి ఉభయ కర్మముల యొక్క ఫలితముగా అనేక జన్మములు పొందుచు, సంసార సాగరము నందీదుచున్నాడనుచు "ఒక" అను ప్రయోగము ద్వారా ఆత్మ నిత్యత్వమును తెలుపుచు,

"జీవుడు నిత్యుడేమిటా జెరుపగ రానివాడు
ఈ వివేకము దెలిసి యే జాతి వారైనా" (2-421)

అనియు, జీవాత్మ నిత్యత్వమును అన్నమయ్య నిరూపించినాడు.

## జీవాత్మ అణుత్వము :

"తలచును బ్రహ్మాండ తతులకు నవ్వల
తలచేటి జీవుడు తానణువు" (2-118) అనియు,

"యిన్ని చింతలు మరచి యింద్రియాల గుదియించి
పన్నివుండిన హృదయ పద్మమందును
యెన్నవంగుష్టమాత్రపు టీశ్వరు పాదాల క్రింద
దన్ను అణుమాత్రముగ దలచగ వలెను" (2-198)

అనియు బొటనవేలి పరిమాణముగల పరమాత్మ, శరీరమునందు హృదయ మధ్యమున ఉండునను కఠోపనిషదుక్తిని తెలియపరుచుచు, అన్నమయ్య అట్టి పరమాత్మ పాదముల క్రింద జీవుని అణుమాత్రముగా దలచవలెననుచు,

"ఆవల బ్రహ్మాండాలకన్నిటా బొడవు నీవు
భావించ నేనణువై పరగేటి వాడను" (3-173) అనియు

"అతి సూక్ష్మమీ యాత్మ అందులో హరియున్నాడు" (3-217) అనియు,

"కాలమెంతైనా గద్దు కర్మములు వేవేలు
ఆలించ నందులో నేనణుమాత్రము" (3-337) అనియు,

"అణుమాత్రపు దేహినంతే నేను
మణిగెద లేచెద మందరగావను" (3-347)

అనియు జీవాత్మ అణుస్వరూపమని ప్రకటించినాడు.

**జీవాత్మ జ్ఞానవంతము - విభుత్వ :**

"జీవుడణువు - జ్ఞానము చింతించగా విభువు
యీ విధము నానా జీవులివె నీయందె" (3-524) అనియు,

"వెలుపలి వెలుగే చూడగ లోపలి వెడచీకటి గావని యట్లు
అలరి ప్రపంచజ్ఞానికి దనలో నాత్మ జ్ఞానము కానరాదు" (2-137)

అని ఇందు 'ప్రపంచజ్ఞానికి' అనగా లోక జ్ఞానము కలిగినవానికి, 'ఆత్మజ్ఞానము' అనగా జ్ఞాన స్వరూపమయిన ఆత్మ కనబడుటలేదు అనుచు ఆత్మ-జ్ఞాన స్వరూపమని తెలియజేసినాడు.

**జీవాత్మ ఆనందమయత్వము :**

"హీన జంతువైనవాడు యేమగై పుట్టిన వాడు
ఆనంద మొక్కటే అంగాలు వేరు" (3-84)

అని జీవాత్మ ఆనందమయమైనదని అన్నమయ్య తెలిపినాడు.

**జీవాత్మ అనాదిత్వము :**

"ఆతుమ తొల్లిటిదే అంతరాత్మ తొల్లిటిదే
నీతితో యీ దేహములే నిత్యకొత్తలు" (3-104)

అని జీవాత్మ అనాదిత్వమును "తొల్లిటిదే" అను పదము ద్వారా అన్నమయ్య ప్రకటించినాడు.

**జీవాత్మ సత్యత్వము :**

"వయమై శ్రీవేంకటనాథు కరుణచేత
జయమై తామున్న చోటె సతమాయెనాత్మ" (3-386)

అని ఇందు "సతమాయె" అను ప్రయోగము ద్వారా (సతము+ఆయె) జీవాత్మ సత్యత్వము చాటినాడు.

### జీవాత్మ నిర్మలత్వము - నిర్దోషిత్వము :

"ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
నీతల హరి విజ్ఞానపు దాస్యంబిది యొక్కటె పోసుజాతి" (2-383)

అని జీవాత్మ పరిశుద్ధము, నిర్దోషమని స్పష్టపరచినాడు అన్నమయ్య.

### జీవాత్మ పరమాత్మకు శరీరము :

"నిలిచి శ్రీవేంకటేశ నీవె నా యెదలో నుండి
మలసి పెరరేపుచు మన్నించేవుగాక" (2-38)

అనెడి కీర్తనలో "నాయెదలో" అనగా జీవుని యెదలోనని అర్థము. జీవుని యెదలో పరమాత్మయుండుట అనగా పరమాత్మకు జీవుడు శరీరమే కదా! ఈ విషయమునే మరొక కీర్తనలో **"శ్రీవేంకటేశ జీవుడనే మేదలోన - అంతర్యామి నీవు"** (2-274), అని స్పష్టముగా పేర్కొన్నాడు. మరొక కీర్తనలో **"అంతర్యామివి నీవు అంగ మాత్రమె నేము"** (2-514) అని అంగాంగి భావ సంబంధమును కూడా ప్రకటించినాడు.

### జీవాత్మ ప్రకృతికి శరీరి :

"పంచ భూతాలివియె పరగ జీవుల కెల్లా
దించరాక యెప్పుడును దేహాలయ్యేవి" (2-199) అనియు,

జీవుడింతటా సృష్టికి మూలము
భావము ప్రకృతికి ప్రపంచము
చేవగ రెంటికి శ్రీవేంకటేశ్వర
నీవంతరాత్మవు నెమకగ నేలా" (2-147)

అనియు ప్రకృతికి ఆత్మయైన జీవాత్మ తత్త్వమును పేర్కొనెను.

### జీవాత్మకు పరమాత్మ నియామకుడు :

"పుట్టించిన వాడవు నీవు పుట్టిన వాడను నేను
పట్టి .................. కర్మమేల" (2-36) అనియు,

వేనవగా నెంతవాడ నెయ్యపు జముల లోన
యీ నెపాన రక్షించి నీశ్వరుదేకాక ॥పల్లవి॥

యెవ్వరు బుద్ధి చెప్పిరి యిలపై జీవుల కెల్లా
నెవ్వగ బుట్టల గొల్చు నించు కొమ్మని
అవ్వల సంసార భ్రాంతి అనాదినుండియు లోలో
దవ్వించి తలకెత్తె అంతర్యామి కాక ॥వేనవగా॥

చెట్టు కెవ్వరు బుద్ధి చెప్పేరు తతికాలాన
బుట్టి కాచి పూచి నిండా బొదలుమని
గుట్టుతో చైతన్యమై గుణము లన్నిటికిని
తట్టపెట్టి రచించిన దేవుడింతేగాక ॥వేనవగా॥

బుద్ధులెవ్వరొ చెప్పిరి పుట్టినట్టి మెకాలకు
తిద్దిచన్ను దాగి పూరి దిమమని
పొద్దువొద్దులోన మండి భోగములు మరపిన
నిద్దవు శ్రీవేంకటాద్రి నిలయుండేగాక ॥వేనవగా॥ (2-45)

అని పరమాత్మ జీవాత్మకు నియామకుడనియు, అన్నమయ్య తెలిపినాడు.

## జీవాత్మ ఆధేయత్వము :

"దిక్కు దెసలై నాకు దేవుడవై యేలికవు
చొక్కి నామనసింత సోదించ వలెనా" (2-59) అనియు

"అనంత బ్రహ్మాండముల కట్టె నీ రూపములకు
వెనుక ముందున్నదా నీవే యాధారము గాక" (2-194)

అనియు, జీవునికి "దిక్కు, ఆధారము" పరమాత్మయే అని అన్నమయ్య జీవాత్మ యొక్క ఆధేయత్వమును ప్రకటించినాడు. ఒక జీవాత్మకేగాక అనంత బ్రహ్మాండములకు, ఆ దైవమే ఆధారమని కూడా తెలిపినాడు.

## జీవాత్మ విధేయత్వము :

"వనిచి సిరుల లక్ష్మీనాథుడైన వాని
పనుల వారము మేము బ్రతికేముగాని" (2-30)

అని పరమాత్మ యెడ జీవాత్మకుగల విధేయత్వము "పనులవారము" అను ప్రయోగము ద్వారా ప్రకటించినాడు.

## జీవాత్మ-పరమాత్మల కార్యకారణ సంబంధము :

"కారణమాతడు దాకార్యమాత్రమింతె
ఘారుడై రెంటా జొరక చూచుటే సుఖము" (3-132)

అని జీవాత్మ సృష్టికి పరమాత్మ కారణతత్త్వమని స్పష్టము చేసెను.

## జీవాత్మ పరాధీనత :

"చేత నాత్మకుడట శ్రీవేంకటేశ్వరుడు
జాతి లేని జీవునికి స్వతంత్రమేది" (2-72) అనియు,

"నేరచి నడచేనంటే నేగాను స్వతంత్రుడను" (2-171) అనియు,

"రానివి రప్పించగ నేరను వచ్చేవాపనేర
తానకపు నా స్వతంత్ర మెందాకా వచ్చును
అనుకున్నది ముదిమి అట్టె జారె శాంతము
నేనెంత విఱ్ఱవీగినా నిండేదేమి" (2-176) అనియు,

"దైవమా నీ పెరరేపణలివి తప్పక వున్నవి జీవులకు
భావించి కాదని దొబ్బిదీ కొనగ బ్రహ్మాదులకైనను వసమా" (2-190) అనియు,

"చేయుటకు చేయక మానుటకు జీవుడు స్వతంత్రుడా యంటెను
కాయపు సుఖములు గోరక గర్తట కడగనుటకు గర్త కాడా
యీ యెడ నాయెడ నంతర్యామే యిన్నిటికి ప్రేరకుడింతే
దాయక పాయక తన తలపు కొలది దైవమె సృజియించీ' (2-384)

అనియు పై కీర్తనలలో "స్వతంత్రమేది"యని, "గాను స్వతంత్రుడను" అని, "నా స్వతంత్రమెందాకా వచ్చును" అని, జీవుని పరాధీనతను స్పష్టముగా ప్రకటించినాడు. పైనుదహరించిన కీర్తనలలో "నీ పెరరేపణలివి తప్పకవున్నవి" అని అనుటవలన నీ ప్రేరేపణలు జీవులకు తప్పక లభించునుగాని, వారు నిను "భావించి కాదని దొబ్బి (త్రోసి) దీకొనగ (ఎదిరించగ) బ్రహ్మాదులకైనను వశమా'' అనుచు జీవుల అస్వతంత్రతను, పరాధీనతను వెల్లడించినాడనవచ్చును.

## జీవాత్మ కర్తృత్వ పారతంత్ర్యము :

"ఏది వలె నీవది సేయు యందులోననో జీవాత్మ
పొదగు మనలో నంతరాత్మయై పరగిన శ్రీహరి పనుపునను" (2-128)

అనియు,

**"శ్రీహరి పనుపున ఓ జీవాత్మ ఏది వలె నీవది సేయుము"**

అనియు జీవాత్మ పారతంత్ర్యము తెలిపినాడు. మరియు,

**"మేవల వరుడు లేక యెద్దే తాదున్నునా?**
**నీవు సేయించక వేరే నే బుణ్యాము సేసేనా" (2-130)**

అని లౌకికోదాహరణముతో జీవుని అస్వాతంత్ర్యము ప్రకటించెను.

## జీవాత్మ గమ్యము :

**"దైవము తోడిదే తన తగులు**
**జీవుడిది యెరిగితే చిక్కు నీదు తగులు" (2-204)**

అని దైవము తోడిదే శాశ్వత సంబంధమని(తగులు)యు,

**"పరమాత్మ పై నాత్మ ప్రవేశింప జేయుటే**
**పరికింప పరకాయ ప్రవేశము" (2-258)**

అని ప్రకృతి సంబంధముతో నున్న జీవాత్మ జ్ఞానియై పరమాత్మను ప్రవేశించుటయే గమ్యమని, "పరకాయ ప్రవేశము'' అను ప్రయోగము ద్వారా సూచించినాడు.

ఈ విధముగా అన్నమయ్య జీవతత్త్వము యొక్క వివిధ లక్షణములను తన కీర్తనలయందు వర్ణించినాడు.

## జీవాత్మ భేదములు :

బద్ధులు, ముక్తులు, నిత్యులు అని జీవులు మూడు విధములు. సంసారమున నుండెడి వారు బద్ధులు. భక్తి ప్రపుత్తులను గ్రహించి, నిత్యనైమిత్తికములైన నిష్కామ కర్మములను భగవదాజ్ఞా కైంకర్యములుగా ఆచరించుచూ, భగవద్భాగవతాపచారములు చేయక, పరమాత్మయందు మనస్సు విశ్రమింపజేసి, ఆతని అనుగ్రహము వలన పునర్జన్మ లేని బ్రహ్మ సాయుజ్యమును పొందిన వారు ముక్తులు. ఎప్పుడు ప్రకృతి యొక్క సంసర్గమే లేక పరబ్రహ్మ సాయుజ్యము నందుండు వారు నిత్యులు. ఇట్టి బద్ధ, ముక్త, నిత్య జీవుల లక్షణములను అన్నమయ్య అనేక కీర్తనలయందు వర్ణించినాడు. అన్నమయ్య వర్ణించిన

## బద్ధజీవుల లక్షణములు :

"అన్నిటికి మూలమని హరినెంచరు
పన్నిన మాయలో వారు బయలు వాకేరు ॥పల్లవి॥

ప్రకృతి బోనుల లోపల జిక్కి జీవులు
అకట చక్కని వారమనుకునేరు
సకలపుణ్య పాపాల సంధి జన్మముల వారు
వెకలి సంసారాలకె వేడుక పడేరు ॥అన్ని॥

కాముని యేట్ల దగగారేటి దేహులు
దోమటి తమ బతుకే దొడ్డ దనేరు
పామిడి కోరికలకు బంట్లైన వారలు
గామిడి తనాల దామే కర్తల మనేరు ॥అన్ని॥

యితర లోకాలనెడి ఏతపు మెట్ల ప్రాణులు
కతల మోక్ష మార్గము గంటి మనేరు
తతి నలమేల్మంగ పతి శ్రీవేంకటేశ్వర
మతకాన మన్నవారు మారు మలసేరు" ॥అన్ని॥ (2-261)

అని అన్నమయ్య ఈ కీర్తన యందు బద్ధజీవుల సంపూర్ణ లక్షణమును తెలిపినాడు. సర్వ సృష్టికి మూలకారణునిగా పరమాత్మను భావించక ఆతనిచే కల్పింపబడిన ప్రకృతి నుండి బయట పడుటకై జీవులు చేయు స్వప్రయత్నమును "పన్నిన మాయలో వారు బయలు వాకేరు" అని పల్లవిలో వర్ణించి చెప్పినాడు.

"భౌతిక ప్రకృతి సత్త్వరజస్తమో గుణములనెడి మూడింటితో కూడి యుండును. నిత్యుడైన జీవునికి ప్రకృతితో సంసర్గము కలిగినపుడు అతడా గుణములచే బద్ధుడగును"[6] అని భగవద్గీతయందు చెప్పబడినట్లుగా అన్నమయ్య మొదటి చరణమున "ప్రకృతి బోనుల లోపల" అను ప్రయోగము ద్వారా త్రిగుణాత్మక మైన ప్రకృతి యందు చిక్కిన జీవులను గూర్చి తెలిపి, "అక్కట చక్కని వారమనుకునేరు" అని అట్లు జీవించుటయే సుఖమని భావించెడి బద్ధజీవుల లక్షణమును తెలిపినాడు.

"వారి వారి కర్మములే వారి వారి జన్మములకు ప్రధాన కారణములు"[7] అని విష్ణుపురాణము తెల్పినట్లుగా "సకల పుణ్యాపాపాల సంధి జన్మముల వారు - వెకలి

సంసారాలకె వేడుక పడేరు" - అని జీవులు పుణ్య పాపరూపములైన కర్మముల ననుసరించుచు వాటి ద్వారా అనేక జన్మములు పొందు వారనియు, అట్టి జన్మముల నొంది మూఢులై సంసార సుఖములకే సంతోష పడెదరనియు, తెలిపినాడు. రెండవ చరణములోని మొదటి పాదమునందు "కాముని యేట్ల దిగగారేటి దేహులు" అని కోరికలు అనెడి ఏరుల యందు జీవులు మునిగిపోయినారని (దిగగారేటి) తెలుపుచు, "దోమటి తమ బతుకే దొడ్డ దనేరు" అని అన్నముతో సుఖించే జీవితమునే గొప్ప దానినిగా భావించెదరని రెండవ పాదమున తెలిపినాడు. "రజోగుణము అపరిమిత ములైన కోరికల వలనను, కాంక్షల వలననూ, పుట్టును. దీని కారణముచే బద్ధ జీవుడు కామ్య కర్మలచే బద్ధుడగును"[8] అని గీత పేర్కొనినట్లుగా "పామిడి కోరికలకు బంట్లైన వారలు" అని అనేకములైన కోరికలను పెంచుకొని వాటికి బద్ధులైన జీవులను గూర్చి తెలుపుచు, 'మమ'-'నమమ' అను ఈ రెండు పదము బంధమునకు మోక్షమునకు కారణములై యున్నవి, "మమ" అనుకొని జీవుడు బద్ధుడగును[9] అని మహోపనిషత్తు పేర్కొనినట్లుగా "గామిడి తనాల తామే కర్తల మనేరు" అని గొప్పనైన పనులకు జీవులు తామే కర్తలుగా భావించెడి లక్షణమును వర్ణించినాడు.

"భౌతిక ప్రపంచమునందలి అత్యున్నత లోకము నుండి అత్యధమ లోకము వరకును అన్నియును దుఃఖమయములైన ప్రదేశములే. అచ్చట జనన-మరణములు మరల మరల కలుగుచుండును"[10] అని భగవద్గీత జీవులకు స్వర్గనరకాది లోకగమనము పునర్జన్మ హేతువని తెలిపినది - ఈ విషయమునే అన్నమయ్య "యితర లోకాలనెడి యేతపు మెట్ల ప్రాణులు" అని బద్ధ జీవులుపొందు స్వర్గ నరకాదులను స్ఫురింప జేసినాడు. మోటబావిలోని నీటిని పైకి తోడెడి యేతము ఏవిధముగా చక్రమువలె తిరుగుచు నీటిని మోయునో అట్లే యేతపు మెట్ల వంటి జీవులు తమ తమ కర్మ ఫలములను మోయుచు, నిమ్నోన్నత గమనములతో సంసార చక్రమున పరిభ్రమించు చున్నారని "యేతపు మెట్లు ప్రాణులు" అని బద్ధ జీవులను వర్ణించినాడు. చివరగా,

**"తతివలమేల్మంగ పతి శ్రీవేంకటేశ్వర**
**మతకాన మున్నవారు మారు మలసేరు"**

అని ఈ జీవ సమూహమంతయు అలమేలు మంగపతి శ్రీ వేంకటేశ్వరుని మాయ వలననే బద్ధులై సంసారమున పరిభ్రమించుచున్నారని అన్నమయ్య స్పష్టము చేసినాడు.

ఈ విధముగా అన్నమయ్య ఈ కీర్తనయందు ప్రకృతి ప్రభావమున చిక్కి కర్మానుభవమును అనుభవించుచూ, కోరికలు జయించలేక సంసార జీవితమే సుఖమనుచు, కేవలము స్వర్గాది లోకగమనమే మోక్షమనుకునే బద్ధ జీవుల లక్షణమును వర్ణించినాడు.

దేవ-మనుష్య-తిర్యక్ - స్థావరములనెడి బద్ధ జీవుల భేదములు అన్నమయ్య కీర్తనలయందు అన్వయించిన తీరు -

**దేవయోనులు :**

బ్రహ్మ ఇంద్రాది దేవతలు దేవయోనులనబడెదరు.

**"సురలును జీవులే వసురులును జీవులే**
**ధరనిందు ప్రకృతి భేదమేగాని**
**సురులకు స్వర్గ మసురులకు నరకము**
**పరగ నీ రెంటికి గతి పాపపుణ్యములే"** (2-78)

అని సురాసురులందరు, బ్రహ్మాది స్తంబ పర్యంతం గల వన్నియు జీవులే అని తెలుపుచు, "ధరనిందు ప్రకృతి భేదమేగాని" అని ప్రకృతి గుణములైన సత్త్వరజస్తమో గుణముల వలన కలిగిన భేదమేసుర, అసుర, జనమ కారణములనియు, ఇట్లు గుణ కర్మ విభాగము వల్ల జన్మలు పొందిన సరాసురలకు వారివారి పుణ్య పాపకర్మల ఫలముగా స్వర్గనరకాదులు లభించుననియు, వర్ణించి దేవయోనుల లక్షణము వివరించినాడు.

**మనుష్య యోనులు :**

ప్రకృతి ప్రభావమున బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాది కులములందు జన్మించిన వారు మనుష్య యోనులు.

**"హరినామములనె సంధ్యాది విదులొనరించు**
**పరిపూర్ణ మతులువో బ్రాహ్మలు"** (1-365)

అని కేశవాది నామములతో సంధ్యావందనాదుల నాచరించు బ్రాహ్మణులను గూర్చియు,

**"విరసపు కంసుగతి వినదా దుర్యోధనుడు**
**పరుగ తానూ బగై నమసినాడు"** (2-308)

అని ఇందు ఆ దుర్యోధనుడు అని క్షత్రియ కులము నందు జన్మించిన జీవుని గూర్చియు

**"మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే**
**చండాలుడుండేటి సరిభూమి యొకటే" (2-385)**

అని ఛండాలుని పేర శూద్రకులము నందు జన్మించిన వానిని గూర్చి,

**"నీడనుండి చీరలమ్మే నేత బేహారి" (5-105)**

అని "బేహారి" అను పదము ద్వారా వ్యాపార లక్షణముగల వైశ్యకులజుని గూర్చియు వర్ణించి, చాతుర్వర్ణ్యముల యందు జన్మించిన మనుష్యయోనుల గూర్చి తెలిపినాడు.

**తిర్యక్ యోనులు** : పశుపక్ష్యాదులు.

**"కాననా నా వంటి వారే కారా ఈ జంతువులు**
**నానా యోనుల బుట్టి నడచే వారు" (3-39)**

అని కనిపించే జంతువులన్నియు తనవంటి జీవులే అనియు అట్టి జీవులన్నియు నానా యోనుల యందు జన్మములను పొందినవనియు,

**"మనవంటి జీవులే మహిలో నొకకొన్ని**
**శునకములై కుక్కుటములై సూకరములైనవి" (2-128)**

అనియు మానవుల దేహముల యందున్న జీవాత్మ వంటి జీవాత్మలన్నియు శునకాది జన్మ రూపములను పొందినవనియు తిర్యక్యోనుల లక్షణమును అన్నమయ్య వర్ణించినాడు.

**స్థావరములు** : కొండలు చెట్లు మొదలగునవి.

**"వేప మానికిని చేదు విడువక వుండేది**
**యే పొద్దు సహజమే యెంతైనాను" (8-71)**

అని పాప పుణ్యముల లంపటములో తిరిగే వాడు దుర్గుణుడుగా నుండుట సహజమను విషయమును చెప్పుచు స్థావర జీవియగు వేపచెట్టును గూర్చియు,

**"యిహ వైకుంఠము యీ శేషగిరి**
**మహి నీ దర్శనము మాత్రమిది" (2-446)**

అని ఈ లోకమున వెలసిన వైకుంఠముగా శేషగిరిని వర్ణించి స్థావర జీవలక్షణమును తెలిపినాడు. ఇట్టి బ్రహ్మాది బద్ధ జీవులు, శాస్త్ర వశ్యులు, తదవశ్యులు అని రెండు రకములు[11]. ఇంద్రియాధీన జ్ఞాన బద్ధులు శాస్త్రవశ్యులు. వీరు మరల బుభుక్షువులు, ముముక్షువులు అని రెండు రకములు.

**బుభుక్షువులు :**

ధర్మార్థకామములనబడు పురుషార్థములు మూడింటియందు ఆసక్తికలవారు.

**"తగబసిడి చూచి నే ధర్మము మరచే వాడ**
**జగతి విజ్ఞానము పరవెరిగేనా**

**..........................................**

**వలచి పతులనేటి వలల బడెడి వాడ**
**మలసి తప్పించుక నీ మాయ దాటెనా"** (3-108)

అని "తగబసిడిచూచి" అని అర్థము నందాసక్తిని, "నే ధర్మము మరచేవాడ" అని బుభుక్షువు ఆచరించవలసిన ధర్మమును పసిడి జూచి మరచితి ననియు, "వలచి సతునేటి వలల బడెడివాడ" అని కామాసక్తిని వివరించినాడు.

బుభుక్షువులు మరల అర్థకామపరులు, ధర్మపరులు, దేవతాంతర పరులు, భగవత్పరులు అని నాలుగు విధములు.

**అర్థకామ పరులు :**

దేహాత్మాభిమానము గలవారు.

**"తతి బంచేంద్రియముల ధనవంతుడ నేను**
**వెతకి నా వంటి వాని విడువగ జెల్లునా"** (3-48)

అని పంచేంద్రియములతో కూడిన దేహమును ధనముగా భావించి, ఆ దేహమునందు అభిమానము ప్రకటించుచూ "వెతకి నా వంటివాని" అని పంచేంద్రియ ధనముతో కూడినట్టి తనను విడుచుట చెల్లదని తెలుపుచు, దేహాభిమానముగల జీవుని లక్షణమును వెల్లడించినాడు.

**ధర్మపరులు :**

యజ్ఞ, యాగాదులయందాసక్తిగలవారు.

**"కోరి తపములు చేసి గుణియా తానొక వేళ**
**వూరికే అలసి వుండు నొక్కవేళ"** (2-97)

అని యజ్ఞయాగాదులలోనిదైన తపస్సునందు ఆసిక్తిగల ధర్మపరులను గూర్చి వివరించినాడు.

**దేవతాంతరపరులు :**

ఇతర దేవతలను పూజించువారు.

**"అపరిమిత దేవతాంతర భజనలు ఆయాలోక ప్రాప్తులు**
**వుపవాసాది నియమ వ్రతములు తపో నిష్టకు కారణంబులు" (2-328)**

అని ఇతర దేవతల నారాధించి ఆయా లోకముల పొందెదరని, దేవతాంతర పరులను గూర్చి తెలిపినాడు.

**భగవత్పరులు :**

దేవతాంతరము నొల్లనివారు.

**"శ్రీవేంకటేశ్వర నీసేవే ధ్రువపదము**
**దేవతాంతర మెల్లా దిగ్గుడుకు దిగ్గుడు" (3-201)**

అని శ్రీవేంకటేశ్వర సేవవలననే శాశ్వత పదము లభించుననియు, ఇతర దేవతల వలన కలిగిన ఫలమంతయు "దిగ్గుడుకుదిగ్గు" (అత్యల్పము) అని చెప్పుచు దేవతాంతరము నిష్టపడని భగవత్పరుని లక్షణము వెల్లడించినాడు.

ఈ భగవత్పరులలో ఆర్తులు-అర్థార్థులు, జిజ్ఞాసులు, జ్ఞానులు అను బేధములు గలవు. ఈ భేదములను గూర్చి భగవద్గీత - "ఆపదలోనున్నవాడు, సంపదకోరువాడు, జ్ఞానమును వాంఛించువాడు, పరమాత్మ జ్ఞానము నన్వేషించువాడు అను నాలుగు రకములైన పుణ్యాత్ములు నన్ను భుజించెదరు"[12] అని తెలిపినది.

**ఆర్తుడు :**

**"ఆర్తుడను నేను నీ కడ్డ మెవ్వరును లేరు**
**మూర్తి త్రయాత్మక మొగి కరుణించవే" (2-382)**

అని, ఎదురులేనివాడును, త్రిమూర్త స్వరూపుడైన పరమాత్మను కరుణించమని ప్రార్థించెడి ఆర్తుని గూర్చి అన్నమయ్య తెలిపినాడు.

**అర్థార్థి :**

నూతనుగా ఐశ్వర్యమురు కోరువాడు.

**"ఇచ్చలో గోరేవెల్లా ఇచ్చే ధనము**
**అచ్చుత నామమెపో అధికపు ధనము" (3-27)**

అని ఇష్టమైన కోరికలను తీర్చువాడు అచ్యుతుడని తెలుపుచు అచ్యుతుని కోరెడి అర్థార్థిని వర్ణించాడు.

**జిజ్ఞాసువు :**

ఆత్మ స్వరూపమును తెలుసుకొనగోరువాడు.

**"పట్టినా కొంగు పంచేంద్రియములు - తొట్టి బాపము తోడుతనే**
**పెట్టీభ్రమ చెరిగి నీ మాయలు - అట్టి మోక్షమెన్నడందేమయ్యా"** (3-46)

అని పంచేంద్రియముల వలన కలుగు విషయాసక్తులు అంటిపెట్టుకొని వీడుట లేదనియు, వాటి వల్ల కలిగెడి కర్మ ఫలము కొప్పెరడై (తొట్టి) వెంటవెంటనే వచ్చుచున్నదనియు, అధికమైన భగవంతుని యొక్క మాయ భ్రమలను కలిగించుచున్నదనియు ఇట్టి భ్రమల నుండి మోక్షమును(జ్ఞానమును) ఎన్నడు పొందేము - అనియు జిజ్ఞాసువు లక్షణమును వివరించినాడు.

**జ్ఞాని** : భగవత్ప్రాప్తిని పొందగోరెడివాడు.

**"వేవేలు బంధములు విడువ ముడువబట్టె**
**దైవమా నిన్నెట్టు తగిలేమయ్యా"** (3-46)

అని అనేక జన్మములు కలుగుచు, తొలగుచున్నవనియు, అట్టి జన్మబంధముల నుండి విడివడి భగవంతుని చేరుట ఎట్లు అని భగవత్ప్రాప్తిని కోరు జ్ఞాని లక్షణము పేర్కొనినాడు.

ఈ విధముగా బుభుక్షు జీవులలోని వివిధ భేదములను అన్నమయ్య కీర్తనలలో గమనింపవచ్చును.

**ముముక్షువులు** : మోక్షమునందిచ్ఛగలవారు.

**"మొనసి వైకుంఠములో నిందిర గూడున్ననీకు**
**పెనగి గజము మొరపెట్టిన యట్లు**
**చనవుతో మా కోరిక సారెవిన్నవించితిమి**
**వివి శ్రీవేంకటేశుడ వేగ రక్షించరాదా!"** (3-266)

అని గజేంద్రుని మొర నాలకించి, రక్షించి మోక్షమిచ్చిన విధముగనే, రక్షించుమని (మోక్షమునిమ్మని) మోక్షమునందాసక్తి గల ముముక్షు లక్షణము ఈ కీర్తన యందు వర్ణింపబడినది.

వీరియందు మరల కైవల్యపరులు - మోక్షపరులు అని రెండు రకముల బేధములు గలవు.

**కైవల్యపరులు :**

జ్ఞాన యోగము ద్వారా ఆత్మ స్వరూపానుభవమును పొందువారు.

**"ఇట్టి జ్ఞానమాత్రమున నెవ్వరైనా ముక్తులే**
**పుట్టుగులు మరి లేవు పొందుదురు మోక్షము"** (3-211)

అని జ్ఞాన స్వరూపమును తెలుసుకున్నవారు సంసారము నుండి ముక్తులై పునర్జన్మము లేని మోక్షమును పొందు లక్షణమును తెలిపినాడు.

**మోక్షపరులు:**

వైరాగ్యమును వహించి మోక్షవాంఛ జనించగా సదాచార్యునాశ్రయించి, భగవంతుని పదములను కోరువారు.

**"తిరుగకు మీ విజ్ఞవమా (దిష్టవు మాయలకును లోగి**
**పరిలేదితని పాదసేవకును సనకాదుల బ్రతుకే సాక్షి"** (2-41)

అని ప్రకృతి ప్రభావానికి లోనుకావలదనియు, భగవంతుని పాదములను ఆశ్రయించ మనియు, అట్లు ఆశ్రయించుట వలన ఎట్టి ఫలము కలుగునో తెలుసుకొనుటకు నిత్యముక్తులైన సనకాదులే సాక్షియనియు అన్నమయ్య మోక్షపరులను గూర్చి తెలిపినాడు. మోక్షపరులలో మరల భక్తులు, ప్రపన్నులు అను భేదము కలదు.

**భక్తులు :**

భక్తి ద్వారా మోక్షమును పొందువారు.

**"అతి రహస్యమిది అచ్యుతుపై భక్తి**
**ప్రతిలేని పరమ పావనము**
**చతురులై తెలిపిరి సనకాది మునులు"** (3-261)

అని శాశ్వతుడైన అచ్యుతునిపై భక్తి అతి పవిత్రమైనదనియు, దానికి ఎదురులేదనియు, తెలుపుచు భక్తిని కలిగి మోక్షము ననుభవించెడి సనకాది మునులను ఉదాహరణముగా చూపినాడు.

**ప్రపన్నులు :**

భగవంతుని పైననే సకల భారమును వేయువారు.

**"నాకేల విచారము నాకేల ఆచారము**
**సాకిరైనవాడనింతే సర్వేశ్వరుడే దిక్కు" (3-384)**

అని సంసార సంబంధమైన ఆలోచనలను, నియమములను అన్నింటిని వదలి, కేవలము సాక్షివలెనుండి, సర్వేశ్వరునే దిక్కుగా భావించెడి ప్రపన్నుని లక్షణమును అన్నమయ్య తెలిపినాడు. ప్రపన్నులలో త్రైవర్ణికపరులు - ఏకాంతి - పరమైకాంతి పరులను భేదములుగలవు.

**త్రైవర్ణిక పరులు :**

భగవంతుని వల్లనే పురుషార్థములు పొందువారు.

**"అలర శ్రీవేంకటేశుడవియేటి మాలిమి**
**వలుదిక్కులకు నోడ వడపగాను**
**ములుగె ధర్మార్థ కామ మోక్ష ధనము గడించి**
**పలుమారు జీవుడనే బలుమరకాడు" (3-388)**

అని శ్రీవేంకటేశ్వరుడు వాత్సల్య రూపము ధరించి సంసారమనే ఓడను వెనుక నుండి నడుపగా, జీవుడనెడి నావికుడు అట్టి సంసారమును తరించి ధర్మార్థ కామమోక్షము లనెడి పురుషార్థములు గడించి, తృప్తితో మూలిగి నాడనియు అన్నమయ్య ఈ కీర్తనలో త్రైవర్ణికపరుల లక్షణమును వర్ణించినాడు.

**ఏకాంతి :**

మోక్షముతో పాటు యితర ఫలములను గూడా భగవంతుని వలననే పొందగోరువాడు.

**"ఇహపరములు గొవ నీ దేవుడే**
**సహజ మన్నిటాను సర్వేశ్వరుడె" (3-380)**

అని ఇహలోకపు కామ్యములు, పరలోకపు మోక్షమును యిచ్చువాడు సర్వేశ్వరుడేనని భావించెడి ఏకాంతి లక్షణము తెలిపినాడు.

**పరమైకాంతి :**

భక్తి జ్ఞానములనే ఫలముగా కోరెడివాడు.

**"మరి సంసార మనెడి మంటి కిందటి వాకు**
**ధర భక్తియను బిల ద్వారమే దిక్కు" (2-146)**

అని సంసారమనెడి జ్వాల కింద దహించబడు జీవునికి, అందుండి తప్పించుకొనుటకు భక్తియనెడి బలమే దిక్కు అనుచు భక్తి కోరు పరమైకాంతి లక్షణము వర్ణింపబడినది. మరల పరమైకాంతి జీవునిలో దృప్త ప్రపన్నులు - ఆర్త ప్రపన్నులు అను భేదములు గలవు.

**దృప్త ప్రపన్నులు :**

ప్రారబ్ధ కర్మమును అనుభవించవలెననుచు, దేహావసాన సమయమునకై, నిరీక్షించువారు.

**"తోడునీడ యిది తొలగని జన్మము**
**యేడకు బోరాదు యీ బతుకు**
**పీడని కట్లు వెడవెడ యాసలు**
**వూడిన దాకా మండగ వలెను" (3-578)**

అని జీవునికి జన్మములు తోడు నీడల వలె అంటి వచ్చుననియు అట్లు వచ్చు జన్మల నుండి తప్పించుకొనరాదనియు, జన్మలకు మూలమైన ఆశలు అనెడి కట్లు బంధించు చున్నవనియు, అట్టి బంధములు తొలగు వరకు అనుభవించవలసినదేననియు దృప్త ప్రపన్నుల జీవలక్షణమును ఈ కీర్తనలో తెలిపినాడు.

**ఆర్తప్రపన్నులు :**

సంసారము భరించలేక ప్రపత్తి నాశ్రయించువారు.

**"అనుపమ వ్రత కర్మానుష్ఠానము**
**లెనలేని బంధ హేతువులు**
**తనిసితి నింక నీ దాస్యం బేగతి**
**ఘనుడవు శ్రీవేంకటనాథా!" (3-465)**

అని అనేకములైన పుణ్యాపాపరూపములైన కర్మముల నాచరించుట వలన సంసారము కలుగుననియు, అట్టి బంధము వల్ల తనిసితిననియు, ఇంక భరించలేననియు, నీవే దిక్కనియు శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించు ఆర్తప్రపన్నుని అన్నమయ్య వర్ణించినాడు.

ఈవిధముగా అన్నమయ్య బద్ధజీవులయందలి వివిధ భేదములను, వారి వారి దశా విశేషములను తన కీర్తనలయందు వర్ణించి వివరించినాడు. జీవ భేదముల వివిధ లక్షణములు "యతీంద్ర మతదీపిక" ఆధారముగ ఈ వివరణమున వర్గీకరింపబడి, అన్నమయ్య కీర్తనలలోని సాదృశ్యాంశములు తదనుగుణముగా నుదాహృతములైనవి. ప్రపన్నులు పొందెడి మోక్షము సాలోక్యము, సారూప్యము, సామీప్యము సాయుజ్యము అని నాలుగు రకములుగానున్నది.[13]

## అన్నమయ్య కీర్తనలయందు సాలోక్యాది ముక్తులు :

**సాలోక్యము** : అనగా భగవంతుని లోకమున నుండుట.

> **"శ్రీ వేంకటేశ నీపై జేరి భక్తిసేసే వారు**
> **కావించి యనంత ముఖ్యగరుడాదులు"** (3-286)

అని భగవంతుని లోకమున నుండి సేవ చేసెడి అనంత గరుడాదులను గూర్చి చెప్పుచు "నీపైచేరి" అను పదము ద్వారా సాలోక్యమును స్ఫురింపజేసినాడు అన్నమయ్య.

**సారూప్యము** : అనగా భగవంతునితో సమానమైన రూపమును పొందుట.

> **"విరహ మొక్కంద మాయ విచ్చేయవయ్య**
> **నిరతి నాకే జూచి నీ వంటా మొక్కితిని** ॥పల్లవి॥
>
> **చక్కటి చెయ్యే చెలికి శేషపర్యంకము**
> **జక్కువ చన్నులు శంఖ చక్రములు లాయ**
> **వుక్క చెమటే జలధి వునికి సేసుక నిన్ను**
> **జక్కని సతి దలచి సారూప్యమందె** ॥విరహ॥
>
> **చలువ కస్తూరి పూత సరినీల వర్ణమాయె**
> **సిరుల గట్టిన తాళి శ్రీధర భావమాయె**
> **వరుస వలపు భక్తి వత్సలమాయె**
> **యిరవై శ్రీవేంకటేశ యింతలో నీవు గూడగా**
> **సరుస విన్నంటి నాకె సారూప్యమందె** ॥విరహ॥ (26-191)

అని ఈ కీర్తనయందు స్వామి వారితో సమానమైన రూపమును పొందిన అమ్మవారి స్వరూపమును వర్ణించుచూ అన్నమయ్య చెక్కిటి క్రింది చేతిని శేషపర్యంకముగా, జక్కువ వంటి వక్షస్థలమును శంఖచక్రములుగా, శృంగారపు చమటను జలధిగా, కస్తూరి పూతను నీలవర్ణముగా, ఆశ్చర్యపు చూపును అనిమిషత్వముగా, చిగురు

పొన్పును తులసిపూజగా, మంగళసూత్రమును శ్రీధరభావముగా, ఆమె వలపును భక్తవత్సలత్వముగా, చమత్కరించి సారూప్య మోక్షస్వరూపమును చూపించినాడు.

ఇంకను - **"జడియు శ్రీవేంకటేశ్వరు దాసుదాయెనా**
**బడి బడి తుద పరబ్రహ్మమే యతడు"** (2-452)

అనియు, **"వెదకుమా శ్రీవేంకటపతి నిను సేవించగ నిను సేవించగను**
**అదన నిన్నంటిన వారల నీయంతలు సేతువుగాక"** (2-121)

అనియు సారూప్య మోక్షమును గూర్చి వర్ణించినాడు.

**సామీప్యము :**

భగవంతుని సమీపమునందుండుట.

**"వోరార హరి నిను నుతించు వారలు**
**చేరువ నుండేటి శేషాదులు"** (3-581)

అని శేషాదుల సామీప్యముక్తిని "చేరువనుండేటి" అను పదముద్వారా తెలియ జేసినాడు. ఇంకను, "వెడ కర్మాలు దోసితే విష్ణుని సాన్నిధ్యమబ్బు" ననియు (3-152)

**"వదలక కూడినట్టి వనచర బలముతో**
**నదె యేకాంగ వీరుడు హనుమంతుడు**
**.........................................................**
**త్రిజగములలోపల దేవతా సంఘములోన**
**అజుని పట్టాన నిల్చె హనుమంతుడు"** (3-138)

అనియు భగవంతుని సమీపమును పొందు జీవుని యొక్క సామీప్య మోక్షమును అన్నమయ్య వర్ణించినాడు.

**సాయుజ్యము :**

జీవుడు భగవంతునితో సమానముగా శంఖ చక్రముల ధరించి, సమాన భోగముల ననుభవించుచూ, భగవంతుని సన్నిధి యందుండుట.

**"యెక్కడ చూచిన మాయల సుఖములు యెన్నైనా గలవెప్పుడును**
**చొక్కపు శ్రీవేంకటపతి తోడుత సుఖియించేటి సుఖమొల్లరు"** (3-372)

అని అశాశ్వతములైన ప్రకృతియందలి సుఖములకన్ననూ భగవంతునితోపాటు అనుభవించెడి సుఖములే చొక్కమైనవనియు,

"సంకుచక్రములుమాని సమానభోగముతోడ
అంకెల శ్రీవేంకటేశు నండమండరో" (3-241) అనియు,

"బొందితిని బొందితిని నీయందఖిల భోగములు
కందర్ప జనక నాకు గలిగితి విన్నిటా" (3-393)

అనియు జీవుడు భగవంతునితో సమానముగా శంఖచక్రములను ధరించి, అఖిలములైన సమాన భోగములననుభవించుటను వర్ణించుచూ అన్నమయ్య సాయుజ్య మోక్ష స్వరూపమును తెలిపినాడు. ఈవిధముగా సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యములను పొందినవారే ముక్తులు.

## 2. ముక్తులు :

"మాముపేత్యతు కౌంతేయ! పునర్జన్మన విద్యతే"[14]

"నన్ను పొందువాడు పునర్జన్మము పొందడు" అని భగవద్గీత ముక్తజీవుని లక్షణమును వివరించినది. ముండకోపనిషత్తు, ముక్తజీవులను గురించి "వేదాంత జ్ఞానమునందు నిస్సందేహమైన సునిశ్చిత బుద్ధికలవారై, సన్యాస యోగము చేత పరిశుద్ధ మనస్సు గలవారై, సంయమివరులు మరణానంతరము బ్రహ్మలోకముచేరి, అచట కల్పాంతము వరకుండి, తరువాత సంపూర్ణ మోక్షము ననుభవించుచున్నారు"[15] అని వివరించినది. ఈ భావమునే అన్నమయ్య,

"అండనే నీ సాకార మాతుమ దలచి కాదె
నిండిన యోగీంద్రులు నిత్యముక్తులైరి" (3-473)

అని బ్రహ్మసాక్షాత్కారము పొంది ముక్తులైన యోగీంద్రులను గూర్చియు,

"బడి నీచే ముక్తి బడసిన వారలు
సుడి గొను ముని జన శుకాదులు" (3-473)

అని "సుడిగొను" అనుచు - 'కర్మఫలముననుభవించిన' అను అర్థము స్ఫురింప జేయుచు, అట్లు అనుభవించిన ముని జనులు, శుకాదులు భగవంతునిచే ముక్తిని పొందినట్లుగా తెలుపుచు, ముక్త పురుషుల లక్షణమును అన్నమయ్య వివరించినాడు.

## 3. నిత్యులు :

నిత్యుల లక్షణమును గూర్చి భగవద్గీత, "పుణ్యపురుషులగు మహాత్ములు దివ్య ప్రకృతి నాశ్రయించి, నన్ను నాశరహితునిగా, భూతముల యుత్పత్తి కారణముగా ఎరింగి అనన్యమనస్కులై ఆరాధించుతురు"[16] - అని తెలిపినది. మహానారాయణో

పనిషత్తు, "నిత్యముక్తులైన బ్రహ్మమయ వైకుంఠ వాసులందరి చేతను"[17], అని నిత్యుల నివాసస్థానము వైకుంఠముగా చెప్పినది. అట్టి నిత్య సూరుల గూర్చి అన్నమయ్య

**"శ్రీవేంకటేశ నీపై చేరి భక్తి సేసేవారు**
**కావించి అనంత ముఖ్యగరుడాదులు" (3-286)**

అని భగవంతుని వద్ద ఉండి, అతనిని భక్తితో సేవించెడి నిత్యసూరులైన అనంత గరుడాదులను వర్ణించుచూ నిత్యుల లక్షణమును తెలిపినాడు. ఇంకను,

**"పగుల పగుల వృషభాసురిని జంపె**
**పగనీగె అతని జలములలో**
**అగపడి శ్రీవేంకటాధిపు పంపున**
**జగిగల విష్వక్సేనుడు గెలిచె" (2-108)**

అని భగవంతుని నిత్యేచ్ఛ ననుసరించి నియమింపబడిన నిత్యుడైన విష్వక్సేనుని గూర్చి వర్ణించినాడు.

ఈవిధముగా జీవులలోని ముక్తులు, నిత్యులు అను భేదములను అన్నమయ్య తన కీర్తనలయందు వర్ణించి, వారి వారి లక్షణములను వివరించినాడు.

## అన్నమయ్య కీర్తనలయందు అచిత్తత్త్వము :

జీవుని కన్న భిన్నమైన తత్త్వముగలది అచిత్తు. అదియే ప్రకృతి అనబడును. ప్రకృతి జీవాత్మకు శరీర భూతమైనది. వికారాస్పదమైనది. జ్ఞాన శూన్యమైనది. జీవేశ్వరుల వలెనే నిత్యమైనది. ఇట్టి ప్రకృతిని గూర్చి అన్నమయ్య,

**"అనంతమైన ప్రకృతి అఖిల వికారములై**
**పనివడి నీమాయయై ప్రపంచమై**
**వొనరి జడమై యుండ నొకచో దివ్యమై యుండు**
**నినుపై ఇహపరాలు నీయైశ్వర్యములు" (3-524)**

అని "అనంతమైన ప్రకృతి" అనుచు ప్రకృతి యొక్క నిత్యత్వమును తెలుపుచు, అట్టి ప్రకృతి భగవంతుని లీలవలన వికారములు పొంది ప్రపంచరూపమున వ్యక్తమై, జడస్వరూపమును కలిగి ఉండుననియు, ఇంకొకచోట "దివ్యమైయుండు"ననుచు అప్రాకృత దివ్యమండల రూపమును చెప్పి, ఇహపరములని పిలువబడు ఈ రెండు ప్రకృతులు భగవంతుని ఐశ్వర్యములనియు - ప్రకృతి తత్త్వమును వివరించినాడు.

ఇట్టి ప్రకృతి శుద్ధ సత్త్వము, మిశ్రసత్వము, సత్త్వ శూన్యము అని మూడు రకములుగానుండును. ఈ మూడు భేదములను అన్నమయ్య వర్ణించినాడు.

**శుద్ధసత్త్వము :**

రజస్తమోగుణ శూన్యమైనది. సత్త్వగుణము మాత్రమే గలది. పరమపదము, వైకుంఠము, నిత్యవిభూతి మొదలగు పేర్లతో పిలువబడునది. "దేనిని వేదాంతులు అవ్యక్తమనియు, అక్షరమనియు, వర్ణింతురో, ఏది పరమ లక్ష్యమని చెప్పబడుచున్నదో, ఏ ప్రదేశము పొంది మానవుడు తిరిగిరాడో అది నా దివ్య నివాసము"[18] అని భగవద్గీత యందు పరమాత్మ నివాస స్థానముగా శుద్ధ సత్త్వము చెప్పబడినది. అచ్చటికి చేరిన వారికి పునర్జన్మ లేని మోక్షము సిద్ధించును. అన్నమయ్య ఇట్టి శుద్ధ సత్త్వమును గూర్చి -

**"వైకుంఠమున కివ్వలి లోకంబులు**

**రాకలపోకల రచనలవి"** (3-292)

అని శుద్ధ సత్త్వమైన వైకుంఠము జీవునికి శాశ్వత పదమనియు, దాని కంటె ఇవతలి లోకంబులు పునర్జన్మలను కలిగించునవి అనుచు శుద్ధ సత్త్వ లక్షణమును వర్ణించినాడు.

**"వైకుంఠమందు నున్నవనజనాభుడు పర**
**మాకార మందునున్న ఆది మూరితి"** (3-281)

అని పరమాత్మ నివాస స్థానమైన శుద్ధసత్త్వమును, వైకుంఠముగా పరమాకారముగాను తెలిపినాడు. ఇంకను,

**"వైకుంఠమూ నున్నది పరములునున్నవి**
**ఈకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను"** - (2-518)

"వైకుంఠమూనున్నది" అని శుద్ధసత్త్వము యొక్క నిత్యత్వమును గూర్చియు, **"ఇహము నీ వినోదమె యెన్నబరము నీ సొమ్మె"** (3-260) అని ఇహము భగవంతునికి లీల యనుచు, పరము భగవంతునికి ఐశ్వర్యమనుచు వర్ణించి, భగవంతుని ఉభయ విభూతులైన మిశ్ర, శుద్ధ సత్త్వముల లక్షణమును తెలిపినాడు. మరియు,

**"యిరవుగ శ్రీవేంకటేశ్వరు గొలిచితే**
**పరమ పదమునకు పాత్రుండగును"** (3-310)

అని జీవుని గమ్యస్థానమైన పరమపదమును వర్ణించినాడు. ఈ విధముగా అన్నమయ్య కీర్తనలలో శుద్ధసత్త్వ లక్షణమున్నది.

**మిశ్రసత్త్వము :**

సత్త్వ, రజ, స్తమో గుణాత్మకమైనది. మిశ్రసత్త్వ లక్షణమును గూర్చి భగవద్గీత "భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అను ఎనిమిదింటితో కలిసినది, నా యొక్క భిన్నమైన ప్రకృతి"[19] అనియు, "సత్త్వ రజస్తమములను గుణముల చేత ప్రకృతి కూడియుండును"[20] అనియు తెలిపినది. ఇట్టి మిశ్రసత్త్వమును గూర్చి అన్నమయ్య,

> **"ఇంతేగాని తెలిసితే నెవ్వరు కర్తలుగారు**
> **బంతినే వీనికెప్పుడు బ్రకృతి గారణము ॥పల్లవి॥**
>
> **యివిగో గుణాలు మూడే యింద్రియాల గూడుకొని**
> **భువి బ్రాణుల నెల్లాను పూచి పనులు గొనేవి**
> **కవిసి కర్మములై ఘన లోకాల దిప్పేవి**
> **ఆవల బుట్టుగులకు నప్పటి దెచ్చేవి ॥ఇంతే॥**
>
> **పంచభూతాలివియే పరగ జీవులకెల్లా**
> **దించ దాకా యెప్పుడును దేహాలయ్యేవి**
> **అంచెల గంచములో బదార్థములై యుండివవి**
> **తెంచరాని పాశములై తీపుల బెట్టేవి ॥ఇంతే॥. (2-199)**

అని వర్ణించినాడు. భగవద్గీత "నా అధ్యక్షతన ప్రకృతి చరాచరములను ఉత్పాదించు చున్నది. దాని నియమము ననుసరించియే ఈ వ్యక్తమగు ప్రపంచము ప్రవర్తించు చున్నది"[21] అని తెలిపినట్లుగా అన్నమయ్య పై కీర్తన పల్లవియందు "బంతినే వీని కెప్పుడు ప్రకృతి కారణము" అని జీవుల జన్మములకు ప్రకృతి కారణము అని తెలిపినాడు. మొదటి చరణమున

> **"యివిగో గుణాలు మూడే యింద్రియాల గూడుకొని**
> **భువి బ్రాణుల కెల్లాను పూచి పనులు గొనేవి"**

అని ప్రకృతి గుణములగు, సత్త్వరజస్తమములు జీవులకు యింద్రియములను కలిగించి, భువియందు వారి సృష్టికి కారణమై, వారిచేపనులు చేయించునని తెలుపుచు, భగవద్గీతయందు తెలుపబడిన త్రిగుణాత్మక ప్రకృతి లక్షణమును వివరించి,

**"కవిసి కర్మములై ఘన లోకాల దిప్పేవి**
**ఆవల బుట్టువులకు నప్పటి దెచ్చేవి"**

అని త్రిగుణములు జీవులపైబడి వారిని ప్రకృతి బద్ధులనుజేసి, వారి చేత కర్మములు చేయించి, ఆ కర్మ పరిపాక ఫలముల వలన ఘనలోకములకు వారిని త్రిప్పుచు, మరల మరల జన్మించునట్లు చేయునని తెలిపినాడు. రెండవ చరణమున

**"పంచభూతాలివియె పరగ జీవులకెల్లా**
**దించరాక యెపుడును దేహాలయ్యేవి"**

అని ప్రకృతి శక్తులగు పంచభూతముల వలన జీవులకు దేహ సృష్టి జరుగుననియు, "అంచెలగంచములో పదార్థములై వుండినవి" అని భుజించుటకు వడ్డించిన పదార్థముల వలె పంచభూతములు ఉన్నవనుచు, జీవునికి భోగ్యభూతమైన ప్రకృతి యొక్క లక్షణమును తెలుపుచు, "తెంచరాని పాశములై తీపుల బెట్టేవి" - అని అట్టి పంచభూతములు తమ ప్రభావము చేత జీవుని బద్ధుని జేసి యాతనలు పెట్టుననియు వర్ణించినాడు.

ఈవిధముగా అన్నమయ్య ఈ కీర్తనయందు జీవుని కృత్యములన్నింటికిని ప్రకృతియే కారణమనియు, ప్రకృతి తన యొక్క త్రిగుణముల ప్రభావము వలన జీవునికి కర్మములు, వాని వలన జీవులకు దేహసృష్టి కలిగించి, తద్వారా వారిని బద్ధులను జేసి యాతన పెట్టుననియు వర్ణించి మిశ్రసత్త్వము యొక్క స్వభావమును వివరించినాడు. ఇంకను,

"రజో గుణము అపరిమితములైన కోరికల వలననూ కాంక్షల వలననూ పుట్టును. దీని కారణముచే బద్ధ జీవుడు కామ్య కర్మలచే బద్ధుడగును"[22] అని భగవద్గీత చెప్పినట్లుగా

**"ఘోరమైన దేహపు దుర్గుణ మేమి గలిగిన**
**ఆరసి ప్రకృతిబోయి అడుగవయ్యా -"** (2-28)

అని ప్రకృతి కారణముగా జీవుడు జన్మించినందువలన అట్టి జీవుడు చెడు గుణముల నెన్నింటిని కలిగియున్నను, అవన్నియు ప్రకృతి గుణముల యొక్క ప్రభావమే అని "ప్రకృతిబోయి అడగవయ్యా" అని గుణ దోషములను కలిగించు ప్రకృతి లక్షణమును వర్ణించినాడు. **"ప్రకృతి కాతుమ దాను పరమాత్ముడాతడు"** (3-132) అని జీవేశ్వరుల

తారతమ్యములు తెలుపు సందర్భమున అన్నమయ్య జీవుడు ప్రకృతికి 'ఆత్మ' అనియు భగవంతుడు పరమాత్మ అనియు, ప్రకృతి జీవునికి దేహమను విషయము తెలిపినాడు.

**"ఘనబంధ మోక్షాలకు గారణమిక నెవ్వరు**
**వనిచిన జ్ఞానాజ్ఞానములే గాక"** (2-174)

అని జీవుని బంధమునకు అజ్ఞానమును, మోక్షమునకు జ్ఞానమును కారణమని తెలుపుచు, ప్రకృతి జ్ఞాన శూన్యమైనదని, అట్టి జ్ఞాన శూన్యమైన ప్రకృతి ద్వారా జీవుడు బంధమును పొందుచున్నాడనుచు, బంధమును కలిగించు అజ్ఞాన రూపమైన ప్రకృతి లక్షణమును తెలిపినాడు. **"ప్రకృతి వికారములకు జొరకుండటయే పరమమైన సాత్వికము"** (2-201) అనియు, **"క్షితి దేహాలు ప్రకృతి చెందిన వికారాలు"** (3-211) అని ప్రకృతి వికార లక్షణము కలదనియు, అట్టి వికారముల వల్ల జీవునికి దేహములు కలుగుననియు తెలిపినాడు. **"సరసిజాక్ష నీ సంకల్ప మాత్రము - అరుదగు ఘన బ్రహ్మాండమిది"** - (2-446) అని భగవంతుని సంకల్పానుసారముగా బ్రహ్మాండము సృష్టింపబడినదని తెలుపుచు "మయాధ్యక్షేణ .........." అని గీతయందు తెలుపబడిన ప్రకృతి లక్షణము తెలిపినాడు.

**సత్త్వశూన్యము :**

గుణత్రయ శూన్యమైనది. సూక్ష్మావస్థయందు అవ్యక్త రూపమున భగవంతునిలో అణగియుండునది. దీనినే అన్నమయ్య **"అతనిలోనె వణగె నన్నియును"** (3-568) అని "అన్నియును" అను పదము ద్వారా జీవునితో పాటు ప్రకృతి తత్త్వమును గూడ స్ఫురింపజేయుచు, భగవంతునిలోనే అణగినదని ప్రకృతి యొక్క అవ్యక్త స్థితిని గూర్చి తెలిపినాడు.

ఈ విధముగా అచిత్ తత్త్వమును, అందలి వివిధ భేదములను అన్నమయ్య తన కీర్తనలలో వివరించినాడు.

## అన్నమయ్య కీర్తనలలో ఈశ్వర తత్త్వము :

విశిష్టాద్వైతమున ఈశ్వర తత్త్వము విశిష్టమైనది. ఈశ్వరుడనగా పరమాత్మ. పరబ్రహ్మము. నారాయణుడు (చిదచిత్తులకు ఆత్మ అయినవాడు). సర్వనియామకుడు. సర్వ స్వతంత్రుడు. సర్వ చేతనాత్మకుడు. సర్వశక్తిమంతుడు. నియంత. సర్వ

శేషితత్త్వము మొదలగు లక్షణములు కలవాడు. ఇట్టి ఈశ్వర తత్త్వమును అన్నమయ్య అనేక కీర్తనలలో వర్ణించినాడు. అందు కొన్ని ఇచట ఉదహరింపబడుచున్నవి.

**"సారపు శాస్త్రాలు చూచి సన్యసించి మడిగేటి**
**నారాయణ నామపు నాధుడేపో దేవుడు"** (2-385)

అని శాస్త్రములు అభ్యసించి, సన్యాసమును స్వీకరించి, బ్రహ్మతత్వమును గ్రహించిన బ్రహ్మవేత్తలు తెలుపునది నారాయణ తత్త్వమేనని అన్నమయ్య తెలిపినాడు. ఇట్టి "నారాయణుడు ఒక్కడే సృష్టికి ముందుండెనని"[23] మహోపనిషత్ నిర్ధారించినది.

**కీర్తన :**

**"ఆతని బోభాగదేము ఆతని శరణంటిమి**
**ఆతని సర్వజీవుల అంతర్యామి** ॥పల్లవి॥

**పెక్కు బ్రహ్మాండ కోట్లు పెక్కు బ్రహ్మకోట్లు**
**పెక్కు రుద్ర కోట్లును పెక్కు యింద్రులు**
**ఒక్కొక్క రోమకూపాల నొగినించు కుండినట్టు**
**వొక్కడే విష్ణుడు వాడే వున్నతోన్నతుడు"** ॥ఆతని॥ (2-498)

అని ఈ కీర్తన పల్లవియందు కఠోపనిషత్తు ప్రవచించిన పరమాత్మ యొక్క సర్వాంత ర్యామిత్వమును[24] గూర్చి "ఆతని సర్వజీవుల అంతర్యామి" అనుచు అన్నమయ్య వర్ణించినాడు.

తర్వాతి చరణమున, నారాయణుడు తన యొక్క ఒక్కొక్క రోమకూపమున అనేక బ్రహ్మాండ కోట్లును, అనేకమంది బ్రహ్మలను, అనేకమంది రుద్రులను, అనేకమంది యింద్రులను, కలిగియున్నాడని[25] మహానారాయణోపనిషత్ తెలిపినట్లు నారాయణుని విరాట్ స్వరూపమును వర్ణించుచూ అట్టి నారాయణుడే వున్నతోన్నతు డనుచు, విష్ణువు ఒక్కడే పరదైవమను లక్షణమును స్పష్టముగా ప్రకటించినాడు. ఒక్కడే అయిన అట్టి నారాయణుడు, "తన ఏకరూపమును బహురూపములుగా వ్యక్తపరుచు చున్నాడు"[26] అని కఠోపనిషత్తు చెప్పినట్లుగా,

**"ప్రకటపు బహురూపములయి నాతడు**
**అకుటిల మహిమల అనంతుడే"** (3-289)

అని మహిమాన్వితుడైన అనంతుడే బహురూపములుగా ప్రకటితమైనాడని పరమాత్మ యొక్క సృష్టి కర్తృత్వ విధానమును విశదీకరించినాడు. ఇంకను,

కీర్తన :

"నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు పం
స్తుత్యుడే తిరువేంకటాద్రి విభుడు ॥పల్లవి॥

ఏమూర్తి లోకంబులెల్ల నేలెడు నాత
డేమూర్తి మోక్షమియ్య జాలెడు నాత
డేమూర్తి లోకైక హితుడు
యేమూర్తి నిజమూర్తి యేమూర్తియును గాడు
యేమూర్తి త్రిమూర్తులేకమైన యాత
డేమూర్తి సర్వాత్ముడేమూర్తి పరమాత్ము
డామూర్తి తిరువేంకటాద్రి విభుడు ॥నిత్యాత్ముడు

యేదేవు దేహమున నిన్నియును జన్మించె
నేదేవు దేహమున నిన్నియును నణగె మరి
యేదేవు విగ్రహంబీ సకల మింతయును
యేదేవు నేత్రంబు లిన చంద్రులు
యేదేవుడీ జీవులన్నింటిలోనుండు
నేదేవు చైతన్యమిన్నిటికి నాధార
మేదేవుడవ్యక్తు డేదేవుడద్వంద్వు
డాదేవుడే వెంకటాద్రి విభుడు ॥నిత్యాత్ముడై॥

యే వేల్పు పాదయుగమీ భూమియు నాకాశంబు
యేవేల్పు పాదాక్రాంతంబనంతంబు
యేవేల్పు నిశ్వాసమీ మహామారుతము
యేవేల్పు నిజదాసులీ పుణ్యులు

యేవేల్పు సర్వేశు దేవేల్పు పరమేశు
దేవేల్పు భువనైక హితమనోభావుకుడు
యేవేల్పు కడు సూక్ష్మమే వేల్పుకడు ఘనము
ఆ వేల్పు తిరువేంకటాద్రి విభుడు ॥నిత్యాత్ముడై॥ (1-75)

అని ఈ కీర్తన పల్లవియందు, కఠోపనిషత్తు తెలిపిన ఈశ్వరుని నిత్యత్వమును, "నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు"[27] అనియు, తైత్తిరీయోపనిషత్తు తెలిపిన పరమాత్మ సత్యత్వ[28] లక్షణమును "సత్యాత్ముడైయుండి సత్యమై తానుండు" అనియు, అట్టి నిత్య సత్య స్వరూపము కలిగిన ఈశ్వరుడు బ్రహ్మముగా పొగడుబడు శ్రీవేంకటేశ్వరుడే అనియు తెలిపినాడు.

మొదటి చరణమున "లోకంబులెల్ల నేలెడు నాతడు" అని పరమాత్మ సర్వనాయకత్వమును, "నిజమోక్షమియ్యజాలెడు నాతడు" అని మోక్ష ప్రదత్వమును, "లోకైక హితుడు" అని లోకహిత లక్షణమున, "యేమూర్తి నిజమూర్తి, యేమూర్తియును గాడు" అని పరమాత్మ వ్యక్తావ్యక్త, సాకార నిరాకార రూపములను, "త్రిమూర్తులేకమైన యీతడు" అని త్రిమూర్తిత్వమును, "ఏమూర్తి సర్వాత్ముడని" సర్వాత్మకత్వమును, "ఏమూర్తి పరమాత్మ"డని పరమాత్మ తత్త్వమును కలిగిన వాడని, అట్టివాడు వేంకటేశుడే అని అన్నమయ్య తెలిపినాడు.

"ఇతడే సమస్త భూతముల ఉత్పత్తి లయములకు స్థానము"[29] అని మాండుక్యోపనిషత్తు తెలిపినట్లుగా రెండవ చరణమున, "ఏదేవు దేహమున ......... అణగె"నని పరమాత్మయందే అన్నియును జన్మించెననియు, తిరిగి అతని యందే లీనమగుననియు చెప్పుచూ, సకల ప్రపంచము అట్టి పరమాత్మ స్వరూపమేనని భావించుచూ, ముండకోపనిషత్ ప్రవచించినట్లుగా పరమాత్మ సూర్యచంద్రులే నేత్రములుగా కలవాడనియు[30], "సర్వభూతాంతరాత్మ" అనియు, కఠోపనిషత్తు పేర్కొనినట్లుగా[31], "చైతన్యమై అన్నిటికి ఆధారమైనవాడు" అనియు, భగవద్గీతయందు చెప్పబడినట్లుగా[32], పరమాత్మ "అవ్యక్తమూర్తియు, అద్వంద్వుడనియు" ఇట్టి లక్షణములు గలదేవుడు శ్రీవేంకటేశ్వరుడేననియు వర్ణించినాడు. "అతని పాదముల నుండి భూమి పుట్టెను"[33] అని ముండకోపనిషత్తు తెలిపినట్లుగా మూడవ చరణమున "ఏవేల్పు పాదయుగ మీ భూమియు నాకాశము" అనియు, "పాదకేశాంతంబనంతంబు" అని పరమాత్మ యొక్క ఆది, మధ్య, అంత్య రహితమైన లక్షణమును వర్ణించినాడు.

"వాయువు ప్రాణము"[34] అని ముండకోపనిషత్తు తెలిపినట్లుగా "పరమాత్మ యొక్క నిశ్వాసమే ఈ మహా మారుతము" అనియు, పరమాత్మ పుణ్యాత్ములను దాసులుగా గలవాడనియు, సర్వేశ్వరుడనియు, పరమేశుడనియు, భువనైక హితుడనియు, మనస్సునందు భావింపబడువాడనియు తెలుపుచూ, ముండకోపనిషత్తు తెలిపిన పరమాత్మ యొక్క సూక్ష్మతర స్వరూపమును[35] గూర్చి భావించుచూ "సూక్ష్మమైన వాడనియు, కఠోపనిషత్తు తెలిపినట్లుగా ఘనమైన వాడనియు[36], వర్ణించుచు ఇట్టి లక్షణములు కలవాడు శ్రీవేంకటేశ్వరుడే అని అన్నమయ్య ఈశ్వరుని యొక్క సంపూర్ణ తత్త్వమును ఈ కీర్తనయందు ఆవిష్కరించినాడు.

ఇంకా అనేక కీర్తనలలో ఈశ్వర తత్త్వ లక్షణములను తెలుపుచు, ఈశ్వరుని సర్వాంతర్యామిత్వమును గూర్చి, **"మంగళము సర్వాత్మునకు, ధర్మ స్వరూపమునకు జయ జయ"** (1-46) అనియు, **"విష్ణుడొక్కడే విశ్వాత్మకుడు"** (2-345) అనియు, ఉపనిషత్తులు తెలిపిన సర్వాంతర్యామిత్వమును అన్నమయ్య వర్ణించినాడు.

శ్వేతాశ్వతరోపనిషత్తు పరమాత్మ యొక్క లోకేశ్వరత్వమును "సర్వస్య ప్రభుమీశానాం"[37] అని తెలిపినది. అన్నమయ్య **"సర్వేశ పరమ పురుషాచ్యుతా"** (10-256), **"హరి జగన్నాథు"** (1-363), **"సర్వం సర్వంసహా చక్రవర్తివి"** (2-382), **"నానా బ్రహ్మాండనాథునికి శరణు"** (3-374), **"నారాయణుడే సర్వనాయకుడు"** (3-264) అని పరమాత్మ యొక్క లోక నాయకత్వమును గూర్చి వర్ణించినాడు.

పరమాత్మ యొక్క సర్వాధారత్వ లక్షణమునుగూర్చి భగవద్గీతయందు "బలవంతమైన వాయువు అంతటను వీచుచూ సర్వదా ఆకాశము నందే ఆధారపడి యుండునట్లు, సృజింపబడిన జీవులన్నియు నాయందే ఆధారపడి యుండునని గ్రహింపుము"[38] అని చెప్పబడినది. అట్లే అన్నమయ్య **"ఆదికూర్మంబైన జగదాధారకమూర్తికిని"** (1-46), **"పరమ పురుషుజగద్ధరితు"** (1-363), **"అందరి కాధారమైన ఆదిపురుషుడీతడు"** (1-351), **"అనంత చరణ సర్వాధారాధేయ"** (2-401) అని సర్వ సృష్టి కాధారమైన ఈశ్వర తత్త్వమును గూర్చి వర్ణించినాడు.

పరమాత్మ యొక్క అణు మహత్త్వ స్వరూపములను గూర్చి "ఆత్మ తత్త్వము అణువు కంటె అణువుగాను, మహత్తు కంటె మహత్తుగాను, ప్రతి జీవుని యొక్క హృదయ కుహరమునందు నివసించుచున్నది"[39], అని కఠోపనిషత్తు పేర్కొనినది. ఈ భావమునే అన్నమయ్య **"అణు మహత్త్వములందు అంతర్యామైన**

**వాని"** (2-30) అని వర్ణించెను. భగవద్గీత పరమాత్ముని అనాది రూపునిగా[40] తెలిపినది. అన్నమయ్య **"హరి పరమాత్ముడనాది పురుషుడు"** (3-529) **"అనాది కరణా అనంతా"** (2-236), **"సనాతనా అచ్యుత సర్వేశ్వరా"** (2-326) అని పరమాత్మ అనాదిత్వ లక్షణమును వర్ణించినాడు.

**"తాపసోత్తముల చింతా సౌధములోన**
**దీపించు సుజ్ఞాన మతడు"** (5-112)

అని పరమాత్మ యొక్క జ్ఞాన స్వరూపమును తెలిపినాడు. ముండకోపనిషత్ పరమాత్మను సర్వజ్ఞునిగా[41] పేర్కొనినది. అన్నమయ్య **"జ్ఞాన రహితుడను సర్వజ్ఞనిధివి"** (10-176) అని పరమాత్మను సర్వజ్ఞనిధిగా వర్ణించినాడు.

**"అనయము నిర్మలు డఖిలానందుడు"** (2-77), **"ఆనంద నిలయ ప్రహ్లాద వరదా"** (3-502) అని పరమాత్మను ఆనంద స్వరూపునిగా తెలిపినాడు. తైత్తిరీయోపనిషత్తు పరమాత్మ ఆనంద స్వరూపమును[42] వర్ణించినది.

పరమాత్మను శాశ్వతునిగా[43] భగవద్గీత తెలిపినది. అన్నమయ్య కూడ "జగదేక గురుడు శాశ్వతుడచ్యుతుడు" (3-526) అని శాశ్వత లక్షణము కలవాడు అచ్యుతుడని పేర్కొనినాడు.

ఇంకను "యెలిమి శ్రీవేంకటేశు డితడే సర్వసాక్షి" (3-294) అని పరమాత్మ సర్వ సాక్షిత్వమును ప్రకటించినాడు.

ఈ విధముగా అన్నమయ్య తన కీర్తనలయందు ఈశ్వర తత్త్వమును ఆవిష్కరించినాడు.

## ఈశ్వరుని అనంత కల్యాణ గుణములు

పరమాత్మ అనంత కల్యాణ గుణములు కలవాడుగా పేర్కొనబడినాడు. అందు జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజస్సులనెడి ఆరు గుణములు అన్నమయ్య కీర్తనలలో ఇట్లు ప్రకటించెను.

1. **జ్ఞాన గుణము** : సర్వ వస్తువులను సాక్షాత్కరింపజేయుట.

**"సతతము జీవులకు చైతన్య సూత్రము**
**అతిశయ భక్తుల జ్ఞానామృతము"** (2-244)

అని "జ్ఞానామృతము" అను పదము ద్వారా భక్తులకు సర్వము సాక్షాత్కరింపజేయు వాడనియు,

"సకల లోకనాథుడు జనార్దను డితడు
శుకయోగి వంద్యుని సుజ్ఞాన మెంత" (2-279) అనియు,

"సారెకు నజ్ఞాని నేను జ్ఞానివి నీవు" (2-53) అనియు, పరమాత్మ జ్ఞాన గుణములను అన్నమయ్య వర్ణించినాడు.

**2. శక్తి** : అఘటిత ఘటనా సామర్థ్యము.

"యీతడా తాటకి జంచె యీ పిన్నవాడా
ఆతల సుబాహు గొట్టి యజ్ఞము గాచె
చేతనే కొమరుడా శివుని విల్లు విరిచె
సీతమ్మ బెండ్లాడె చెప్పగొత్తగాదవె ॥రామ॥

మన కౌసల్య కొడుకా మాయా మృగము నేసె
దనుజుల విరధుని తానే చెటిచె
తును మాడె నేడు దాళ్ళు తోడనే వాలి నడచె
యినకులు డితడా యెంత కొత్తచూడరే" ॥రామ॥(1-474)

అని పరమాత్మ అఘటిత ఘటనా సామర్థ్యమును రామకథా పరముగా వర్ణించినాడు.

**3. బలము** : ధరింపగలుగుట.

"పినువు గోవర్ధనాద్రి చేతబట్టి యెత్తెనంట
కొసరీతని పాదాలే కొలువ వద్దా" (1-502) అనియు,

"మొదల కుంగిన కొండ మోచి యెత్తితివి" (2-503) అనియు,

"బలయుక్త నరసింహ ప్రహ్లాద వరదా" (3-502) అనియు పరమాత్మ బలమును వర్ణించినాడు.

**4. ఐశ్వర్యము** : నియమింపకలుగుట.

"శ్రీవేంకటేశ్వర నీకు చే కానుకిచ్చేనంటే
లావు సంపదల నీవు లక్ష్మీనాథుడవు" (3-159) అనియు,

"శ్రీవేంకటేశు డితడా సిరుల నయోధ్య యేల" (1-474) అనియు,

"పొదిగి చేపట్టి దెచ్చి భూమి నుద్ధరించితివి" (2-503) అనియు,

"యిన మండలమున జెలగేటి హితవైభవుడీతడు" (1-351) అనియు పరమాత్మ యొక్క ఐశ్వర్య గుణమును వర్ణించినాడు.

5. వీర్యము : వికారము చెందకుండుట.

"వీధుల వీధుల వెస దురగముపై
భేదిల బల్లెము బిరబిర దిప్పుచు
మోదము తోడుత మోహన మూరితి
యేదెస జూచిన వేగీ వాడే" (2-39) అనియు,

"బలుడు అన్నిటా రవికులుడు భావింప, ని
ర్మలుడు నిశ్చలు డవికలుడు వాడే" (2-219) అనియు పరమాత్మ యొక్క వీర్య గుణమును "నిశ్చలుడు, అవికలుడు" అను పదముల ద్వారా తెలిపినాడు.

6. తేజస్సు : ఇతరులను తిరస్కరింపగలుగుట.

"రాముడిదే లోకాభిరాము డితడు
గోమున పరశురాము కోప మార్చెనటరే" (1-474) అనియు,

"అనిశము జీవులకు నణువుకు మహత్తుకు
పెనుకొన్న మాయకు విరాట్టుకు
పొనుగని మహిమల పొడవుకు బొడవైన
దివకర కోటి తేజమువు నీవు" (2-332)

అనియు పరమాత్మ తేజో గుణమును వర్ణించి షాడ్గుణ్యములను తన కీర్తనలలో అన్వయించినాడు.

## పరమాత్మ అసంఖ్యాక కళ్యాణ గుణములలో కొన్ని :

కీర్తన :

అరుదు నీ చరిత్రము హరినే నిదియె తలచుకొని
శరణంటి గావు మిదియు విన్నపము సరిలేదునీకు

పరగ నీయకారణ బంధుత్వ మహల్యయందు గంటిమి
కరియందు నార్త రక్షకత్వము మెరయగ గంటిమి
అరసి ద్రౌపదియందు నాపదుద్ధారకత్వము మెరయగ గంటిమి
శరణంటె గాచుట ధర విభీషణు నందు గంటిమి ॥అరుదు॥

మును భక్తవత్సలత్వము నీకు శబరియందు గంటిమి
అనాది నాథుడవు నీవగుట సుగ్రీవునందు గంటిమి
పెనగి నిరుహేతుక ప్రేమ పరీక్షిత్తునందు గంటిమి
నిను కింకరాధీనుడని ప్రహ్లాదుని యందు గంటిమి ॥అరుదు॥

గోవర్ధనమందు సర్వజీవ దయా పరత్వము గంటిమి
భావించి సాందీపునందు ప్రతిజ్ఞా పాలకత్వము గంటిమి
దేవ శ్రీవేంకటేశ్వర నీవు ద్రిష్ట వరదుడ వగుట
తావైన నీ కోనేటి దండ నొసగయందే గంటిమి" ॥అరుదు॥ (2-321)

అని ఈ కీర్తన యందు అన్నమయ్య పరమాత్మకు గల అకారణ బంధుత్వము, ఆపదుద్ధారకత్వము, రక్షకత్వము, ఆర్తత్రాణపరాయణత్వము, భక్తవత్సలత్వము, నిర్హేతుక దయ, కింకరాధీనత, సర్వజీవ దయాపరత్వము, ప్రతిజ్ఞా పాలకత్వము, భక్త వరదత్వము, అనెడి కళ్యాణగుణములను వర్ణించినాడు. ఇంకను,

"కలిగి యా కరిరాజు గాచిన నీవు" (2-31) అనియు,

"ఛీ ఛీ నరుల దేటి జీవనము
కాచుక శ్రీహరి నీవే కరుణింతువుగాక" (1-387)

అనియు భగవంతుని కరుణను,

"నీకు దొల్లేయలవాటు నిరుహేతుకపు దయ
జోకమరత మెచ్చివ సులభుడవేకా" (9-162)

అని భక్త సులభత్వమును, నిర్హేతుకపు దయను,

"ధారుణిలో నిండెను ప్రతాపము నీది" (2-53)

అని పరమాత్మ ప్రతాపగుణమును;

"అమిత వరదునికి ఔదార్య గుణమెంత" (2-279)

అని ఔదార్య గుణమును,

"నిగమ నిగమాంత వర్ణిత మనోహర రూప
నగరాజ ధరుదా శ్రీనారాయణా" (1-243) అనియు,

"చల్లని తమ్మిరేకుల సారసపు గన్నులు
మెల్ల మెల్లన విచ్చి మేలుకొనుమయ్యా
..........................................................
సిరిమొగము దెరచి చిత్తగించ వేలయ్యా" (14-25)

అని భగవంతుని సౌందర్య లక్షణమును, అన్నమయ్య వర్ణించినాడు.

ఈ విధముగా అన్నమయ్య పరమాత్మ అనంత కళ్యాణగుణ విశేషములను తన కీర్తనలయందు అనేక చోట్ల వర్ణించినాడు.

## అన్నమయ్య కీర్తనలలో - పరమాత్మ పంచ స్వరూపములు

విశిష్టాద్వైత సంప్రదాయమున భగవంతుడు పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చాస్వరూపములతో అనుగ్రహించును. పరమాత్మ యొక్క ఈ పంచ స్వరూపములు అన్నమయ్య వివిధ కీర్తనల యందు వర్ణించి తరించినాడు.

### పరస్వరూపము :

నిత్య విభూతి నివాస స్థానముగా కలవాడు పరమాత్మ, పరంజ్యోతి, పరబ్రహ్మము, పరవాసుదేవుడు.

"ఈతడే సుండి యెంత యెంత చూచినా
చేతనే వరాలిచ్చే శేషాచలేశుడు ॥పల్లవి॥

విశ్వరూపపు బ్రహ్మము, విరాట్టయిన బ్రహ్మము
ఐశ్వర్య స్వరాట్టా సామ్రాట్టయిన బ్రహ్మము
శాశ్వత బ్రహ్మాండము శరీరమయిన బ్రహ్మము
యీశ్వరుడై మహారాట్టై యిందరిలో బ్రహ్మము ॥ఈతడే॥

సూర్యునిలో తేజము, సోమునిలో తేజము
శౌర్యపు టనలుని భాస్వత్తేజము
కార్యపు టవతారాల గముగొన తేజము
వీర్యపుటెజ్ఞ భాగాల విష్ణునామ తేజము ॥ఈతడే॥ (7-137)

అని ఈ కీర్తనలో అన్నమయ్య పరబ్రహ్మమును వర్ణించినాడు. మరొక కీర్తనయందు,

"త్రిజగములు నెరుగు దేవదేవుడు
అజుని జనకుడైన ఆది నారాయణుడు ॥పల్లవి॥

గరుడుని మీదనెక్కి ఘనచక్రము చేబట్టి,
పరమ పదాన నుండి పరతెంచీ
మురిపేన కరిగాచి మొసలి దుంచినవాడు
అరుదైన ప్రతాపపు ఆదినారాయణుడు ॥త్రిజగ॥

కనకాంబరము గట్టి కౌస్తుభము మెడబెట్టి
వెనువెంట శ్రీసతి సేవించుచుండగా
పనిపూని జయముతో పాంచజన్యము పట్టి
అనిశము కరుణించీ ఆదినారాయణుడు ॥త్రిజగ॥

త్రిదశులు నుతియించ దిక్కులెల్లా మల్లసిల్ల
ముదమున దాసులెల్లా మొక్కగాను
వదలకెల్ల వారికి వరములిచ్చు వాడే
అదె శ్రీవేంకట విభుదాది నారాయణుడు" (3-523)

అని గరుడ వాహనము, ఆయుధములు, ఆభరణములు, దాసవర్గ సేవనములతో పాటు, లక్ష్మీనిత్యాన పాయిత్వమును గలవానిగా పరమపదవాసుని అన్నమయ్య వర్ణించినాడు. ఇంకా పరమాత్మ యొక్క అనంత కళ్యాణ గుణములైన ప్రతాప, భక్త వరదత్వములు పేర్కొనినాడు.

"అతడే పరబ్రహ్మమతడే లోకనాయకుడు
అతని కంటె మరి అధికులు లేరయ్యా" (3-470)

అని పరబ్రహ్మము యొక్క లోక నాయకత్వమును,

"జగదాకార చతుర్భుజ
గగననీల మేఘశ్యామ
నిగమ పాదయుగ నీరజ నాభ
అగణిత లావణ్యాననా ॥దేవా॥

ఘన వేదాంతై గణన వుదార
కనక శంఖ చక్ర కరాంకా
దినమణి శశాంక దివ్య విలోచన
అనుపమ రవి బింబాధరా ॥దేవా॥ (2-377)

అని పరవాసు దేవుని జగదాకారమును, చతుర్భుజములను, నీలమేఘ శ్యామల దేహమును, వానిచే విశిష్టమగు దివ్యమంగళ విగ్రహమును వర్ణించినాడు. మరొక కీర్తనయందు,

"ఈ రూపమై యున్నాడు ఈతడే పరబ్రహ్మము
శ్రీరమా దేవి తోడ శ్రీవేంకటేశుడు ॥పల్లవి॥

పొదలి మాయాదేవి పట్టిన సముద్రము
అదె పంచభూతాలుండే అశ్వత్థము
గుదిగొన్న బ్రహ్మాండాల గుడ్లు బెట్టేహంస
పదరపు బ్రహ్మలకు జలజమూల కందము ॥ఈ రూప॥

అనంత వేదాలుండేటి అక్షయవట పత్రము
ఘన దేవతలకు శ్రీకర యజ్ఞము
కనలు దానవ మత్తగజ సంహార సింహము
మొనసి సంసార భారము దాల్చే వృషభము ॥ఈ రూప॥

సతతము జీవులకు చైతన్య సూత్రము
అతిశయ భక్తుల జ్ఞానామృతము
వ్రతమై శ్రీవేంకటాద్రి వరముల చింతామణి
తతిగొన్న మోక్షపు తత్త్వ రహస్యము ॥ఈ రూప॥ (2-244)

అని లక్ష్మీవిశిష్టుడైన పరవాసుదేవుని షాడ్గుణ్య పరిపూర్ణత్వమును నిరూపించుచూ "బ్రహ్మాండములనే గుడ్లను బెట్టే హంస" అని పరబ్రహ్మ శక్తి గుణమును, "బ్రహ్మాదులకు జలజ మూలకందము" అని బలము అనుగుణమును, "దానవ మత్తగజ సంహారసింహము" అని వీర్య గుణమును, "సంసార భారము దాల్చే వృషభము" అని ఐశ్వర్య గుణమును, "సతతము జీవులకు చైతన్య సూత్రము" అని తేజోగుణమును, "గొప్పనైన భక్తులకు జ్ఞానామృతము" అని జ్ఞాన గుణమును, అన్నమయ్య ఆవిష్కరించినాడు. ఈ పరిపూర్ణత్వమునే మరొకచోట

"పరమ పురుష హరి పరమ పరాత్పర
వరరిపు భంజన పరిపూర్ణ నమో" (2-453)

అనియు తెలిపినాడు. మరియు,

"ఇరవైన రవిచంద్రులితని కన్నులు
ధరణి అనంత వేదములూర్పులు
అరుదై చెలగే బ్రహ్మాండ మీతని నెలవు
నిరతి సనకాదులు నిత్య సేవకులు " (3-234)

అని పరబ్రహ్మ రవిచంద్ర నయనుడని, వేదములతని ఊర్పులని, బ్రహ్మాండ నిలయుడని, సనక సనందాదులచే నిత్య సేవితుడని ఉపనిషత్తులు తెలిపిన విధముగా అన్నమయ్య వర్ణించుచూ చివరగా,

"వైకుంఠమందు నున్న వనజనాభుడు, పర
మాకార మందున్న ఆది మూరితి
ఆకడ సూర్య కోట్లందునున్న పరంజ్యోతి
దానొక బ్రహ్మాండాలు ధరించిన బ్రహ్మము" (3-281)

అని వైకుంఠమందలి వనజ నాభునిగా, పరమాకారమనబడు పరమ పదమునందలి పరవాసుదేవునిగా, సూర్య మండలావర్తియైన పరంజ్యోతి స్వరూపునిగా, బ్రహ్మాండ ధారియైన పరబ్రహ్మముగా 'పర' స్వరూపమును వర్ణించినాడు. ఇకంను అనేక కీర్తనల యందు (2-499, 2-364, 3-222, 3-264, 3-470, 3-524, 1-75) పరబ్రహ్మము యొక్క పర స్వరూపము వర్ణింపబడినది.

## 2. వ్యూహస్వరూపము :

ఉపాసనార్థము పరుడు ధరించు రూపము వ్యూహము. యోగులచే మాత్రమే దర్శింప వీలయినది వ్యూహరూపము. ఇది నాల్గు విధములు.

**వాసుదేవ వ్యూహము :**

"మనసుకు గోచరమా మాటలకు గోచరమా
కనుగొన వసమా నీ ఘనరూపము
నిను వెదకుచున్నాడ నీ వెక్కడ నేనెక్కడ
జనుడ నింతే యెంత సాహసము నాది" (2-187) అనియు,

"యోగీశ్వరుల మతి నుండేటి దేవుడు
సాగరశాయి యైన సర్వేశ్వరుడు" (3-281) అనియు,

"ఘన యోగీంద్రుల మతి గట్టు వడివట్టివాడు" (3-316) అనియు,

"భోగి శయనమును బుసకొట్టెడిని
యోగ నిద్ర పాయను మేల్కొనవే" (1-139)

అనియు యోగి హృద్ధ్యానగమ్యమైన, క్షీరసాగరశయనుడయిన వ్యూహ వాసుదేవ రూపమును వర్ణించినాడు. ఈ వాసుదేవ రూపము తిరగి సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపములతో మూడు విధములు.

**సంకర్షణ వ్యూహము :**

"దేవకీ నందనా దేవేంద్ర వందితా
కైవల్య నిలయ సంకర్షణాఖ్యా" (10-256)

అని మోక్షసాధనమైన జ్ఞానమును బోధించు సంకర్షణ వ్యూహమును 'కైవల్య నిలయ' అని వర్ణించినాడు.

**ప్రద్యుమ్న వ్యూహము :**

"ఇవియే పో ప్రద్యుమ్న యిహపర సాధనము
భవ జలధుల తేప పరమ యోగులకు"

అని బ్రహ్మచే సృష్టి కర్మలను చేయించు ప్రద్యుమ్న వ్యూహమును పరమ యోగులకు ఇహపరసాధనముగా, భవజలధులను దాటించే తెప్పగా వర్ణించినాడు.

**అనిరుద్ధ వ్యూహము :**

"అనిరుద్ధ పురుషోత్తమా ధోక్షజ ఉపేంద్ర
జనార్దన కేశవ సంకర్షణా
నిను దలచగ లేము నిన్ను దెలియగ లేము
మనసై నీ నామమె నోటికి సులభము
వామన గోవింద విష్ణు వాసుదేవ హరికృష్ణ
దామోదరాచ్యుత మాధవ శ్రీధరా" (11-110)

అని తత్త్వజ్ఞాన రక్షణమగు అనిరుద్ధ వ్యూహమును పేర్కొనుచు, యోగుల హృదయములకు మాత్రమే సులభమైన ఆ రూపమును దర్శించుట కష్టము గనుక నోటికి సులభమైన వామన గోవింద, విష్ణు, వాసుదేవాది నామములు ఉచ్చరించి తరించెదనని అన్నమయ్య తెలిపినాడు.

ఈ చతుర్వ్యూహముల నుండి మూడేసి వ్యూహాంతరములు అవతరించును. అవియే కేశవాది ద్వాదశ రూపములు''[44] - అని తెలుపబడినట్లుగా కేశవాది నామముల ఉచ్చారణచే వాసుదేవాది వ్యూహములను భావించుట తరుణోపాయమని అన్నమయ్య భావించినాడు.

## 3. విభవ స్వరూపము :

లోకోద్ధరణమునకై అవతరించు పరమాత్మ అవతారములు "విభవము" అనబడును. ఈ అవతారములు అనేకమయిననూ, పది అవతారములు మాత్రమే ప్రసిద్ధమయినవి.

"మత్స్య కూర్మ వరాహశ్చ నారసింహశ్చ వామనః
రామో రామశ్చ రామశ్చ బుద్ధః కల్కిరేవచ''

అని లోక ప్రసిద్ధి పొందిన ఈ శ్లోకమున దశావతారములు పేర్కొనబడివి. అన్నమయ్య తన కీర్తనలలో ఈ అవతారములను అనేక విధములుగా వర్ణించియున్నాడు.

## దశావతారములు గల కీర్తనలు :

**కీర్తన :**

"యితని కంటె మరి దైవము గానము యెక్కడ వెదకిన నితడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారము దానె

మది జలధుల నొక దైవము వెదకిన మాత్స్యావతారంబితడు
అదివో పాతాళమందు వెదకితే నాది కూర్మ మీ విష్ణుడు
పొదిగొని అడవుల వెదకి చూచితే భూవరాహమని కంటిమి
చెదరక కొండల గుహల వెదకితే శ్రీ నరసింహంబున్నాడు ॥యితని॥

తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలచినది
పలు వీరులలో వెదకి చూచితే పరశురాముడొకడైనాడు
తలపున శివుడును పార్వతి వెదకిన తారక బ్రహ్మము రాఘవుడు
కెలకుల నావుల మందల వెదకిన కృష్ణుడు రాముడు నైనారు ॥యితని॥

పొంచి యసుర కాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాడు
మించిన కాలము కడపట వెదకిన నంతర్యామై మెరసెను
యెంచుక ఇహమున బరమున వెదకిన యీతడే శ్రీ వేంకటవిభుడు"

(3-370)

అని ఈ కీర్తనయందు అన్నమయ్య పరమాత్మ ధరించిన దశావతార వైభవములను వర్ణించినాడు. ఈ కీర్తన యందు ఒక విశేషము కలదు. శుద్ధోదనుని కుమారుడైన బుద్ధుని గాధకు బదులుగా, "పొంచి యసుర కాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాడు" అని బుద్ధావతారమునుపురాణములు పేర్కొనిన విధముగా వరిర్ణచినాడు.

"శ్రీమహావిష్ణువు త్రిపురాసురులకు రక్షణ కవచంగా ఉన్న వారి భార్యల యొక్క పాతివ్రత్య మహిమను తొలగించి వారిని సంహరించదలచెను. అందులకై సంతాన హీనులైన త్రిపురాసుర ధర్మపత్నులకు విష్ణువే కపటవటు (బుద్ధరూపంలో) వేషంలో వెళ్ళి ఒక రావి చెట్టునుచూపి దానిని ఆలింగనం చేసుకుంటే మీకు సంతాన ప్రాప్తి కలుగుతుందని ఉపదేశించినాడని, ఇది వృక్షమే కదా! మన పాతివ్రత్యానికి భంగం లేదని వారట్లే ఆ వృక్షాన్ని ఆలింగనం చేసుకొనగా అందులో ఆ విష్టుడైన విష్ణువు వారికి పాతివ్రత్య భంగం కలిగించినాడని ఒక కథ ప్రచారంలో ఉన్నది".[45] బహుశ ఈ కథను దృష్టియందుంచుకొని అన్నమయ్య బుద్ధావతారమును వర్ణించియుండ వచ్చును.

"భగవత్తేజసా గుప్తో దదాహ త్రిపురం శివః అనే భాగవత శ్లోక ఖండాన్ని బట్టి విష్ణువు యొక్కతేజః ప్రభా రక్షితుడై శివుడు త్రిపుర దాహం చేయగలిగినట్లుతెలుస్తూనే ఉన్నది".[46] కనుక అన్నమయ్య ఇచ్చ టభావించిన 'అసురకాంతలు' త్రిపురాసురుల భార్యలే అనవచ్చును.

అన్నమయ్య తర్వాతి వాడును, శ్రీవైష్ణవ మతావలంబియును అయిన శ్రీకృష్ణదేవ రాయలు తన ఆముక్తమాల్యదయందు కూడా బుద్ధావతారమును ఇట్లే వర్ణించెను.

మరొక కీర్తనయందు -

**"ఇట్టె మమ్ము రక్షించుట యేమి దొడ్డ నీకు నేడు**
**బట్ట బాయటనే నీవు పదిరూపులైతివి ॥పల్లవి॥**

**చదువుల చిక్కుదిద్ది చక్కగ జేసితివి**
**మొదల కుంగిన కొండ మోచి యెత్తితి**
**పొదిగి చేపట్టె తెచ్చి భూమి వుద్ధరించితివి**
**అదనున ప్రహ్లాదునట్టె మన్నించితివి ॥ఇట్టె॥**

అడుగులు మూటనె అఖిలము గొలచితి
బడిబడినే రాచపగ నీగితి
బెడిదపులంక విభీషణు నేలించితివి
అదరి పాండవుల దిక్కై నిలిచితివి ॥ఇట్టి॥

త్రిపుర కాంతల గుట్టుదీర బోధించితివి
వుపమ గలికి రూపై యున్నావడవు
ఇపుడు శ్రీవేంకటేశ యేలితివి లోకాలెల్ల
యెపుడు మా నుతులకు నిరవైతివి ॥ఇట్టి॥ (2-503)

అని జీవులనురక్షించుటకు పరమాత్మ ధరించిన పది రూపులను అన్నమయ్య "చదువుల చక్కదిద్ది" అని వేదముల నుద్ధరించిన మత్స్యావతారమును, "మొదల గుంగిన కొండమోచి యెత్తితి" అని సముద్రమున కుంగిన మంధరమును మోసిన కూర్మావతారమును, "పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి" అని వరాహావతారమును, "ప్రహ్లాదు మన్నించితివి" అని నరసింహావతారమును, "అడుగుల మూటనె అఖిలము గొలిచితి"వని వామనావతారమును, "రాచపగనీగితి" అని పరశురామావతారమును, "లంక విభీషణునేలించితివి" అని శ్రీరామావతారమును, "పాండవులకు దిక్కై" అని కృష్ణావతారమును, "త్రిపుర కాంతల గుట్టుతీర" బోధించిన బుద్ధావతారమును, "కలికి రూపై" అని కల్క్యావతారమును వర్ణించినాడు. "త్రిపుర కాంతల గుట్టుదీర బోధించితివి" అని ఇందు వర్ణించుట వలన ఇంతకు ముందు కీర్తనలో పేర్కొన్న "అసురకాంతలు" త్రిపురాసురుల భార్యలేననియు, త్రిపురాసుర సంహారార్థము ధరించినదే బుద్ధావతార మనియు, అన్నమయ్య భావించినట్లుగ స్పష్టమగుచున్నది. ఇంకను అనేక కీర్తనలయందు (2-374, 12-374, 12-295, 6-192, 1-75, 26-82, 28-135 మొదలగు) అన్నమయ్య దశావతార వైభవమును వర్ణించియున్నాడు.

దశావతారములలోని రామ, కృష్ణ, నృసింహావతారములను అన్నమయ్య విడివిడిగా అనేక కీర్తనలలో వర్ణించినాడు.

**రామావతారము :**

రాజీవ నేత్రాయ రాఘవాయ నమో
సౌజన్య నిలయాయ జానకీశాయ ॥పల్లవి॥

దశరథ తనూజాయ - తాటక దమనాయ
కుశిక సంభవ యజ్ఞ గోపనాయ
పశుపతి మహాదమర్భంజనాయ నమో
విశద భార్గవరామ విజయ కరణాయ ॥రాజీవ॥

భరిత ధర్మాయ శూర్పణకాంగ హరణాయ
ఖర దూషణాది రిపుఖండనాయ
తరణి సంభవ సైన్య దక్షకాయ నమో
నిరుపమ మహావారినిధి బంధనాయ ॥రాజీవ॥

హత రావణాయ సంయమినాథ వరదాయ
అతులితాయోధ్యా పురాధిపాయ
హితకర శ్రీవేంకటేశ్వరాయ నమో
వితత వావిలిపాటి వీర రామాయ ॥రాజీవ॥ (2-273)

అని ఈ కీర్తన రామావతార వైభమును సంపూర్ణముగా ఆవిష్కరించినది. ఇంకా రామవతార వర్ణనలు అనేక కీర్తనలలో (2-497, 3-94, 3-157, 3-155, 1-474, 2-178, 2-219, 2-220, 2-275 మొదలగు) చూడవచ్చును.

కృష్ణావతారము :

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు ॥పల్లవి॥

అంతనింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల గరుడ పచ్చాపూస
చెంతల మాలోనున్న చిన్నికృష్ణుడు ॥ముద్దు॥

రతికేళీ రుక్మిణికి రంగుమోవి పగడము
మితి గోవర్ధపు గోమేధికము
సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము
గతియై మమ్ము గాచేటి కమలాక్షుడు ॥ముద్దు॥

కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీవేంకటాద్రి యింద్రనీలము
పాలజలనిధిలోన బాయని దివ్యరత్నము
బాలువి వలె దిరిగే పద్మనాభుడు ॥ముద్దు॥ (3-577)

అని ఈ కీర్తనయందు కృష్ణుని - యశోద ముంగిటిలోని ముత్యముగా, గోపిక అరచేతి మాణిక్యముగా, కంసుటి పాలిటి వజ్రముగా, ముల్లోకాలను ప్రకాశింపజేసే గరుడపచ్చగా, రతికేళి యందు రుక్మిణీదేవి పెదవినివెట్టబరచే పగడముగా, గోవర్ధనము నెత్తు సమయమున గోమేధికముగా, శంఖుచక్రముల మధ్యన ప్రకాశించు వైడూర్యముగా, కాళింగుని తలలపై నాట్యమాడునప్పుడు పుష్యరాగముగా, వేంకటాద్రి మీద యింద్ర నీలముగా, పాలసంద్రములోని దివ్యరత్నముగా వర్ణించి నవరత్నములలో శ్రీకృష్ణుని పొదిగినాడు అన్నమయ్య. ఇంకను అనేక కీర్తనలలో (2-65, 2-110, 2-165, 2-166, 2-167, 3-149, 3-235, 2-515, 28-146, 10-20, 26-450, 10-172, 12-247, 22-420, 30-160, 24-18, 27-248, 25-258, 26-332, 27-385, 1-311, 1-35, 1-503 మొదలగు) శ్రీకృష్ణుని బాల్య క్రీడలు, మధుర భక్తిపూర్వక శృంగారలీలలు మొదలగునవి వర్ణించినాడు.

**నృసింహావతారము :**

విరిగిరి దానవ వీరులదె
అరిమురి దేవతలాడి రదె ॥పల్లవి॥

పరగు కంభమదె పగిలె పగిలెనదె
హరి నరసింహంబాయనదె
గరుడ ధ్వజ మదె ఘనచక్రంబదె
మొరసేటి శంకపు మ్రోతలవె ॥విరిగిరి॥

వెడలె వెడలె నదె వెనుకొని హిరణ్యు
డొడికి పట్టినదె తొడమీద
విడువక చించిన వేయిచేతులవె
కడప మీదవే కదలడదె ॥విరిగిరి॥

**అదె వామాంకంబందు లక్ష్మియదె**
**కదిసి శాంతమదె కరుణయదె**
**వుదుటువ ప్రహ్లాదు నూరడించెవదె**
**యిది శ్రీవేంకట వగమెక్కెనదె** ॥విరిగిరి॥ (2-91)

అని ఈ కీర్తనయందు స్తంభము నుండి వెడలిన నరసింహరూపము హిరణ్యకశిపుని సంహరించి, వామాంకముపై లక్ష్మిని ధరించి, శాంతపూర్వక కరుణముతో ప్రహ్లాదుని ఊరడించినట్లుగా నృసింహావతార ప్రయోజన పరమార్థములు వర్ణింపబడినవి.

"శ్రీవేంకటేశ్వరునిపై రచియించిన కీర్తనలను పక్కకు బెడితే అహోబలపతిపై రచించినన్ని కీర్తనలు మరి ఏదైవము పైనను రచింపలేదనుట సుప్రసిద్ధము. ఏ దైవమును పేర్కొన్నను అందరినీ తుది చరణములో శ్రీవేంకటేశ్వరునితో ముడి వెట్టుట ఆయన జీవిత సిద్దాంత లక్ష్యము"47 అని పేర్కొనబడినట్లుగా అన్నమయ్య అనేక కీర్తనల యందు (2-91, 2-112, 2-113, 2-228, 2-278, 3-151, 3-154, 3-236, 3-242) నృసింహావతార వైభవమును వర్ణించినాడు.

## 4. అంతర్యామి స్వరూపము :

జీవుని అంతరంగముననను, అంతటను వ్యాపించునది పరమాత్మ అంతర్యామి స్వరూపము.

**"తలచుకొంటే చాలు దైవమేమి దవ్వా**
**నిలుచుక తవలోనె నిండుకున్నాడు"** (2-7)

అని జీవాంతరాత్మయైన పరమాత్మను,

**"మనసులోపల నీవె మరి వెలుపల నీవె**
**యెనసి అపరాధాలు యేమి మాకు"** (2-42) అనియు,

**"అందరి లోపల నుండే అంతర్యామివి నీవు"** (3-202) అనియు,

**"ఈతడే అంతర్యామి ఈ చరాచరములకు"** (2-470) అనియు,

**"నీవు లేని చోటు నిజముగ దెలిసిన**
**ఆవల నదిగాదన వచ్చును**

శ్రీవెంకటగిరి శ్రీనాథ సకలము
భావింప నీవె పరిపూర్ణుడుగాన" (1-9)

అనియు పరబ్రహ్మ సర్వాంతర్యామిత్వమును వర్ణించినాడు. మరియు

"జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా హరినీవు
కావగ పోరాదు మాకు గల యంతర్యామివి" (2-103) అనియు,

"కాలము గర్మము మాయ కల్పించిన యట్టివాడు
ఆలించి సర్వజీవుల అంతర్యామి" (2-116) అనియు,

"భ్రమయక వుండేదీ పరమార్థము
నెమకితే నన్నిటాను నీవే వుండుదువు" (2-203) అనియు,

"చిక్కి శ్రీవేంకటేశుడు జీవుల కంతర్యామి
యిక్కు వెరిగితే నీడకిదే సూత్రము" (2-234) అనియు,

"అన్నిటికి హరి అంతర్యామి మూలము
విన్నకన్న గతులెల్లా వృథా మూలము" (2-442) అనియు,

"అంతర్యామియై దేవుడు అటు సుఖ దుఃఖము లొసగగ
అంతయు మనుజులు సేసేరని నేదిరిగితిని" (3-72)

అనియువివిధ కీర్తనలలో అన్నమయ్య పరమాత్మ అంతర్యామి స్వరూపమును అర్చించినాడు.

## 5. అర్చాస్వరూపము :

అజ్ఞ జనులను అనుగ్రహించుట కొరకు దేవాలయములందు వెలసిన పరమాత్మ ప్రతిమలు అర్చాస్వరూపములు. కలియుగమున తిరుమలయందు వెలసిన శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళ స్వరూపమే అన్నమయ్య ప్రధానముగా భావించి అనేక కీర్తనలయందు తనివితీర వర్ణించినాడు.

కీర్తన :

చూడ చూడ మాణిక్యాలు చుక్కల వలె నున్నవి
యీడు లేని కన్నులవేయిన చంద్రులు॥పల్లవి॥

కంటి కంటి వాడె వాడె ఘనమైన ముత్యాల
కంట మాలలవె పదకములు నవె
మింటి పొడవైనట్టి మించు గిరీటంబదె
జంటల వెలుగు శంఖ చక్రాలవె ॥చూడచూడ॥

ముంగై వరాలును నవె మొలకతారును నదె
బంగారు నిగ్గుల వన్నె పచ్చబట్టదె
యింగిత మెరిగి వేంకటేశుడిదె కన్నులకు
ముంగిటి నిధానమైన మూలభూతమదె ॥చూడచూడ॥ (1-133)

అని శ్రీవేంకటేశ్వరుని అర్చాస్వరూపమును వర్ణించినాడు. మరియు శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళ విగ్రహమును సంపూర్ణముగా ఆవిష్కరించినదీ క్రింది కీర్తన -

కీర్తన :

చేరి కొల్వరో యీతడు శ్రీదేవుడు
యీరీతి శ్రీవేంకటాద్రి కిరవైన దేవుడు ॥చేరి॥

అలమేలుమంగ నురమందిడుకొన్న దేవుడు
చెలగి శంఖ చక్రాల చేతి దేవుడు
కల వరద హస్తము గటి హస్తపు దేవుడు
తులసీ శ్రీవత్స వనమాలికల దేవుడు ॥చేరి॥

ఘన మకర కుండల వర్ణముల దేవుడు
కనక పీతాంబర శృంగార దేవుడు
ననిచి బ్రహ్మాదుల నాభిగన్న దేవుడు
జనించె బాదుల గంగ సంగతైన దేవుడు ॥చేరి॥

కోటి మన్మధాకార సంకులమైన దేవుడు
జూటపు కిరీటపు మించుల దేవుడు
వాటపు పామ్ముల తోడి వసుధాది పతిదేవుడు
యీటులేని శ్రీవేంకటేశుడైన దేవుడు ॥చేరి॥ (11-1)

11 సంపుటము 171వ కీర్తనలో కూడా వేంకటేశ్వర సంపూర్ణ స్వరూపము వర్ణింపబడినది.

ఇంకా వివిధ దివ్య దేశములందు వెలసిన వేంకటేశ్వర అర్చామూర్తిని అన్నమయ్య అనేక కీర్తనలలో వర్ణించినాడు. కంభమున వెలసిన శృంగారమూర్తిని(24-420), కడపలోని మూర్తిని(24-403, 24-472, 25-153, 25-252), కోనలో వెలసిన మూర్తిని (29-242), చింతకుంటలోని మూర్తిని(29-209), చిప్పిలిలోని మూర్తిని(13-307), నెదలూరులోని మూర్తిని(26-175), పాలగిరిలోని మూర్తిని(30-182), మంత్రగాద్రిలోని రూపమును(10-165), విజయనగరములోని రూపమును(24-372), ఇంకను అనేక క్షేత్రములందు వెలసిన రామ, కృష్ణ, నృసింహాది అర్చా స్వరూపములను అన్నమయ్య వర్ణించాడు.

**రాముడు :**

**ఇందులోనే కానవద్దా యితడు దైవమని**
**విందువలె నొంటిమెట్ట వీరరఘు రాముని**

**యెందుచొచ్చె బ్రహ్మవరమిల రావణుతలలు**
**కందువ రాఘవుడు ఖండించునాడు**
**ముందటి జలధియే మూల జొచ్చె కొండలచే**
**గొందిబడ గట్టివేసి కోపగించేవాడు** ॥ఇందు॥ (1-477)

అని ఒంటిమిట్టలో వెలసిన శ్రీరాముని అర్చాస్వరూపమును అన్నమయ్య వర్ణించినాడు. ఇంకను గండికోట (25-165), గుత్తి(9-210), వావిలిపాడు(2-178), విజయనగరము (2-219), వెంకటాద్రి(2-220)లలో వెలసిన రాముని అర్చాస్వరూపము స్తుతించబడినది.

**శ్రీకృష్ణుడు :**

ఉద్దగిరి కృష్ణుని గూర్చి అనేక కీర్తనలు గలవు. అందు ఒకటి,

**"మన్ననలు నాకునిచ్చి మదమెంతో మెక్కించీనే**
**కన్ను సన్నలనే యేమి గారవించీ నే**
**వున్నతి శ్రీవేంకటేశు దుద్దగరి కృష్ణుడై**
**నన్నుగూడె తన పొందు నమ్మికైన దావను"** (30-369)

అనియు, మరియు గండికోట (24-367, 26-50, 29-323), చేగలమట్టి (25-162), తుమ్మలూరు (30-179), నల్లబల్లి(30-161), మాచనవేలు(27-495), మాడుపూరు

(8-178), వత్తలూరు (28-106), విజయనగరము(17-12), వెలిగోడు (11-96), వెంకటాద్రి(24-370)లలో వెలసిన శ్రీకృష్ణుని అర్చాస్వరూప వైభవము అనేక కీర్తనలలో వర్ణింపబడినది.

**నృసింహుడు :**

అహోబిలములో వెలసిన నృసింహమూర్తిని అన్నమయ్య,

నవ నారసింహా నమో నమో
భవనాశి తీర యహోబల నారసింహా ॥పల్లవి॥

సతత ప్రతాప రౌద్ర జ్వాలా నారసింహా
వితత వీరసింహ విదారణా
అతిశయ కరుణ యోగానంద నారసింహా
మతిశాంతపు కానుగుమాని నారసింహా ॥నవ॥

మరలి భీభత్సపు మట్టెమళ్ళ నరసింహా
వరహరి భార్గోటి నారసింహా
పరిపూర్ణ శృంగార ప్రహ్లాద నారసింహా
సిరుల నద్భుతపు లక్ష్మీనారసింహా ॥నవ॥

వదన భయానకపు వరాహ నారసింహా
చెదరని వైభవాల శ్రీనరసింహా
అదన శ్రీవెంకటేశ అందునిందు నిరవైతి
పదివేలు రూపముల బహునారసింహా ॥నవ॥ (1-453)

అని ఈ కీర్తనలోని అహోబిల నవనారసింహమూర్తితోపాటు కానుగుమాని, మట్టెమళ్ళ, భార్గోటి ప్రదేశములలోని నారసింహమూర్తిని కూడా స్తుతించినాడు. జీగునూతుల (30-178), కదిరి(10-32), పేరెవరము(38-145, 38-129), భువనేశ్వరము(11-217), మండెము(29-214, 1-259) ముడియము(17-39), వేదాద్రి(9-218)లలో వెలసిన నృసింహ అర్చామూర్తులను తన సంకీర్తనలతో అన్నమయ్య స్తుతించినాడు.

## బ్రహ్మప్రాప్త్యుపాయము

భగవంతుని పొందుటయే మోక్షము. జీవునికి మోక్షమే పరమ పురుషార్థము. మోక్షము నందిచ్చగల జీవునకు కర్మ, జ్ఞాన, భక్తి యోగములు ముఖ్యసాధనో పాయములు. అన్నమయ్య కీర్తనలయందు కర్మజ్ఞాన భక్తియోగములు అన్వయించిన తీరు -

## కర్మయోగము :

ప్రతి ఫలాపేక్ష లేక నిత్యనైమిత్తిక కర్మముల నాచరించుట కర్మయెగము. ఇది దేవపూజ, తీర్థయాత్రలు, తపస్సు, దానము మొదలగువిధముగా ఉండును.

కర్మయోగమును గూర్చి భగవద్గీతయందు, "కర్మఫలముల యందు ఆసక్తిలేనివాడై, తన ధర్మముగా భావించి మానవుడు కర్మము నాచరింపవలెను. ఆసక్తి లేకుండ పని చేయుటచే జీవుడు పరమాత్మను పొందును"[48] అని చెప్పబడినది. ఈ విధముగనే అన్నమయ్య

"చేకొంటి నిహమే చేరిన పరమని
కైకొని నీవిందు కలవే కాన ॥పల్లవి॥

జగమున కలిగిన సకల భోగములు
తగిన నీ ప్రసాములే యివి
అడపడు నేబది అక్షర పంక్తులు
నిగమ గోచరపు నీ మంత్రములే ॥చేకొంటి॥

పొదిగిన సంసార పుత్రదారలిల
వదలిన నీదాస వర్గములే
చెదరక యే పొద్దు జేయు నా పనులు
కదిసిన నీ యాజ్ఞ కైంకర్యములే ॥చేకొంటి॥

వలుగడ మించిన నా జన్మాదులు
పలుమరు లిటు నీ పంపులివి
యెలమిని శ్రీవేంకటేశ్వర నీవిక
వలసినప్పుడీ వరములు నాకు ॥చేకొంటి॥ (2-517)

అని ఈ కీర్తన పల్లవియందు, ఇహమునందు కూడా పరమాత్మ ఉండును కనుక ఈ ఇహమునే పరముగా గైకొంటినని తెలిపినాడు.

మొదటి చరణమున జీవుడు ఈ ప్రపంచములో అనుభవించుచున్న సకల భోగములు భగవంతుని ప్రసాదములే అనియు, కనిపించే సమస్త అక్షరములు వేదములయందు భగవంతుని తెలిపిన మంత్రములే అనియు,

రెండవ చరణమున, సంసారమునందలి భార్య పిల్లలు భగవంతుని దాస వర్గములోని వారే అనియు, యెప్పుడును జీవులు చేయు పనులు భగవంతుని ఆజ్ఞా కైంకర్యములుగా భావించవలెననియు వివరించినాడు.

చివరి చరణమున జీవునికి కలుగు అనేక జన్మములు భగవంతుని యొక్క సంకల్పములనియు కనుక భగవతుండైన శ్రీవేంకటేశ్వరుడు తనకు యిష్టమైనపుడే వరములిచ్చుననియు, తెలుపుచు కర్మఫలము నందాసక్తిని విడిచిపెట్టుటను గూర్చి వివరించినాడు. మరొక కీర్తనయందు,

**"నగధర నీవిటు నడపేటి కర్మము**
**నగినగి తోయగ నా వశమా**
**తగు శ్రీవేంకట దైవము నాపాల**
**దగిలితి నితరము దలచగ వశమా"** (3-408)

అని భగవంతుడు నడిపేటి కర్మము తోసివేయుట తన వశము కాదనియు, దైవమయిన శ్రీవేంకటపతి తనను తగిలినందువలన యిక యితరములయిన వాటిని గూర్చి తలచుటకు తనకు వశము కాదనియు అన్నాడు. మరియొక కీర్తనలో

**"కర్మము శ్రీవేంకటపతి కార్యము**
**కర్మము దేహికి కాణాచి"** (2-501)

అని జీవుడు చేయు కర్మమంతయు భగవంతుడైన శ్రీవేంకటేశ్వరునిచే నియోగింపబడిన కార్యమనియు, ఈ కర్మమే దేహాత్మకు చిరకాల నివాసస్థానమనియు తెలిపినాడు.

ఈ విధముగా జీవుడు భగవంతునిచే విధింపబడిన కర్మమును అనుభవించవలెననియు, అట్టి కర్మమునందు ప్రతిఫలాపేక్ష వదిలి నిష్కామముగా ఆచరింపవలెననియు, చెప్పుచు,

**"శ్రీమంతుడైనట్టి శ్రీవేంకటేశ నిను**
**నేమమున గొలిచి తుచ్ఛెములడుగదగునా"** (3-582)

అని తుచ్ఛములైన కోరికలు కోరననియు,

**"పొగిడితే బాపమేది పుణ్యమేది కర్మమందు**
**వొవర ఫలమొల్లని యోగికిని "** (2-19)

అని ఫలమునందాసక్తిలేని యోగి యొక్క కర్మమునకు పాపము పుణ్యము అనునవి ఉండవనియు,

**"మలసి కామ్యకర్మములకు జొచ్చిన మగుడ బుట్టువులు మానునా"** (2-22)

అని కామ్య కర్మములు ఆచరించినచో జన్మములు కలుగుననియు,

**"కలసి కర్మము లెల్లా నీ కైంకర్యములందు వెట్టితి**
**బలు మమకారము నీపై జేర్చితి**
**యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి**
**నిలిచిన కాలమెల్లా నీ సేవే చేసితి"** (2-215)

అని ముముక్షువైన తాను చేయు కర్మలన్నియు భగవంతుని కైంకర్య రూపము లోనివే ననియు, తన మమకారమంతయు భగవంతునిపై చేర్చితిననియు, అందువలన వేంకటేశుడు తనను రక్షించె ననియు, జీవించునంత కాలము భగవంతుని సేవా రూపక కర్మమునే చేతుననియు. అన్నమయ్య నిష్కామ కర్మవిధానమును గూర్చి తెలిపినాడు.

జీవుడు తన కర్మము నంతటిని భగవంతునికి అర్పణచేయ వలెనని భగవద్గీత యందు "తమ కర్మల నన్నింటిని నాయందు విడచి, అన్యచింతలేక నాయందు మనస్సులను స్థిరీకరించి నన్నే ఎల్లప్పుడును ధ్యానించు వారిని జనన మరణ రూప సంసార సముద్రము నుండి సత్వరముగా రక్షింతును"[49] అని తెలుపబడినది. అట్లే అన్నమయ్య,

**"సర్వాత్మకుడవు సర్వేశ్వరుడ నా**
**పూర్వాపరాలు నీకే భువి సమర్పయామి"** (3-571) అనియు,

**"నెరపిన నా కర్మ ఫలంబులు నీకు సమర్పణ సేసితిని"** (2-302) అనియు, తన యొక్క పూర్వాపరముల కర్మఫల మంతయు సర్వేశ్వరునికి సమర్పించినాడు. మరియును

"పొందుగ వచ్చుతు బూజించు పూజలు
కిందట గొన కెక్కడి నిచ్చెనలు" (3-564)

అని అచ్యుతునికి చేసెడి పూజలు కొనదైన పరమ పదమునకు చేర్చెడి నిచ్చెనల వంటివనియు,

"పంచి యజ్ఞముల ఫలమైయున్నవి
నించి దేవ నీ నిజపూజలె పో" (3-348)

అని భగవంతుని పూజలే యజ్ఞ ఫలములను యిచ్చుననియు, తెలిపినాడు.

ఇట్టికర్మ యోగాచరణము వలన జీవుడు నిర్మలమైన అంతఃకరణము కలవాడై సమస్త దుర్గుణములను జయించి, జ్ఞాన యోగమును, భక్తి యోగమునకు అంగముగా జేసుకొని మోక్షమునకై ప్రయత్నించును.

## జ్ఞానయోగము :

ఆత్మానాత్మ వివేకము, పరమాత్మ స్వరూపావగాహనము, జ్ఞానయోగము. జ్ఞానమును గూర్చి భగవద్గీత, "ఈదేహమును, దేహము నెరింగిన వానిని తెలుసు కొనుటయే జ్ఞానము"[50], అనియు, "కర్మము సమస్తమును జ్ఞానమందు సమాప్తినొందును"[51] అనియు, "మండుచున్న అగ్ని కట్టెలను బూడిదగా చేయునట్లు జ్ఞానమనెడి అగ్ని భౌతిక కర్మ ఫలితములన్నింటిని బూడిదగ చేసివేయును"[52], అనియు "జ్ఞానముతో సమానమైనది పవిత్రమైనది ఈ ప్రపంచములో లేదనియు"[53] తెలిపినది.

ఇట్టి జ్ఞాన యోగమును గూర్చి అన్నమయ్య -

ఇట్టె జ్ఞాన మాత్రమున నెవ్వరైనా ముక్తులే
పుట్టుగులు మరిలేవు పొందుదురు మోక్షము" ॥పల్లవి॥

అతి సూక్ష్మమీ యాత్మ అందులో హరియున్నాడు
కతలే వినుట గాని కానరాదు
క్షితి దేహాలు ప్రకృతి చెందిన వికారములు
మతినిది తెలియుటేమహిత సుజ్ఞానము ॥ఇట్టె॥

లోకము శ్రీపతి యాజ్ఞలో తత్వాలిరువది నాల్గు
కైకొని సేతలుసేపే గర్తలులేరూ
సాకిరింతే జీవుడు స్వతంత్రుడు దేవుడు
యీ కొలదిగని సుఖియించుటే సుజ్ఞానము ॥ఇట్టె॥ (3-211)

అని ఈ కీర్తన పల్లవియందు జ్ఞానము కలిగినందు వల్లనే ఎవ్వరైనను ముక్తిని పొందెదరని చెప్పి, తర్వాతి చరణములయందు "జ్ఞానమును" నిర్వచించినాడు.

మొదటి చరణమున జీవాత్మ అతి సూక్ష్మమనియు, అందుపరమాత్మ ఉండుననియు, అట్టి ఆత్మకు ప్రకృతి వికారము వలన నశించు దేహము కలుగుననియు, ఇది తెలుసుకొనుటయే సుజ్ఞానమనియు, అనుచు,

తర్వాతి చరణమున పరమాత్మ ఆజ్ఞతో ప్రకృతి ఇరువది నాల్గు తత్త్వములతో కూడుకొని పనులు చేయుననియు, పరమాత్మ తప్ప వేరే కర్తలులేరనియు, జీవుడు కేవలము సాక్షీభూతుడనియు, దేవుడు స్వతంత్రుడని తెలుసుకొని సుఖించుటే జ్ఞానమనియు అన్నమయ్య వివరించినాడు. ఈ విధముగా ఈ కీర్తనయందు ఆత్మానాత్మ వివేకము, పరమాత్మ స్వరూపావగాహన రూపకమునగు జ్ఞానమును గూర్చి వివరించబడినది. ఇంకను,

**"అన్నిటికి ప్రేరకుడు ఈశ్వరుడింతే**
**పన్నియీతని దెలిసి బ్రదుకుటే జ్ఞానము"** (2-288)

అని ప్రేరకుడైన పరమాత్మను గూర్చి తెలుసుకొనుటయే జ్ఞానమని తెలిపినాడు. ఇట్టి జ్ఞానమును భక్తియోగమునకు అంగముగా చేసుకొని మోక్షమునకై ప్రయత్నించుటను గూర్చి భగవద్గీత 'అనేక జన్మముల తర్వాత జ్ఞానులు వాసుదేవుడే సర్వమని నమ్మి నన్ను శరణుజొచ్చెదరు"[54] అని తెలిపినది.

## భక్తియోగము :

జీవుడు సమస్త కర్మములను భగవంతునియందు సమర్పించి, ఆతడే గతియని నమ్మి అతని యందే చిత్తమును నిలిపిఉండుట భక్తి. భక్తియోగము యొక్క ప్రాముఖ్యతను గూర్చి భగవద్గీత "అన్ని పరిస్థితులలోను నిశ్చలమైన భక్తియోగములో నిమగ్నుడై యుండు వాడు వెంటనే ప్రకృతి గుణముల నతిక్రమించి బ్రహ్మ స్థితికి వచ్చును"[55] అని తెలిపినది.

రామానుజులు సాధన సప్తకముతో, అష్టాంగ యోగములతో కూడుకొని తైలధారవలె అవిచ్ఛిన్నమగు భగవంతుని స్మృతి పరంపరగా సాగునది భక్తియోగమని తెలిపిరి.

ఇట్టి భక్తి తొమ్మిది విధములుగా గలదని భాగవత పురాణము తెలిపినది. నారద శాండిల్యులు తమ భక్తి సూత్రములయందు వివిధ భక్తి భేదములను తెలిపిరి.

ఇట్లు వివిధ భేదములతో కూడుకొని ఉన్న భక్తియోగమును అన్నమయ్య తన కీర్తనలయందు పలుచోట్ల వర్ణించినాడు. అందుకొన్ని ఉదాహరణములు.

భాగవతమున ప్రతిపాదింపబడిన నవవిధ భక్తి మార్గములు అన్నమయ్య వర్ణించిన తీరు.

1. **శ్రవణము :**

**"శ్రీపతి మీకథ చెవులను వింటిమి**
**పాపము లణగెను భయమణఁగె"** (2-322)

అని శ్రీపతి కథా శ్రవణము వలన పాపములు, భయములు తొలగినవని అన్నమయ్య తెలిపినాడు.

2. **కీర్తనము :**

**"హితమైన యిహపరాలిష్టమైన వెల్లానియ్య**
**సతమై కలదుగా నీ సంకీర్తన"** (2-430)

అని భగవతుని సంకీర్తన వలన ఇహ పరములు, ఇష్టమైన కోరికలు కలుగునని తెలిపినాడు.

3. **స్మరణము :**

**"ఇచ్ఛలో గోరే వెల్లా ఇచ్చే ధనము**
**అచ్చుతు నామమె పో అధికపు ధనము**
**నారదాదుల నొగడే నాలుకపై ధనము**
**సారపు వేదాలలో చాటే ధనము**
**కూరిమి మునులు దాచుకున్నట్టి ధనము**
**నారాయణ నామమిదే నమ్మినట్టి ధనము"** (3-27)

అని అచ్యుతుని నామమును స్మరించుట వలన కోరిన ధనమెల్లా లభించుననియు, ఆ నామమే అధికమైన ధనమనియు, నారదుడు మొదలగు వారి చేత స్మరింపబడిన నాలుకపైని ధనమనియు, అట్టి నారాయణ నామమే నమ్మదగిన ధనమనియు నామ స్మరణమును గూర్చి తెలిపినాడు.

4. పాదసేవనము :

"శ్రీకాంతుడ నీ పాద సేవకులయిన వారు
పాకశాసనాదులును బ్రహ్మాదులును" (3-286)

అని ఇంద్రాదులు, బ్రహ్మాదులు భగవంతుని పాదములను సేవించువారనుచు పాదసేవనము గూర్చి తెలిపినాడు.

5. అర్చనము :

"నిన్ను బూజించే వారి నిజ పరతత్త్వమవు
యిన్నిటా నీ దాసులకు యేలికవు" (2-173)

అని భగవంతుని అర్చించే వారికి నిజమైన పరతత్త్వము లభించుననియు, దాసులకు ఆతడే ఏలిక అనియు అర్చనమును గూర్చి వివరించినాడు.

6. వందనము :

"నమో నమో లక్ష్మీ నరసింహా
నమో నమో సుగ్రీవ నరసింహా" (2-348)

అని నరసింహునికి వందనము లాచరించినాడు.

7. దాస్యము :

"ఆదికి ననాది హరిదాస్యంబిది
వేదాంతంబుల వెలసినది
సోదించి కనిరి శుకనారదాదులు
పాదుగ నిక తమ భాగ్యము కొలదీ" (3-261)

హరి దాస్యము అనాది అనియు, వేదాంతముల యందు చెప్పబడినదనియు, శుక నారదాది నిత్యముక్తులచే ఆచరింపబడినదినియు దాస్య భక్తి ప్రాచీనతను, ప్రబోధమును, ఆచారమును అన్నమయ్య ప్రకటించినాడు.

8. సఖ్యము :

"బలువగు తన రూపము చూపెన్
కలదింతయు ఘనతెరింగించెన్ ॥పల్లవి॥

పాండవ రక్షణ పరుడై నరునకు
నండనె తెలిపె మహామహిమ
దండె విడచి తన దయతో నర్జును
డుండగ మగటిమి నొడబడ బలికె ॥బలువగు॥

మగుడగ కుల ధర్మములు పుణ్యములు
తెగి పార్థునకుపదేశించెన్" ॥బలువగు॥ (1-295)

అని అర్జునునికి శ్రీకృష్ణుడు గీతోపదేశము చేసిన వృత్తాంతమును వర్ణించినాడు. నరనారాయణులు మిత్రులు. అర్జునుడు ధైర్యమును కోల్పోయి ఉండగా కృష్ణుడు క్షత్రియ ధర్మములను, పుణ్యములను ఉపదేశించినాడనియు, తెలిపినాడు. అర్జునుడు కృష్ణుని యందు సఖ్యభక్తిని కలిగియున్నందువలననే గీతోపదేశమును పొందినాడు అని స్ఫురింపజేయుచు సఖ్యభక్తిని వర్ణించినాడు.

**9. ఆత్మ నివేదనము :**

**"అలతునో సొలతునో నేనీయందు భక్తి సేతునో సేయనో**
**యెలమినీకు నివేదించక యేమేమి భుజియింతునో**
**తలచేటి నా మనసే నీకును ధనముగా కప్పము వెట్టితిని**
**పలుమరు నన్నును తగవుకు దియ్యక పరమాత్మనను గావవటే"** (2-302)

అని అలసి సొలసి నీ యందు భక్తిని చేతునో లేదోయని, భగవంతుడవైన నీకు నివేదించక నేనేమి భుజించెదనోయని, కనుక నా మనస్సే నీకు ధనముగా కప్పము పెట్టితిననియు, రక్షింపుమనియు వేడుకొనుచు అన్నమయ్య ఆత్మ నివేదనము చేసినాడు.

ఈవిధముగా భాగవతమునందు పేర్కొనబడిన నవవిధ భక్తులను అన్నమయ్య తన కీర్తనలలో వర్ణించినాడు. ఈ భక్తి భేదములనే నారద శాండిల్యులు తమ భక్తి సూత్రములలో వివరించిరి. అందు నారదుడు నవవిధ భక్తి భేదములకు సమానములగు వాటిని ఏడింటిని చెప్పుటతో పాటు వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, తన్మయాసక్తి, పరమవిరహాసక్తి అని మరికొన్ని భక్తి భేదములను జేర్చి మొత్తము పదకొండు భేదములను తెలిపినాడు. నారదుడు చెప్పిన విశేషమగు నాల్గు భక్తి భేదముల లక్షణములు కూడా అన్నమయ్య కీర్తనలలో కన్పించుచున్నవి. ఆ లక్షణములు గల కీర్తనలు యివి.

**వాత్సల్యాసక్తి :**

భగవంతునియందు వాత్సల్యముతో ఆసక్తి కలిగియుండుట.

**ముద్దుగార నిదె ముంగిట నిలుచున్నాడు**
**వొద్దకేగి చెలులెల్ల వూరడించరే ॥ముద్దు॥**

**వేకువ జామున లేచి వేడుక కృష్ణుడు తల్లి**
**ఆకలయ్యీ ననుచు వొయ్యనె మంచము దిగి**
**కాకలతో వసివాడికన్నులు పులుముకొంటూ**
**మొకరుచు మన్నవాడు యెత్తుకోరె బిడ్డని ॥ముద్దు॥ (30-160)**

అని ముంగిట నిలుచున్న ముద్దు కృష్ణుని రూపమును వర్ణించుచూ, కృష్ణుడు వేకువ జాముననే లేచి ఆకలనుచు తన తల్లిని అడుగుచు, కన్నులు నులుపుకొనుచు, ఉన్నాడనియు, ఆ బిడ్డను ఎత్తుకొనరే అనుచు అన్నమయ్య యశోదవలె కృష్ణునియందు వాత్సల్యభక్తిని ప్రదర్శించినాడు.

**కాంతాసక్తి :**

భగవంతుని నాయకునిగా తలచి భక్తుడు నాయికవలె సేవచేయుట యందు ఆసక్తి కలిగియుండుట

**ఎఱుగ గొల్లపడుచ నిల్లు గాచకుండగాను**
**మఱి కృష్ణుడు వచ్చి నామయి చెమరింపించెనే ॥పల్లవి॥**

**పాపట దువ్వేనంటా బాసికము గట్టీనాడే**
**చాపేనంటా చేత సేసెలు చెల్లేనే**
**కాపురాలు సేతమని కౌగిలించుకొననే**
**మాపుదాక నేమో సేసి మనసు గరచేనే ॥ఎఱుగ॥ (24-18)**

అని తాను గొల్లపడుచు అయి ఇంటి ముందు ఉండగా కృష్ణుడు వచ్చి తన తనువును పులకింపజేసినాడనియు, తలదువ్వెదననుచు బాసికము గట్టినాడనియు, చేతులు చాపెదననుచు అక్షింతలు చల్లినాడనియు, కాపురము చేయుదుమని కౌగిలించెననియు, మాపుదాక ఏమేమో చేసి మనసును దోచినాడనియు అన్నమయ్య తనను నాయికవలె భావించుకొని నాయకుడైన కృష్ణుడు చేసిన పనులను వర్ణించినాడు.

**పరమవిరహాసక్తి :**

పరమాత్ముని విడచి ఒక్క క్షణమైనా ఉండలేక మహావిరహాసక్తిని కలిగి ఉండుట.

**వలసి వచ్చితి నేను వానికి గాను**
**నెలవై మీ గొల్లవాడనే తాముండువంటా ॥పల్లవి॥**

**చెందమ్మి కన్నులవాడు చేతి పిల్లగోవివాడు**
**యిందు వచ్చె గంటిరా యేమిరే యమ్మ**
**మంద పసువుల వాడు మకరాంకముల వాడు**
**యెందుమన్నాడు చెప్పరే యేల దాచేరమ్మా ॥వలసి॥ (24-14)**

అని తాను గోపికయై, గొల్లవాడల యందు ఉండెడి కృష్ణునికై వచ్చితిననియు, ఆ కృష్ణుడు తామర పూరేకుల వంటి కన్నులు కలవాడనియు, మకరాంకములు కలవాడనియు, వాడుయిటే వచ్చినాడనియు, అతడు ఎక్కడ వున్నాడో చెప్పమనియు, దాచిపెట్టి దనను బాధించవద్దనియు పరమ విరహాసక్తిని ప్రకటించినాడు.

**తన్మయతాసక్తి :**

భగవంతునితో ఐక్యమును పొందుట యందాసక్తి కలిగియుండుట.

**"చిత్తంబు లోపలను శ్రీవేంకటేశ్వరుని**
**హత్తించినాడు తానయి యుండవలదా**
**కొత్తయిన యిటువంటి కొదలేని సంగతుల**
**తత్తరము మున్నడి తగులంగ వలదా" (12-230)**

అని మనస్సులో భగవంతుని గట్టిగా నిలుపుకొని నాయికవలె ఉండవలెననియు, కొత్తైన యిటువంటి వెలితిలేని సంగతులయందు తొట్రుపాటును వదలి భగవంతుని తగులవలెను" అనియు అన్నమయ్య తన్మయతాసక్తిని వర్ణించినాడు.

ఈ విధముగా వ్యాస నారదాదులు విశదీకరించిన భక్తి విశేషములను అన్నమయ్య తన కీర్తనలయందు వర్ణించినాడు. ఈ భక్తి భేదములే గాక అన్నమయ్య "నానావిధ భక్తులను" మరి కొన్నింటిని తెలిపియున్నాడు.

## అన్నమయ్య భక్తి మార్గములు :

నానా భక్తులివి నరుల మార్గములు
యేనెపాన నైనా నాతడియ్యకొను భక్తి ॥పల్లవి॥

హరికిగా వాదించుటది ఉన్మాదభక్తి
పరుల గొలువకుండుటే పతివ్రతాభక్తి
అరసి ఆత్మగనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి చొక్కుటే ఆనందభక్తి ॥నానా॥

అతి సాహసాల పూజ అది రాక్షసభక్తి
ఆతని దాసుల సేవే అది తురీయభక్తి
క్షితి నొక పనిగోరి చేసుటే తామసభక్తి
ఆతడే గతని ఉండుటది వైరాగ్యభక్తి ॥నానా॥

ఆట్టై స్వతంత్రుడౌటె అది రాజసభక్తి
నెట్టన శరణమటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే చేసి
తట్టుముట్టు లేనిదే తగ నిజభక్తి ॥నానా॥ (2-429)

అని అన్నమయ్య "నరుల మార్గములు నానా భక్తులివి" యని ఉన్మాదభక్తి, పతివ్రతా భక్తి, విజ్ఞానభక్తి, ఆనందభక్తి, రాక్షసభక్తి, తురీయభక్తి, తామసభక్తి, వైరాగ్యభక్తి, రాజసభక్తి, నిర్మలభక్తి,, నిజభక్తులను తెలిపినాడు.

రామానుజ సంప్రదాయానుసారియైన అన్నమయ్య పేర్కొన్న ఈ నానావిధ భక్తి మార్గములను సంప్రదాయ పరముగా సమన్వయము చేసుకొన్నచో, ఈ భక్తి మార్గములన్నియు తమతమ నడవడుల ద్వారా శ్రీవైష్ణవ మతమునకు ప్రాచుర్యము కలిగించిన ఆళ్వారులు అనుసరించి తరించిన మార్గములే అని చెప్పవచ్చును. ఈ నానావిధభక్తుల ద్వారా అన్నమయ్య ఆళ్వారుల వృత్తాంతములను స్ఫురింపజేసినాడన వచ్చును. ఒకొక్కక్క భక్తిమార్గము ఒక్కొక్క ఆళ్వారు గాథను తెలియజేయునదిగా అన్నమయ్య భావించినాడు అనవచ్చును.

**1. ఉన్మాదభక్తి :**

ఈ మార్గము ననుసరించి తరించినవారు పెరియాళ్వారులు. వీరి సంస్కృత నామధేయము విష్ణుచిత్తులు. మోక్షప్రదమగు పరతత్త్వ ప్రతిపాదనమునకై పాండ్యరాజు పండిత ప్రకాండుల కొరకు చాటింపువేయించెను. అప్పుడు విష్ణుమూర్తి పెరియాళ్వారుల స్వప్నములో కనిపించి పాండ్యసభలో పరతత్త్వ నిరూపణము చేయుమని ఆజ్ఞాపించెను. విష్ణుచిత్తుడు తాను పండితుడు కాకపోయినను, విష్ణ్వాజ్ఞానుసారము, ఆ విష్ణువునే చిత్తములో నిలుపుకొని వాదన ప్రారంభించినాడు. అపుడు విష్ణుచిత్తుని ముఖము నుండి విష్ణుతత్త్వమును స్థాపించునట్టి వేద, ఉపనిషత్, స్మృతి, పురాణ, ఇతిహాస సూక్తులు గంగా ప్రవాహమువలె జాలువారినవి. సభాసదులు, పండితులుగోడమీది బొమ్మలవలె ఉండిపోయిరి. ఈ విధముగా విష్ణువు తమ నావహించగా విష్ణుచిత్తులు విష్ణువు కొరకు వాదించి పాండ్యసభలో పరతత్త్వమును స్థాపించిరి. ఇదియే హరికిగా వాదించెడి ఉన్మాద భక్తిమార్గము.

**2. పతివ్రతాభక్తి :**

ఆళ్వారులందరునూ ఈ భక్తిమార్గమును అవలంబించినవారే. అయినను ముఖ్యముగా పేర్కొనదగిన 'తిరుమళిశై ఆళ్వారులు' (భక్తిసారులు) ఈ మార్గముననే పయనించి తరించినారు. వీరికి కేవలము నారాయణ ధ్యానము, తద్గుణానుభవమే ఆహార పానీయములు. ఒకనాడు వీరు ఒక బహిఃప్రదేశమున భగవద్గుణ పరశులై ఉండగా శివుడు త్రిశూలము ధరించి పార్వతీ సమేతుడై నందివాహన మెక్కి దిక్కులను ప్రకాశింపజేయుచు, ఆకాశమార్గమున వచ్చుచుండెను. పరమ వైష్ణవులయిన భక్తిసారులు ఆకాశము నుండి వచ్చునది శివుడని గ్రహించి ఆయన నీడకూడా తన మీద పడకూడనదని తలచి వెంటనే తనవద్ద నున్న బొంతకప్పుకొని దట్టమైన కప్పుగల ఒక యింటి కిందికి వెళ్ళి నిలిచినారు. ఇదియే "పరుల కొలువ కుండెడి పతివ్రతాభక్తి".

**3. విజ్ఞానభక్తి :**

పొయ్‌గయాళ్వారులు, పూదత్తాళ్వారులు, పేయాళ్వారులు అను ముగ్గురు ఆళ్వారులు ఏకాత్మ గలిగియుండి "ముదలాళ్వారులు" అని ఖ్యాతి వహించిరి. వీరి సంస్కృత నామములు వరుసగా కాసరయోగి, భూతయోగి, మహాయోగి. వీరు

ముగ్గురును విష్వక్సేనుని ఉపదేశము చేత బంధమునందును, మోక్షమునందును, జ్ఞానానందమయమగు ఈ ఆత్మ నారాయణునకు దాసభూతమనియు, ఇదే ఆత్మ లక్షణమనియు, పరమాత్మ జీవాత్మపై సర్వ అధికారములు గలవాడనియు, ఈ పరస్పర సంబంధము స్వభావసిద్ధము అనెడి శుద్ధసత్వజ్ఞానము కలవారైరి. ఇదియే అరసి ఆత్మగనెడి విజ్ఞానభక్తి మార్గము.

**4. ఆనందభక్తి :**

ఆళ్వారులలో ప్రధానులగు నమ్మాళ్వారులు ప్రాకెడి వయస్సులోనే ప్రాకుకుంటు వెళ్ళి, చింతచెట్టుతొర్రలో ప్రవేశించిరట. కళ్ళు తెరవక, ఉలుకు పలుకు లేక పదహారు సంవత్సరములు అట్లే గడిపిరట. ఆ చెట్టు తొర్రయందే వారు భగవదనుభవమును, నిర్భరత్వాను సంధానమును సర్వవేద, పురాణ, ఇతిహాస, స్మృతి జ్ఞానమును, సర్వవిధ భగవత్సాక్షాత్కారమును పొందిరట. ఇదియే "అరమరచి చొక్కెడు ఆనంద భక్తిమార్గము.

**5. రాక్షసభక్తి :**

తిరుమంగై ఆళ్వారుల వృత్తాంతం రాక్షసభక్తికి ఉదాహరణముగా చెప్పుకొన వచ్చును. వీరు భాగవత-భగవత్ కైంకర్యమునకై ఇండ్లలో దొంగతనములు, దారి దోపిడీలుచేసిరి. చివరకు పెండ్లి కుమారుని రూపములో వచ్చిన విష్ణువును కూడ దోచుకొనదలచిరి. ఒక ఓడ వ్యాపారిని మాటలతో మోసగించి అతని ద్రవ్యములో సగభాగము గ్రహించి దానిని అమ్మి భగవత్ కైంకర్యము చేసిరి. అట్లే ఒక బౌద్ధాలయములోని బుద్ధుని బంగారు విగ్రహమును అతి సాహసముతో దొంగిలించిరి. ఆ కార్యమున తన బావమరిది బలియైనా లెక్కించక ఆ విగ్రహమును చేజిక్కించుకొని, బౌద్ధులను మోసగించి, భగవత్ కైంకర్యము చేసిరి. భగవత్ కైంకర్యమును గూర్చి చేయునది ఏది అయినను అకృత్యముకాదని వీరి అభిప్రాయము.

శ్రీరంగనాధుని ఆలయమునకు నాల్గవ ప్రాకారములు నిర్మింపజేసి తాపీ మేస్త్రీలకు ఒక్క పైసా కూడ ఇవ్వలేదు. అందుకు వారు తనపై దొమ్మికి రాగా, పొరుగూరిలో ఉన్న ధనమిచ్చెదనని, మంచి మాటలతో వారిని నమ్మించి, పడవపై ప్రయాణమునకు సిద్ధపరచిరి. ప్రయాణ మార్గమున నావికులను రహస్యముగా ఒప్పించి పడవ ముంచి ఆ మేస్త్రీలను చంపించిరట.

ఈ విధంగా ఎన్నో అబద్ధాలు ఆడి, దొంగతనాలు మోసాలు చేసి చివరకు ప్రాణములను సైతము తీసి భగవత్-భాగవత కైంకర్యము చేసిరి. ఇదియే అతి సాహసాల పూజ అనెడి భక్తి మార్గము.

**6. తురీయభక్తి :**

తిరుమంగై ఆళ్వారులు భాగవత సేవచేసి ఈ తురీయ భక్తి మార్గమును అనుసరించుట జరిగినది. (ఈ తురీయ భక్తిమార్గమును గూర్చి "అన్నమయ్య భాగవతనిష్ఠ" అను అధ్యాయమున విపులముగా వివరించబడినది.)

**7. తామసభక్తి :**

పన్నిద్దరు ఆళ్వారులలో ఒకరైన గోదాదేవి భగవత్సాన్నిధ్యము కొరకు తానొక గోపికయయి భావనావ్రత మాచరించినది. గోపికలను మేలు కొలిపి నందమందిరమున కరిగి కృష్ణునకు తన అంతరంగమును తెలిపినది. ఈ భావనలే "తిరుప్పావై" అను ముప్పది పాశురములు గల ప్రబంధము. ఇదియే క్షితి నొకపనిగోరి అనుసరించెడి తామసభక్తి మార్గము.

**8. వైరాగ్యభక్తి :**

దాదాపుగా ఆళ్వారులందరిలోను వైరాగ్యభక్తి భావనలు గలవు. అందు ముఖ్యులు రాజ్యపరిపాలకులైన కులశేఖరులు. వీరు వైష్ణవ ద్వేషుల మధ్య ఉండుట కన్న దావాగ్ని మధ్యమున ఉండుట మేలని భావించిరి. రాజ్యమును భగవత్-భాగవత సేవా విడిది అని ఎంచి, మానవ సాంగత్యమూ వీడి శ్రీరంగ నిత్యనివాసమును గోరి, అచ్చటికి చేరి శ్రీరంగనాథుని సేవించుకొనిరి. ఇదియే అతడే గతియని ఉండెడి వైరాగ్యభక్తి.

**9. రాజసభక్తి :**

తన పూజ తప్ప హరియితరము మెచ్చడని స్వతంత్రించుట రాజసభక్తిగా చెప్పబడినది.

శరణాగతియే "నిర్మలభక్తి" యనియు వేంకటేశ్వర కైంకర్యమే "నిజభక్తి" అనియు చెప్పుటలో ఆళ్వారులు అందరును అనుసరించిన శరణాగతి, కైంకర్యభక్తి మార్గములు స్ఫురించుచున్నవి.

## అన్నమయ్య కీర్తనలలో నానావిధ భక్తి మార్గములు :

1. **ఉన్మాదభక్తి** : హరికిగా వాదించుటది ఉన్మాదభక్తి.

> **"పిల్లిగాని నల్లిగాని పిన్నఎలుకైనగాని**
> **కల్లగాని పొల్లగాని కాని యేమైన**
> **బల్లిదుడై వేంకటాద్రి పైనున్న యాతడే మ**
> **మ్మెల్ల కాలమును యేలే యింటి దైవము" (1-214)**

అని వేంకటేశుడే రూపములో నున్ననూ కొలిచెదనని తన ఉన్మాద భక్తిని అన్నమయ్య ప్రకటించినాడు.

2. **పతివ్రతాభక్తి** : పరుల కొలువ కుండుటే పతివ్రతాభక్తి.

> **"నిన్నేగాని యితరులనే గొలువ నొల్లనంటి**
> **వున్నతి పరద్రవ్యాలొల్లనంటి" (26177)**

అని అన్నమయ్య తన పాతివ్రత్య భక్తిని గూర్చి తెలిపినాడు.

3. **విజ్ఞానభక్తి** : పరమాత్మ తత్త్వమును తెలుసుకొనుటయే విజ్ఞానభక్తి.

> **"చేతన్య మీతనిది సృష్టి యీతని ఘటన**
> **ఆతుమ శ్రీవేంకటేశు డంతర్యామి**
> **రాతరి బగలు దానే రక్షకుడు మనలకు**
> **పోతరించి యిక మెచ్చి పొగడ జోటేదయ్య" (3-264)**

అని చైతన్యమిచ్చువాడు, సృష్టిని చేసినవాడు, ఆత్మఅయినవాడు, అంతర్యామి అయినవాడు శ్రీవేంకటేశుడే అనియు, ఏకాలమైనను ఆతడే రక్షకుడనుచు పరమాత్మ తత్త్వమును తెలుసుకొను విజ్ఞానభక్తిని పేర్కొనినాడు.

4. **ఆనందభక్తి** : ఆదమరచి చొక్కుటే ఆనందభక్తి.

> **"పాలించి శ్రీవేంకటాద్రి పతి నాకు గలుగగ**
> **ఆలరినై గెలిచితి హైహై నేను" (2-513)**

అని వేంకటేశ్వరుడు తనకు లభించిన ఆనందమును ప్రకటించినాడు అన్నమయ్య.

5. **రాక్షసభక్తి** : అతి సాహసాల పూజ. ఇది రాక్షసభక్తి.

"మొక్కరో మీరు మోసపోక మీరు
దిక్కు దెసైన ఆది దేవునికి
మారుచేతలీయవద్దు - మారుగాళ్లీయవద్దు
బీరాన గుండెలు గోసి పెట్టవద్దు
గోరపడి చిచ్చులోన గుండాలు చూఱవద్దు" (11-62)

అని చేతులు కాళ్ళుబలి యిచ్చుట, గుండెలు కోసుకొనుట. నిప్పుల గుండములపై నడుచుట మొదలగు సాహసములతో కూడిన భక్తి రాక్షసమనియు దానిని అనుసరించ వద్దనియు అన్నమయ్య తెలిపినాడు.

6. **తురీయభక్తి** : హరిదాసులను సేవించుటయే తురీయభక్తి.

"హరిప్రసాద జీవనై గర్వించుట కంటే
నరయ నీ దాసుల లెంకౌ టెక్కుడు" (2-483)

అని హరి ప్రాసదమున కన్నను హరిదాసులకు సేవకునిగా ఉండుటయే గొప్పయని చెప్పుచు తురీయ భక్తిని పేర్కొనినాడు.

7. **తామసభక్తి** : ఒకపనిని మాత్రమే కోరి భక్తిని ప్రకటించుట.

**"సకలోద్యోగంబులుమాని సకలోపాయంబులు విడచి
సకలేంద్రియముల జాలటు మాని సకల విషయముల రహితుడై
సకలము దవవలె భావించి సర్వాంతరాత్మువు నిను దెలిసి
అకలంకంబున నుండెడి భావంబది యిక నెన్నడొకో!"** (2-127)

అని, అన్నికర్మములు మాని, అన్ని ఉపాయములు విడచి, సకలేంద్రియములను నిగ్రహించి, అన్నియును సర్వాంతరాత్మను వలెనే భావించి ఉండెడి భావము ఎన్నడు కలుగునో - అట్టి భావమును మాత్రమే కోరెడి తామసభక్తిని అన్నమయ్యో ప్రకటించినాడు.

8. **వైరాగ్యభక్తి** పరమాత్మయే గతియని ఉండుట.

**"అతడే గతియని ఉంటే నన్నిటా మాన్యుడు
ఇతరాలు మానగానే యీతనికే శలవు"** (2-511)

అని పరమాత్మయే గతియని నమ్మినవాడు మాన్యుడనియు, ఇతరములు మానుట వలన ఆతనిని పొందవచ్చుననియు తెలిపినాడు.

**9. రాజసభక్తి :** స్వతంత్రుడౌటే రాజసభక్తి.

**"నేనొక్కడ లేకుండితే నీకృపకు బాత్రమేది**
**వూని నావల్లనే కీర్తి పొందేవు నీవు" (3-48)**

అని తాను లేకపోతే భగవంతుని అనుగ్రహమునకు పాత్రమైనది లేనేలేదనియు, తన వల్లనే భగవంతుడు కీర్తిని పొందినాడనియు అన్నమయ్య రాజసభక్తిని వర్ణించినాడు.

**10. నిర్మలభక్తి :** స్వామిని శరణు అనుటయే నిర్మలభక్తి.

**"కంటిరా వింటిరా కమలనాభుని శక్తి**
**వొంటి నితని శరణమొక్కటే వుపాయము" (2-470)**

అని భగవంతుని ఒక్కనినే శరణువేడుటయే ఉపాయమని నిర్మలభక్తిని చాటినాడు.

**11. నిజభక్తి :** తట్టుముట్టలేనిదే నిజభక్తి.

**"శ్రీకాంతుడవైన శ్రీవేంకటేశ నీకు**
**వూకొన నా జన్మఫలమొక మొక్కు చాలునయ్యా" (2-390)**

అని శ్రీవేంకటేశునకు ఒక్కసారి మొక్కినచో జన్మసఫలము పొందునని నిజభక్తిని (సందేహములేని) ప్రకటించినాడు.

ఈ విధముగా అన్నమయ్య నానావిధభక్తి మార్గములను నిర్వచించి, తన కీర్తనలలో వర్ణించినాడు.

ఈ భక్తియోగ సాధనమునకై శ్రీమద్రామానుజులు వివేక, విమోకాదులతో కూడిన సాధన సప్తకమును తెలిపిరి. భక్తి యోగానుష్ఠానమునందు అధికారము లేనివారికి సులభోపాయమగు శరణాగతి ధర్మమును ప్రభోదించిరి.

## సాధన సప్తకము అన్నమయ్య కీర్తనలయందు అన్వయించిన విధానము :

**1. వివేకము :** ఆహారము వలన శరీర శుద్ధిని సంపాదించుట.

**"వినియు చదివియును శ్రీవిభుని దాసుడుగాక**
**తనువు వేపుచునుండు తపసి కంటె**
**యెనలేని శ్రీవేంకటేశు ప్రసాదాన్న**
**మనుభవించిన యాతడప్పుడే ఘనుడు" (1-318)**

అని శాస్త్రాధ్యయన, శ్రవణముల కంటెను, శరీరమును కృశింపజేయు తాపసికంటెను, శ్రీవేంకటేశునకు నివేదించిన ప్రసాదాన్నమును స్వీకరించినపుడే జీవుడు ఘనుడగు ననుచు జీవుడు ఆచరింపవలసిన వివేకమును గూర్చి వర్ణించినాడు.

**2. విమోకము :** ఇతర కోరికలు లేకుండుట.

> **"మనసున బుట్టిన మంకు కామ క్రోధాదులు**
> **పనిలేవు తనకంటె బాపమంటదు"** **(2-288)**

అని మనస్సునందు పుట్టిన కామ, క్రోధాది కోరికలను జయించినచో పాపమంటదని విమోకమును గూర్చి వివరించినాడు.

**3. అభ్యాసము :** ఉపాస్య దైవమును అనుక్షణము స్మృతియందు ఉంచుకొనుట.

> **"దైవంబు దన్ను మతి దలపోయనేర్చెనా**
> **జీవన్ముక్తుడని చెప్పబడు నాతడు"** **(2-452)**

అని జీవుడు దైవమును నిరంతరము మతియందు తలపోయుట వలన జీన్ముక్తుడగునని అభ్యాస లక్షణమును తెలిపినాడు.

**4. క్రియ :** పంచమహాయజ్ఞములను శక్త్యనుసారము చేయుట.

> **"విదురునకు పరలోక విధి చేసె నట తొల్లి**
> **అదె ధర్మసుతుడు వర్ణాశ్రమంబులు విడచి**
> **కదిసి నీ దాసుడయిన కతమునను గాదె**
> **యెదురనే తుది పదం బిహముననే కలిగె**
>
> **యిరవైన శబరి రుచులివియె నైవేద్యమై**
> **వరగెనట శేషము బహు నిషేధములనన్**
> **ధర తదీయ ప్రసాదపు విశేషమె కాదె**
> **సిరుల శ్రీ వేంకటేశ చెల్లుబడులాయ"** (5-224)

అని ధర్మరాజు తన వర్ణాశ్రమ ధర్మములు విడిచి, విదురునకు ఉత్తరక్రియలు జరిపి నీ దాసుడైనందున యిహముననే తుది పదమును చేరినాడనియు, శబరి అందించిన ఎంగిలి పండ్లే నైవేద్యములైనవనియు, అందువలన "ఎంగిలి పదార్థము నిషేధము"

అను నియమము లేక ధరయందు తదీయుల శేషమే విశేషమను చెల్లుబడి కలిగిన దనియు, దేవ, పితృ, యజ్ఞములను, అతిథి పూజలను వర్ణించినాడు.

**5. కళ్యాణము :** సత్యము, దయ, దానము, అహింస మొదలగు గుణములు కలిగియుండుట.

"ఏ కులజుడైన యెవ్వడైన నేమి
ఆకడ నాతడె హరినెరిగినవాడు ॥ పల్లవి ॥

పరగిన సత్య సంపన్నుడైన వాడే
పరనింద సేయ తత్పరుడు కానివాడు
అరుదైన భూతదయానిధి యగు వాడే
పరులు దానే యని భావించు వాడు ॥ ఏ కుల ॥

నిర్మలుడై ఆత్మ నియతి కల్గు వాడే
ధర్మతత్పరబుద్ధి దగిలిన వాడు
కర్మమార్గములు తడవని వాడే
మర్మమై హరిభక్తి మఱవని వాడు ॥ ఏ కుల ॥

జగతికై హితముగా జరియించు వాడే
పగలేక మతిలోన బ్రతికిన వాడు
తెగి సకలము నాత్మ తెలిసిన వాడే
తగిలి వేంకటేశు దాసుడయిన వాడు ॥ ఏ కుల ॥ (1-292)

అని ఇందు సత్యము, పరనింద చేయకుండుట, చింతారాహిత్యము, భూతదయ, నిర్మలత్వము, ధర్మతత్పరబుద్ధి, సర్వభూత హితత్వము, పగలేకపోవుట, మొదలగు-గుణములు వర్ణించి కళ్యాణ లక్షణమును వివరించినాడు.

**6. అనవసాదనము :** దైన్యము లేకుండుట, చింతారాహిత్యము

"విరతియే లాభము విరతియే సౌఖ్యము
విరతియే పో విజ్ఞానము
విరతిచే ఘనులైరి వెనుక వారెల్లరును
విరతి పొందకున్న వీడదు భవము" (11-74)

అని చింతారాహిత్యమునకు మూలమైన చిత్త విరతిని గూర్చి ఇందు వర్ణించి అనవసాదనమును తెలిపినాడు.

7. **అనుద్ధర్షము** : సుఖ దుఃఖాది ద్వంద్వములందు సమానబుద్ధి కలిగియుండుట.

**"సకల ఉద్యోగములు చాలించుటె శాంతి**
**సుఖ దుఃఖములు విడుచుటే శాంతి**
**వొకరేమి యిచ్చినను వొల్లకుండుటె శాంతి**
**కోరకుండె సాత్విక గుణమె శాంతి**
**భారము శ్రీ వేంకటేశునిపై బెట్టుటె శాంతి**
**ధీరత తోడుత గుణాతీతుండౌటె శాంతి"** (2-377)

అని అన్ని ఉద్యోగములు చాలించుట, సుఖదుఃఖములను విడచుట, యితరులు యిచ్చినవి వొల్లకుండుట, గొడవలకు దూరముగా నుండుట, నిశ్చింతముగా నుండుట, కోరికలు లేని సాత్విక గుణము కలిగియుండుట, భారము భగవంతునిపై ఉంచుట, ధీరతతో గుణాతీతుడగుట మొదలగు వాటివలన శాంతి లభించునని వర్ణించి అనుద్ధర్షమును వివరించినాడు.

ఈ విధముగా భగవత్సేవా రూపకమగు భక్తి యోగ స్వరూపమును గూర్చియు, అట్టి భక్తికి సాధనములైనవానిని గూర్చియు అన్నమయ్య అనేక కీర్తనల యందు వర్ణించినాడు.

**శరణాగతి** : ఇట్టి భక్తియోగమును ఆచరింప సాధ్యము కానివారికి సులభోపాయమగు శరణాగతి ధర్మము తరుణోపాయముగా చెప్పబడినది. ఈ శరణాగతికే ప్రపత్తి, న్యాసము అని పేర్లు. శరణాగతి అనగా "నీవే రక్షకుడవు అను భావముతో వచ్చి చేరుట" అని అర్థము. ఆత్మనివేదన రూపమైన భక్తి విభాగములోనిదే శరణాగతి ధర్మము. శరణాగతి ధర్మమును గూర్చి భగవద్గీత "పార్థా! సర్వభావములయందు ఆతనినే శరణు పొందుము. ఆతని అనుగ్రహముచే నీవు శాంతిని, దివ్యమును, శాశ్వతమైన స్థానమును పొందెదవు" అనియు, "అన్ని ధర్మములను విడచి నన్ను శరణు పొందుము. అన్ని పాపములనుండి నిన్ను విడిపింతును, భయపడకుము[57]" అనియు పేర్కొన్నది. ఈ శరణాగతి ధర్మము అన్నమయ్య కీర్తనల యందు అడుగడుగునా కన్పించును.

"ఒక్కడే మోక్షకర్త వొక్కటే శరణాగతి
దిక్కని హరిగొల్చి బతికిరి తొంటివారు ॥ పల్లవి ॥

నానా దేవతలున్నారు నానా లోకములున్నవి
నానా వ్రతాలున్నవి నడచేటివి
జ్ఞానికి కామ్యకర్మాలు జరపి పొందేదేమి
అనుకొన్న వేదోక్తాలైనా నాయగాక ॥ ఒక్కడే ॥

వొక్కడు దప్పికి ద్రావు వొక్కడు కడవ నించు
వొక్కడీదులాడు మడుగొక్కటి యందే
చక్క జ్ఞానియైనవాడు సారార్థము వేదమందు
తక్కగ చేకొనుగాక తలవెత్తుకొనునా ॥ ఒక్కడే ॥

యిది భగవద్గీతార్థమిది యర్జునని లోను
యెదుటనే వుపదేశమిచ్చె గృష్ణుడు
వెదకి వినరో శ్రీ వేంకటేశు దాసులాల
బ్రదుకు ద్రోవ మనకు పాటించి చేకొనరో" ॥ ఒక్కటే ॥ (2-186)

అని ఈ కీర్తన పల్లవియందు మోక్షమునకు కర్త ఒక్కడే అనియు, పూర్వపు వారిట్లు భావించి బ్రదికిరనియు తెలిపినాడు.

మొదటి చరణమున, ఎంతమంది దేవతలున్నను, ఎన్ని లోకములున్నను, ఎన్ని వ్రతములున్నను, జ్ఞానియైనవాడు కామ్య కర్మముల వలన పొందునదేమియు లేదనుచు, వేదములయందు చెప్పబడినవైనను అట్టి కర్మములవలన ఫలితము లేదనియు వర్ణించి, కర్మయోగము తారకము కాదని తెలిపినాడు.

రెండవ చరణమున, ఒకే మడుగుయందు ఒకడు దాహము తీర్చుకొను ననియు, ఒకడు కడవ నింపుకొనుననియు, ఒకడు ఈదులాడుననియు, అట్లే జ్ఞానియైనవాడు వేదసారార్థము తనకు తగినంత మాత్రమే చేకొనునుగాని తలకెత్తు కొనలేడు - అని జ్ఞానయోగము పరిపూర్ణమైనది గాదని సూచించినాడు.

చివరి చరణమున, ఇదియంతయు గీతార్థమనియు దీనిని కృష్ణుడు అర్జునునికి ఉపదేశించెననియు, కనుక వేంకటేశుని దాసులైన భక్తులు బ్రదుకుద్రోవ

అయిన శరణాగతిని ఆచరించవలెననియు అన్నమయ్య సంపూర్ణ శరణాగతి ధర్మమును వివరించినాడు.

**"అతి సులభంబిదె శ్రీపతి శరణము అందుకు నారదాదులు సాక్షి**
**ప్రతిలేని దిదియే నిత్యానందము బహువేదంబులె యివె సాక్షి"** (2-41)

అని శరణాగతి అతి సులభోపాయమనియు, అందుకు సాక్షి దాని నాచరించిన నారదాదులే అనియు, ఈ శరణాగతి ఎదురులేనిదనియు, నిత్యానందమును కలిగించునదనియు, ఇందుకు వేదములే సాక్షియనియు అన్నమయ్య తెలిపినాడు. ఇట్టి శరణాగతి ధర్మమునకు ఆరు అంగములు కలవు. అన్నమయ్య కీర్తనలలో శరణాగతి ధర్మమునకు గల ఆరు అంగములు ప్రతిఫలించిన తీరు ఇట్లున్నది -

**1) ఆనుకూల్య సంకల్పము :** భగవద్విషయమునందు మాత్రమే శ్రద్ధ కలిగియుండుట.

**"ఇదియే నాకు మతమిది వ్రతము**
**నుదుట కర్మము వొల్ల నింకను** ॥పల్లవి॥

**నిపుణత హరి నే నిను శరణంటే**
**తపములు జపములు ధర్మములు**
**నెపమాన సకలము నీవే చేకొనుము**
**వుపమల పుణ్యము లొల్లనే యికను"** (2-172)

అని భగవంతునికి సంబంధించినదే వ్రతమనియు, మతమనియు, ఆతని శరణమే తపములు, జపములు, ధర్మములనియు, సకలము ఆయననే అనుగ్రహింపుమనుచు, ఏ కర్మములను (పుణ్యములు) ఒల్లననియు అన్నమయ్య ఆనుకూల్య సంకల్పమును వర్ణించినాడు.

**2. ప్రాతికూల్య వర్జనము :** భగవద్వ్యతిరిక్తములగు విషయములను పరిత్యజించుట.

**"నరహరి కీర్తన నానిన జిహ్వ**
**నొరుల నుతియింపగ నోపదు జిహ్వ**
**మురహరు పదముల మొక్కిన శిరము**
**పరుల వందనకు ఒరగదు శిరము"** (2-144)

అని భగవంతుని నామమును కీర్తించుటలో నానిపోయిన నాలుక ఇతరులను పొగడలేదనియు, ఆతని పదములకు మొక్కిన శిరస్సు ఇతరులకు వందనము చేయ జాలదనియు ప్రాతికూల్య వర్జనము గూర్చి తెలిపినాడు.

**3. రక్షత్యతీతి విశ్వాసము** ; భగవంతుడు తప్పక రక్షించునని విశ్వాసము కలిగియుండుట.

**"ఇతర చింతలికనేమిటికి - అతడే గతియై అరసేవాడు"** (3-22)

అని భగవంతుడే గతియై రక్షించువాడై యుండగా యిక యితర చింతలు దేనికని అన్నమయ్య భగవంతుని యందు రక్షకత్వ విశ్వాసము ప్రకటించినాడు.

**4. గోప్తృత్వ వరణము** : భగవంతుని రక్షింపుమని కోరుట.

**"మరి యెందూగతి లేదు మనుప నీవే దిక్కు**
**జఱసి లక్ష్మీశ నీ శరణమే దిక్కు"** (2-146)

అని వేరే మార్గమేమియు లేదనియు, కడతేర్చు మార్గము నీవే అనియు శ్రీమన్నారాయణుని శరణు వేడుచు గోప్తృత్వ వరణమును అన్నమయ్య తెలిపినాడు.

**5. ఆత్మనిక్షేపణము** : తన భారమంతయు భగవదధీనము చేయుట.

**"దైవము దాతవు నీవే తల్లివి దండ్రివి నీవే**
**భావించి చేపట్టితే నీబంట నేనింతే**
**శ్రీ వేంకటేశ నీవు చేకొని రక్షించగాను**
**జీవుడనయిన నేను చెలగి మొక్కేది"** (2-455)

అని భగవంతుని దాతగా, తల్లిగా, తండ్రిగా, తనను బంటుగా భావించి తన భారమంతయు భగవంతుని అధీనము చేసి ఆత్మ నిక్షేపణ లక్షణమును ప్రకటించినాడు అన్నమయ్య.

**6. కార్పణ్యము** : దీనత్వముతో భగవంతుని వేడుకొనుట.

**"వెనక గానను ముందు విచారించి గానను**
**నినుపై దేహధారినై నీకు మొక్కేను**
**ఘనుడ శ్రీవేంకటేశ కన్నులెదుట బడితి**
**కనిపో విడువరాదు కరుణించు నన్నును"** (2-2)

అని వెనుక ముందు ఏమియు ఎరుగననియు, దేహమును ధరించిన నేను నీకు మొక్కుట ఒక్కటే చేయగలననియు, శ్రీ వేంకటేశ నీ యెదుట బడితి, నన్ను విడువక కరుణించుమనియు, అన్నమయ్య దీనత్వముతో భగవంతుని వేడుకొనుచు కార్పణ్యమును తెలిపినాడు.

ఈ విధముగా శరణాగతియొక్క ఆరు అంగములను అన్నమయ్య వర్ణించినాడు. ఇట్టి శరణాగతికే ప్రపత్తి అని మరియొక పేరు. న్యాసము, భరన్యాసము అని కూడా ప్రపత్తిని వ్యవహరించెదరు.

ప్రపత్తి : "అనగా గొప్ప ఆశ్రయము" అని అర్థము. తిరిగి విడిపోని విధముగా గట్టిగా పట్టుకొనుట అని భావము.

**"ఉపకారముగ దేహ మొసగితి విటు నాకు**
**ఉపమించి నే జేసె ప్రత్యుపకార మికనేది**
**యెపుడూ నీ ధర్మమున నిటు నీ ఋణస్థుడనై**
**ప్రపన్నుడనై నేను బ్రదుకుటే కలది"** (2-197)

అని దేహమొసగిన భగవంతునికి జీవుడు చేయు ప్రత్యుపకారము ఎప్పుడును భగవంతుని వీడక ఆతనికి ఋణస్థుడై, ప్రపన్నుడై బ్రదుకుటే, అని అన్నమయ్య ప్రపత్తి లక్షణమును తనయందే ప్రకటించినాడు.

ఈ విధముగా కర్మ, జ్ఞానాంగక, శరణాగతి రూపకమైన భక్తి యోగమును బ్రహ్మప్రాప్త్యుపాయముగా తన కీర్తనల ద్వారా ప్రకటించినాడు అన్నమయ్య.

## అథస్సూచికలు

1. పేజి - 61, సంకీర్తన లక్షణము - చినతిరుమలాచార్యులు.
2. పేజి - 21, 22, పీఠిక, సంపుటి-1, ఆధ్యాత్మిక సంకీర్తనలు.
3. పేజి - 57, అన్నమాచార్య సంకీర్తన సుధ, ఆచార్య ఎస్. గంగప్ప.
4. పేజి - 233, శ్రీమద్భగవద్గీత - హిందీ వ్యాఖ్యానము.
   వ్యాఖ్యాత : శ్రీ హరికృష్ణదాస గోయందకా.
5. శ్లో॥ "వాసాంసి జీర్ణాని యథా విహాయ - నవాని గృహ్ణాతి నరోపరాణి ।
   తథా శరీరాణి విహాయ జీర్ణాన్య న్యాని సంయాతి నవానిదేహీ ॥"

శ్లో॥ "అవ్యక్తోయ మచిన్త్యోయ మవికార్యోయ ముచ్యతే ।
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥" - 25

శ్లో. 22, 25, అధ్యా-2, భగవద్గీత.

6. శ్లో॥ సత్త్వం రజస్తమయితి గుణాః ప్రకృతి సమ్భవాః ।
నిబధ్నన్తి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్ ॥

శ్లో-5, అధ్యా-14, భగవద్గీత

7. శ్లో॥ నిమిత్త మాత్రమే వాసౌ సృజ్యానాం సర్గకర్మణి ।
ప్రధాన కారణీభూతా యతోవై సృజ్యశక్తయః ॥

శ్లో - 50, అధ్యా - 4, అంక - 1, విష్ణుపురాణము.

8. శ్లో॥ రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగ సముద్భవం ।
తన్నిబధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ ॥

శ్లో-7, అధ్యా - 14, భగవద్గీత.

9. శ్లో॥ "ద్వేపదే బంధమోక్షాయ నిర్మమేతి మమేతి చ మమేతి బధ్యతే జంతుః"
13, అధ్యా. 4, మహోపనిషత్.

10. శ్లో॥ "ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోర్జున ।
మాముపేత్యతు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే ॥"

శ్లో - 16, అధ్యా - 8, భగవద్గీత.

11. "తే చ ద్వివిధాః శాస్త్రవశ్యాస్తదవశ్యాశ్చ ....."
పేజి - 116, అష్టమోవతారః, యతీంద్రమత దీపికా.

12. శ్లో॥ "చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోర్జున ।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ ॥"

శ్లో - 16, అధ్యా - 7, భగవద్గీత.

13. "సాలోక్యాది విభాగేన చతుర్థా ముక్తిరీరితా" మం.శ్లో-4, అధ్యా-1, ముండకోపనిషత్.

14. శ్లో॥ "మాముపేత్యతు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే" - 16, అధ్యా-8, భగవద్గీత.

15. శ్లో॥ "వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః సన్యాసయోగాద్యతయః శుద్ధసత్త్వా ।
తే బ్రహ్మలోకే పరాన్తకాలే పరామృతాత్ పరిముచ్యన్తి సర్వే ॥"
6, ఖం-8, ముండపి-3, ముండకోపనిషత్.

16. శ్లో॥ "మహాత్మా నస్తు మాం పార్థ! దైవీం ప్రకృతిమాశ్రితాః ।
భజన్త్యనన్య మనసోజ్ఞాత్వ భూతాదిమవ్యయమ్ ॥"
శ్లో - 13, అధ్యా - 9, భగవద్గీత.

17. శ్లో॥ "వైకుంఠవాసిభిస్సర్వై ర్నిత్యముక్తై స్సుపూజితస్తదా ॥"
మం.శ్లో. - 6, అధ్యా - 6, మహా (త్రిపాద్విభూతి) నారాయణోపనిషత్.

18. శ్లో॥ "అవ్యక్తోక్షర ఇత్యుక్త స్తమాహుః పరమాం గతిమ్ ।
యం ప్రాప్య ననివర్తన్తే తద్ధామ పరమం మమ ॥"
శ్లో. - 21, అధ్యా - 8 , భగవద్గీత.

19. శ్లో॥ "భూమిరాపోనలో వాయుః ఖం మనో బుద్ధిరేవచ ।
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥"
శ్లో - 4, అధ్యా - 7, భగవద్గీత.

20. శ్లో॥ "సత్త్వ రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసమ్భవాః ॥"
శ్లో -5, అధ్యా - 14, భగవద్గీత.

21. శ్లో॥ "మయ్యాధ్యక్షణ ప్రకృతః సూయతే సచరాచరమ్ ।
హేతు నానేన కౌంతేయ జగద్విపరి వర్తతే ॥"
శ్లో - 10, అధ్యా - 9, భగవద్గీత.

22. శ్లో॥ "రజో గుణాత్మకం విద్ధి తృష్ణా సంగ సముద్భవమ్ ।
తన్నిభధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ ॥"
శ్లో - 7, అధ్యా - 14, భగవద్గీత.

23. "..... ఏకోహివై నారాయణ ఆసీన్న బ్రహ్మనేశానో నాగ్నీ ...."
మం.శ్లో. 1, అధ్యా - 1, మహోపనిషత్తు.

24. "ఏష సర్వభూతాంతరాత్మా" - శ్లో - 12, వల్లి-3, కఠోపనిషత్తు.

25. "..... అస్యైకైక రోమరూపాంతర్వేష్వనంతకోటి బ్రహ్మాండాని, స్థావరాణిచ జాయంతే ..... ప్రజాపతయో జాయంతే" మం - 6, పూర్వకాండః, అధ్యా-2, మహా (త్రిపాద్విభూతి) నారాయణోపనిషత్.

26. శ్లో॥ "ఏకం రూపం బహుధాయ కరోతి" మం - 12, అధ్యా - 1, వల్లి-5, కఠోపనిషత్తు.

27. శ్లో॥ "నిత్యోనిత్యానాం ...." 13, అధ్యా - 1, వల్లి - 5, కఠోపనిషత్తు.
28. "సత్యమ్ జ్ఞానమ్ అనంతం బ్రహ్మ" - తైత్తిరీయము.
29. "అంతర్యామేష యోని: సర్వస్య ప్రభవాప్యయౌ హి భూతానామ్"
మం.శ్లో - 6, మాండూక్యోపనిషత్తు.
30. శ్లో॥ "చక్షుషీ చంద్రసూర్యౌ" 4 , ఖం-1, ముండపి-2, ముండకోపనిషత్తు.
31. "ఏష సర్వభూతాంతరాత్మా" శ్లో-12, వల్లి-3, కఠోపనిషత్తు.
32. "మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా" శ్లో-4, అధ్యా-9, భగవద్గీత.
33. శ్లో॥ అస్యపద్భ్యాం పృథివీ ..." 4, ఖం-1, ముండకోపనిషత్తు.
34. శ్లో॥ "వాయు: ప్రాణో ..." 4, ఖం-1, ముండకోపనిషత్తు.
35. శ్లో॥ "సూక్ష్మాచ్చాతత్సూక్ష్మతరం ...." 7, ఖం-1, ముండకోపనిషత్తు.
36. శ్లో॥ "అణోరణీయాన్ మహతో మహీయాన్" - 20, వల్లి-2, అధ్యా-1, కఠోపనిషత్తు.
37. శ్లో॥ "సర్వస్య ప్రభుమీశానం" - 17, అధ్యా-3, శ్వేతాశ్వతరోపనిషత్.
38. శ్లో॥ "యథాకాశస్థితో నిత్యం వాయుస్సర్వత్రగో మహాన్
తథాసర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥"
శ్లో-6, అధ్యా-9, భగవద్గీత.
39. శ్లో॥ "అణోరణీయాన్ మహతో మహీయాన్" - కఠోపనిషత్.
40. శ్లో॥ "యోమామజమనాదిం" - 3, అధ్యా-10, భగవద్గీత.
41. శ్లో॥ "య: సర్వజ్ఞ:" - 7, ఖం-2, ముండపి-2, ముండకోపనిషత్తు.
42. శ్లో॥ "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" - 1, అను-6, అధ్యా-3, భృగువల్లి, తైత్తిరీయోపనిషత్తు.
43. శ్లో॥ "పురుషం శాశ్వతం దివ్యం" - 12, అధ్యా-10, భగవద్గీత.
44. "కేశవాదయా వ్యూహాన్తరాణి ద్వాదశ" - పేజి-136, నవమోవతార:, యతీంద్రమతదీపిక
45. పేజి-156, తత్త్వోపహారము, న.చ. రఘునాథాచార్య.
46. పేజి-156, తత్త్వోపహారము, న.చ. రఘునాథాచార్య.
47. పీఠిక, ఆధ్యాత్మిక సంపుటి-2, గౌరిపెద్ది రామసుబ్బశర్మ.

48. శ్లో॥ "తస్మాదసక్త స్సతతం కార్యం కర్మసమాచర ।
అసక్తో హ్యాచరన్ కర్మపర మాప్నోతి పురుషః ॥"
శ్లో-19, అధ్యా-3, భగవద్గీత.

49. శ్లో॥ "యేతు సర్వాణి కర్మాణి మయి సంన్యస్య మత్పరాః ।
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే ॥"
శ్లో - 6, అధ్యా-10, భగవద్గీత.
శ్లో॥ తేషా మహం సముద్ధర్తా మృత్యు సంసార సాగరాత్ ।
భవామి నచిరాత్పార్థ మయ్యావేశిత చేతసామ్ ॥" - 7 , అధ్యా-12, భగవద్గీత

50. శ్లో॥ "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।
క్షేత్ర క్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥"
శ్లో-2, అధ్యా-13, భగవద్గీత.

51. శ్లో॥ "సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే" శ్లో-33, అధ్యా-4, భగవద్గీత.

52. శ్లో॥ "యథైధాంసి సమిద్ధోగ్ని ర్భస్మసా త్కురుతేర్జున ।
జ్ఞానాగ్ని స్సర్వ కర్మాణి భస్మసా త్కురుతే యథా ॥"
శ్లో-37, అధ్యా-4, భగవద్గీత.

53. శ్లో॥ "నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ॥" శ్లో-38, అధ్యా-4, భగవద్గీత.

54. శ్లో॥ "బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।
వాసుదేవస్సర్వమితి ......................................" శ్లో-19, అధ్యా-7, భగవద్గీత.

55. శ్లో॥ "మాం చయో వ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।
సగుణాన్ సుమతీత్యైతాన్ బ్రహ్మభూమాయకల్పతే ॥"
శ్లో-26, అధ్యా-14, భగవద్గీత.

56. శ్లో॥ "తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్యసి శాశ్వతమ్ ॥"
శ్లో-62, అధ్యా-18, భగవద్గీత.

57. శ్లో॥ "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥"
శ్లో-66, అధ్యా-18, భగవద్గీత.

# అధ్యాయము - 5

# తత్త్వ విచారము

"శఠగోపముని వద్ద సకల వేదాంత
పఠనంబు జేసి అభంగ విస్ఫూర్తి
హరిపూజ హరిసేవ హరికీర్తనంబు
హరి మననంబు ధ్యానమనిశంబు తనకు"[1]

అని అన్నమయ్యను గూర్చి తాళ్ళపాక చిన్నన్న వర్ణించినాడు. అన్నమయ్య ఆదివణ్ శఠగోపముని వద్ద సకల వేదాంత రహస్యములను అవగాహన చేసికొనెను. అంతకు ముందే విష్ణుడను వైష్ణవ యతిచేత పంచసంస్కార దీక్షను కూడా పొందెను. హరి భక్తుడైన అన్నమయ్య కీర్తనలయందు హరిభక్తితోపాటు వైష్ణవ సిద్ధాంత సంప్రదాయ శాస్త్రాంశాలు అడుగడుగున ప్రతిఫలించుచుండును.

కొందరు విద్వాంసులు అన్నమయ్య పూర్వీకులు అద్వైతులైనందున, అన్నమయ్య కూడా మొదట అద్వైతియే అయినందున ఆయన కీర్తనలు కొన్నింటి యందు అద్వైతవాసన కలదని భావించిరి[2]. కాని ఆదివణ్ శఠగోపయతికి శిష్యుడై, భగవద్గీతకు వ్యాఖ్యానము వ్రాసిన అన్నమయ్య సకల వేదాంతసార సంగ్రహ మనీషతో విశిష్టాద్వైత పరముగా సంకీర్తనలు రచించినట్లు తరచిచూచిన తెలియగలదు.

### అద్వైతవాసన గలవిగా భావించబడిన కొన్ని కీర్తనలు - విశిష్టాద్వైత పరంగా సమన్వయం :

1. చూచే చూపొకటి గురియొకటి
చాచి రెండు నొకటైతే దైవమే సుండీ ॥పల్లవి॥

యేనుగ దలచితే యేనుగై పొడచూపు
మాను దలచితే వట్టి మానై పొడచూపు
పూని పెద్ద కొండ తలపోయ గొండై పొడచూపు
తానే మనోగోచరుడు దైవమే సుండీ ॥చూచే॥

బట్టబయలు దలచ బయలై పొడచూపు
అట్టె యంబుధి దలచ నంబుధియై పొడచూపు
పట్టణము దలచిన పట్టణమై పొడచూపు
తట్టి మనోగోచరుడు దైవమే సుండీ ॥చూచే॥

శ్రీ వేంకటాద్రి మీది శ్రీపతి దలచితేను
శ్రీ వేంకటాద్రి మీది శ్రీపతై పొడచూపు
భావమే జీవాత్మ ప్రత్యక్షము పరమాత్మ
తావు మనోగోచరుడు దైవమై సుండీ ॥చూచే॥ (2-141)

అనెడి ఈ కీర్తనలోని పల్లవియందు సాధకుని చూపు, గురి ఒక్కటే అయితే దైవము సాక్షాత్కరించునని చెప్పబడినది.

"ప్రణవమే ధనుస్సు. ఆత్మ (మనస్సు)యే బాణము. ఆత్మకు లక్ష్యముగా బ్రహ్మము చెప్పబడుచున్నది. ప్రమత్తత లేని జీవసాధకునిచేత బ్రహ్మము పొంద తగినది" అని ఉపనిషత్తు పేర్కొనినట్లుగా[3] జీవునికి లక్ష్యముగా చెప్పబడిన బ్రహ్మమును ఉపాసనమనే ధనుస్సును గైకొని ఆత్మ అనే బాణమునుసంధించి పొందవచ్చును. "చూచే చూపొకటి గురియొకటి, చాచి రెండు నొక్కటైతే" అనుటలో ఈ భావము స్ఫురించుచున్నది.

ఇట్లు లక్ష్యము, చూపు ఒక్కటైతే, "దైవమే సుండీ" అని అన్నమయ్య తెలిపినాడు. ఇచ్చట "దైవమేసుండి" అనగా తానే దైవమను భావము కాదు. ఎట్లనగా-

పురుషుడు సంకల్పమయుడు. ఈ లోకమున నున్నపుడు ఎవ్విధమైన భావనతో కూడిన ధ్యానము గలవాడగునో, ఈ లోకము వదలి పైకి పోయినప్పుడు అవ్విధమైన వాడగును. కావున మనోమయుడనియు, ప్రాణశరీరుడనియు, భారూపుడనియు, నిట్లు ధ్యానము చేయవలసినది[4] (పరమాత్మను గూర్చి).

అని చెప్పబడినట్లుగా బ్రహ్మమును లక్ష్యముగా ఉపాసించినచో ఆ బ్రహ్మమే అగును అని అర్థము. అనగా బ్రహ్మముగా మారును అను భావమే గాని దైవమే తానని కాదు. ఎట్లనగా - "బ్రహ్మవేత్త బ్రహ్మమే యగును"[5] అనియు "అపుడు ఉపాసకుడు పుణ్య పాపములను విడచి సంసార సంపర్కము లేనివాడై మిక్కిలి సామ్యమును పొందుచున్నాడు"[6] అనియు ముండకోపనిషత్,

"ముక్తపురుషుడు పరబ్రహ్మముతో కూడా అన్ని కళ్యాణ గుణములను పొందుచున్నాడు"[7] అని తైత్తిరీయోపనిషత్,

"ముక్తపురుషుడు పరమాత్మయందు సంచరించుచున్నాడు"[8] అని ఛాందోగ్యోపనిషత్,

"ప్రవహించుచున్న నదులు వాని పేరును, రూపమును విడచి సముద్రములో నెట్లు లయమును పొందుచున్నవో అట్లే ఉపాసకుడు నామరూపములు లేనివాడై గొప్పవానికంటె గొప్పవాడును, అప్రాకృతుడును అగు పురుషుని పొందుచున్నాడు"[9] అని ఉపనిషత్తులు పేర్కొనిన విధంగా ముక్తపురుషుడు పరబ్రహ్మముతో పొందు పరమ సామ్యమును, విశిష్ట ఐక్యమును అన్నమయ్య దైవమే సుండీ" అని తెలిపినాడు అనవచ్చును.

ఇట్లు పరమాత్మ లక్ష్యముగా ఉపాసించినచో పరమాత్మే అగునని ఈ కీర్తనయందు పల్లవిలో తెలిపి తర్వాతి చరణములయందు పరమాత్మను ఎట్లు భావించిన అట్లే దర్శనమిచ్చునని పరమాత్మయొక్క అంతర్యామి తత్త్వమును తెలిపినాడు.

"ఆత్మ తత్త్వము అణువుకంటె అణువుగాను, మహత్తుకంటె మహత్తుగాను, ప్రతి జీవియొక్క హృదయ కుహరమునందు నివసించుచున్నది"[10] అని కఠోపనిషత్తు,

"ఒక్కడే అయిన ఆత్మయే సర్వభూతములయందు, సర్వ దేహములయందు అతి సూక్ష్మరూపమున అంతరాత్మభూతుడై ప్రవేశించి ఆయా దేహములకు తగిన రూపము గలవాడు అగుచున్నాడు"[11] అనియు,

"ఆ పరమాత్మ నిత్యులలో నిత్యుడు, చేతనులలో చేతనుడు, ఏకైకుడైనను బహు కామములను నెరవేర్చువాడు. అట్టి పరమాత్మను తమ ఆత్మలోనే దర్శించు ప్రాజ్ఞులకు మాత్రమే శాశ్వత శాంతి లభించగలదు. ఇతరులు ఆ శాంతిని పొందలేరు"[12] అనియును కఠోపనిషత్తు తెలిపిన పరమాత్మ స్వరూపమును అన్నమయ్య ఈ కీర్తనయందు యేనుగు, చెట్టు, కొండ, బయలు, అంబుధి, పట్టణము మొదలగు విధముగా భావించినాడు. ఇంకను "ఈ శరీరమునందు సూక్ష్మమగు కమలము వంటి స్థానము గలదు, దహరమనబడు ఒక ఆకాశము గలదు, దానిలో నెద్ది గలదో దానిని వెదకి తెలిసికొనుడు"[13] అని ఛాందోగ్యము,

"ఎవడు ప్రాణములయందు విజ్ఞానమయుడిగా నున్నాడో, ఎవడు హృదయములోని ఆకాశమున శయనించి యున్నాడో, ఎవడు సర్వమును తన వశమున నుంచుకొనినవాడై సర్వమును నియమించుచున్నాడో (వానిని తెలుసుకొనుము)"[14] అని బృహదారణ్యకము.

"నేను ప్రతివాని హృదయము నందున్నాడను" [15] అని భగవద్గీత మొదలగు శ్రుతులు బ్రహ్మమును హృదయ కుహరమున నుండు దానినిగా తెలుసుకొని ఉపాసించ వలయునని తెలిపిన విధముగా అన్నమయ్య పరమాత్మను "మనోగోచరుడు" గా దర్శించవచ్చునని ఈ కీర్తనలో వివరించాడు.

ఇంకను ఈ కీర్తనయందు చివరి చరణమున "భావమె జీవాత్మ - ప్రత్యక్షము పరమాత్మ" అనుచోట పైకి అద్వైత భావనగా స్ఫురించును. కాని ఇచ్చట "భావమె" అనగా పరమాత్మ స్వభావము అను అర్థమును చెప్పుకొనవలెను. ఎట్లనగా -

శ్లో॥ "ఆత్మభావం నయత్యేనం తద్బ్రహ్మధ్యాయినం మునే
వికార్య మాత్మన శ్శక్త్యా లోహమాకర్షకో యథా ॥" [16]

తాత్పర్యము : ఓ మునీ! బ్రహ్మము అజ్ఞానాది వికారములు గల యుపాసకుని అయస్కాంతము మొదలగు ఆకర్షక వస్తువు లోహమునువలె తన శక్తిచే తన స్వభావమును పొందించును" అని విష్ణుపురాణము "ఆత్మభావం" అనుదానికి "తన స్వభావము" అని అర్థమును చెప్పుచున్నది. ఆకర్షింపబడునట్టి పదార్థము ఆకర్షించునట్టి పదార్థముయొక్క స్వభావమును మాత్రమే పొందునుగాని ఆకర్షించు వస్తువే తాను గాదు. అట్లే ఇచ్చట అన్నమయ్య "భావమె జీవాత్మ" అనుటలో పరమాత్మ యొక్క సాధర్మ్యములను జీవుడు పొందినాడని చెప్పినట్లు భావించవచ్చును.

తననుపాసించిన జీవులు తనతో సాధర్మ్యమును పొందెదరని కృష్ణ పరమాత్మ భగవద్గీత యందు స్వయముగా తెలిపియున్నాడు.

2. "ఇన్నిటి మూలం బీశ్వరు డాతని
మన్నన కొలదిని మలయుట గాక ॥పల్లవి॥

మాయామయమై మనియెడి జగమిది
ఛాయల నిందు నిజము గలదా

కాయము సుఖ దుఃఖములకు బొత్తిది
రేయి పగలు నొకరీతే గలదా ॥ఇన్నిటి॥

దైవాధీనము తగు సంసారము
వావిరి జీవుల వసమవునా
ధావతి మనసిది తన కర్మమూలము
వేవేలయినా విడువగ వశమా ॥ఇన్నిటి॥

పంచేంద్రియముల బరగేటి బ్రతుకిది
చంచలంబు నిశ్చల మవునా
యెంచగ శ్రీవేంకటేశ్వరు కృపతో
సంచయ మయితే సతమవుగాక ॥ఇన్నిటి॥ (3-296)

"ఇతడే సర్వేశ్వరుడు, ఇతడే సర్వజ్ఞుడు, ఇతడే అంతర్యామి, ఇతడే అంతటికి కారణము, ఇతడే సమస్త భూతములయొక్క ఉత్పత్తి లయాలకు స్థానము"[17] అని ఈశ్వర తత్త్వమును మాండూక్యోపనిషత్తు వివరించిన విధముగా "ఇన్నిటి మూలం బీశ్వరుడు" అని అన్నమయ్య ఈ కీర్తన పల్లవిలో వర్ణించినాడు. ఇందు "ఇన్నిటి" అను ప్రయోగము వలననే అద్వైత భావము తిరస్కరింపబడుచున్నది. అద్వైతములో బ్రహ్మమొక్కటే తత్త్వము. "ఇన్నిటి" అనగా చిదచిత్తులు అని భావించవలెను. ఎట్లనగా ఈ కీర్తనయందు మొదటి చరణమున ప్రకృతి (జగమిది), రెండవ చరణము జీవులు పేర్కొనబడినవి. కనుక "ఇన్నిటి" అనగా చిదచిత్తులే.

"ఈ పరమాత్మ వేదాధ్యయనము చేతను, బుద్ధిచేతను, ఎక్కువ వినుటచేతను పొందబడడు. ఈ పరమాత్మ ఎవనిని ప్రేమించుచున్నాడో అతడే ఈ పరమాత్మను పొందుటకు తగినవాడు. అట్టివానికే పరమాత్మ తన స్వరూపమును బాగుగా కనబరచుచున్నాడు."[18] అని ముండకోపనిషత్తు తెలుపుచున్నది. అన్నిటికి మూలమైన ఆ పరమాత్మ అనుగ్రహం వల్ల మాత్రమే జీవునికి ఉనికి గలదనియు, జీవుడు పరతంత్రబుద్ధి కలిగి ఉండుటకంటే వేరొక మార్గము లేదని "అతని మన్నన కొలది మలయుటగాక" అని పల్లవిలోని రెండవ పాదమున అన్నమయ్య ప్రకటించినాడు.

అద్వైతమున ఆత్మ తత్త్వమును తెలుసుకొనుటయే పరమార్థం. అట్లు తెలుసుకొనుటకు సాధన చతుష్టయమును ఆచరించుట మిక్కిలి ఉపయోగకరము. దీనివలన మానవుని అవిద్య నశించి భేదజ్ఞానము తొలగి అద్వైతము సిద్ధించును. శ్రవణ మననాదులు మాత్రమే పరమాత్మను పొందుటకు ఉపాయములు కావనియు, పరమాత్మచే వరింపబడుటయే ఆతనిని చేరుటకు ఉపాయమనియు, ఉపనిషత్తు తెలిపిన విధముగా ఈ కీర్తన చివరలో "శ్రీ వేంకటేశ్వరుకృపతో" అని అన్నమయ్య స్పష్టీకరించినాడు.

ఈ కీర్తనలోని మొదటి చరణమున "మాయామయమై మనియెడు జగమిది" అని ప్రయోగించుట వలన అద్వైత సిద్ధాంతములోని జగన్మిథ్యావాదముగా భావింప వీలగుచున్నది. నిజమునకు అన్నమయ్య భావన అది కాదు.

అద్వైతమున మాయ అనగా మిథ్య. కాని మాయా శబ్దము అన్ని తావుల మిథ్యా వాచకము అనలేము. రాక్షసులు మొదలగువారియొక్క అస్త్రములు మొదలగునవి సత్యములే అయినా మాయా శబ్దముచే నిర్దేశింపబడుచున్నవి. విష్ణు పురాణమున -

శ్లో॥ తేన మాయా సహస్రం తచ్ఛంబరస్యాశుగామినా ।
బాలస్య రక్షితా దేహమైకైక శ్యేన సూదితం ॥" [19]

తాత్పర్యం : "శీఘ్రముగా నడచుచు బాలుని రక్షించుచున్న ఆ వ్యక్తిచేత శంబరాసురుని యొక్క మాయలు (అస్త్రములు) వేయియును ఒక్కటిగా భేదింపబడినవి" అనుచోట మాయాశబ్దము మరొక అర్థములో ప్రయోగింపబడినది. కనుక మాయా శబ్దమునకు 'మిథ్య' ఒక్కటే అర్థము గాదని తెలియుచున్నది.

"ప్రకృతిని మాయనుగా నెరుంగునది. సర్వేశ్వరుని మాయ గలవానిగా నెరుంగునది"[20] అని శ్వేతాశ్వతరోపనిషత్తు 'మాయ' అనగా ప్రకృతి యని తెలుపు చున్నది. ఇదే ఉపనిషత్తు "ఇందువలన మాయ గలవాడగు సర్వేశ్వరుడు ఈ జగత్తును సృజించుచున్నాడు. ఆ జగత్తునందు మరియొక్కడు మాయచే నిరోధింపబడు చున్నాడు"[21] అని తెలుపుట వలన పరమేశ్వరుడు మాయ వలన జగత్ సృష్టి చేయు చున్నాడని తెలియుచున్నది.

అద్వైత సిద్ధాంతమున మాయకు లోనైన పరమాత్మ (అజ్ఞానమునకు) జగత్ సృష్టి చేయునని చెప్పుదురు. సర్వేశ్వరుడు సత్యకామ, సత్యసంకల్పాది గుణవిశిష్టుడు. అపహత పాప్మడు, విజరుడు, విమృత్యుడు అయిన పరమాత్మ మాయకు అధీనుడు కానేరడు. కాన ఇచ్చట మాయ అనగా విచిత్ర సృష్టియైన ప్రకృతియే. ప్రకృతిని ఈశ్వరుడు శేషభూతముగా కల్గినవాడు. ఉపనిషత్తు "మాయీ" అని పరమాత్మను పేర్కొనుట వలన 'మాయగలవాడు' అనగా ప్రకృతిని శేషభూతముగా గలవాడు అని పరమాత్మ నిర్దేశింపబడుచున్నాడు. అజ్ఞానము (మాయ) కలవాడుగా చెప్పబడలేదు.

మాయాశబ్దమునకు జ్ఞానము అనే అర్థము కూడా "ఆత్మ మాయయా" అను ప్రయోగము వలన తెలియుచున్నది (ఆత్మజ్ఞానము) మాయా వయునం జ్ఞానమ్" అని వైదిక నిఘంటువునందు 'మాయా' శబ్దము జ్ఞానవాచకముగా కూడా చెప్పబడినది. కనుక మాయా శబ్దప్రయోగం వలన పరమాత్మ జ్ఞానతత్త్వం ((ప్రజ్ఞానం బ్రహ్మ, సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ) చెప్పబడుచున్నది.

అందువలన "మాయామయమై మనియెడు జగమిది" అని అన్నమయ్య ప్రయోగించిన మాయా శబ్దమునకు మిథ్య అను అర్థము చెప్పుకోనవసరము లేదు.

మాయ అనగా ప్రకృతి అను అర్థము గలదు. కనుక ఆ ప్రకృతి సత్త్వ, రజస్తమోగుణాత్మకమగుటవలన, ఆ గుణత్రయాత్మకమగు మాయా ధర్మములతో నిండిన జగము ఇది అనియు, "చాయల నిందు నిజము కలదా" అని అనుట వలన (పరమాత్మ ప్రకృతి ద్వారా జీవులకు పాంచభౌతిక శరీరములకు కల్పించునని గీత, శ్రుతులు తెలుపుచున్నవి) పాంచభౌతికమైన శరీరము, తద్వారా కలిగెడు సంసారము అశాశ్వతమైనదని అన్నమయ్య మొదటి చరణమున భావించినాడని తెలియుచున్నది.

కీర్తనలోని రెండవ చరణమున "దైవాధీనము తగు సంసారము, వారిరి జీవుల వసమవునా" అని అన్నమయ్య వర్ణించెను. భగవద్గీతలో "ఓ అర్జునా! నేనధ్యక్షుడనుగా నుండుటచే ప్రకృతి స్థావర జంగమ విశిష్టమగు జగత్తును సృజించుచున్నది. నావలననే ఈ జగత్తు జరుగుచున్నది[22] అని శ్రీకృష్ణపరమాత్మ స్వయముగా తెలిపినట్లుగా "దైవాధీనము తగు సంసారము" అని వర్ణింపబడినది. పరమాత్మచే సృష్టింపబడి ఆతని అధీనమున గల ఈ సంసారమున జీవుడు కర్మఫలముల ననుభవింపవలసిన వాడే, కాని స్వతంత్రుడు కాడు అని "వారిరి జీవుల వసమవునా" అను వర్ణనలో తెలియుచున్నది.

"ఇంద్రియముల కధిపతియగు జీవుడు తన కర్మ మూలముగా జనన మరణాలను పొందుచున్నాడు"[23] అని శ్వేతాశ్వతరోపనిషత్తు,

"సంసార బంధానికిగాని ఆ బంధంలో నుండి విముక్తిని పొంది మోక్ష సామ్రాజ్యాన్ని చేరుకోవడానికిగాని ప్రతి ప్రాణికి మనస్సే కారణమవుతుంది"[24] అని అమృతబిందూపనిషత్తులు చెప్పినట్లుగా మనస్సు కామాదుల వృద్ధికి హేతువై సంసార బంధమును కల్గించును. తద్వారా కర్మములు, వానివల్ల జన్మములును సిద్ధించును. ఇట్లు సిద్ధించిన కర్మమూలమైన ఫలితములను వేయి వేలగు జన్మములకయినా విడుచుటకు వశమా" అని "ధావతి మనసిది తన కర్మమూలము - వేవేలయినా విడువగ వశమా" అని తెలిపినాడు.

"సృజింపబడువాని సృష్టి విషయమై సర్వేశ్వరుడు నిమిత్తమాత్రుడు, వాని వాని కర్మములే వాని వాని జన్మములకు ప్రధాన కారణములు"[25] అని విష్ణు పురాణము తెలుపుచున్నందున సత్కర్మల నాచరించి, పరమాత్మను ఉపాసించి, పరమాత్మ అనుగ్రహమునకై పాటుపడిన ఆతని అనుగ్రహము జీవునిపై ప్రసరించును. జీవుని కర్మానుసారము సృష్టి చేయువాడు పరమాత్మ కనుక జీవుడు పరమాత్మను ప్రసన్నుని గావించుకొనవలెను. అందుకే "అతని మన్నన కొలది మలయుట గాక" అని పల్లవిలో అన్నమయ్య వర్ణించినాడు. పరబ్రహ్మముయొక్క అనుగ్రహము పొందుటకు కూడా ఆ పరబ్రహ్మము యొక్క కృపయే కావలెనని "ఎంచగ శ్రీ వేంకటేశ్వరు కృపతో సంచయ మయితే సతమవుగాక" అని చివరి చరణమున ప్రకటించినాడు.

ఇందు "సంచయమయితే సతమవుగాక" అనుట వలన జీవాత్మ పరమాత్మతో కూడినచో సత్యమగునని తెలుపుట వలన జీవాత్మ ప్రత్యేక తత్త్వము వెల్లడియగుచున్నది. "సంచయమయితే" అనెనే గాని "సర్వేశ్వరుడయితే" అని అనలేదు. పరమాత్మతోపాటు జీవాత్మ కూడా సత్యమైనదే అని అన్నమయ్య ఇందు స్పష్టపరచినాడు.

అద్వైతములో మోక్షము అనగా పరమాత్మతో అభేద భావము పొందుట లేదా తానే పరబ్రహ్మము అని తెలుసుకొనుట. విశిష్టాద్వైతమున పరమాత్మతో కలియుట, ఆ పరమాత్మతో సమాన భోగములు అనుభవించుట, పరమాత్మకు గల లక్షణములను పొందుటయే మోక్షము. అన్నమయ్య "సంచయమయితే" అని

ప్రయోగించుట వలన జీవాత్మ పరమాత్మతో కలసి వుంటే" అను భావమే స్ఫురించు చున్నది గాని జీవాత్మే పరమాత్మగా మారితే అను అర్థము స్ఫురించుట లేదు.

"ఎంచగ శ్రీ వేంకటేశ్వరు కృపతో
సంచయమయితే సతమవుగాక"

అని జీవ బ్రహ్మముల విశిష్టమైన ఐక్యము స్పష్టముగా చెప్పబడినది.

3. నడుమ రెంటికిని నామేమ
వడబడె యెందలి వాడనౌ వేమ ॥పల్లవి॥

కంటిమి జగమిది కన్నుల యెదుటను
అంటి యిదియు నిజమన రాదు
వింటిమి స్వర్గము వేరే కలదని
కంటగించి అది కాదనరాదు ॥నడుమ॥

కట్టుకొంటి మిదె ఘన సంసారము
గట్టిగ నిక దొలగగ రాదు
పట్టుకొంటిమిదె పాపపుణ్యముల
తెట్ట దెరువునె దించాలేము ॥నడుమ॥

నగిలి నొక సెలవు నానాటి బదుకు
మొగి నొకచే నిను మొక్కితిని
అగపడె శ్రీ వేంకటాధిప నీ కృప
నిగుడి గురుచే నిను గనగలిగె ॥నడుమ॥ (3-342)

అను ఈ కీర్తన పల్లవియందు పుణ్య పాప రూపమైన కర్మ ఫలములకు తన శరీరము ఒడబడినదనియు, నిజమునకు తానెందలివాడనో అనియు అన్నమయ్య చింతించినాడు.

జీవుడు పరమాత్మతో కలసియుండుట విశిష్టాద్వైత సిద్ధాంత తత్త్వము. పరమాత్మయే జీవుడు కాడు, జీవ బ్రహ్మలు ప్రత్యేక తత్త్వములు. అందుకే అన్నమయ్య "ఎందలివాడనో" అని ప్రయోగించినాడు.

మొదటి చరణమున కన్నులయెదుట కన్పించే జగత్తు నిజమనరాదని చెప్పుటలోని భావము అద్వైతభావన కాదు. జీవుడు అనుభవించెడి - కన్నులకు కన్పించెడి సంసారము (జగము) శాశ్వతమైనది కాదని మాత్రమే. అనగా త్రిగుణాత్మక మైన ప్రకృతి ద్వారా కలిగిన శరీరము, దానిద్వారా కలిగిన కర్మఫలములు, సంసారములు శాశ్వతములు కావని "అంటి యిదియు నిజమనరాదు" అనుటలోని భావము.

విశిష్టాద్వైతమున శబ్దప్రమాణము అత్యంత ప్రధానమైనది. (శబ్దము అనగా వేదము) "వింటిమి స్వర్గము వేరే గలదని కంటగించి అది కాదనరాదు" అనుటలో స్వర్గము (పరమపదము) శబ్దప్రమాణము వలన తెలుసుకోబడినది కనుక కాదనరాదని స్పష్టపరచినాడు. అద్వైత తత్త్వమున పరమాత్మ ఒక్కటే నిత్యసత్యమైనది. విశిష్టాద్వైతమున పరమాత్మతో పాటు చిత్తు-అచిత్తులు కూడ నిత్యసత్యములే. అచిత్తు అనునది నిత్యవిభూతి - లీలావిభూతి రూపములు గలది. అన్నమయ్య పేర్కొనిన స్వర్గము నిత్యవిభూతిగా భావించవచ్చును.

ఈ సంసారము అనాది కాలమునుండి ఆచరింపబడిన పుణ్యాపాప రూపకర్మ ప్రవాహమనబడు అజ్ఞానమువలన కలిగినది. బ్రహ్మజ్ఞానము వలననే ఈ సంసార బంధము నివర్తించును. ప్రతినిత్యము అనుష్ఠింపబడునవియు, పరమపురుషారాధన రూపములును, ఆత్మయదార్థ జ్ఞానముచే సంస్కరింపబడినవియు అగు వర్ణాశ్రమోచిత కర్మములవలన బ్రహ్మజ్ఞానము లభించగలదు. ఫలాపేక్ష లేక పరమపురుష ఆరాధనముగా అనుష్ఠింపబడిన కర్మములు ఉపాసనా రూపమగు జ్ఞానమును కలుగజేసి దాని మూలముగా బ్రహ్మానుభవ రూపమగు అనంత స్థిర ఫలమును కలుగజేయును. ఈ విధానమంతయు కర్మ స్వరూప జ్ఞానము లేకపోయినచో తెలియబడదు. కనుక భగవదారాధన రూపములగు కర్మములను అనుష్ఠించుట అనునది కర్మ స్వరూపమును గూర్చిన జ్ఞానము లేక సంభవింపదు. కావున పరమాత్మచే సృష్టింపబడిన జీవునికి కర్మానుష్ఠానము తప్పనిసరి అని విశిష్టాద్వైత సిద్ధాంతము. అందుకే అన్నమయ్య ద్వితీయ చరణమున "కట్టుకొంటిమిదె ఘనసంసారము - గట్టిగనిక దొలగగ రాదు" అని తెలిపినాడు. అట్లే,

"సృజింపబడువాని విషయమై సర్వేశ్వరుడు నిమిత్తమాత్రుడు, వాని వాని కర్మములే వాని వాని జన్మములకు ప్రధాన కారణములు"[26] అని విష్ణుపురాణము

తెలిపినట్లుగా "పట్టుకొంటిమిదె పాపపుణ్యములు - తెట్టదెరువున దించాలేము" అని కర్మ ఫలముల ననుభవించవలసినదేనని పేర్కొనినాడు.

అద్వైతమున కర్మానుష్ఠానమునకు ప్రాధాన్యము లేదు. సాధన చతుష్టయమే బ్రహ్మోపాసనాంగము. విశిష్టాద్వైతమున కర్మానుష్ఠానము బ్రహ్మోపాసనకు అంగము కనుక అన్నమయ్య కట్టుకొంటిమిదె ఘన సంసారము - గట్టిగ నిక దొలగగ రాదు. పట్టుకొంటిమిదె పాపపుణ్యములు - తెట్టదెరువున దించాలేము" అని కర్మానుష్ఠానమును భావించినాడని అనుకొనవచ్చును. తర్వాతి చరణమున "మొగి నొకచే నిను మొక్కితిని" అని చెప్పుట వలన బ్రహ్మోపాసనము సూచింపబడినది.

ముందు చరణమున కర్మాచరణమును, తర్వాత బ్రహ్మోపాసనమును అన్నమయ్య వర్ణించుటనుబట్టి బ్రహ్మోపాసనమునకు కర్మానుష్ఠానమును అంగముగా భావించినాడనవచ్చును. చివరి చరణమున "నగితి నొక సెలవి నానాటి బదుకు - మొగి నొకచే నిను మొక్కితిని - అగపడు శ్రీ వేంకటాధిప నీ కృప - నిగుడిగురుచే నిను గానగలిగె"నని వర్ణించెను.

"బ్రహ్మవిద్యను పొందగోరువాడు సమిత్పాణియై, వైరాగ్యము పొంది సద్గురువు నాశ్రయించవలెను"[27] అని ముండకోపనిషత్తు పేర్కొనిన విధముగా "నగితి నొక సెలవి నానాటి బదుకు" అని అనాది కర్మపరంపరాగతమైన బ్రతుకును గురించి తృణీకారపు నవ్వు నవ్వితినని విరాగము ప్రకటించి, "మొగి నొకచే నిను మొక్కితిని" అని భగవంతుని ఆశ్రయించితిననియు, అందువలన "అగపడె శ్రీ వేంకటాధిప నీ కృప నిగుడి గురుచే నిను గనగలిగె" అనియు వేంకటేశ్వరు కృప వలన గురువు లభించి, ఆ గురువువలన (ఉపదేశము) నిన్ను చూడగలిగితినని, సద్గురువు నాశ్రయించుటను తెల్పినాడు. అట్టి సద్గురువు అనుగ్రహమువలన "నినుగానగలిగె" అనియు బ్రహ్మసాక్షాత్కారము కలిగినదని తెలిపినాడు. ఇందు పరమాత్మను దర్శించితినని చెప్పినాడు గాని అద్వైత పరమార్థమైన తానే పరమాత్మనని చెప్పలేదు.

4. "ఎన్నడిక యేది కొలది పాటు
వున్నతపు మాయలకే వొడిగట్టవలసె ॥పల్లవి॥

ఛీఛీ మనసా ఛీ మనసా
కాచేటి పూచేటి వో ఘనజన్మమా

నీచు ఎండమావులెల్లా నీళ్ళంటా నమ్మినట్లు
చూచి చూచి యింద్రియాలే సుఖమనవలసె ॥ఎన్నడిక॥

కట్టా జీవుడా కటకటా జీవుడా
తొట్టిన పంచభూతాల తోడి దేహమా
వెట్టి జెఱకు పోలిక వెదురు నమిలినట్టు
పట్టిన ఈ కనకమే బ్రహ్మమనవలసె ॥ఎన్నడిక॥

బాపు బాపు దైవమా భావపు శ్రీ వేంకటేశ
చూపుల నా యాతుమలో సుజ్ఞానమా
దోపుచు పూవుల వల్ల తుంగ దలకెక్కినట్లు
దాపగు నాలికె నిన్ను దలచగ వలసె ॥ఎన్నడిక॥ (3-440)

మాయ అనగా ప్రకృతియని, ప్రకృతికి అధ్యక్షుడైన పరమాత్మ ప్రకృతి ద్వార స్థావర జంగమ విశిష్టమగు జగత్తును సృజించుచున్నాడని గీతోపనిషత్తులు పేర్కొనిన విషయము తెలిసినదే. జీవులకు పాంచభౌతిక శరీరములు కల్పించి పరమాత్మ జగత్తును నిర్వహించుచున్నాడు. జీవులకు వారి కర్మపరంపరాగతమునుబట్టి శరీరాదులు కలుగును. ప్రకృతి వలన ఏర్పడిన పాంచభౌతిక శరీరాదులు అశాశ్వతములు. అన్నమయ్య ఈ కీర్తనలోని పల్లవియందు "ఎన్నడిక యేది కొలదిపాటు - వున్నతపు మాయలకె వొడిగట్టవలసె" అని జీవునికి ముక్తి ఎన్నడు? - ఉన్నతమైన ప్రకృతి కృత్యములకే ఒడిగట్టవలసి వచ్చెనుగదాయని ప్రకృతి ద్వారా సంభవించెడి కర్మపరిపాకములైన అశాశ్వతములైన జీవితములనుగూర్చి భావించినాడు.

అన్నమయ్య మాయను ప్రకృతిగా భావించినాడనుటకు ఆధారము "వున్నతపు మాయ" అను ప్రయోగము. ఒకవేళ మాయను అద్వైతపరముగా మిథ్య అనే అర్థమున భావించినచో ఉన్నతపు మిథ్య అను అర్థము స్ఫురించును. మిథ్య అయినదానికి "ఉన్నతపు" అను విశేషణము చెప్పవలసిన అవసరము లేదు. కనుక అన్నమయ్య "మాయ" అనుదానికి "ప్రకృతి" అను అర్థమునే భావించినాడనవచ్చును. ఈ ప్రకృతికి పరమాత్మ అధ్యక్షుడు కనుక "ఇది ఉన్నతమైన" ప్రకృతిగా భావించినాడు.

"ఛీఛీ మనసా ఛీ మనసా
కాచేటి పూచేటి వో ఘనజన్మమా
నీచు యెండమావు లెల్లా నీళ్ళంటా నమ్మినట్లు
చూచి చూచి యింద్రియాలే సుఖమనవలసె"

అని మొదటి చరణమునందు సర్వకర్మములకూ మూలమైన మనస్సును, తద్వారా కలిగెడి జన్మములను పేర్కొనుచు, నీచమైన ఎండమావులను చూసి నీళ్ళని నమ్మినట్లు ఇంద్రియ సుఖములనే నిజమైన సుఖములని భావించుటనుగూర్చి తెలిపినాడు.

రెండవ చరణమున -

"కట్టా జీవుడా కటకట జీవుడా
తొట్టిన పంచభూతాల తోడి దేహమా
వెట్టి జెఱకు పోలిక వెదురు నమిలినట్టు
పట్టిన ఈ కనకమే బ్రహ్మమనవలసె"

అని జీవునికి కలిగిన పంచభూతాత్మకమగు దేహమును నిరసించుచూ వెదురుగడను చూచి చెఱకుగా భ్రమించి నమిలినట్లు, కనకముపై (సంపదలపై) ఆశలు పెంచుకొని దానినే బ్రహ్మముగా (పరమార్థముగా) భావించుటనుగూర్చి తెలిపినాడు.

"బాపు బాపు దైవమా భావపు శ్రీవేంకటేశ
చూపుల నాయాతుమలో సుజ్ఞానమా
దోపుచు బూవుల వల్ల తుంగ తలకెక్కినట్లు
దాపగు నాలికె నిన్ను దలచగ వలసె"

అని చివరి చరణమున వీటినన్నింటిని బాపుమని పరమాత్మను ప్రార్థించినాడు. "నేను అందరి హృదయమున నుండువాడను, నావల్లనే జ్ఞానము ప్రకాశించుటయు సంకోచించుటయు"[28] అనియు, "బ్రహ్మము సత్యమైనది, జ్ఞానరూపమైనది, అనంతమైనది"[29] అనియు బ్రహ్మము జ్ఞానరూపముగను, అంతరాత్మగ నుండుటను గూర్చియు తెలుపబడినది. అన్నమయ్య "నా ఆతుమలో సుజ్ఞానమా" అని వర్ణించుట యందు అట్టి భావము గలదు. జ్ఞానరూపముతో అంతరాత్మగా నీవున్నను నీచమైన ఇంద్రియమగు నాలుకతో నిన్ను తలచవలసి వచ్చిదని "దోపుచు బూవులవల్ల తుంగ

తలకెక్కినట్లు - దాపగు నాలిక నిన్ను తలచగ వలసె" అని పూవులతో పాటు తుంగ కూడా తలయందు ధరింపబడినట్లుగా, ఆత్మలో జ్ఞానరూపముగా పువ్వువలె నీవుండగా తుంగవంటి నాలుకతో నిన్ను తలచవలసి వచ్చినదని ఉపనిషత్ సత్యమును లౌకికోదాహరణము ద్వారా ప్రకటించినాడు.

5. "ఇంతయు నీ మాయామయ మేగతి తెలియగ వచ్చును
దొంతిబెట్టిన కుండలు తొడరిన జన్మములు ॥పల్లవి॥

కలలోపలి సంభోగము ఘనమగు సంపదలిన్నియు
వలలోపలి నిడి పరువులు వన్నెల విభవములు
తలపున గలిగియు నిందునే తగులక పోదెవ్వరికిని
దెలిసిన దెలియదు యిదివో దేవరహస్యంబు ॥ఇంతయు॥

అద్దము లోపలి నీడలు అందరి దేహపు రూపులు
చద్దికి వండిన వంటలు జంటకర్మములు
పొద్దొక విధమయి తోచును భువి నజ్ఞానాంబుధిలో
వద్దిన దిది తెలియగ రాదంబుదముల మెరుగు ॥ఇంతయు॥

మనసున దాగిన పొలివి మదిగల కోరికలిన్నియు
ఇనుమున నిగిరిన నీళ్ళు యిల నాహారములు
పనివడి శ్రీవేంకటగిరి పతి నీ దాసు లివిన్నియు
కనిమని విడిచిన మనుజుల కాయపు మర్మములు ॥ఇంతయు॥ (2-133)

"నా మాయ తెలుసుకొన జాలనిది"[30] అని భగవద్గీతలో చెప్పిన విషయమును అన్నమయ్య ఈ కీర్తనలో అనుసంధించుకొన్నాడు. మాయను ప్రకృతిగా, పరమాత్మ దానికి అధ్యక్షునిగా[31] ఉపనిషత్తు పేర్కొనిన విషయము తెలిసినదే. మాయ అనగా మిథ్య అను అర్థము అన్నిచోటుల కలుగదని విష్ణు పురాణాది ప్రమాణములు ఇంతకు ముందు చూపించబడినవి. మాయ అనగా విచిత్ర వస్తుసృష్టి. ఇంద్రజాలికుని చేష్టలను మాయలుగా చెప్పుట లోకమున కలదు. అట్లే సర్వేశ్వరుడును ప్రకృతిని పంచ భూతాత్మకముగా సృష్టించుచున్నాడు. ఇది విచిత్రసృష్టియే. తద్వారా జీవులకు దేహాది సంచయము, కర్మ పరిపాకాది గుణముగా కలిగించుచున్నాడు. ఈ విషయమునే అన్నమయ్య ఈ కీర్తనలో "ఇంతయు నీమాయామయమేగతి తెలియగ వచ్చును"

అని విచిత్ర తత్త్వము గలిగిన నీ సృష్టిని ఏ విధముగా తెలియగలము అని భావించినాడన వచ్చును.

"పరమాత్మ మాయావరణముతో ఈ సృష్టి కలిగినది" అని తెలుసుకొనడమే అద్వైతమున పరమార్థము. ఇక ఆపైన తెలుసుకొనవలసినది ఏదియును లేదు. ఇచ్చట అన్నమయ్య ఇంతయు నీ మాయామయము" అని ఊరుకొనక "ఏ గతి తెలియగ వచ్చును" అని ప్రయోగించుటవలన అద్వైత భావన పరాస్తమగుచున్నది. సుఖ దుఃఖాది రూపమైన ఈ జన్మమునకు (ఇంతయు) నీయొక్క మాయా (ప్రకృతి) సృష్టియే మూలము. దీనిని తరించుటకు ఏది మార్గము అని జీవుని జిజ్ఞాసతో పల్లవి ప్రారంభమైనది.

"ఈ అక్షరమనబడుదానిని ఎర్రుగక ఎవడు వేలకొలది సంవత్సరములు ఈ లోకమున హోమము చేయుచున్నాడో తపస్సు చేయుచున్నాడో వాడు చేసిన దంతయు నాశము కలది యగును"[32] అని బృహదారణ్యకము పేర్కొనినట్లుగా అన్నమయ్య పల్లవి మొదటి పాదమున పరమాత్మ సృష్టి ఎట్లు తెలుసుకొనవచ్చును? అని చెప్పి రెండవ పాదములో "దొంతి పెట్టిన కుండలు దొడరిన జన్మములు" అని వర్ణించుట వలన పరమాత్మను తెలుసుకొనక ఎన్ని యజ్ఞములు చేసినా ప్రయోజనము లేదను భావమును స్ఫురింపజేసినాడనవచ్చును.

మొదటి చరణమున సంపదలు వన్నెల విభవములు, క్షణికములు అశాశ్వతములు అని తెలిసి కూడా జీవులు వాటికి చిక్కెదరనియు, తరచి తెలుసుకొనిన మాత్రమే దేవరహస్యము (శాశ్వత తత్త్వము) తెలియుననియు తెలిపినాడు.

రెండవ చరణమున "అద్దములోపలి నీడలు అందరి దేహపు రూపులు" అని ఈ పాంచభౌతికమైన శరీరములు అద్దములోని ప్రతిబింబములవంటివని చెప్పినాడు. అద్వైతమున జీవులనునవి అద్దములోని ప్రతిబింబములవంటివి మాత్రమే. అన్నమయ్య "దేహపు రూపులు" అని ప్రత్యేకంగా ప్రయోగించుటవలన కేవలము పాంచభౌతికమైన శరీరములు మాత్రమే అద్దములోని నీడలవంటివని, స్థిరానందమును కలిగించవను అర్థమును స్ఫురించుచున్నది. "ఇంద్రియములకు అధిపతియగు జీవుడు తన కర్మమూలమున జన్మ మరణాదులను పొందుచున్నాడు"33 అని శ్వేతాశ్వతరోపనిషత్తు పేర్కొనినట్లుగా "చద్దికి వండిన వంటలు జంట కర్మములు" అని జీవుని

పాపపుణ్యములు (జంటకర్మములు) జన్మముల దారిబత్తెమునకు సిద్ధాహారమైనవని రెండవ పాదములో తెలిపినాడు. సృజింపబడినవాని సృష్టి విషయమై సర్వేశ్వరుడు నిమిత్తమాత్రుడు. వాని వాని కర్మములే వాని వాని జన్మములకు ప్రధాన కారణము లని[34] విష్ణుపురాణము తెలిపినది. విశిష్టాద్వైతమున కర్మ పరిపాకములు జీవునితో పాటు అనాదులు. అందుకే అన్నమయ్య "చద్దికి వండిన వంటలు" అని కర్మ పరిపాకమును పోల్చి దాని అనాదిత్వమును తెలిపినాడు.

విశిష్టాద్వైతమున చిత్-అచిత్-బ్రహ్మము మూడును నిత్యసత్యములు. ఇందు అచిత్ లేక ప్రకృతి మూడు విధములైనది. అవి 1. శుద్ధసత్వము, 2. మిశ్ర సత్వము, 3. సత్వశూన్యము.

ప్రస్తుతము అన్నమయ్య అచిత్తత్వము యొక్క మిశ్రసత్వమును గూర్చి చెప్పినాడనవచ్చును. రజస్తమస్సులతో కూడిన సత్వగుణము కలది మిశ్రసత్వము. ఇదియే 'ప్రకృతి' అనియు, 'అవిద్య' అనియు, 'మాయ' అనియు వ్యవహరింపబడు చున్నది. ఈ మిశ్రసత్వమే ప్రాకృత మండలము. ఇది జగత్ సృష్టికి మూలము. మహదాదిభూత పర్యంతము సృష్టి సర్వమును మిశ్రసత్వము వల్లనే సంభవించుచున్నది. గుణత్రయముచే ఏర్పడినందువల్ల వాటి అంశముచేత సంసారులయొక్క జ్ఞానా నందములను ఈ మిశ్రసత్వము మరుగుపరచ జాలినదై యుండును.

"పొద్దొక విధమయి తోచును భువి నజ్ఞానాంబుధిలో
నద్దిన దిది, తెలియగ రాదంబుదముల మెరుగు"

అని వర్ణించిన రెండవ చరణమునందలి చివరి భాగమును ఇట్లు అన్వయించవచ్చును. "ప్రొద్దొక విధమయి తోచును" అనుటవలన వికారాస్పదమయిన ప్రకృతిని స్ఫురింప జేయుచున్నాడనియు, "భువి నజ్ఞానాంబుధిలో నద్దినది" అనుటవలన ఆ ప్రకృతి ఈ భువిని అజ్ఞానమను అంబుధిలో అద్దినదనియు భావించవచ్చును. "భువి" అనగా భౌతికమైన ప్రపంచము. అనగా జీవులు, సంసారము మొదలగునవి స్ఫురించును. "ఇది" అను పదమువలన ప్రకృతి అను అర్థము కలుగుచున్నది. అజ్ఞానము అనగా పూర్వకర్మములు స్ఫురించుచున్నవి.

జీవుడు తన కర్మముల ననుసరించి జన్మములు పొందువాడు కనుక, అట్లు కలిగించునది ప్రకృతి కనుక, ఆ ప్రకృతి త్రిగుణాత్మకమైనది కనుక దాని ప్రభావమునకు

జీవుడు లోనై సంసారబంధములను పొందువాడు. అందువలన ప్రకృతి భువిని అజ్ఞానమనే అంబుధిలో అద్దినది అని అన్నమయ్య వర్ణించినాడు.

అందువల్లనే రెండవ పాదమున "చద్దికి వండిన వంటలు జంటకర్మములు" అని వర్ణించినాడు. ఆ జన్మకర్మముల ఫలితమే అజ్ఞానమని తర్వాతి పాదములయందు తెలిపినాడు.

మనసున దాగిన పాలివి మదిగల కోరికలిన్నియు
ఇనుమున యిగిరిన నీళ్ళు యిల నాహారములు
పనివడి శ్రీ వేంకటగిరి పతి నీ దాసు లివిన్నియు
కనిమని విడిచిన మనుజుల కాయపు మర్మములు

అని మూడవ చరణమున జీవుని కోరికలకు మనస్సు మూలమనియు, జీవుని ఆహారము లన్నియు క్షణికములైనవనియు, మొదటి రెండు పాదములందు తెలిపినాడు.

దేహధారణకు కారణములైన భోగములను (బంధములను) పరమాత్మను శరణాగతి చేయుట ద్వారా తొలగించుకొనవచ్చునని, తద్వారా ముక్తిని పొందవచ్చునని "శ్రీ వేంకటగిరి పతి నీ దాసు లివిన్నియు కనిమని విడిచిన కాయమపు మర్మములు" అని అనినాడు. జీవునికి శరీరములు కలిగించెడి రహస్యములను "ఇవిన్నియు" అను పదము ద్వారా, పరమాత్మకు దాసులైనవారు అట్టివాటిని "కని" అనగా చూచి, "మని" అనగా అనుభవించి, "విడిచిన" అనగా వదిలివేసిన వారగుదురు అని వర్ణించినాడు.

6. **కని గుడ్డను (గుడ్డియు) వదె వినిచెవుడును విదె**
**వనిచి జగత్తు వడచీ వదివో** ॥పల్లవి॥

**ఉదయాస్తమయము లోక దినమునవె**
**యెదుటనె వున్నవి యెంచినను**
**యిదివో జీవులు యెంచక తమ తమ**
**బ్రతుకులు సతమని భ్రమిసెదరు** ॥కని॥

**వెలుగును చీకటి వెస గమకొనలవె**
**నిలిచీ నూరక నిముషములో**
**కలవలె నుండిన గతి సంసారము**
**బలువుగ సతమని భ్రమసెదరు** ॥కని॥

**కాంతలు పురుషులు కాయ మొక్కటనె**
**పొంతనె పుట్టుచు పొదలెదరు**
**యింతయు శ్రీ వేంకటేశ్వరు మహిమ**
**పంతము దెలియక భ్రమసెదరు** ॥కని॥ (3-185)

సుబాలోపనిషత్తు పరమాత్మను గూర్చి ఇట్లు చెప్పుచున్నది. "మూలము లేకయు, ఆధారము లేకయును, సృష్టికి పూర్వ మెద్దియును లేదు. చక్షురింద్రియమును చూడబడు వస్తువును నారాయణుడే. శ్రోత్రేంద్రియమును - వినబడు వస్తువును నారాయణుడే. వానినుండియే సర్వ ప్రజలును పుట్టుచున్నారు[35]. ఇట్లు ఉపనిషత్తు తెలిపినట్లుగా జీవుని చక్షురింద్రియమును - చూడబడెడి వస్తువును, శ్రోత్రేంద్రియ మును వినబడెడి వస్తువును అయిన నారాయణుని జీవుడు చూడలేక గుడ్డివానివలె, వినలేక చెవిటివానివలె, ప్రవర్తించుచు, సర్వజగత్తుకు మూలమై నడిపించెడి ఆతనిని తెలుసుకొనలేకపోవుచున్నాడని" కనిగుడ్డియు" అను పదము ద్వారా, "విని చెవుడును" అను పదము ద్వారా అన్నమయ్య ఈ కీర్తనలోని పల్లవియందు తెలిపినాడు.

**"ఉదయాస్తమయము లొక దినమువనె**
**యెదుటనె వున్నవి యెంచినను**
**యిదివో జీవులు యెంచక తమ తమ**
**బ్రదుకులు సతమని భ్రమసెదరు"**

అని ఉదయాస్తమయములతో కూడుకున్న కాలములోని పాంచభౌతికమైన తమ బ్రదుకులు క్షీణించి నశించునని గ్రహించక, శాశ్వతమని భ్రమించుచున్నారని తెలిపినాడు. ఇందు బ్రదుకులు అను ప్రయోగము ద్వారా 'అశాశ్వతమైన శరీరములు' అను అర్థమేగాని జీవులను అర్థము స్ఫురించుట లేదు. —

ఇంకను "జీవులు" అను ప్రయోగము ద్వారా "జీవులు అనేకులు" అను విశిష్టాద్వైత మతమును తెలిపినాడు. అద్వైతమున జీవులు అనేకులు లేరు. బ్రహ్మమే మాయోపాధి వలన అనేకులుగా మారును. విశిష్టాద్వైతమున అనేకులైన జీవులు శాశ్వతమైన ఆత్మస్వరూపము కలిగినవారు. వారికి పాంచభౌతికమైన శరీరం మాత్రమే అశాశ్వతమైనది.

"వెలుగును చీకటి వెసగనుకొనలనె
నిలిచీ నూరక నిముసములో
కలవలె నుండిన గతి సంసారము
బలువుగ సతమని భ్రమసెదరు"

అని రెండవ చరణమున "వెలుగును చీకటి వెసగనుకొనలనె" అనుటవలన చక్షువు-చూడబడు వస్తువైన నారాయణుడు జీవుల కనుకొనలలోనే ఉండి తన స్వరూపమును గ్రహించిన జీవునికి వెలుగును (అనగా జ్ఞానమును - ఆత్మస్వరూపమును), గ్రహించ లేని జీవునికి చీకటిని (అనగా అజ్ఞానమును-కర్మరూపమైన సంసార బంధమును) కలుగజేయుచున్నాడని భావము కలుగుచున్నది.

"నిలిచీ నూరక నిముసములో" అను ప్రయోగములో 'నిమిషము' అనగా రెప్ప మూయుట. రెప్పలు మూయుట అనునది ధ్యానమును సూచించును. ఇట్లు రెప్పలు మూసి ధ్యానము చేసినచో జ్ఞానము నిలిచియుండునని తెలిపినాడు. చివరి పాదమున సంసారము కల వంటిదని జీవులు తెలుసుకొనక శాశ్వతమని భావించెదరని బద్ధజీవలక్షణమును వర్ణించినాడు. "కలవలె నుండిన గతి సంసారము" అని అన్నమయ్య ప్రయోగించిన స్వప్నోపమానము గూర్చి యిట్లు వ్యాఖ్యానింపవచ్చును. బృహదారణ్యకము "ఆ స్వప్నస్థానమునందు రథములు కాని వాటికి కట్టబడిన అశ్వములు గాని, అవి పోవు మార్గములుగాని ఏమియు లేవు. ఆ రథములను, అశ్వములను, మార్గములను పరమాత్మయే సృష్టించును. ఆయనయే సృష్టికర్త"[36] అని పేర్కొనుటవలన సర్వసృష్టికర్త అయిన పరమాత్మయే స్వప్న సృష్టిని కూడా చేయునని తెలియుచున్నది. స్వప్నములను కూడ పరమాత్మయే సృష్టించుటయందు ఒక అంతరార్థము కలదని విశిష్టాద్వైతుల భావన. స్వప్నములు అవి కలిగినవానికి తప్ప ప్రక్కనున్నవానికి కనబడవు. వాటిని చూచు వ్యక్తియొక్క అనుభవము కొరకే, తద్వారా ఆతని పుణ్య పాప క్షయము కొరకే తాత్కాలికముగా సృష్టించబడునవి. జీవులచే వారి వారి స్వల్ప స్వల్పములగు కర్మముల కనుగుణములగు ఫలముల ననుభవింప జేయుటకై స్వప్నమున్నంత వరకు మాత్రముండునట్టివియు, స్వప్నగతులగు జీవులచే మాత్రము అనుభవింపబడదగునట్టివియు నగు స్వప్నములను పరమాత్మ సృజించు చున్నాడు. కనుక ఈ స్వప్నాదులు అద్వైతులు భావించినట్లుగా మిథ్యాతత్త్వములు కావు.

ఏ విధముగా పరమాత్మ జీవుని కర్మక్షయము కొరకు స్వప్నాదులను సృష్టించి కర్మక్షయము చేయించునో అదే విధముగా ఈ సంసారము కూడా జీవుల కర్మానుసారముగా పరమాత్మ విధించినది. ఇట్లు విధింపబడిన ఈ సంసారమె (ఇంద్రియ భోగములు మొ॥) శాశ్వతమైనదని జీవులు భ్రమను పొందుచుండిరనియు, తద్వారా ఆత్మస్వరూపము తెలుసుకొనలేకపోవుచున్నారనియు అన్నమయ్య "కలవలె నుండిన గతి సంసారము - బలువుగ సతమని భ్రమసెదరు" అని ప్రకటించినాడు.

మూడవ చరణమున "కాంతలు పురుషులు కాయమొక్కటనె పొంతనె పుట్టుచు పొదలెదరు" అని జీవులు వారి వారి కర్మలననుసరించి అనుభవించెడి జన్మాది సుఖదుఃఖములు, మరియు స్త్రీ పురుష భేదములను గూర్చి తెలిపినాడు. ముండకోపని షత్తు "ఎవడు సర్వజ్ఞుడో, సర్వమును తెలియువాడో ఆ పరమాత్మ మహిమమే ఈ భూమియందు కనిపించుచున్నది. పంచభూతములకును భౌతికములకును సంబంధించిన విశ్వ వ్యవహారమంతయు క్రమబద్ధముగా నడచుచున్నదనగా ఇది ఆ ఆత్మయొక్క ప్రభావమే"[37] అని తెలిపినట్లుగా జీవులచేత వారి వారి కర్మానుభవముల ననుభవింపజేయుటకై వారిని సృష్టించుట అనునది పరమాత్మ లీల, మహిమ అని తెలియక జీవులు భ్రమను పొందుచున్నారనియు, "యింతయు శ్రీ వేంకటేశ్వరు మహిమ సతము తెలియక భ్రమసెదరు" అనుచు పరమాత్మ లీలను వర్ణించినాడు. ఇందలి "ఇంతయు" అను పదమునకు ఈ కీర్తనలోని భావమంతయు "పరమాత్మ మహిమమే" అని అర్థము. అది తెలుసుకొనలేక జీవులు భ్రమను పొందుచున్నారని తాత్పర్యము.

7. **అందాకా దాదానే అంతకెక్కుడు గాడు**
**ముందు వెనకెంచెనా ముఖ్యడే అతడు ॥పల్లవి॥**

**చిత్తమంతర్ముఖము సేసుకొన నేర్చెనా**
**అత్తల అతడు యోగి యనబడును**
**పత్తపత్తెనెడి నువిచారము కలిగెనా**
**ఉత్తమ వివేకి యని యూహింపబడును ॥అందాకా॥**

**భావము నభావము పరికించి తెలిసెనా**
**కైవల్య నిలయుడని కానబడును**
**దైవంబు దన్ను మతి దలపోయ నేర్చెనా**
**జీవన్ముక్తుడని చెప్పబడు నతడు ॥అందాకా॥**

**అదరి వైరాగ్యధన మార్జింప నోపెనా**
**దిడువై జితేంద్రియ స్థిరుడాతడు**
**జడియు శ్రీ వేంకటేశ్వరు దాసుడాయెనా**
**బడిబడి దుద పరబ్రహ్మమే యతడు** ॥అందాకా॥ (2-452)

అని అన్నమయ్య ఈ కీర్తనలో పరబ్రహ్మమును అష్టాంగయోగము ద్వారా ఉపాసించు పద్ధతిని తెలిపినాడు. "యమ-నియమ-ఆసన-ప్రాణాయామ-ప్రత్యాహార-ధ్యాన-ధారణ-సమాధులచేత ప్రీతిపూర్వకముగ దర్శన సమానాకారస్థితి కలిగేటట్లుగా తైలధారవలె అవిచ్ఛిన్న స్మృతి సంతతితో ఆ పరమాత్మ దివ్యరూపమును గోచరింప జేసుకొనుటయే ధ్యానమని, ఉపాసనమని, భక్తియోగమని చెప్పబడుతుంది"[38].

అష్టాంగ యోగము భక్తియోగముగా భావించబడుచున్నది.

**"అందాకా దాదానే అంతకెక్కుడుగాడు**
**ముందు వెనుకెంచెనా ముఖ్యుడే అతడు"**

అని ఆత్మతత్త్వమును తెలుసుకొను ప్రయత్నము చేయు బ్రహ్మ జిజ్ఞాసి ప్రథమ లక్షణమును పల్లవియందు తెలిపి, ఆతడాచరింపవలసిన అష్టాంగ యోగమును క్రమముగా "చిత్తమంతర్ముఖము సేసికొన నేర్చెనా" అని మనస్సును అన్నింటిపైనుండి మళ్ళించుట అను "యమ" లక్షణమును, "సత్తసత్తనెడి సువిచారము కలిగెనా" అని తపస్సు, స్వాధ్యాయము మొదలగు నియమమును, "యోగియనబడును" అని ఆసన ప్రాణాయామములు తెలిపినాడు. బాహ్య వస్తువులనుండి ఇంద్రియములను నిగ్రహించి మనోధీనము చేయుట ప్రత్యాహారమను లక్షణమును చివరి చరణమందలి "అదరి వైరాగ్య ధనమార్జింపనోపెనా - దిడువై జితేంద్రియ స్థిరుడాతడు" అని వర్ణించినాడు. ఇట్లు నిలకడ కలిగి నిగ్రహింపబడిన మనస్సును శుభాశ్రయమైన పదార్థమందు నిలిచి ఉండేటట్లుగా లగ్నము చేయుటయే ధారణ. "జడియు శ్రీ వేంకటేశ్వరు దాసుడాయెనా" అని చివరి చరణమున మనస్సును పరమాత్మ దాస్యము నందు లగ్నము చేయుటను తెలిపినాడు. ధ్యానింపబడవలసిన పదార్థము నిర్దుష్టమై శుభాశ్రయమైనపుడే మనస్సుకు నిలకడ ఏర్పడును. భగవంతుని విగ్రహమే శుభాశ్రయ మని విష్ణుపురాణము ఖాండిక్య కేశిధ్వజుల సంభాషణ రూపముగా తెలియజేసినది. అందుకే శ్రీ వేంకటేశ్వరుని శుభాశ్రయముగా అన్నమయ్య భావించినాడు.

ధారణలో నిలచిన శుభాశ్రయము, అస్త్రభూషణాది శోభితమైన దివ్యమూర్తిని ఏకధారగా చింతించడమే ధ్యానమని, ఇదే సబీజయోగమనీ విష్ణుపురాణము పేర్కొన్నది. "దైవంబు దన్ను మతి దలపోయ నేర్చెనా" అని అన్నమయ్య ధ్యాన లక్షణమును తెలిపినాడు.

చివరకు భగవంతుని యొక్క పరిపూర్ణమైన జ్ఞానానందాత్మక దివ్యాత్మ స్వరూపమందు మనస్సుకు విశ్రాంతి కల్పించడమే సమాధి. "పడి పడి తుద పరబ్రహ్మమే యాతడు" అని సమాధి లక్షణమును ఈ కీర్తన చివరి పాదమున వర్ణించినాడు. రెండవ చరణమున "భావము నభావము పరికించి తెలిసెనా కైవల్య నిలయుడని కానబడును" అనెడి వర్ణనలో భావరూపములనగా, సత్య, జ్ఞాన, అనంతత్వ, సత్యకామ సత్యసంకల్పాది విశేష గుణములు. అభావ రూపములనగా స్థూలత్వ, హ్రస్వత్వాది ప్రాకృత గుణములు లేకుండుట, అపహత పాప్మత్వము, విజరత్వము, విమృత్యువు మొదలగునవి.

ఈ భావాభావ లక్షణములు కలిగిన పరమాత్మయొక్క స్వరూపమును పూర్తిగా గ్రహించినచో జీవుడు కైవల్యనిలయుడగునని అన్నమయ్య భావన. "ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానమ్" అన్నట్లుగా భావాభావ స్వరూపము కలిగిన పరమాత్మ తత్త్వము తెలుసుకున్నచో సర్వవిజ్ఞానము అవగతమగునని అన్నమయ్య భావించినాడనవచ్చును.

ఈ కీర్తనలోని రెండవ చరణములోని ఉత్తర పాదములలో "దైవంబు దన్ను మతి దలపోయనేర్చెనా-జీవన్ముక్తుడని చెప్పబడునతడు" అనెడి వర్ణనలో దైవధ్యానము వలన జీవునికి జీవన్ముక్తి కలుగునని అన్నమయ్య పేర్కొనినాడు. ఇది పైకి అద్వైత భావనవలె కన్పించును. విశిష్టాద్వైతమున జీవునికి జీవన్ముక్తి లేదు. దేహావసానము నందు మాత్రమే ముక్తి లభించును. ఇచ్చట అన్నమయ్య భావించినది కోరికల నుండి కలుగు ముక్తి మాత్రమేనని చెప్పవచ్చును. కఠోపనిషత్తు "హృదయమున గల కోరికలన్నియు ఎప్పుడు పూర్తిగా తొలగిపోవునో, అప్పుడు మర్త్యుడు అమృతుడై ఇచటనే లెస్సగా బ్రహ్మమును పొందుచున్నాడు"[39] అని తెల్పుచున్నది. శ్రీభాష్య వ్యాఖ్యానము జీవన్ముక్తుని లక్షణమును ఈ విధంగా పేర్కొన్నది. "బ్రహ్మజ్ఞానము గల మనస్సు కలవాడు, త్రికరణశుద్ధి కలవాడును, అసత్యము పలుకనివాడును, ఎక్కువ శాంతము కలవాడును, యోగసంపన్నుడును, ఎల్లప్పుడు యోగప్రియుడును, ఐనందున జీవన్ముక్తుడు[40] అని.

ఈ విధమగు జీవన్ముక్తి లక్షణమునే అన్నమయ్య ఈ కీర్తనయందు తెలిపినాడు. చిత్తమంతర్ముఖము చేసికొన్న యోగి సత్యాసత్య స్వరూపమును విచారించి తెలుసుకొని, భావాభావమును పరికించి, గ్రహించి కైవల్య నిలయుడై అనగా బ్రహ్మ జ్ఞానమును పొంది, అట్టి బ్రహ్మమును నిరంతరము మననము చేయుచు జీవన్ముక్తుడగు చున్నాడని అన్నమయ్య భావన. జీవన్ముక్తిని ఇంకను యిట్లు వివరించవచ్చును. బ్రహ్మ సూత్రములలో ఇట్లు చెప్పబడినది. "బ్రహ్మవిద్యా ప్రాప్తి కలుగగనే ఉపాసకుని యొక్క ఆగామి పాపకర్మములాతనికి సంబంధింపవు. సంచిత పాపకర్మములు నశించు చున్నవి"[41]. బృహదారణ్యకమిట్లు చెప్పినది. "పరమాత్మ స్వరూపము తెలుసుకొనిన వాడు వానిని ధ్యానించి పాపకర్మముతో సంబంధింపడు"[42]. ముండకోపనిషత్తు "పరావరుడగు సర్వేశ్వరుని సాక్షాత్కరించుకొన్న జ్ఞానియొక్క పాపములన్నియు నశించు చున్నవి"[43] అని పేర్కొన్నది. ఈ విధముగా ఉపనిషత్తులు వివరించిన పాపకర్మములు నశించిన జ్ఞాని దశను "జీవన్ముక్తి"గా అన్నమయ్య భావించినాడనవచ్చును.

"బ్రహ్మవేత్తకు శరీర వియోగము కలుగువరకు మాత్రమే మోక్షము పొందుటకు విలంబము కలదు. అనంతరమతడు పరమాత్మను పొందుచున్నాడు"[44] అని ఛాందోగ్యము పేర్కొనినట్లుగా జీవునికి ముక్తి దేహావసానమున మాత్రమే సంభవించును. "బడిబడి తుద పరబ్రహ్మమే యతడు" అని ఈ కీర్తన చివరి పాదమున "తుద"ను ప్రత్యేకముగా చెప్పుట వలన దేహావసానమున మాత్రమే మోక్షమను అర్థము సిద్ధించుచున్నదనవచ్చును. జీవుడు ముక్తపురుషుడై బ్రహ్మముతో పరమసామ్యమును పొందునని[45], పరమాత్మయందే సంచరించునని[46], పరమాత్మ యొక్క కళ్యాణ గుణములను పొందునని[47], అట్టి సాధర్మ్యమును పొందిన జీవుడు తిరిగి జన్మింపడని[48], శ్రుతులు, గీత పేర్కొనినట్లుగా "పరబ్రహ్మమే యితడు" అని ఈ కీర్తనయందు అన్నమయ్య ప్రయోగించెనేగాని అద్వైతదృష్టితో కాదు.

8. **ఎంతమాత్రము ఎవ్వరు దలచిన అంతమాత్రమె నీవు**
**అంతరాంతరము లెంచిచూడబిండంటే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥**

**కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని**
**పలుకుదురు వేదాంతులు పరబ్రహ్మంబనుచు**
**తలతురు మిము శైవులు తగిన భక్తులను శివుడనుచును**
**అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుడనుచు ॥ఎంత॥**

పరిగెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరశనములు మిము నానా విధులను తలపుల కొలదుల భజింతురు
సిరుల మిమ్ము నే యల్పబుద్ధి తలంచిన వారికి నల్పంబవుదువు
గరిమల మిము నే ఘనమని తలచిన ఘనబుద్ధులకు ఘనుడవు ॥ఎంత॥

నీవలన కొరతే లేదు మరి నీరు కొలది తామెరవు
ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే వూరిన యట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము జేకొని వున్న దైవమని
యీ వలనే నీ శరణని యెదను నిదియే పరతత్త్వము నాకు ॥ఎంత॥ (2-393)

అద్వైతుల భక్తిలో శివకేశవ భేదము లేదు. అందువలన ఈ కీర్తనపైకి అద్వైత భావన గలదిగా కన్పించుచున్నది. ఈ కీర్తనయందు శివకేశవాభేదము చెప్పుట అన్నమయ్య ఉద్దేశ్యము గాదు. పరబ్రహ్మమైన నారాయణుడే బ్రహ్మరుద్రాది దేవతా స్వరూపుడని శ్రుతులు ఘోషించుచున్నవి[49]. ఆయననే విధముగా భావించి కొలిచిన వారికి ఆయన ఆ రూపముననే లభించును. ఈ విషయము పల్లవిలోనే అన్నమయ్య "పిండంత నిప్పటి" అని పండి ఎంతో ముద్ద అంతేనని స్పష్టపరచినాడు. మరియు సర్వదేవతాంతర్వర్తియైనది నారాయణుడే"యని ప్రకటించు ఉపనిషత్సారమును "ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే యూరినయట్లు" అని లౌకికమైన ఉదాహరణ మును చూపినాడు. గోదావరి నది ప్రక్కన ఉన్న బావులలో ఆ నదీజలమే వూరినట్లుగా, భక్తులు భావించిన వారి వారి ఇష్టదైవములుగా నారాయణాంశములైన బ్రహ్మ రుద్రేంద్రాదులే కన్పించెదరని అన్నమయ్య నారాయణ విరాట్ స్వరూపమును భాగీరథిగను, భక్తుల విభిన్న భక్తిమార్గములను బావులుగను నిరూపించి వివరించినాడు. "నీరు కొలది తామెర" అని ప్రయోగించి ఏ భక్తుని హృదయము ఎంత విశాలమైనదో అతనికంత పరమాత్మ వైభవము లభించునని, "కొలిచిన ... కొరతే లేదు" అని తాను మాత్రము "శ్రీ వేంకటపతినే పరదైవముగా జేకొని శరణమనియెద"నని ప్రకటించి, దేవతాంతరములెన్ని లోకమున ప్రకాశించినా, భక్తులు ఆయా మార్గములయందు ప్రయాణించినను, పరదైవము మాత్రము శ్రీవేంకటేశుడని, అతనినే శరణు వేడవలెనని అన్నమయ్య స్పష్టము చేసి, విశిష్టాద్వైత సిద్ధాంత లక్ష్యమును, లక్షణమును తన కీర్తనల ద్వారా ప్రకటించినాడు.

ఇంతవరకు విచారించిన ఈ కీర్తనలయందు పైకి అద్వైత భావనలు గోచరించి నను తరచి చూచిన విశిష్టాద్వైత సిద్ధాంత లక్షణములు కనిపించుచున్నవని స్పష్టముగా నిరూపించబడినది.

## అథస్సూచికలు

1. పేజి-30, అన్నమాచార్యుల జీవితచరిత్రము.
2. పేజి-3, పేజి-35 పీఠిక - గౌరిపెద్ది రామసుబ్బశర్మ, అధ్యాత్మసంకీర్తనలు, సంపుటి-2.
3. శ్లో॥ "ప్రణవో ధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే ।
   అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్"
   శ్లో-4, ఖం-2, ముండపి-2, ముండకోపనిషత్.
4. శ్లో॥ "పురుషో యథా క్రతురస్మింల్లోకే పురుషో భవతి ।
   తథేతః ప్రేత్య భవతి, సక్రతుం కుర్వీత!
   మనోమయః ప్రాణశరీరో భారూపస్సత్యసంకల్పః
   ఆకాశాత్మా సర్వకర్తా, సర్వకామ ........"
   శ్లో-1,2, ఖం-14, ప్రకరణము 3, ఛాందోగ్యోపనిషత్తు.
5. "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి". శ్లో-9, ఖం-2, ముండపి-3, ముండకోపనిషత్తు.
6. "తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి" సూ-3, ఖం-1, ముండపి-3, ముండకోపనిషత్.
7. "సోశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితేతి" శ్లో-2, అనువాకం-1, అధ్యా-2, తైత్తిరీయారణ్యకము.
8. "స ఉత్తమః పురుషః సతత్రపర్యేతి" శ్లో-3, ఖం-12, ప్రకరణము-8, ఛాందోగ్యోపనిషత్తు.
9. "యథానద్యః స్యందమానాః సముద్రేస్తంగచ్ఛంతి నామరూపే విహాయ, తథా విద్వాన్నామ రూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్" శ్లో-8, ఖం-12, ముండకోపనిషత్తు.
10. "అణోరణీయాన్ మహతో మహీయాన్ ఆత్మాస్యజంతోర్నిహతో గుహాయాం" శ్లో-20, వల్లి-2, అధ్యా-1, కఠోపనిషత్తు.

11. "ఏకస్తథా సర్వభూతాంతరాత్మా రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ"
శ్లో-9, వల్లి-5, అధ్యా-2, కఠోపనిషత్.

12. "నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానామేకో బహూనాం యోవిదధాతి కామాన్!
తమాత్మస్థం యేనుపశ్యంతి ధీరాస్తేషాం శాంతి: శాశ్వతీ నేతరేషామ్"
శ్లో-13, వల్లి-5, అధ్యా-2, కఠోపనిషత్తు.

13. శ్లో॥ "అథ యదిదమస్మిన్ బ్రహ్మపురేదహరం పుండరీకం వేశ్మ
దహరోస్మిన్నంతరాకాశస్తస్మిన్యదంతస్తదన్వేష్టవ్యం
తద్వావ విజిజ్ఞాసి తద్యమితి" శ్లో-1, ఖం-1, ప్రక-8, ఛాందోగ్యోపనిషత్.

14. శ్లో॥ "సవా ఏష మహాజన ఆత్మా యోయం విజ్ఞానమయ:
ప్రాణేషు య ఏషోంతర్హృదయ ఆకాశ స్తంస్మింఛేతే
సర్వస్య వశీ సర్వస్యేశాన: సర్వసాధిపతి: ....."
శ్లో-22, బ్రాహ్మణము-4, ఆరణ్యకము-6, బృహదారణ్యకము.

15. శ్లో॥ "సర్వస్యచాహం హృది సన్నివిష్టో..." శ్లో-15, అధ్యా-15, భగవద్గీత.

16. శ్లో॥ "ఆత్మభావం నయత్యేనం తద్బ్రహ్మధ్యాయినం మునే ।
వికారమాత్మనశ్శక్త్యా లోహమాకర్షకో యథా ॥"
శ్లో-30, అధ్యా-7, అంకము-6, విష్ణుపురాణము.

17. "ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోంతర్యామ్యేష యోని: సర్వస్య ప్రభవాప్యయౌ
హి భూతానామ్" మండలము-6, మాండూక్యోపనిషత్.

18. శ్లో॥ "నాయమాత్మా ప్రవచనేన లభ్యో నమేధయా న బహునా శ్రుతేన!
యమేవైష వృణుడే తేన లభ్య స్తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్"
శ్లో-3, ఖం-2, ముం-3, ముండకోపనిషత్తు.

19. శ్లో॥ "తేన మాయా సహస్రం తచ్ఛంబర స్వాశుగామినా ।
బాలస్య రక్షితాదేహ మైకైక శ్యేన సూదితం ॥"
శ్లో-20, అధ్యా-19, అంకము-1, విష్ణుపురాణము

20. శ్లో॥ "మాయాంతు ప్రకృతి విద్యాన్మాయినంతు మహేశ్వరం"
శ్లో-10, అధ్యా-4, శ్వేతాశ్వతరోపనిషత్తు.

21. "తస్యావయవ భూతైసువ్యాప్తగ్ం సర్వమిదం జగత్"
అధ్యా-4, శ్వేతాశ్వతరోపనిషత్తు

22. శ్లో॥ "మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ ।
హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే ॥" శ్లో-10, అధ్యా-10, భగవద్గీత.
23. శ్లో॥ "గుణాన్వయోయః ఫలకర్మకర్తా కృతస్య తస్యైవ సచోపభోక్తా
స విశ్వరూపస్త్రిగుణస్త్రివర్త్మా విశ్వాధిప స్సంచరతి స్వకర్మభిః ॥
శ్లో-7, ఆరణ్యకము-5, శ్వేతాశ్వతరోపనిషత్తు.
24. శ్లో॥ "మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః ।
బన్ధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయగ్ం స్మృతమ్ ॥"
శ్లో-2, అమృతబిందూపనిషత్తు.
25. శ్లో॥ "నిమిత్తమాత్రయే వాసౌ సృజ్యానాం సర్గకర్మణి ।
ప్రధాన కారణీభూతా యతోవై సృజ్య శక్తయః ॥"
శ్లో-50, అధ్యా-4, అం-1, విష్ణుపురాణం
26. శ్లో॥ "నిమిత్తమాత్రయే వాసౌ సృజ్యానాం సర్గకర్మణి ।
ప్రధాన కారణీభూతా యతోవై సృజ్య శక్తయః ॥"
శ్లో-50, అధ్యా-4, అం-1, విష్ణుపురాణం
27. శ్లో॥ "పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్య
కృతః కృతేన తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛే
త్సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం"
శ్లో-12, ముండపి-1, ముండకోపనిషత్తు.
28. శ్లో॥ "సర్వస్యచాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్జ్ఞాన మపోహనం చ".
శ్లో-15, అధ్యా-15, భగవద్గీత.
29. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" శ్లో-1, అధ్యా-2, ఆనందవల్లి, తైత్తిరీయోపనిషత్తు
30. శ్లో॥ "మమ మాయా దురత్యయా" - 14, అధ్యా-7, భగవద్గీత.
31. శ్లో॥ "మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరమ్"
శ్లో-10, అధ్యా-4, శ్వేతాశ్వతరోపనిషత్తు.
32. శ్లో॥ "యోవా ఏతదక్షరం గార్గ్య విదిత్వాస్మిల్లోకే
జుహోతి యజతే తపస్తప్యతే బహూని వర్ష
సహస్రాణ్యంత వదేవాస్యతద్భవతి ॥"
శ్లో-10, బ్రా-8, అర-5, బృహదారణ్యకోపనిషత్తు.

33. శ్లో॥ "కర్మానుగాన్యనుక్రమేణ దేహీస్థానేషు రూపాణ్యభి సంప్రపద్యతే"
శ్లో-11, అర-5, శ్వేతాశ్వతరోపనిషత్తు.

34. శ్లో॥ "నిమిత్తమాత్రమేవాసౌ సృజ్యానాం సర్గకర్మణి
ప్రధాన కారణీభూతా యతో వై సృజ్యశక్తయః ॥"
శ్లో-50, అధ్యా-4, అంకము-1, విష్ణుపురాణము

35. "నైదేహ కించనాగ్ర ఆసీదమూల మనాధారా ఇమాః ప్రజాః
ప్రజాయంతే దివ్యో దేవ ఏకో నారాయణశ్చక్షుశ్చ
ద్రష్టవ్యంచ నారాయణః శ్రోత్రంచ, శ్రోతవ్యంచ నారాయణో"
మం.శ్లో.-1, ఖం-6, సుబాలోపనిషత్తు.

36. "న తత్ర రథా న రథ యోగా నపన్థానో భవన్త్యథ రథాన్
రథయోగాన్పథ స్సృజతే, న తత్రానందా ముదః .... సహి కర్తా"
మం.శ్లో-10, బ్రహ్మ-3, అధ్యా-6, బృహదారణ్యకోపనిషత్తు.

37. శ్లో॥ యః సర్వజ్ఞః సర్వవిద్యస్యైష మహిమాభువి
దివ్యే బ్రహ్మపురేహ్యేష వ్యోమన్యాత్మ ప్రతిష్ఠితః
సూ-7, ఖండ-2, ముం-2, ముండకోపనిషత్తు.

38. పేజి-147, తత్త్వోపహారము - న.చ. రఘునాథాచార్యులు, ప్రచురణ : సత్సంప్రదాయపరిరక్షణ సభ, వరంగల్.

39. శ్లో॥ "యదా సర్వే ప్రముచ్యంతే కామాయేస్య హృదిశ్రితాః
అథ మర్త్యోమృతో భవత్యత్ర బ్రహ్మసమశ్నుతే॥"
శ్లో-14, వల్లి-6, అధ్యా-2, కఠోపనిషత్తు.

40. శ్లో॥ "జీవన్ముక్తః సరాజర్షిః బ్రహ్మజ్ఞానమతిః శుచిః
తద్యవక్తాతి శాంతశ్చ యోగీయోగ ప్రియస్సదా"
- శ్రీమదాంధ్ర శ్రీభాష్యము-ప్రథమాధ్యాయము-ప్రథమపాదము-సమన్వయాధికరణ వ్యాఖ్యాన సందర్భము.

41. సూ॥ "తదధిగమే ఉత్తర పూర్వాఘయోరశ్లేష వినాశౌ తద్వ్యపదేశాత్"
సూ-13, పాద-1, అధ్యా-4, బ్రహ్మసూత్రములు.

42. "...... సమహితో భూత్వాత్మన్యేవాత్మానం పశ్యతి, సర్వమాత్మానం పశ్యతి నైనం పాప్మా తరతి, సర్వం పాప్మానం తరతి ....."
సూ-23, బ్రహ్మ-41, అర-6, బృహదారణ్యకోపనిషత్తు.

43. "క్షీయంతే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే"
శ్లో-9, ఖం-2, ముం-2, ముండకోపనిషత్తు.

44. "ఆచార్యవాన్ పురుషో వేదతస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యేథ సంపత్స్యే ఇతి" - శ్లో-2, ఖండ-14, ప్రకరణము-6, ఛాందోగ్యోపనిషత్తు.

45. "తదా విద్వాన్ పుణ్యాపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి"
సూ-3, ఖం-1, ముం3, ముండకోపనిషుత్తు.

46. శ్లో॥ "స ఉత్తమః పురుషః సతత్ర పర్యేతి"
సూ-3, ఖం-12, ప్రక-8, ఛాందోగ్యోపనిషత్తు.

47. "సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ" సూ-1, అను-1, తైత్తిరీయారణ్యకము.

48. శ్లో॥ "ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతా ।
సర్గేపి నోపజాయంతే ప్రలమే నవ్యదంతిచ ॥"
శ్లో-2, అధ్యా-14, భగవద్గీత.

49. "బ్రహ్మైవ పరమాత్మా సబ్రహ్మ సవిష్ణు సరుద్ర స్సఇంద్రస్సశమన స్ససూర్య స్సచంద్రస్తేసురా ....." సూ-5, నిరాలంబోపనిషత్.

# అధ్యాయము - 6

# అన్నమయ్య కీర్తనలలో శ్రీవైష్ణవ ఆచార సంప్రదాయములు

భగవద్రామానుజులు పరిపుష్టమొనరించిన విశిష్టాద్వైత సిద్ధాంతమును అనుసరించు శ్రీవైష్ణవులు తమ నిత్యాచార, వ్యవహారాది విషయములలో పాంచరాత్ర ఆగమ ప్రమాణమునను సరించి ఏర్పడిన సంప్రదాయమును అనుకరించుచూ వచ్చిరి. శ్రీమద్రామానుజాచార్యులు బ్రహ్మసూత్ర వ్యాఖ్యానము చేయుచు పాంచరాత్ర ఆగమమునకు సర్వాత్మనా ప్రామాణ్యమును నిరూపించిరి. పాంచరాత్రాగమములో వివరించిన శ్రీవైష్ణవ సంప్రదాయ విధివిధానములను భగవద్రామానుజాచార్యులు సర్వ మానవులకు వర్తింపజేసి, వారికి మోక్షాధికారమును కల్గించిరి. పాంచరాత్రాగమము నందు చెప్పిన పంచసంస్కారాది ఆచారములు పాటించనివారికి శ్రీవైష్ణవత్వ సిద్ధి లేదని వారు నిర్ణయించిరి.

అన్నమాచార్యుల కీర్తనలలో విశిష్టాద్వైత తత్త్వ పరిశీలనముతో పాటు శ్రీవైష్ణవ ఆచార సంప్రదాయ విధానములను అన్నమయ్య వర్ణించిన తీరు, వాటి గొప్పదనమును ఉల్లేఖించిన తీరు, వాటిని తాననుసరించి ఆనందించిన తీరు వివరింపవలసియున్నది.

అన్నమాచార్యులు ఉపనయనానంతరము విష్ణుడను యతిచేత పంచసంస్కార ములు పొంది, ఆదివణ్ శఠగోప యతీంద్రుల అనుగ్రహముతో నృసింహ మంత్రమును ఉపాసించినాడు. అక్షరమునకు వేయి చొప్పున ఆ మంత్రాక్షరముల సంఖ్యతో తులతూగు 32 వేల సంకీర్తనలు రచించినాడు. అన్నమయ్య సంకీర్తనలయందు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారము ఒక అంశము కాగా, సంగీత సాహిత్య సరస సమ్మేళనము మరొక ముఖ్యాంశము. విష్ణ్వవతారములను వర్ణించు సందర్భమున, విశిష్టాద్వైత మత లక్షణములు వివరించు సందర్భమున ఆయన వర్ణించిన కీర్తనలలో పంచసంస్కార లక్షణములిట్లు ప్రతిఫలించినవి.

కీర్తన : గతులన్ని ఖిలమైన కలియుగమందున:
గతి యీతడే చూపె ఘన గురుదైవము

యీతని కరుణనెకా యిల వైష్ణవుల మైతి
మీతని వల్లనే కంటిమీ తిరుమణి
యీతడెకా వుపదేశ మిచ్చె నష్టాక్షరి మంత్ర
మీతడే రామానుజులు యిహపరదైవము ॥గతులన్ని॥

వెలయించె నీతడెకా వేదపు రహస్యములు
చెలిమి నీతడె చూపె శరణాగతి
నిలిపి నాడీతడేకా నిజముద్రా ధారణము
మలసి రామానుజులే మాటలాడే దైవము ॥గతులన్ని॥

నియమము లీతడెకా నిలిపె బ్రపన్నులకు
దయతో మోక్షము జూప దగనీతడే
నయమై శ్రీవేంకటేశు నగమెక్కె వాకిటను
దయజూచి మమ్ము నిట్టే తల్లిదండ్రి దైవము ..." ॥గతులన్ని॥ (2-372)

అను ఈ కీర్తనలోని మొదటి చరణమున అన్నమయ్య తనకు పంచసంస్కారమొనరించి దీక్షనిచ్చిన గురువును స్తుతించెను. రెండవ చరణమున శ్రీవైష్ణవ సదాచార లక్షణమును, ముద్రాధారణము ద్వారా, భగవంతుని చేరుకొను లక్షణమును శరణాగతి ద్వార గురువు ఉపదేశించెనని, ఆయన అపర రామానుజులని ప్రస్తుతించెను.

మరొక కీర్తనలో "హరిభక్తి వేదాలలో మొలచి, వేదాంతాలలో కొనలు సాగినదనీ, అది పంచ సంస్కారములతో ప్రతివ్యక్తిలో పాదుకొనునని - (2-222), వేరొక కీర్తనలో ఈ "పంచసంస్కార లక్షణము కల్గినదే బ్రాహ్మణ్యమనీ" (2-486) అన్నమయ్య పంచసంస్కార లక్షణమును ప్రస్తుతించి శ్రీవైష్ణవ సదాచారమును తానాచరించి ప్రజలకు అనుసరించమని ప్రబోధించెను.

శ్లో॥ "తాప: పుండ్ర తథా నామ మంత్రో యాగశ్చ పంచమ: ।
అమీ పరమ సంస్కారా పారమైకాంత్య హేతవ: ॥"

"తాపము, పుండ్రము, నామము, మంత్రము, యాగము అనునవి పంచ సంస్కారములుగా శ్రీవైష్ణవులకు సదాచార్యులు విధించిరి. ఈ పంచసాస్కారములను పొందిన వైష్ణవులు పరమైకాంత్యస్థితిని పొందగలుగుదు"రని ఆచార్యులుపదేశించిరి.

**తాపము** : అగ్నితప్తమైన సుదర్శనచక్ర, పాంచజన్య ముద్రలను సదాచార్యుని చేతి మీదుగా, శిష్యుడు తన భుజములందు ధరించుట తాపము. ఈ విధానమునే "సమాశ్రయణము" అందురు. ఈ విధి ఆగమ విధానమేగాక ఉపనిషత్ ప్రోక్తమైనది. అవ్యక్తోపనిషత్తు "ప్రజాపతి ఇంద్రుని అమృత పూర్ణములైన మూడు కలశములచే అభిషేకించి సుదర్శనముచే కుడివైపున, పాంచజన్యముచే ఎడమవైపున రక్షించెననియు, "ఈ రక్షణ ద్వారా ఇంద్రునకు త్రిలోకాధిపత్యము సమకూడెన"నియు[1] వివరించినది. ఇట్టి 'తాపము'ను గూర్చి అన్నమయ్య అనేక విధములుగా స్తుతించెను.

"నేమినాతప్తముద్రాం ధారయేత్" (2-485) అని శ్రుతి ప్రమాణము కలదనియు, ఈ ముద్ర ధరించనివారు "అనాయుధా సో అసురా అదేవా" (2-485) అని ఋగ్వేదము తెలిపినదనుచు అనాది ప్రమాణములను అన్నమయ్య నిరూపించెను.

"లలిమీరి హరిచక్ర లాంఛనపు శూరులకు" (2-114) అన్నిచోట్ల విజయము ప్రాప్తిస్తుందని "పొందుగ చక్రాంకితమే భుజబలమిదే నాకు" (2-109) అనియు, "సతతము హరిచేతి శంఖచక్రములే, కోరి మా భుజముల డాగులు మోయుచున్నార మనుచు", "అవియే గతియై మా పాలనుండి గాచుగాక" (2-101) అనుచు ముద్రా ధారణమువలన కలిగెడు బలమును, రక్షణను అన్నమయ్య కీర్తించెను. నీ ముద్రలను ధరించినాము గనుక మమ్ములను నీవే రక్షించాలని అన్నమయ్య భగవంతుని ప్రార్థించెను.

"నీ ముద్రలు మోచి యీ యెడ నుండగా నీవే యీడేరింతువు గాక" (2-52), "నీ ముద్రలు ధరించితి నీ గుణాలు వొగడితి" (2-257), "మరిగి నీ ముద్రలు మోచితిని-మన్నించితివిటు నను నీవు" (2-299), "లలి నా భుజము చక్రలాంఛనము జూచి యేలుమీ" (2-192), "సారె నీ ముద్రలు లేని భుజములు బుద్బుజములు" (2-450), "యొనసి రక్షించను నీముద్రేచాలు" (2-482)

అని అన్నమయ్య ముద్రా ప్రాశస్త్యమును అనేక కీర్తనలలో ఉగ్గడించినాడు. అనేక తీర్థములలో స్నానమాడిన లభించని నీవు నీ ముద్ర ధరించినవారికి సులభుడవని (3-56) భగవంతుని భక్తసులభత్వమును, "ఆయన ఆయుధ లాంఛనము ధరించిన వారికి కాలదండముల భయము లేదని" (3-12) భగవంతుని అభయత్వమును, ముద్రాధారణము ద్వారా అన్నమయ్య అభివ్యక్తీకరించినాడు.

**పుండ్రము :** పంచ సంస్కారములలో పుండ్రముమ అన్నమయ్య బ్రాహ్మణత్వమునకు ప్రథమ లక్షణముగా పేర్కొనినాడు. శ్రీవైష్ణవులు తమ శరీరములోని ద్వాదశ స్థానముల యందు కేశవాది నామోచ్చారణ చేయుచు, ఊర్ధ్వరేఖలను ధరించుట పుండ్రమన బడును. ఈ రేఖలు త్రివిధము. రెండు తెలుపు రేఖల మధ్య ఒక ఎరుపు రేఖతో త్రిపుండ్రములను ధరించుట, కొందరు ఎరుపు స్థానమున శ్రీచందనము కూడ ధరింతురు. ముఖమున కేశవ నామముతో, ఉదరమున నారాయణ నామముతో, వక్షస్థలమున మాధవ నామముతో, కంఠమున గోవింద నామముతో, ఉదర కుడి భాగమున విష్ణు నామముతో, కుడిభుజమున మధుసూదన నామముతో, కంఠ కుడి భాగమున త్రివిక్రమ నామముతో, ఉదర వామభాగమున వామన నామముతో, ఎడమ భుజమున శ్రీధర నామముతో, కంఠ వామభాగమున హృషీకేశ నామముతో, నడుమ వెనుక భాగమున పద్మనాభ నామముతో, మెడ వెనుక దామోదర నామముతో, ఊర్ధ్వముగా పుండ్రములను ధరించవలెను. ఎరుపు వర్ణము కలిగిన శ్రీచూర్ణము ధరించునపుడు శ్రీదేవి అని, అమృతోద్భవయని, కమలయని, చంద్రశోభితయని, విష్ణుపత్నియని, వైష్ణవియని, వరారోహాయని, సురసుందరియని లక్ష్మీదేవియొక్క ద్వాదశ నామములు ఉచ్చరింపవలెను. ఈ విధముగా పుండ్రముల ధరించి, చేతిని కడిగిన నీరు సర్వాభీష్టప్రదమని శిరస్సున ప్రోక్షించుకొనవలెను. పిమ్మట ఆయా పుండ్రముల నుద్దేశించి ఆయా నామములతో, ఆ స్థలములకు నమస్కారము గావించవలెను. ఈ పుండ్ర విధానము పరిశీలించిన దేహమే దేవాలయమను ఉపనిషదుక్తి[2] స్పష్టమగు చున్నది.

అన్నమయ్య ఈ పుండ్ర విధానమును "హరిణోర్ధ్వపుండ్ర దేహులౌటే బ్రాహ్మణ్యాము" (2-456) అని కీర్తించెను. భక్తుని రక్షించుటకు "తిరుమణిలాంఛన మొకటే చాలును" అని (2-482), తిరుమణిని ధరించడమే పంచాంగ బలమని" (2-109) అన్నమయ్య తిరుమణి ప్రాశస్త్యమును వర్ణించెను.

> **"తిరుమణి ధరించితి - తీర్థప్రసాదములు గొంటి**
> **విరివైన నీ కథలు వీనుల వింటి"** (2-257) అనియు,
> **"ఈతని కరుణనే కా యిల వైష్ణవుల మయితి**
> **ఆతని వల్లనే కంటిమీ తిరుమణి"** (2-372) అని

అనేక కీర్తనలలో తిరుమణి ధారణ, ప్రసక్తి కన్పించును.

**నామము** : దీక్షానామముగా వైష్ణవులు భగవద్దాసత్వముగాని, తద్దాసదాసత్వముగాని స్వీకరించి తన నామమునకు బదులుగా రంగదాసుడనియు, రామానుజదాసుడనియు చెప్పుకొనుట కలదు. అన్నమయ్య తాను "కేశవదాసినైతి గెలిచితి నన్నిటను" (2-487) అని తనను "కేశవదాసి"గా ప్రకటించుకున్నాడు. కేశవ నామమే తనకు కీర్తిని, బలమును కలిగించినదని విశ్వసించిన అన్నమయ్య -

**"సందడి బేరుబలము కేశవ నామము నాకు**
**యిందును నందును భవభయమిక లేదిదె నాకు"** (2-109)

అని ప్రకటించినాడు.

"కరుణతోడ నా యపరాధంబులు కడపుకావుమని యిరవై నీ పేరు పెట్టితే యియ్య కొనక పోరాదు" (2-299) అనెడి కీర్తన చరణములో దయతో తన అపరాధములు తొలగించి రక్షించుమని, నీ పేరు పెట్టుకున్నందుకు రక్షణ కర్తవ్యము నీవు తప్పక వహించవలసినదని అన్నమయ్య భగవంతుని నామధారణతో నిర్బంధించినాడు.

**మంత్రము** : తిరుపతిలో విష్ణుడను యతికి విష్ణుమూర్తి కలలో కన్పించి "నాభక్తుడొకడు నన్నెపుడు విడువక సంకీర్తనము సేయువాడు రేపు నీకడకేగుదెంచును. అతనికి నీవు ముద్రాధారణము నాకు మారుగా కావింపుము"[3] అని ఆనతిచ్చెనట. అంత విష్ణుడు మేలుకొని ఆశ్చర్యపడి తెల్లవారి అన్నమయ్యను గుర్తుపట్టి "నాతో నీవు ముద్రాధారణము చేయించుకొందువా" అని అడుగగా అతడు "కృతార్థుడనైతి" నని సంతోషించెను. అపుడు విష్ణమౌని వేదమార్గానుసారముగా అన్నమయ్యను శంఖచక్రాంకితుని జేసి తిరుమంత్రమునుపదేశించెను. ఆ తిరుమంత్రముగూర్చి దాని మహిమాతిశయమును గూర్చి అన్నమయ్య అనేక కీర్తనలలో ఉగ్గడించెను.

కీర్తన : **"గతులన్నీ ఖిలమైన కలియుగమందున**
**గతి యితడే చూపె ఘన గురుదైవము** ॥పల్లవి॥

**ఈతని కరుణనెకా యిల వైష్ణవుల మైతి**
**మీతని వల్లనె కంటిమీ తిరుమణి**
**యీతడే కా ఉపదేశమిచ్చె అష్టాక్షరి మంత్రము"** (2-372)

అని అష్టాక్షరీ మంత్రమును గురూపదేశముగా పొందితినని ప్రకటించినాడు. ద్వయ మంత్రమును గూర్చి మరొకచోట -

**"కొదదీర ద్వయమను కుండలంబులు వెట్టి" - (2-148)**

అని కర్ణములకు ఆభూషణములైన కుండలములు నిత్యము కర్ణములను ఏ విధముగా అంటిపెట్టుకొని ఉండి ముఖసౌందర్యమును ద్విగుణీకృతమొనరించునో, అదే విధముగా ఆత్మసంస్కారము నుద్దీపింపజేయునది, నిత్యమూ అనుసంధానమొనర్చుకొనునది, భాగవతోత్తముల అనుసంధానమును ప్రీతిపూర్వకముగా శ్రవణము చేయుటకు తగినది, లక్ష్మీనారాయణ స్వరూపమైనది అయిన ద్వయమంత్రమును కుండలముతో పోల్చి అన్నమయ్య వర్ణించాడు. ఈ "ద్వయాధికారులే తప్పరు బ్రాహ్మణ్యము" (2-486) అని లక్ష్మీనారాయణ స్వరూపమెరిగినవారే బ్రాహ్మణత్వమును కలిగినవారని మరొకచోట వివరించినాడు.

ఈ మంత్రానుసంధానమువలన చిత్రగుప్తుని లెక్కలు తొలగిపోయి శ్రీవైకుంఠము అరచేత నిలుచునని,

**"ఎడరై నీ మంత్రజప మెంచుకొన్నయపుడే**
**కడ చిత్రగుప్తుని లెక్కలు గడచీ**
**వడిగా శ్రీవేంకటేశ్వర మీ శరణనగా**
**అదరి వైకుంఠము మా అరచేత నిలచె"** (3-12)

అని మంత్రానుసంధాన ఫలమును వర్ణించినాడు.

**"ప్రకటించి బహువేద పఠన చిక్కని నీవు**
**మొరకివై తిరుమంత్రమునకు చిక్కితివి"**

అని వేదశాస్త్ర పఠనము కన్నను, తిరుమంత్ర జ్ఞానమువల్లనే భగవత్ప్రాప్తి కలుగునని అన్నమయ్య విశ్వసించి ప్రకటించినాడు. ఈ విషయము ఉపనిషత్తులందు కూడ విశ్లేషింపబడినది. తారసారోపనిషత్తునందు అష్టాక్షరీ మంత్రానుసంధానముచేత పరమాత్మ సాన్నిధ్యము లభించునని వివరింపబడినది[4]

అన్నమయ్య భగవంతుని,

"అలి నాభుజము చక్రలాంఛనము జూచిగాని
అలనా నోరి మంత్రమైనా జూచి యేలుమీ" (2-192)

అని, నీవాడనని, నిన్నే జపించుచున్నానని, ఏలుకొమ్మని అర్థించెను.

**యాగము** : పంచసంస్కారములలో యాగము చివరిది. దైవపూజ అయిన యాగమును అన్నమయ్య ఇట్లు వర్ణించినాడు.

**షోడశ కళానిధికి షోడశోపచారములు**
**జాడతోడ నిచ్చలును సమర్పయామి ॥పల్లవి॥**

**అలరు విశ్వాత్మకున కావాహనమిదె సర్వ**
**నిలయునకు ఆసనము నెమ్మినిదె**
**అల గంగాజనకునకు అర్ఘ్యపాద్యాచమనాలు**
**జలధిశాయికిని మజ్జనమిదె ॥షోడశ॥**

**వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె**
**సరి శ్రీమంతునకు భూషణములివె**
**ధరణీధరునకు గంధపుష్ప ధూములు**
**తిరమిదె కోటిసూర్య తేజునకు దీపము ॥షోడశ॥**

**అమృతమథనునకు నదివో నైవేద్యము**
**గమి చంద్రనేత్రునకు కప్పురవిడెము**
**అమరిన శ్రీవేంకటాద్రిమీది దేవునకు**
**తమితో బ్రదక్షిణాలు దండములు నివిగో ॥షోడశ॥** (2-134)

అని ఈ కీర్తనలో ఆవాహనము, ఆసనము, అర్ఘ్యము, పాద్యము, ఆచమనము, మజ్జనము, వస్త్రము, భూషణము, గంధము, పుష్పము, ధూపము, దీపము, నైవేద్యము, తాంబూలము, దండములతో షోడశోపచారములను అన్నమయ్య భగవంతునికి సమర్పించినాడు.

ఈ షోడశోపచారములలో కొందరు కొన్ని సంప్రదాయముల ప్రకారము యజ్ఞము కూడా నిర్వహింతురు. అన్నమయ్య,

**"మక్కువతో యజ్ఞము చేయించె బో మా గురుడు"** (2-148)

అని వివరించినాడు. భగవదర్చనచే తామసగుణము తొలగి సాత్విక లక్షణము సమకూరును. అన్నమయ్య ఈ విషయమును,

**"చేముట్టి పూజించితి శ్రీ యంగాలు**
**తామసము లెల్లామాడె తతి వచ్చె సాత్వికము**
**గోమున మరేమి నిన్ను కొసరేమికను"** (2-257)

అని భక్తుని సాత్వికలక్షణమే పరమపదమునకు సోపానమని ప్రకటించెను. తగు సమయములలో చేయవలసిన విష్ణుకైంకర్యములు చేసినవాడే "సుజ్ఞాని"యని, అందరి లోనను "ఘనుడగునని" (2-352) అన్నమయ్య తెలిపెను. విష్ణుకైంకర్యపరులు నిర్మలులై, నిత్యసుఖులై, దుష్కర్మదూరులై ఉండెదరని (2-114) కీర్తించినాడు. భగవంతుని, "నా యింటి లేశమైన నారగించు అంకించి నీ నాలోని అంతరము లెంచక" (2-60) అని ప్రార్థించినాడు. మరొకచోట,

**"చిల్లరైన మాయింట చేసిన సాపాటారగించు**
**చల్లతోడి బోనమైన చాలు చాలదనక"** (2-60)

అని, ఇంకొకచోట,

**"ఊరకే మా యింట నీవు వొదవిన పాటి నీ**
**వారగించవయ్య చౌలేగాములెంచక"** (2-60)

అని భగవంతుని తన ఇంటి భోజనము స్వీకరింపుమని ఆర్తితో అర్థించినాడు. అన్నమయ్య తాను భక్తితో చేసెడి తిరువారాధనను గూర్చి "బ్రహ్మరుద్రాదులే నీకు తిరువారాధన సరిగా సమర్పింపలేరు. నేను ఏమి యెరిగి చేయగలనని" వినయమును ప్రకటించినాడు (2-373). "కైవల్యముకంటే కైంకర్యమే అధికమని, శ్రీ విభుడవైన నీవు మాకు చిక్కే మర్మమిదే" (2-483) అని అర్చనామూలకమైన భగవత్సాలభ్యమును అనుభవించినాడు. భగవంతుని కైంకర్యమే భక్తునికి గొప్పదనమును, తృప్తిని కలిగించు నని (2-482) భావించినాడు.

ఈ విధముగా అన్నమయ్య కీర్తనలలో తాప, పుండ్ర, నామ, మంత్ర, యాగములను పంచసంస్కారములు ప్రతిఫలించినవి.

## అధస్సూచికలు

1. "తం ప్రజాపతిరింద్రం త్రికలశైరమృత పూర్ణైరానుష్టుబాభి మంత్రకైరభిషిత్య తం సుదర్శనేన దక్షిణతోరరక్ష పాంచజన్యేన వామతోద్యయేనైవ సురక్షితో భవత్".
   మం.శ్లో-8, అవ్యక్తోపనిషత్.
2. "ఏతే ప్రణవమయోర్ధ్వపుండ్రాస్తదాత్మా...."
   మం.శ్లో-4, వాసుదేవోపనిషత్.
3. పేజి-27, అన్నమాచార్య జీవిత చరిత్రము
   తాళ్ళపాక చిన్నన్న, టి.టి.డి. ప్రచురణ, 1982.
4. "శ్రీమన్నారాయణాష్టాక్షరానుస్మరణేన గాయత్ర్యాశ్శతసహస్రం జప్తం భవతి. ప్రణవానామయుతం జప్తం భవతి. దశపూర్వాన్, దశోత్తరాన్ పునాతి. నారాయణ పదమవాప్నోతి. య ఏవం వేద..... " తారసారోపనిషత్, మం.4.

# అన్నమయ్య కీర్తనలలో ఆచార్యనిష్ఠ

"గురువు సాక్షాత్తు ఆదినారాయణ పురుషుడు. ఆ ఆదినారాయణుని నేనే. కావున నన్నొకనినే శరణు పొందుము. నాయందు భక్తినిష్టుడవగుము. నా ఉపాసన చేయుము, నన్నే పొందగలవు. నాకన్నా వేరైనదంతయు బాధితమే"[1] అని శ్రీమహావిష్ణువు చతుర్ముఖ బ్రహ్మకు ఉపదేశించెను. అపార దయాసముద్రుడైన ఆ మహావిష్ణువు అంతటితో ఆగక జీవుల నుద్ధరింపదలచి తానే ఆచార్యునిగా అవతరించెను. నరనారాయణావతారమునందు నరునకు అష్టాక్షరిని ఉపదేశించెను[2]. శ్రీకృష్ణావతారమున జగదాచార్యుడై భగవద్గీతను ప్రకటించెను.

దీపంబువలన కొండొక దీపము ప్రభవించినట్లు ఆచార్యుని సదుపదేశము వలన శిష్యునిలో జ్ఞాన సంసారజ్యోతి వెలుగొందును. ఆస్తిక సంప్రదాయములన్నింటి లోను, ఆచార్యునకు విశిష్టమైన స్థానమీయబడినది. పూర్వము వైదిక శాస్త్ర, సాహిత్య, మత, సంప్రదాయములలో నిష్ణాతులైన వారిని ఆచార్యులుగా పరిగణించిరి.

విశిష్టాద్వైత సంప్రదాయమున పంచసంస్కారములు చేసి, భగవత్తత్త్వమును బోధించి, తిరుమంత్రమునుపదేశించు పెద్దలను ఆచార్యులుగా వ్యవహరింతురు. "ఆచార్యోపి హరిస్సాక్షాత్ చరరూపీ న సంశయః" అని భావింతురు. ఆచార్యుని కటాక్షము లేనిదే మోక్షము లభించదని విశ్వసింతురు. ఒక దశలో భగవంతునికన్న, భగవంతుని చూపించి, ఆయన అనంత కళ్యాణగుణములను అనుసంధించు ఆచార్యుడే సంసేవ్యమానుడని శ్రీవైష్ణవులు సంభావింతురు. ఆచార్యనిష్ఠ లేని జీవనము ఉజ్జీవింపదని వీరి విశ్వాసము. ఈ విధముగా భగవదవతారమునకు అభేద రూపముగా వ్యవహరింపబడెడి ఆచార్యుని ప్రాధాన్యము గూర్చి ఉపనిషత్తులు, శాస్త్రములు, సంప్రదాయములు ఇట్లు పేర్కొన్నవి.

"సాంగముగా సంపూర్ణ వేదాధ్యయనమొనరించిన బ్రాహ్మణుడు కర్మలచేత పొందు స్వర్గలోక భోగాది ఫలములను మీమాంసా న్యాయాదులచే పరిశీలించి, అవి అనిత్యములని తెలుసుకొని, నిత్యుడగు పరమాత్మ కేవల కర్మానుష్ఠానము చేత లభించడని వైరాగ్యమును పొంది, సమిధలు హస్తమునందు కలవాడై, పరమపురుషుని తెలుసుకొను విజ్ఞానార్థమై ఆచార్యునాశ్రయించవలెను. అట్టి ఆచార్యుడు వేదాంత శ్రవణము చేసినవాడును, బ్రహ్మసాక్షాత్కారము పొందినవాడును అయి ఉండవలెను" అని ముండకోపనిషత్తు ఆచార్య లక్షణమును పేర్కొన్నది.

"ఆచార్యుని కటాక్ష విశేషము వలన బంధములు నశించునని, విఘ్నములు తొలగిపోవునని సర్వసిద్ధులు సర్వశ్రేయస్సులు వాటంతట అవే నడచివచ్చునని"[4] మహానారాయణోపనిషత్తు వివరించినది. మరియు "పుట్టుగ్రుడ్డివానికి స్వరూపజ్ఞాన మెట్లుండదో అట్లే గురూపదేశము లేకుండా కల్పకోటిశతములైనా తత్త్వజ్ఞానము కలుగదు"[5] అనియు నిష్కర్షించినది.

"ఆచార్యుడు లభించినచో తిరుమంత్రము లభించునని"[6] "తిరుమంత్రము చేజిక్కిన తోడనే సర్వేశ్వరుండు చేజిక్కునని"[7] శ్రీవచనభూషణము వచించినది. తిరుమంత్రము నుపదేశించి జీవుల నుద్ధరించుటకు పరమాత్మయే ఆచార్యునిగా అవతరించి ఉపదేశమిచ్చినట్లు శ్రీవైష్ణవ సంప్రదాయ అనుయాయులు విశ్వసింతురు.

"లక్ష్మీనాథ సమారంభాం నాథయామున మధ్యమాం" అని లక్ష్మీనాథునితో మొదలుకొని నాథమునులు, యామునులు, రామానుజులు మొదలుగా స్వాచార్య పర్యంతము శ్రీవైష్ణవులు ఆచార్యపరంపరను స్మరించుకొందురు. పరమాత్మ తత్త్వమును ప్రబోధించు ఆచార్యుడు "చోదకుడు, బోధకుడు, మోక్షదుడు అని మూడు రకములుగా నుండు"ననియు, "చోదకుడు మార్గము చూపును, బోధకుడు స్థానము నాచరించును, మోక్షదుడు పరతత్త్వము బోధించు"ననియు[8] బ్రహ్మవిద్యోపనిషత్తు వింగడించినది. ఈ మూడు లక్షణములు ఒకే ఆచార్యునియందు ఉండవచ్చును. లేదా శిష్యునికి లభించిన అవకాశములనుబట్టి ఆచార్యులు త్రివిధములుగా లభించవచ్చును.

శ్రీవైష్ణవ సంప్రదాయమునకు బహుళ ప్రచారము దెచ్చిన రామానుజా చార్యులకు కూడా ఐదుగురు ఆచార్యత్వము వహించిరి. వారు వరుసగా మహాపూర్ణులు, శ్రీశైలపూర్ణులు, గోష్ఠీపూర్ణులు, మాలాధరార్యులు, కాంచీపూర్ణులు. రామానుజులకు పంచసంస్కార దీక్షను యిచ్చి, ద్వయమంత్రమునుపదేశించినది గోష్ఠీపూర్ణులు. మాలాధరార్యుల వద్ద రామానుజులు దివ్య ప్రబంధములను అభ్యసించిరి.

ఒకే సంప్రదాయమునకు చెందిన సాహిత్యమును, శాస్త్రమును, తత్త్వమును అనుసంధించుకొనుటకు అవకాశానుగుణముగా ఆచార్యులనేకులను ఆశ్రయించ వచ్చును. వారియందు హరితత్త్వమే ప్రధానాంశము. తిరుమంత్రము నుపదేశించిన ఆచార్యుడే ప్రాతఃస్మరణీయుడైనప్పటికి, ఆ తిరుమంత్రములోని పరతత్త్వమును

వ్యాఖ్యానించి, ప్రబల విశ్వాసమును కలిగించు గ్రంథాచార్యులు కూడా ఆచార్య స్థానము వహింతురు. ఇది రామానుజీయ సంప్రదాయమున గమనింపవచ్చును.

"సద్గురువు బోధించిన మార్గములో అవ్యయమైన నా రూపమును ధ్యానించుచూ భ్రమరకీటక న్యాయము రీతిగా ద్విజుడు నా సాయుజ్యమును పొందును. అట్టిదానినే మంగళకరమును బ్రహ్మానందమును ఒసంగునది అగు సాయుజ్య ముక్తి అని చెప్పెదరు"[9]. అని ఆచార్యుడు ఉపదేశించిన మార్గమున పరమాత్మ నుపాసించిననే మంగళకరము, బ్రహ్మానందమునగు సాయుజ్యముక్తి లభించునని పరమాత్మ స్వయముగా ప్రవచించి ఆచార్య ప్రాధాన్యము నుగ్గడించెను.

"ఆచార్యుడు నీకు మార్గము చూపును"[10] అని ఛాందోగ్యోపనిషత్తు తెలిపినది.

"ఆచార్యుని తలంపువలన భగవత్కైంకర్యము సిద్ధించును" అని శ్రీవచన భూషణము ఆచార్యుని ప్రాధాన్యమునుగ్గడించినది.

ఆచార్యోపదేశమువలన జీవునియొక్క, పరమాత్మయొక్క యాథాత్మ్యమును తెలుసుకొని, తన శక్తిననుసరించి ఫలమునందాసక్తిని విడచి, నిషిద్ధములు గానట్టి నిత్య నైమిత్తిక కామ్యకర్మల నాచరించుటయే కర్మయోగము. అది దేవతార్చనము, తపస్సు, తీర్థయాత్ర, దానము, యజ్ఞము మున్నగు భేదములతో బహువిధము. ఈ కర్మయోగము జీవునియందలి కల్మషములను పోగొట్టి జ్ఞానయోగమును కలిగించును"[12] అని ఆచార్యోపదేశము జీవునియందు కర్మ జ్ఞాన భక్తి యోగములకు మూలమని యతీంద్రమతదీపిక పేర్కొనినది.

## ఆచార్యుని లక్షణములు :

> **"సిద్ధం సత్సంప్రదాయే స్థిరధియమనఘం శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్**
> **సత్త్వస్థం సత్యవాచం సమయనియతయా సాధువృత్త్యా సమేతమ్**
> **దంభాసూయాది ముక్తం జిత విషయగణం దీర్ఘబంధుం దయాళుమ్**
> **స్ఖాలిత్యే శాసితారం స్వపర హితపరం దేశికం భూష్ణురీప్సేత్ ॥"[13]**

అనాది ప్రవృత్తమగు సదాచార్య పరంపరతో సంబంధము కలిగి సుశిక్షితుడైన వాడును, క్షణక్షణము చాపలబుద్ధితో పలు మతములలో ప్రవర్తింపక స్వాచార్యోపదిష్టమైన స్థిరబుద్ధి కలవాడును, పాపవిముఖుడును, వేదాంత జ్ఞానము కలవాడును,

బ్రహ్మసాక్షాత్కారశాలియును, సత్త్వగుణ సంపన్నుడును, సత్యవచనుడును, యథా కాలము సాధువులచే ఆచరింపబడిన ధర్మవృత్తి నవలంబించినవాడును, దంభము అసూయ మొదలగు దుర్గుణములు లేనివాడును, వ్యామోహ జనకములగు బాహ్య విషయములకు లోబడనివాడును, దయాశాలియును, దోషమొనరించినపుడు శిష్యుని శాసించువాడును, తన మేలును, పరుల మేలును దీక్షతో సాధించువాడును అగు ఆచార్యుని, ఉజ్జీవింపదలచుకొన్న శిష్యుడు ఆశ్రయించవలెను" అని వేదాంతదేశికుల వారు ఆచార్య లక్షణములను ఉగ్గడించినారు.

ముండకోపనిషత్తు కూడ "బ్రహ్మవిదగ్రేసరుడు అయిన ఆచార్యుని వెదకి సంపాదించుకొని ఆశ్రయించవలెనని"[14] చెప్పినది. "ఆచార్యునికి శిష్యుని విషయమున కృపయుండవలెను"[15] అని శ్రీవచన భూషణము పేర్కొనినది.

"తుట్టతుదికి ఆచార్యుండే మోక్షోపాయంబని ఉపపాదించిరి"[16] అని ద్రావిడ వేదమనదగిన శ్రీవచనభూషణము ఆచార్యునకు గల ఉపాయ స్వరూపమును నిరూపించినది.

ఇట్లు అనేక విధములుగా ఉపనిషదాదులచే నిరూపింపబడిన ఆచార్యుడు "గురుర్బ్రహ్మ గురర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః । గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవేన్నమః" అని బ్రహ్మ విష్ణు మహేశ్వరుల స్వరూపముగా, సాక్షాత్తు పర బ్రహ్మముగా సంభావింపబడినాడు.

## అన్నమయ్య ఆచార్యనిష్ఠ :

అన్నమయ్య విష్ణునామక యతిచే పంచసంస్కారదీక్ష పొందినాడని తాళ్ళపాక చిన్నన్న తన "అన్నమాచార్య చరిత్ర"యందు తెలిపినాడు. అన్నమయ్య తాను రచించిన అనేక కీర్తనలందు ఆచార్య ప్రాధాన్యమును, ఆచార్యాభిమానమును అనేక విధముల ప్రకటించియున్నాడు.

**గతులన్నీ ఖిలమైన కలియుగ మందున**
**గతియీతడే చూపె ఘన గురుదైవము** ॥పల్లవి॥

**యీతని కరుణనేగా యిల వైష్ణవుల మైత్రి**
**మీతనివల్లనే కంటిమీ తిరుమణి**

యీతడే కావుపదేశమిచ్చె వష్టాక్షరి మంత్ర
మీతడే రామానుజులు యిహపర దైవము ॥గతులన్ని॥

వెలయించె నీతడె కా వేదపు రహస్యములు
చలిమి నీతడె చూపె శరణాగతి
నిలిపినాడీతడే కా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడే దైవము ॥గతులన్ని॥

నియమము లీతడెగా నిలిపె ప్రపన్నులకు
దయతో మోక్షము జూప దయనీతడే
నయమై శ్రీవేంకటేశు నగమెక్కె వాకిటను
దయజూచీ మమ్మునిట్టె తల్లిదండ్రి దైవము" ॥గతులన్ని॥ (2-372)

"కృతయుగమున ధ్యానము, త్రేతాయుగమున యజ్ఞయాగాది కర్మలు, ద్వాపర యుగమున అర్చనాదులు, కలియుగమున కీర్తనము జీవులకు తగినవ"ని17 భాగవతము పేర్కొన్నట్లుగా అన్నమయ్య తాను పొందిన ఆచార్యోపదేశమును "గతులన్ని ఖిలమైన కలియుగమందున" అనేక కీర్తనల ద్వారా తనకు తాను అనుసంధానించుకొని ప్రజలకొరకు ప్రకటించినాడు.

ఈ కీర్తన మొదటి చరణమున "ఆచార్యుని కరుణ వలన తాము వైష్ణవుల మైనామని చెప్పుచు పంచసంస్కారదీక్ష ద్వారా అనుగ్రహింపబడిన పుండ్రము, మంత్రములను అనుగ్రహించిన ఆచార్యుని అపర రామానుజులుగా, ఇహపర దైవముగా అన్నమయ్య సంభావించినాడు.

రెండవ చరణమున తనకు శరణాగతి ధర్మము బోధించి ముద్రాధారణము నిలిపిన ఆచార్యుని మాటలాడే దైవముగా సేవించినాడు.

మూడవ చరణమున ముముక్షువులైన ప్రపన్నులకు తగు నియమములు యిచ్చినాడని, మోక్షమార్గమును చూపుటకు తగినవాడు ఆచార్యుడే అని, అట్టి మార్గమును దయతో శిష్యునికి చూపినాడని చెప్పుచు, శిష్యునియందు దాక్షిణ్యము కలిగియుండుట ఆచార్యునికి ప్రథమలక్షణమను విషయమును తెలిపినాడు.

ఆచార్యునికి తల్లివలె లాలించే గుణము, తండ్రివలె దండించే లక్షణం, దైవంవలె అనుగ్రహించే తత్త్వం ఉండునని ప్రసిద్ధము. ఈ లక్షణములనే చివరి

పాదమున "బ్రహ్మమును పొందే వాకిటిలో ఆచార్యుడు తల్లి దండ్రి దైవము" అని పేర్కొన్నాడు. ఇంకను,

"శ్రీ వేంకటపతి చిత్తాన నిలిచెను
కావించి గురుని కన్నపుడే
భావించి యితర ప్రార్థనలన్నియును
యీవలావలకు యెందుకో గాని" (3-242)

అని తన ఆచార్యుని జూచినతోడనే ఆ పరమాత్మ చిత్తములో నిలిచినాడని, ఇతరములైన ప్రార్థనలన్నియు అవసరము లేదని తెలుపుచు అన్నమయ్య తన ఆచార్యుని పరమాత్మగా భావించి తనకుగల ఆచార్యనిష్ఠను ప్రకటించినాడు.

కీర్తన : "నారాయణాచ్యుతానంత నిన్నొకచోట
గోరి వెదకనేల వీరివల్ల కంటిబో ॥పల్లవి॥

పొంసి నీ రూపము శ్రుతులలో జెప్పుగాని
బలిమి నాచార్యుదైతే ప్రత్యక్షము
పలికి నీ తీర్థము భావనలందేగాని
అల నీ దాసుల తీర్థమరచేత నిదివో ॥నారాయణా॥

నీ యూవతు లెన్నడు నేము దెలియుముగాని
మా ఆచార్యుని మాట మంత్రరాజము
కాయములో నీవుండేది కడుమరుగులుగాని
యీయెడ నీ పరికర మన్నిటా మున్నదివో ॥నారాయణా॥

అరిది నీ వందవ మొకర్వావతారమువగాని
గురుపరంపరనైతే కోట్లాయబో
హరి నిన్ను శ్రీవేంకటాద్రి నే జూచితిగాని
పరమున ఇహమువ పంచిచూపె నితడు" ॥నారాయణా॥ (3-475)

అను ఈ కీర్తనలో అన్నమయ్య ఆచార్యనిష్ఠ పరాకాష్ఠనందినది. సర్వాధారమైన, నాశరహితమైన, అనంతమైన పరమాత్మ స్వరూపమును ఆచార్యునివలన తెలుసుకొంటిననియు, ఇక దేనికి వెదకవలసిన పని లేదనియు పల్లవిలో తెలిపినాడు.

మొదటి చరణమున శ్రుతులలో చెప్పబడిన పరమాత్మ స్వరూపము తెలుసుకొనుట కష్టసాధ్యమనియు, పరమాత్మ లక్షణములు కలిగిన ఆచార్యుడు ప్రత్యక్షుడు కనుక తెలుసుకొనుట సులభమనియు పరమాత్మకు ఆచార్యునకు అభేదము చెప్పినాడు.

రెండవ చరణమున పరమాత్మ ఆజ్ఞకన్నా ఆచార్యుని మాట మంత్రరాజమనియు, అంతరాత్మ తత్త్వము కలిగిన పరమాత్మకన్న, ఆతని పరికరమైన ఆచార్యుడు ఎదుట ఉన్నాడని, పరమాత్మ రూపుడైన ఆచార్యుని పరమాత్మకన్న సులభునిగా అన్నమయ్య భావించినాడు.

మూడవ చరణమున ఒక అర్చావతారమునకు మాత్రము వందనము జరుగునని అట్టి వందనము ఆచార్య పరంపరకు కోట్లాది రూపముగా సమర్పింపబడునని, వేంకటేశుడు ఒక్క వేంకటాద్రిననే కనిపించునుగానీ (అన్నమయ్య వేంకటాద్రిని అపర వైకుంఠముగా భావించినాడు కనుక ఒక్కచోటనే కన్పించును అని అర్థము) ఆచార్యుడు ఇహమును పరమును చూపగలవాడని, ఆచార్యుని విశిష్టతను చాటిచెప్పి భగవంతునికన్న ఆచార్యునే అధికముగా తలచినాడు.

"జ్ఞానయజ్ఞమీగతి మోక్షసాధనము
నానార్థములు నిన్నే నడపె మా గురుడు ॥పల్లవి॥

అలరి దేహమనేటి యాగశాలలోన
బలునై యజ్ఞానపు పశువు బంధించి
కలసి వైరాగ్యపు కత్తుల గోసి గోసి
వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మా గురుడు ॥జ్ఞాన॥

మొక్కుచు వైష్ణవులనే మునిసభ కూడబెట్టి
చొక్కుచు శ్రీపాద తీర్థ సోమపానమునెంచి
చక్కగా సంకీర్తన సామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సేయించెబో గురుడు ॥జ్ఞాన॥

తదియ్య గురుప్రసాదపు పురోదాశమిచ్చి
కొదదీర ద్వయమను కుండలంబులు వెట్టి

**మొదలో శ్రీవేంకటేశునిటు ప్రత్యక్షము చేసి**
**యిదివో స్వరూప దీక్షను యిచ్చెను మా గురుడు** ॥జ్ఞాన॥ (2-148)

అని ఆచార్యోపదేశమువలన జ్ఞానయోగము సిద్ధించినదని, దానివలన మోక్షసాధన మార్గము సులభమైనదని, నానార్థములలో చెప్పబడిన పరమాత్మ అందినాడని, జ్ఞానశక్తి క్రియాశక్తి కూడా గల ఆచార్య తత్త్వమును అన్నమయ్య ఈ కీర్తనలో పేర్కొనినాడు. దేహముకంటె ఆత్మస్వరూపము వేరైనది అని తెలుసుకొనుట జ్ఞానము. అట్లు తెలుసుకొను జ్ఞానయజ్ఞమును ఆచార్యుడు అన్నమయ్యచే చేయించినాడట.

కీర్తన మొదటి చరణములో అశాశ్వతమైన దేహాత్మాభిమానము అనే అజ్ఞానపు పశువును బంధించి వైరాగ్యము అనెడి కత్తులతో కోసి, జ్ఞానము అనెడి అగ్నిలో పునీత మొనరించినాడని అన్నమయ్య వర్ణించినాడు.

రెండవ చరణమున, భాగవత నిష్ఠగల ఆచార్యుడు తనకు కూడ వైష్ణవమునుల సాంగత్యము కలిగించినాడని తెలిపెను. భగవంతునికన్న భగవద్భక్తులకు అధిక ప్రాధాన్యమిచ్చెడి శ్రీవైష్ణవ సంప్రదాయమును, భగవంతుని చేరుటకు భాగవతసేవ సోపానమను విషయమును అన్నమయ్య తెలిపినాడు. సంప్రదాయపరమైన "శ్రీపాద తీర్థసేవనము"గూర్చి చెప్పుచు, ఆ పాద తీర్థమును సోమపానముగా భావించి తన ఆచార్యనిష్ఠను చాటుకున్నాడు. "వేదములలో సామవేదమును నేను" అని పరమాత్మ భగవద్గీతయందు చెప్పిన విధముగా, తన ఆచార్యుడు తనకు ఆ పరమాత్మను సామగాన రూపముగా చూపినాడని తెలిపినాడు.

మూడవ చరణమున ఆచార్య ప్రసాదము తనకు జ్ఞానపు ఫలమువలె తన ఆచార్యుడు అందించినాడనియు, వాచిక, మానసిక, కాయిక వ్యాపారములన్నియు శ్రీమన్నారాయణునికే ప్రీతితో సమర్పించవలెననే భావము దృఢము చేసెడి ద్వయమంత్రమును ఉపదేశించి స్వరూప దీక్ష యిచ్చినాడని ప్రకటించినాడు.

విశిష్టాద్వైత సిద్ధాంతసారము మొత్తము అర్థపంచక జ్ఞానములో ఇమిడి యున్నది. అర్థపంచక జ్ఞానమనగా స్వస్వరూపజ్ఞానము, పరస్వరూపజ్ఞానము, ఫల స్వరూప జ్ఞానము, ఉపాయ స్వరూపజ్ఞానము, విరోధిస్వరూపజ్ఞానము. ఈ జ్ఞానము లను ఇచ్చువాడు ఆచార్యుడే. శరీర సంబంధముచే జీవుడు తాను భగవంతునికే చెందినవాడును, తన సర్వవ్యాపారములు వానికొరకే, తాను పరతంత్రుడను అను

జ్ఞానము పొందుట స్వస్వరూపజ్ఞానము. అన్నమయ్య ఈ చరణమున చెప్పిన "స్వరూప దీక్ష'' యిదియే. పంచసంస్కారదీక్ష అని మరొక అర్థము కూడ చెప్పుకొనవచ్చును.

"వేంకటేశుని ప్రత్యక్షము చేసి తన ఆచార్యుడు ఉపాయ స్వరూపము వహించి, పరస్వరూపమును, ఫలస్వరూపముల కూడా తెలిపినాడని చెప్పుచు ఆచార్యుడు తనకు అర్థపంచక జ్ఞానమును కల్గించినాడని పరోక్షముగ ఆచార్య ధర్మమును తెలిపెను.

**"అర్మిలి నాయాచార్యు నధీనము మోక్షము**
**ధర్మమతని కృపను తానే వచ్చీని"** (3-384)

అని ఆచార్యుడు మోక్షసాధనమని, అతని కృపాకటాక్షమువలన అది సిద్ధిస్తున్నదని అన్నమయ్య ఆచార్యుని మోక్షప్రదాతగా భావించి ప్రకటించినాడు.

**"జాతి జాతి ఆచారము వేరే**
**ఆతల మోక్షం బది ఒకటే**
**శ్రీ తరుణీశ్వర శ్రీ వేంకటేశ్వర**
**చేత మా గురుడు చెప్పినది"** (3-488)

అని జాతులెన్నైనా, ఆచారములెన్నైనా అందరూ పొందెడి మోక్షం ఒకే రకమైనదనియు, ఆ మోక్షమార్గము తెలుపువాడు ఆచార్యుడే అని చెప్పుచు శ్రీ తరుణీశ్వర-శ్రీ వేంకటేశ్వర అని వర్ణించుట వలన శ్రీ విశిష్టమైన వేంకటేశ్వరునే భావించవలెననెడి ద్వయ మంత్రార్థము సూచితమైనది. శ్రీవైష్ణవ సంప్రదాయమున శ్రీ, శ్రియఃపతుల నిద్దరినీ ఆశ్రయించవలెను. ఈ విధముగా మోక్షమార్గములను ఆచార్యుడు తనకు ఉపదేశించెనని అన్నమయ్య తెలిపినాడు.

## అన్నమయ్య కీర్తనలలో ఆచార్య ప్రాధాన్యము :

**"అరుదైన సుజ్ఞాన మాచార్యమూలము"** (2-442)

ముండకోపనిషత్తు పేర్కొన్న "విజ్ఞానార్థమై సద్గురువు నాశ్రయించవలె[18]ననెడి సూక్తిని అన్నమయ్య యిందు సూచించినాడు.

**"ఆతుమలో అజ్ఞాన మాచార్యుడె పాపె**
**ఆతల జన్మాల వాకిలటు ముయ్యరో"**(2-145)

"ఆచార్యుడు వేదాంతశ్రవణము చేసినవాడు అయివుండవలెను"19 అను లక్షణము యిందన్వయించును. ఆత్మతత్త్వమును తెలుపునది వేదాంత జ్ఞానము. అట్టి ఆత్మ తత్త్వమును తెలిపి, అజ్ఞానమును బాపిన వేదాంతి ఆచార్యుడని ఈ కీర్తనయందు అన్నమయ్య తెలిపినాడు.

"దయతో మోక్షము జూపదగనీతడే" (2-372), "ఆచార్యుడు బ్రహ్మ సాక్షాత్కారము కలవాడు కావలయును" అను భావము యిందు తెలుపబడినది. మోక్షమార్గమును చూపువాడు స్వయముగా తాను ఆ మోక్ష మార్గమును పొందినవాడే అగును. "తగనీతడే" అని అన్నమయ్య పేర్కొనుటవలన తన ఆచార్యుడు స్వయముగా బ్రహ్మానుభవము కలవాడని తెలిపినట్లైనది.

**"తనకు శ్రీ వేంకటేశు తలపించే వారెవ్వరు**
**కొన మొదలెరిగిన గురుడేగాక"** (2-174)

అని "కొన మొదలెరిగిన గురుడే" అని ప్రయోగించుట వలన పరబ్రహ్మతత్త్వమునంతా నెరిగినవాడు ఆచార్యుడను ఆచార్యలక్షణము ప్రకటితమైనది. మరియును,

**"తగు నీ బుద్ధులు వడచిరి మున్నటి దైవజ్ఞులు**
**పూర్వాచార్యులును"** (3-101)

అని అన్నమయ్య ఆచార్యులను దైవజ్ఞులుగా సంభావించి గౌరవించినాడనుట స్పష్టము.

"ఆచార్యుని కటాక్షమువలన బంధములు తొలగి, విఘ్నములు పోయి, సర్వ సిద్ధులు సర్వశ్రేయస్సులు వాటంతట అవే కలుగునని ఉపనిషదుక్తి. ఇదే విషయమును అన్నమయ్య,

**"జీవుడా వేసరకు, చిత్తమా జడియకు**
**దైవము కరుణించ దడవు గాదు**
**తోవ జూపె మనకు తొల్లే ఆచార్యుడు**
**కావలసినట్లయ్యీ కలగకు డికను"** (3-99)

అని ఆచార్యుడు ముందే మనకు మోక్షమార్గమును చూపగా, ఇంకా విసుగుచెంద నవసరము, భయపడవలసిన పనిలేదనియు, ఆచార్యుని కటాక్షమువలన దైవము కరుణించుట ఆలస్యముగాదనియు, జరుగవలసినది తప్పక జరుగుననియు, ఈ

కీర్తనలో అన్నమయ్య తెలిపినాడు. "జీవుడా వేసరకు" అనుటవలన మోక్షము కోరు జీవుని స్థితి, "చిత్తమా జడియకు" అనుటవలన కర్మ పరిపాకము వలన కలిగెడు భయము సూచింపబడినవి. ఇంకను,

**"పలు చుట్టరికములు బట్టబయలు తగుళ్ళు**
**చెలగు నాచార్యు సేవ జీవన్ముక్తి"** (2-185)

అని సర్వబంధములు ఆచార్యుని సేవజేసి తొలగించుకొనవచ్చునని, జీవన్ముక్తిని పొందవచ్చునని తెలిపినాడు.

**"గురువు గలవానికి గొఱత యేమియు లేదు"** (2-254)

అని "ఆచార్య కటాక్షము వలన సర్వసిద్ధులు, సర్వశ్రేయస్సులు వాటంతట అవే వచ్చును" కొరత ఏమియు లేదు అని పేర్కొనినాడు.

"నాడే నా యాచార్యుడు నాకు నన్ని యిచ్చినాడు" (3-95) అని సర్వము ఆచార్యునివలన పొందినాననుచు, అన్నమయ్య,

**"గురుకటాక్షమొక కొంత సోకితే**
**శరణాగతి నిశ్చలమవుము"** (3-310)

అని ఆచార్యుని కటాక్షము కొంచెము సోకినా చాలు శరణాగతి లభిస్తుందని అన్నాడు. శరణాగతి యనగా సర్వమును త్యజించి ఆత్మనిక్షేపము చేయుట. కావుననే,

**"గురు కృప కలిగిన కొఱతున్నదా"** (3-401)

అని ఆచార్య కటాక్షము సర్వోత్కృష్టమని ప్రకటించినాడు అన్నమయ్య.

"జీవునికి స్వరూపజ్ఞానము సిద్ధించవలెనన్న గురూపదేశము తప్పనిసరి. గురూపదేశము లేక కల్పకోటిశతములైనా తత్త్వజ్ఞానము కలుగదు"[21] అను ఉక్తిననుసరించి,

**"సకల శాస్త్రములు చదివినా బరము చక్కటి మార్గము దొరకదు**
**"నికటపు పలువేల్పుల నెందరి కడువెదకి గొలిచినా దొరకదు**
**అకలంకుడు శ్రీవేంకటగిరిపతి అంతరంగమున నున్నాడనుచును**
**ప్రకటముగా గురుడానతి ఇచ్చిన పరము సుజ్ఞానము తనలో దొరకు"**
**(3-446)**

అని ఈ కీర్తనలో ఎన్ని శాస్త్రములు చదివినా ఎన్ని వేలుపుల గొలిచినా మోక్షము లభించదనీ, పరమాత్మ తత్త్వము ఆచార్యునివల్ల మాత్రమే లభించునని చెప్పినాడు. ఇదే విషయమును మరొక కీర్తనలో,

**"రూపము విజ్ఞానమే రూఢికెక్కనైతిగాని**
**కాపు శ్రీ వేంకటేశుడే గతియంటిగాని**
**యీపాటి నేనైతె విహపరాలకు జిక్కి**
**పైపూత లేవి గాన బాలించవో గురుడా"** (3-442)

అని విజ్ఞానము పొంది శ్రీ వేంకటేశ్వరుడే గతి, రక్షకుడు అని తెలుసుకొని కూడా పరమును పొందలేక ఇహపరాలకు జిక్కితినని, "నీ ఉపదేశం లేక నాకు నేనుగా పరమును సాధించలేను కనుక అనుగ్రహించు ఆచార్యుడా" అని అన్నమయ్య ఆచార్య ప్రాధాన్యమును చాటి చెప్పినాడు.

"యీతడేకా వుపదేశమిచ్చె నష్టాక్షరి మంత్రము" (2-372) అనియు,

"వున్నవాడాచార్యుడు వుపదేశించ" (2-188) అనియును ఆచార్యునివలన తిరుమంత్రము, దానివలన సర్వేశ్వరుడు చిక్కునను శ్రీవచన భూషణము తెలిపిన విషయమును తన కీర్తనలలో ప్రకటించినాడు.

**"ప్రకటించి బహువేద పఠన జిక్కని నీవు**
**మొకరివై తిరుమంత్రమునకు జిక్కితివి"** (3-56)

అని, **"తిరుమంత్రమయి నాకు దిక్కయి వుండగాను**
**వరుస నాచార్యుడు వహించుక వుండగాను**
**పరగ దపము జేసి బడలగ వలెనా"** (3-219)

అని, తిరుమంత్రము అండగా, ఆచార్యుని రక్షకత్వము తనకు దిక్కుగా ఉండగా తపస్సుచేసి కష్టపడవలసిన అవసరం లేదని చెప్పుచు, ఆచార్య, ఆచార్యోపదేశమగు తిరుమంత్రముల ప్రాధాన్యమును ఉగ్గడించినాడు.

ఇట్టి ఆచార్యుడు చోదకుడు, బోధకుడు, మోక్షదుడు అని మూడు రకములు.

## అన్నమయ్య కీర్తనలలో చోదకుడు :

చోదకుడనగా మార్గమును చూపువాడు.

**"యీ వేళనే నా గురుడును యీ దైవము నిటుచూపగ**
**తో వెరిగిటు నేబతికితి తొల్లెల్ల వెట్టినయ్యా"** (3-72)

అని అన్నమయ్య తన గురువు చోదకుడై దైవమును మార్గముగా చూపగా తాను వెనుకటి వెట్టితనమును వీడి బ్రతికితినని చెప్పుచు ఆచార్యుని చోదక లక్షణమును తెలిపినాడు. ఇంకను,

**"యేపున శ్రీ వేంకటాద్రినిటు నేమ నా గురుడు**
**చూపగా గొలిచే నచ్చుగ గావవే"** (2-73)

అని తనకు తన ఆచార్యుడు వేంకటాద్రిని మార్గముగా చూపినాడని

**"తోవ జూపె మనకు తొల్లే ఆచార్యుడు"** (3-99) అని తనకు తన ఆచార్యుడు చోదకత్వమును వహించినాడని ప్రకటించినాడు.

## అన్నమయ్య కీర్తనలలో బోధకుడు :

బోధకుడు అనగా స్థానము నాచరించువాడు. ఆచరించి చూపువాడు ఆచార్యుడు అన్నట్లుగా తాను స్వయముగా ఆచరించి శిష్యులకు బోధించువాడు.

**"యీతడేకా వుపదేశమిచ్చె నష్టాక్షరి మంత్ర**
**మీతడే రామానుజులు యిహపరదైవము"** (2-372)

అని ఇందు ఆచార్యుడు అపర రామానుజులవలె ఆచార్య స్థానము వహించినాడని బోధక స్థానమును వివరించినాడు.

## అన్నమయ్య కీర్తనలలో మోక్షదుడు :

మోక్షదుడు పరతత్త్వమును బోధించును.

**"పరము శ్రీవేంకటపతి సంకీర్తన**
**పొరిది గురుడొసగు సూక్ష్మమిది"**

అని పరమొసగునది శ్రీ వేంకటేశ్వరుని సంకీర్తనమే అని గురుడు మోక్షమార్గమును చూపునని తెలిపినాడు అన్నమయ్య. ఇంకను,

"కైవల్యమునకు కడు తెరువైనది
ఆకల నీ శరణాగతియె
శ్రీ వేంకటేశ్వర చెప్పె మా గురుడు
మా వద్ద నిదె నీ మంత్రమె పో" (3-548)

అని కైవల్యమును పొందుటకు సులువైనది శరణాగతియని, ఆ శరణాగతి ధర్మమును ఆచార్యుడు బోధించినాడనియు, ఆచార్యుని మోక్షద లక్షణమును అన్నమయ్య పేర్కొనినాడు. పరతత్త్వమునకు మార్గమైన శరణాగతిని బోధించుటయే మోక్షదము.

"అకలంకుడు శ్రీ వేంకటగిరిపతి అంతరంగమున నున్నాడనుచు
ప్రకటముగా గురుడానతి యిచ్చిన పరము సుజ్ఞానము తనలో దొరకు"
(3-446)

అని సర్వాంతర్యామియైన పరమాత్మ తత్త్వమును ఆచార్యుడు బోధించిన తెలియునని తెలిపినాడు.

ఆచార్యుడు బోధించిన మార్గములో తనను ధ్యానించినచో మంగళకరమును, బ్రహ్మానందము నొసగునది యగు సాయుజ్యముక్తి[22] లభించునని పరమాత్మ స్వయముగా ప్రకటించినాడు. ఇదే విషయమును అన్నమయ్య,

"హరి గోవిందా హరి గోవిందా
ఆనందమానంద మాతుమకును
గురూపదేశాన వెదకగా వెదకగా
గరిమ నీ యర్థము గంటిమో యయ్య" (2-339)

అని "గురూపదేశము వలన నీ తత్త్వము తెలుసుకోగలిగితిని, దానివలన ఆత్మకు ఆనందము కలిగినది" అన్నాడు. "ఆనందమానందము" అని రెండుమారులు ప్రయోగించుటవలన బ్రహ్మానందము సూచింపబడినది. "ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞానమ్" అన్నట్లుగా నీ యర్థము కంటిమి అనుటవలన బ్రహ్మానందము నొసగు మోక్షము లభించినదని తెలిపినట్లయినది. ఈ విధముగా అన్నమయ్య కీర్తనలలో ఆచార్యనిష్ఠ ప్రస్ఫుటముగా ప్రకటింపబడినది.

## అన్నమయ్య కీర్తనలలో ఆచార్య లక్షణములు :

"తగు నీ బుద్ధులు నడచిరి మున్నిటి దైవజ్ఞులు పూర్వాచార్యులు" (3-101) అని అనన్యార్హశేషత్వము, అనన్యశరణత్వము, అనన్యభోగ్యత్వములనెడి అకార త్రయమును ఆచార్యులు పాటించినారని "తగు నీ బుద్ధులు నడచిరి" అను ప్రయోగము ద్వారా అన్నమయ్య సూచించి ఆచార్య లక్షణమును ప్రకటించినాడు.

**"పరమ వైష్ణవులు పట్టిరి వ్రతము**
**యిరవున నాచార్యులెరుగుదురు"** (3-348)

అని పరమ వైష్ణవత్వము కలిగియుండు ఆచార్యలక్షణము ఇందు ప్రకటించబడినది.

**"ఆతుమలో నజ్ఞాన మాచార్యుడె పాపె**
**ఆతల జన్మాల వాకిటులటు ముయ్యరో"** (2-145)

అని అనుటవలన ఆచార్యుడు వేదాంతజ్ఞాని కావలెననెడి లక్షణము ఇందు ప్రకటితమైనది. ఆత్మతత్త్వమును తెలుపునది వేదాంత జ్ఞానము. అట్టి వేదాంత జ్ఞానము ద్వార "ఆతుమలో నజ్ఞానము బాపి" ఆచార్యుడు వేదాంతి అయినాడు.

**"అర్మిలి నా యాచార్య వధీనము మోక్షము**
**ధర్మమతని కృపను తానే వచ్చీని"** (3-384)

అని ఆచార్యునికి శిష్యుని విషయమున కృప యుండవలెనను[23] లక్షణము ఇందు చెప్పబడినది. ఇదే కృపా విశేషమును,

**"చివికి చర్మంబనెడి చిచ్చుచొచ్చిన నాకు**
**జవళి నాచార్య కృపాజలధియే దిక్కు"** (2-146)

అని పరమాత్మ స్వరూపమైన ఆచార్యుడు పరమాత్మ కళ్యాణగుణములను కూడ కలిగి ఉండునని, అందు కృపారసము (గుణము) ఆచార్యునకు శిష్యుని విషయమున ఉండవలెనని సూచింపబడినది. "గురుకృప గలిగియు గొరతున్నదా" (3-401) అని మరొక కీర్తనలో కూడ ఆచార్యకృప స్మరింపబడినది.

"అరుదైన సుజ్ఞాన మాచార్యమూలము" (2-442) అనియు, "గురుని యానతి చేతగొంకులెల్లాబాసె" (3-8) అనియు, సుజ్ఞానము, సందేహ నివారణము

ఆచార్య లక్షణముగా చెప్పబడినవి. ఆచార్యుడే మోక్షోపాయమని శ్రీవచన భూషణము ప్రతిపాదించినది. అన్నమయ్య కూడ ఈ విషయమునే,

> **"పుట్టుగులు గెలిచి నిన్ను పొందుటకుపాయము**
> **అట్టి నీ రూపమైన ఆచార్యుడే" (2-334) అనియు,**
> **"ప్రేమతో వీడు వన్నింట బెట్టుక పూజించేవి**
> **యేమి కారణమో యని యెంచుకోకు మీ**
> **కామించి యాచార్యుడే కారణము నీకు నాకు" (3-95)**

అని ఆచార్యుని ఉపాయ స్వరూప లక్షణమును తన కీర్తనలలో వర్ణించినాడు. ఈ విధముగా అన్నమయ్య కీర్తనలలో ఆచార్య లక్షణములు గమనింపవచ్చును.

## అన్నమయ్య కీర్తనలలో శిష్యుని లక్షణములు :

"మంచి విషయములలో ఆసక్తి గల బుద్ధి కలవాడు, సాత్వికులగు భాగవతోత్తములను సేవించుటలో ఉత్సాహము గలవాడు, సదాచారానుష్ఠానము కలవాడు, తత్త్వజిజ్ఞాసి, జన్మ, విద్య, ధన ప్రతిష్ఠాదుల గర్వము లేనివాడు, పెద్దలకు సాష్టాంగ దండప్రణామాది గౌరవము లాచరించువాడు, ఆచార్యులవద్ద సావకాశముగ ఆధ్యాత్మిక విషయముల నెరింగెడివాడు, బాహ్యాభ్యంతరేంద్రియ స్వాధీనము కలవాడు, ఈర్ష్యాసూయలు లేనివాడు, వేదోపనిషత్తులందు విశ్వాసము కలవాడు, ఆచార్యుని మొల శరణాగతి చేసినవాడు అయిన శిష్యుడు లభించినచో ఆచార్యుడాతనికి తానెరిగిన ఆధ్యాత్మిక విషయములు ఉదారచిత్తముతో నెరిగించవలెను"[24].

"ఫలసాధన శుశ్రూషను, ఆర్తిని, ఆదరమును గలవాడును[25], ఫలసాధన, ఐహిక భోగములు ఆచార్యుడేయని తలచువాడును[26], ఉపకార స్మృతికి ప్రథమ కారణమైన ఆచార్యునియందు కృతజ్ఞత, తుది కారణము సర్వేశ్వరునియందు కృతజ్ఞత కలిగినవాడును[27] అయి వుండవలెను. ఇవి శిష్యుని లక్షణములు.

## అన్నమయ్యలోని శిష్య లక్షణములు :

> **"అంచల యాసలు మాని ఆచార్య సేవజేసి**
> **మించినప్పుడుగా ఆ మీది మోక్షము" (2-505)**

అని అంచల యాసలు మానుట అనెడి వైరాగ్య లక్షణము, ఆచార్య సేవ అనెడి మరొక లక్షణము, ఈ కీర్తనయందు తెలుపబడినవి. ఇంకను,

**"వెలగు నాచార్య సేవ జీవన్ముక్తి"** (2-185),

**"వైష్ణవుడై ఆచార్య సేవ చేయుటే ముక్తి"** (2-195),

**"వేమరు నాచార్యసేవ చేయుటే**
**విచారింపగ దాచిన ధనము"** (2-209)

**"చిటుముడి నాచార్య సేవచేయు"** (3-212),

**"వొప్పగు సంసారమిది వున్నతి నాచార్యసేవ"** (3-80)

అని సేవా లక్షణమును అనేక విధముల, అనేక కీర్తనలలో వర్ణించినాడు. "గురుసేవా రతునకు కోపము రాదు" (2-307) అనియు,

**"ఇరవై శ్రీవేంకటేశు డిందుకు ఫలమైనాడు**
**గురుసేవలను దొరకును వివేకులకు"** (2-222)

అనియు గురుసేవకుల ఫలము శ్రీవేంకటేశుడని తన అనుభవము ప్రకటించినాడు అన్నమయ్య.

శిష్యునికుండవలసిన లక్షణములలో ఆర్తి ఒకటి. అన్నమయ్య ఈ లక్షణమును,

**"పరమ గురువులదె భక్తిమార్గమిటు ప్రాణులకెల్లను బెట్టియుండగా**
**విరసపు టింద్రియ మార్గముల దిరుగు వీరిడినయ్యా నేను"** (3-85)

అని ఆచార్యుల భక్తిమార్గమును విడచి, యింద్రియ మార్గములో దిరుగు వెఱ్ఱివాడనని ప్రకటించినాడు.

శిష్యునకు ఆచార్యుడు ప్రధానము. పరమాత్మతో సమానము. ఈ భావనతోనే అన్నమయ్య,

**"ఆచార్యుడే ధనము"** (2-457) అనియు,

**"గురువు కలవానికి కొరత ఏమియు లేదు"** (2-254)

అనియు, ఈ విషయమునే మరింత వర్ణనాత్మకముగా,

"జ్ఞానమే మాకు ధనము సర్వవేదములు సొమ్ము
పూనిన వైరాగ్యమే పుంబళి మాకు
ఆనిన గురుసేవలు ఆడుబిడ్డలు నాకు
మేనితో తగులాయ మేలు మాకు చేరెను" (3-63)

అని జ్ఞానము ధనముగా, సర్వవేదములు సొమ్ముగా, వైరాగ్యమే ఆహారముగా, గురు సేవలను ఆడుబిడ్డలుగా భావించి శరీరము ఉండగనే మేలును (ముక్తిని) పొందగలిగి నామని అన్నమయ్య శిష్యునికి ఉండవలసిన లక్షణములను తనయందు కలిగి అనుభవముతో వెల్లడించినాడు.

భగవంతునికంటెను ఆచార్యునియందు అభిమానము, పరతంత్రము కలిగి ఉన్నయెడల ఉజ్జీవించుట సులభమని,

"నిక్కి ఆచార్యాభిమాన నిరతులైనవారికి
తక్కిన మోక్షమింతా దనలోనిది" (3-395)

అనియు,

"వున్నవాడాచార్యుడు వుపదేశింప" (2-188) అనియు,

"యెట్లయిన గురువాక్య మేమరకుడీ" (2-234) అనియు,

"కోరిన తన బ్రతుకు గురువాక్యాధీనమైతే
మోరతోపు లేని నిత్యముక్తుడు తానే" (2-460) అనియు

ఇటువంటి అనేక కీర్తనల ద్వారా తన అనుభవమును ప్రకటించాడు. శిష్యుడు ఆచార్యుని అన్నివిధముల అనుసరించవలెననుచు,

"పోడిమి నా నామములు పొద్దు పొద్దు మడిగేని
వీడే మడుగునో వని వెరవకుమీ
వాడే నా యాచార్యుడు నాకు నన్నీ యిచ్చినాడు
నేడిదేలంటే నతని నేమము నే మానను

ప్రేమతో వీడు నన్నింట బెట్టుక పూజించేని
యేమి కారణమో యని యెంచుకోకుమీ

కామించి ఆచార్యుడే కారణము నీకు నాకు
యీ మరులేలంటే నాతడిచ్చే సొమ్మే నేను

పలుమారు నీడు నాపై బత్తిచేసే నేటికని
వెలయ శ్రీవేంకటేశ వేసరకు మీ
యెలమి నాచార్యుడిదేపని చేసినాడు
నిలిచె కలకాలము నీకు నాకు బోదు" (3-95)

అని అన్నమయ్య ఈ కీర్తనలో స్పష్టపరచినాడు.

## అధసూచికలు

1. "గురుస్సాక్షాదాది నారాయణః పురుషః స ఆదినారాయణోహమేవ తస్మాన్మామేకగ్ం శరణం వ్రజ మద్భక్తి నిష్ఠోభవ, మదీయోపాసనం కురు, మామేవ ప్రాప్స్యసి మద్వ్యతిరిక్తగ్ం సర్వబాధితమ్ ....." మం-5, అధ్యా-8 ఉత్తరకాండః-మహానారాయణోపనిషత్తు (త్రిపాద్విభూతి నారాయణోపనిషత్).
2. శ్లో॥ "కర్కటే హస్తనక్షత్రే బదరీ నిలయోద్భవం ।
   అష్టాక్షర ప్రదాతారం నారాయణమహంభజే ॥"
   అనూచానంగా వస్తున్న తిరునక్షత్ర తనియ శ్లోకము.
3. శ్లో॥ "పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో సర్వేద మాయా
   న్నాస్త్యకృతః కృతేన తద్విజ్ఞానార్థం సగురుమేవాభి
   గచ్ఛేత్సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥"
   మం-12, ఖం-2, ముండపి-1, ముండకోపనిషత్తు.
4. మం॥ "తస్మాత్సద్గురు కటాక్షలేశ విశేషేణ సర్వసిద్ధయ సిద్ధంతి. సర్వబంధా ప్రవినశ్యంతి, శ్రేయో విఘ్నాస్సర్వే ప్రళయం యాంతి, సర్వాణి శ్రేయాంసి స్వయమేవాయాంతి" - మం-3, అధ్యా-5, ఉత్తరకాండః మహానారాయణో పనిషత్.
5. "యథాజాత్యంధస్య స్వరూపజ్ఞానం నవిద్యతే తథా గురూపదేశేన వినాకల్పకోటి శతైరపి తత్త్వజ్ఞానం న జాయతే" - మం-4, అధ్యా-5, ఉత్తరకాండః - మహానారాయణోపనిషత్ (త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్).
6. సూ॥ "ఆచార్యన్ కైపుకున్ద వాడే తిరుమన్త్రమ్ కైపుకురుమ్" సూ-97, ప్రకర-1, శ్రీవచనభూషణము - పిళ్లైలోకాచార్యులు.

7. సూ॥ "తిరుమన్త్రమ్ కైపుకున్దవారే ఈశ్వరన్ కైపుకురుమ్" సూ-97, ప్రకర-1, శ్రీవచనభూషణము - పిళ్లైలోకాచార్యులు.
8. మం॥ చోదకోబోధకశ్చైవ మోక్షదశ్చ పరస్కృతః - ఇత్యేషాం త్రివిధోజ్ఞేయ ఆచార్యస్తు మహీతలే, చోదకీ దర్శయేన్మార్గం బోధకస్థానమాచరేత్, మోక్షదస్తు పరం తత్త్వం యద్ జ్ఞాత్వా పరమశ్నుతే" - మం-41, బ్రహ్మవిద్యోపనిషత్.
9. మం॥ "గురూపదిష్టమార్గేణ ధ్యాయన్మద్రూపమవ్యయమ్ । మత్సాయుజ్యం ద్విజస్సమ్యగ్భవేత్, భ్రమర కీటవత్ నైవ సాయుజ్య ముక్తిస్స్యాత్ బ్రహ్మానందకరీ శివా" - మం-6, అధ్యా-1, ముక్తికోపనిషత్తు.
10. ఆచార్యకులేవ సా దయస్సర్వ ఏతే పుణ్య లోకాభవన్తి బ్రహ్మసంస్థోమృతత్వమేతి" - మం-1, ఖం-23, ప్రపాఠకః-2, ఛాందోగ్యోపనిషత్.
11. "ఆచార్యన్ నినైవాల్ భవత్కైంకర్యమ్ సిద్ధిక్కుమ్" సూ-310, సదాచార్య లక్షణము, ప్రక-3, శ్రీవచనభూషణము.
12. "కర్మయోగో నామ ఉపదేశోజ్జీవ పరయాదార్థ్య జ్ఞానవతా ..... భవతి" పేజి-100, సప్తమోవతారః, యతీంద్రమతదీపిక.
13. న్యాస వింశతి - వేదాంతదేశికులు.
14. శ్లో॥ "పరీక్ష్య లోకాన్ ...... గురుమేవాభిగచ్ఛేత్సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్" మం-12, ఖం-2, ముండకోపనిషత్తు.
15. సూ॥ "ఆచార్యనుక్కు, శిష్యన్ పక్కల్ కృపైయుమ్" సూ-313, ప్రక-3, శ్రీవచనభూషణము.
16. పేజి-15, ఆచార్యహృదయము, సాంధ్ర వ్యాఖ్యానము, శేషాచార్యులు.
17. "కృతే యద్ధ్యాయతో విష్ణుం త్రేతాయాం యజతో మఖైః ।
ద్వాపరే పరిచర్యాయాం కలౌ తద్ధరి కీర్తనాత్ ॥" - మహాభాగవతము.
18. "శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్" - మం-12, ముండకోపనిషత్తు.
19. "శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్" - మం-12, ముండకోపనిషత్తు.
20. "తస్మాత్సద్గురు కటాక్షేన" - మం-3, మహానారాయణోపనిషత్తు.
21. "యథాజాత్యంధస్య స్వరూపజ్ఞానం" - మం-6, అధ్యా-1, ముక్తికోపనిషత్తు.
22. "గురూపదిష్టమార్గేణ" - మం-6, అధ్యా-1, ముక్తికోపనిషత్తు.
23. సూ-313, ప్రక-3, శ్రీవచనభూషణము.

24. "సద్బుద్ధి స్సాధుసేవీ సముచిత చరిత: తత్త్వబోధాభిలాషీ
శుశ్రూష స్త్యక్తమాన: ప్రణిపతనపర: ప్రశ్నకాల ప్రతీక్ష:
శాంతో దాంతో న సూయుశ్శరణ ముపగత: శాస్త్రవిశ్వాసశాలీ
శిష్య: ప్రాప్త: పరీక్షాం కృతవిదభిమతస్తత్త్వతి శ్శిక్షణీయ: ॥"
శ్లో-4, న్యాసవింశతి, వేదాంతదేశికులు.

25. సూ॥ "ఫలసాధన శుశ్రూషైయుమ్, ఆర్తియుమ్ ఆదరముమ్" - సూ-321, ప్రక-3, శ్రీవచనభూషణము - పిళ్లైలోకాచార్యులు.

26. సూ॥ "ఫలసాధనముమ్ ఐహికభోగముమ్ ఎల్లామ్ ఆచార్యనే యెన్రు నినైక్కక్కడవన్" - సూ-322, శ్రీవచనభూషణము - పిళ్లైలోకాచార్యులు.

27. "ఉపకార స్మృతిక్కు ముతలడి ఆచార్యన్బక్కల్ కృతజ్ఞతై ముడిన్దనిలమ్ ఈశ్వరన్బక్కల్ కృతజ్ఞతై" - సూ-325, ప్రక-3, శ్రీవచనభూషణము.

# అన్నమయ్య కీర్తనలలో భాగవత నిష్ఠ

## ముముక్షువు ఆచరించవలసినది :

ఆచార్య సమాశ్రయణమునకు పూర్వము భగవద్భక్తులైన భాగవతులను ఆశ్రయించుట ముముక్షువునకు ముఖ్యమైన కర్తవ్యమనియు, భాగవత పురుషకారము ద్వారా ఆశ్రయింపబడినట్టి సదాచార్యునియొక్క అభిమానమే ఉజ్జీవించుటకు తగినట్టి ఉపాయమనియు, శ్రీవచనభూషణము ప్రతిపాదించినది. జీవునికి భక్తి లభించెడి మార్గములను తెలుపు సందర్భమున నారదుడు తన భక్తి సూత్రములందు "తస్మిన్ తజ్జనే భేదాభావాత్" అని తెలిపెను. భగవంతునియందలి ప్రేమయే భక్తి. అట్టి ప్రేమయే భగవద్భక్తులయందు కూడా వుండవలెను అని ఆయన భక్తిసూత్రములలో పేర్కొనెను.

"నాకు నా భక్తులయెడల ఎక్కువ ప్రీతి కలదు. కావున నా భక్తులకు భక్తులయినట్టివారు విశేషముగ పూజింపవలసినట్టివారు"[1] అని భగవంతుడు స్వయముగా తెలిపియున్నాడు.

ఇంకను తన భక్తులు ఎట్లుండవలెనో తెలుపుచూ "దేవతాంతరముల నాశ్రయింపక నా భక్తులయెడల ప్రీతి గలవారై నన్నే శరణు జొచ్చినట్టివారు నా భక్తులుగా నెన్నబడుచున్నారు"[2] అని భగవానుడు తెలిపియుండుటచే భగవత్సమాశ్రయణము నకు దారి భాగవత సమాశ్రయణమని తెలియుచున్నది.

నారదుడు తన భక్తి సూత్రములందు మరొకచోట, "మాయను తరించుటకు మార్గము మహానుభావుల సేవ"[3] అని తెలిపియున్నాడు.

పరమాత్మసర్వశేషి. జీవుడు ఆ పరమాత్మకు శేషభూతుడు. పరమాత్మ అనుగ్రహమునకై జీవుడు తాను పరమాత్మకేగాక విష్ణుభక్తులందరికీ దాసుడనను భావమును పొందవలెను. పరమాత్మకు జీవునకు గల శేష శేషి భావము స్థిరమగుటకు భాగవతసేవ ప్రధానమైనదని శ్రీవైష్ణవము నిర్ణయించినది.

ఇచ్చట శేషత్వమనగా 'మిగిలినది' అని అర్థము కాదు. జీవుడు శేషభూతుడు అనగా భగవంతునికి దాసుడైనవాడు అని అర్థము. "శేషః పరార్థత్వాత్" అనే మీమాంసా సూత్ర ప్రకారము "ప్రధాన వ్యక్తికి తాను అంగమగుట - ఉపకరణమగుట" శేషత్వ

మనబడుతుంది. ప్రధాన వ్యక్తి (స్వామి) తనను యథేష్టముగా వినియోగించుకొనుటకు తగినట్లు తాను ఉపకరణముగా ఉపయోగపడుట అని జీవపరంగా శేషత్వానికి తాత్పర్యం. ఈ విధంగా తనను వినియోగించుకునే ప్రధానవ్యక్తి శేషి అనబడుతాడు. జగత్కారణ భూతుడైన పరమాత్మ సర్వశేషి. ఆయన చేయు సృష్టి స్థితి సంహారము లకు లోనైన ప్రకృతి-జీవులు ఆయన యొక్క సంతోషమునకు ఉపయోగపడు లీలోప కరణములు, కనుక శేషభూతము"[4].

శ్రీవైష్ణవులకు అష్టాక్షరీ మహామంత్రము ప్రధానమైనది. మరియు మోక్ష దాయకమైనది. అందలి ప్రతి అక్షరమునకు ఉపనిషత్ సమన్వయ పూర్వకముగా విశేషార్థములు ప్రతిపాదింపబడినవి.

పిళ్లై లోకాచార్యులవారు "అష్టాక్షరీ మహామంత్రమునందలి నమః పదము నందు భాగవత శేషత్వము అనుసంధించుకొనవలె"[5]నని తెలిపిరి. పిళ్లై లోకాచార్యుల వారు 18 ద్రావిడ ప్రబంధములు రచించిరి. వీటికి అష్టాదశ రహస్యములు అని పేరు. వీటిలో ముఖ్యమైనది "శ్రీవచన భూషణము". ఇది ద్రావిడ భాషలో రచింప బడినది. సంస్కృత వేదాంతములో రామానుజుల శ్రీభాష్యమునకున్నంత ప్రాముఖ్యత ద్రవిడ వేదాంతములో శ్రీవచనభూషణమునకు కలదు.

భాగవత శేషత్వము అనుసంధించుకొనవలెనని పిళ్లై లోకాచార్యులవారు చెప్పిన దానిని వ్యాఖ్యానించుచు వరవరమునీంద్రులు "అహంకార మమకారములు పోయి భగవంతునకు శేషత్వము ఉన్నదున్నట్లుగా ప్రకాశించు నీ మనస్సులో, ఆ భగవచ్ఛేషత్వ మునకు చివరి హద్దైన భాగవత శేషత్వము అనుసంధించుకొనవలెను"[6] అని తెలిపి భాగవత శేషత్వమును భగవంతుని చేరుటకు చివరి హద్దుగా నిర్ణయించిరి. అష్టాక్షరిలోని ఓంకారమునందుగల అకారమునందు భాగవత శేషత్వము అన్వయించు నని కొందరు, ఉకారమునందని కొందరు తలంతురు[7]. మరియును అకారములోని భగవచ్ఛేషత్వమునకు, భగవచ్ఛేషత్వమునకు చరమావధియైన భాగవత శేషత్వమును చతుర్థీ విభక్తి బోధించు[8]ననియు వరవరమునీంద్రులు వ్యాఖ్యానించిరి. కాబట్టి ముముక్షువునకు భాగవత నిష్ఠ ప్రధానమని తేలినది.

## భాగవత ప్రాశస్త్యము :

వరాహావతార సందర్భమున భూదేవితో విష్ణుమూర్తి "నా భక్తులు చండాలురైనను వారిని నిందించు నరుని కోట్లకొలది సంవత్సరములైనను క్షమించను"[9] అని పలికెను.

"తక్కినవారి నందరిని ఆరాధించుట కంటెను విష్ణువును ఆరాధించుట మంచిది. దానికంటెను మంచిది వాని భక్తుల నారాధించుట"[10] అని భాగవత ప్రాశస్త్యమును గూర్చి "రహస్యత్రయ సార సంగ్రహము"న తెలుపబడినది.

దాసానుదాస్యానుసంధానము పాపవిముక్తమనుచు రహస్యత్రయ సార సంగ్రహమున "భగవంతుని ఆశ్రయించినట్టి భాగవతుల నాశ్రయించుటవలనను, వారి నాశ్రయించినట్టి వారిని, వారినాశ్రయించినట్టివారిని, యివ్విధముగ వారి దాసానుదాసుల నాశ్రయించుట వలనను మానవులు పాపవిముక్తులగుచున్నారు"[11] అని పేర్కొనబడింది. ఈ గ్రంథములోనే మరొక సందర్భమున

"ఎవ్వారలు పితృదేవతలను, దేవతలను, నిత్యాగ్నిహోత్రులగు బ్రాహ్మణులను పూజించుచున్నారో - వారు అందుమూలముగ విష్ణువునే పూజించుచున్నారు"[12] అని బ్రాహ్మణ సేవ విష్ణుసేవ అనియు తెలుపబడినది.

"పశువుగాని, మనుష్యుడుగాని, పక్షిగాని యేది భాగవత సంబంధము కలిగి యున్నదో దాని మూలమున అది విష్ణువుయొక్క పరమపదమును పొందుచున్నది"[13] అని భాగవత సంబంధము పశుపక్ష్యాదులకు, మానవునికి పరమపద మార్గమని తెలుపబడినది.

ఇంకను - "దేనిని, దేనిని భాగవతుడు చేతులతో తాకుచున్నాడో, నేత్రములతో కటాక్షించుచున్నాడో స్థావర పదార్థములైనను అవి మోక్షమును పొందుచున్నవి. బంధుజనుల విషయమున చెప్పవలసినది యేమున్నది"[14] అని భాగవత కటాక్షము, వారి స్పర్శ కూడా తారకమని పొగబడినవి.

శ్రీవచనభూషణము భాగవతులను "ఆచార్యతుల్యులని, సంసారులకంటెను సర్వేశ్వరునికంటెను గొప్పవారనియు తలంపవలయును"[15] అని తెలిపినది.

లింగపురాణమున "విష్ణుభక్తుల విషయమున విశేషము గలదు. విష్ణుభక్తుల హృదయములు సర్వేశ్వరునికి చలించునట్టి విమానములు, చలించునట్టి నివాస స్థానములు. మంచి ఆచారము గలవాడును, కల్మషము లేనివాడును అగు వైష్ణవుని జూచినట్లయిన ఏ కులమున పుట్టినవాడైనను వానికి దండము సమర్పించును"[16] అని విష్ణువునకు నిలయుడుగా వైష్ణవుడు పేర్కొనబడినాడు.

భాగవతులు లోక సంరక్షణార్థమై భగవంతునివలె జన్మములను పొందెదరని, శ్రీవచనభూషణ వ్యాఖ్యానమున, "నిత్యసూరి నాయకుడగు సర్వేశ్వరుడు దేవ మనుష్యాది రూపముగా అవతరించినట్లే భాగవతులు కూడ జన్మవృత్తాదులచేత సజాతీయులై అవతరింతురు. అందువలన నింద యేమియు లేదు. శ్లాఘ్యతయే గలదు. ఈ ఉభయులును లోక సంరక్షణార్థమై ఇట్లు అవతరింతురు. భగవద్భక్తి లేనట్టి భాగవతులయందుండు జన్మ వృత్తాద్యతిశయములన్నియును విధవాలంకారము వలె నిందార్హములైయుండును[17] అని తెలుపబడినది.

ఈ విధముగా భాగవత నింద క్షమార్హము కాదని, విష్ణువుకంటే విష్ణుభక్తుల ఆరాధనయే మిన్నయని, దాసానుదాస్యానుసంధానము పాపవిముక్తి హేతువని, భాగవత సంబంధులైన మానవులే గాక పశుపక్ష్యాదులును మోక్షార్హులనియు, భాగవత కటాక్ష, స్పర్శ, అనుగ్రహములు మోక్షదములనియు, భాగవతుల హృదయములు పరమాత్మకు విమానములవంటివనియు, భాగవతులు ఆచార్య-పరమాత్మ సములనియు పురాణ ఇతిహాస సంప్రదాయ గ్రంథములు వివిధ సందర్భములందు భాగవత ప్రాశస్త్యమును గూర్చి ప్రకటించినవి.

## పూర్వాచార్యుల భాగవతనిష్ఠ :

ఆళ్వారులలో ప్రధానులగు నమ్మాళ్వారులు తమ "తిరువాశిరియం" నందు, "సర్వేశ్వరునికి దాసులైన శ్రీవైష్ణవులకు ఇకపైన మనము ప్రతి కల్పమందు ఎడతెగక దాసులమగునట్లు సమ్మతింపుము"[18] అని తమ భాగవత నిష్ఠను ప్రకటించినారు.

అట్లే వేదాంతదేశికులవారు తమ రహస్యత్రయ సారమున - "భగవంతుడు స్వతంత్రుడగుటవలన చేతనాచేతన పదార్థములను తన అభిమానముగలవారి విషయమున నియోగించుచున్నాడు. కావున మేము ఒనర్చునట్టి భగవత్కైంకర్యము

లోక వేదానుసారము భాగవతుల వరకును చేయవలసినదిగా నేర్పడుచున్నది"[19] అనియు,

"ఐహికమగు ఐశ్వర్యమును, కైవల్యమును, తృణ సదృశములను గాను తలంచి యున్నట్టి మేము మా వాక్కుతో మోక్షము నొసంగుమని భగవంతుని యాచింపము. పిరాట్టి వలెనే పారతంత్ర్యమునే ప్రధానముగా అవలంబించినట్టి భాగవతుల యొక్క అనుగ్రహమునే కోరుచున్నాము"[20] అనియు భాగవతులకు పిరాట్టి (లక్ష్మీదేవి)తో సమప్రాధాన్యము నొసగి వారి అనుగ్రహమే తారకమని .భావించి యున్నారు. నమ్మాళ్వార్లు మరొకచోట,

"సర్వేశ్వరుల దాసుల శ్రీపాదములనే పొందవలసినది తప్ప విశాలములైన మూడు లోకములు లభించినను తీవ్రమైన గొప్ప పాపములుగల నేను భాగవతుల శ్రీ పాదములను విడుచుట ఎట్టిది?"[21] అని పాపవిముక్తమగు భాగవత పాదాశ్రయమే తమకు శరణ్యమని చాటుకొన్నారు.

ఆళ్వారులలో విప్రనారాయణులొకరు. వీరు భాగవత ప్రాశస్త్యమును ఎరిగి, నిష్ఠగలిగి "భక్తాంఘ్రిరేణువు" అను విశేష నామమునే పొందిరి. భాగవత పాదరేణువు పాపహరమైనందున దానిని తలపై ధరించుచూ తమ పూర్వపు నామమును మరచిపోయి "భక్తాంఘ్రిరేణువు"గా మారిపోయిరి.

భాగవతార్చనలో పేరుగన్నవారు తిరుమంగై ఆళ్వారులు. వీరికే పరకాలురు అని పేరు. భాగవతార్చనకై తమకు ఉన్నదంతయు వెచ్చించిరి. చివరకు దొంగ తనములు, దారిదోపిడులు కూడా చేసి భాగవతారాధనము చేసిరి. ఒకనాడు ఆదిదంపతులైన లక్ష్మీనారాయణులు నవదంపతులవలె ఎదురుపడగా వారిని కూడ దోచుకొని భాగవతార్చన గావింప దలచిరి. వారి భాగవత నిష్ఠ అంత గొప్పది.

శ్రీమద్భాగవతమున నారదుడు తన శిష్యుడైన వ్యాసునికి తన పూర్వ జీవితమును గూర్చి వివరించుచు చాతుర్మాస్య నియమ సమయమున పవిత్రులైన భక్తులకు బాలసేవకుడుగా తాను సేవలు చేయుచు, వారితో సన్నిహిత సాహచర్యము ననుభవించితిననియు, ఒక్కొక్కప్పుడు ఆ మునులు తమ భోజనపాత్రములలో కొంత ఆహారము విడిచిపెట్టుచుండగా ఆ పాత్రములను కడుగుచున్న తాను వారి అనుజ్ఞ గైకొని తద్భుక్త శేషమును భుజించి, సర్వపాపములనుండి విముక్తుడనైతిననియు,

అట్లు తినుచుండగా క్రమముగా తానుకూడ ఆ మునులవలెనే విశుద్ధ హృదయుడ నైతిననియు, వారివలెనే తానుగూడ నిర్విరామ శ్రవణ సంకీర్తనములచే భగవంతుని యందు సేవారుచిని వృద్ధి చేసుకొంటిననియు[22] తెలిపియున్నాడు.

ఈ విధముగా పూర్వాచార్యులు కొందరు వివిధ సందర్భములయందు తమ తమ భాగవత నిష్ఠను ప్రకటించి శ్రీవైష్ణవ సంప్రదాయమున భాగవతనిష్ఠ ప్రధానమైనదని నిరూపించిరి.

## అన్నమయ్య భాగవతనిష్ఠ :

అన్నమయ్య భగవంతుని చేరుటకు నానావిధ భక్తిమార్గములను తెలుపుచు "అతని దాసుల సేవే అది తురీయభక్తి" అని పేర్కొనినాడు. 'తురీయ'మనగా పరబ్రహ్మము యొక్క నాల్గవ పాదము.

మాండూక్యోపనిషత్తు పరబ్రహ్మము నాలుగు పాదములు కలదానిగా తెలిపినది[23]. జాగ్రదవస్థ స్థానముగా గలది వైశ్వానర పాదము, స్వప్నావస్థ స్థానముగా గలది తైజస పాదము. సుషుప్తి స్థానముగా గలది ప్రాజ్ఞ పాదము. సర్వేశ్వరుడు సర్వజ్ఞుడు, అంతర్యామి, అంతటికీ కారణమైనవాడు నాల్గవ పాదము (తురీయము).

చతుష్పాదములు గల ఈ బ్రహ్మము అక్షరదృష్టితో ఓంకారము. అకార, ఉకార, మకారములే పాదములు. మొదటి పాదమైన వైశ్వానర పాదము 'అ'కార స్థానీయము, ఈ వైశ్వానర బ్రహ్మోపాసనమువలన సమస్త కామనలు తీరి మొదటివాడై ఉపాసకుడు ప్రకాశించును.

ద్వితీయ పాదమైన తైజసము ఉకారస్థానీయము. తైజస బ్రహ్మోపాసన వల్ల ఉపాసకుని జ్ఞాన సంతతి వృద్ధిచెందును. ఉపాసకుని వంశములో బ్రహ్మవిద్య తెలియని వారుండరు.

తృతీయ పాదమైన ప్రాజ్ఞ బ్రహ్మము మకార స్థానీయము. ప్రాజ్ఞ బ్రహ్మోపాసనమువలన ఉపాసకునికి ఏకీభావము కలుగును.

మాత్రారహితమైనది, నాల్గవది అయినది తురీయ బ్రహ్మపాదము. ఈ ఉపాసనమువలన ఉపాసకుడు స్వస్వరూపమును పొందును.

## రామానుజ సంప్రదాయ పరముగా చతుష్పాద సమన్వయము

వాసుదేవుడు సంకర్షణ-ప్రద్యుమ్న-అనిరుద్ధ రూప మూర్తి వ్యూహములను కలిగియున్నాడు. ఇందు సంకర్షణాది మూర్తులకు వరుసగా విశ్వ-తైజస-ప్రాజ్ఞ నామధేయములు కాగా తురీయము ప్రధానమగు వాసుదేవ మూర్తియే. ఇట్లు చతుర్మూర్తియైన భగవానుడు శ్రీహరి ఒక్కొక్క మూర్తితో జాగ్రత్-స్వప్న-సుషుప్తులను దశలు కలిగియుండు సర్వజీవరాశిని, అప్రాకృత నిత్యముక్త వర్గమును కూడా ధరించుచు, నిర్వాహకుడైయుండును. ఈ నాలుగు మూర్తులును అంగోపాంగ రూపమగు అవయవములనుబట్టియు, ఆయుధ భూషణాది ధారణమునందు గల కొద్దపాటి భేదమునుబట్టియు షాడ్గుణ్యావిర్భావ భేదమునుబట్టియు వైవిధ్యము కలిగియుండును.[24]

ఇట్లు పరబ్రహ్మము యొక్క చతుర్వ్యూహాత్మక చతుష్పాదములకు శ్రీవైష్ణవ సంప్రదాయానుసారముగ ప్రథమ పాదమును ఆచార్యనిష్ఠగా, ద్వితీయ పాదమును లక్ష్మీపురుషకారముగా, తృతీయ పాదమును భగవత్ నిష్ఠగా, చతుర్థ పాదమును భాగవత నిష్ఠగా సమన్వయము చేయవచ్చును.

### ప్రథమ పాదము - ఆచార్య నిష్ఠ :

శ్రీవైష్ణవమున ఆచార్యుని స్థానము విశిష్టమైనది. ముముక్షువునకు ఆచార్యోపదేశము లేనిదే మోక్షార్హత లేదు. జాగ్రదవస్థాత్మకమగు వైశ్వానరము ప్రథమ పాదము, ఓంకారమునందలి అకారస్థానీయమని తెలుపబడినది. పరమాత్మ చతుర్వ్యూహముల లోని సంకర్షణ రూపమునకు విశ్వనామధేయము కలదు. సంకర్షణ వ్యూహము పరమాత్మ షాడ్గుణ్యములలోని జ్ఞాన-బలములు కలది. ఉపాసకుడు పరమాత్మ ప్రథమ పాదమును ఓంకారము లోని అకారముగా భావించి సంకర్షణాత్మక రూపమును ఉపాసించినచో మొదటివాడై ప్రకాశించును.

సంకర్షణుని వలె ఆచార్యుడు జ్ఞానబలములు కలవాడు. జ్ఞానమనగా సర్వదా సర్వవిషయ ప్రకాశనము, స్వప్రకాశనము[25]. తననాశ్రయించిన సచ్ఛిష్యునికి తనకుగల సర్వశాస్త్ర సర్వ విషయములను బోధించు లక్షణము గలవాడు ఆచార్యుడు. జ్ఞానము వలన స్వప్రకాశ లక్షణము కలవాడు.

బలమనగా సమస్త వస్తుధారణ సామర్థ్యము.[26] ఆచార్యుడు తన శిష్యుల యొక్క సమస్త భారమును వహించు సామర్థ్యము కలవాడు.

ఇట్టి సంకర్షణ వ్యూహ లక్షణము గల ఆచార్యుడు జీవుని అనుగ్రహించువాడు. సదాచార్యుని అనుగ్రహము పొందిన శిష్యుడు ముముక్షు మార్గమున ప్రథమ స్థానమును పొందును. కనుక ఆచార్యుని పరమాత్మయొక్క సంకర్షణాత్మక వైశ్వానర ప్రథమ పాదముగా భావించవచ్చును.

**ద్వితీయ పాదము - లక్ష్మీస్వరూపము :**

ఆచార్యోపదేశమువలన మోక్షార్థిత పొందిన ముముక్షువు పరమాత్మను ఉపాసించుట ప్రారంభించును. అట్టి పరమాత్మకు నిత్యానపాయిని లక్ష్మీదేవి. తల్లి తన సంతానముయొక్క గుణదోషములను తండ్రివద్ద సమర్థించి తనయునికి అనుకూల పరచునట్లుగా, ఈమె కూడ జీవుని రక్షకత్వ భారము వహించి, గుణదోషము లను పరమాత్మ వద్ద సమర్థించి జీవునిపై ఆయనకు అనుగ్రహము కలుగుటకు తల్లివలె సహకరించును. అందుకే శ్రీవైష్ణవము లక్ష్మీదేవిని "పురుషకార స్వరూపిణి"గా నిర్ధారించినది. (పురుషకారము=పురుషునిగా చేయునది).

భగవంతునియొక్క ద్వితీయపాదమైన తైజసము ఓంకారమునందలి ఉకారముగా ఉపనిషత్తు చెప్పినది. ఉకారము అకార స్థానీయమగు పరబ్రహ్మకు, మకార స్థానీయమైన జీవునికి గల సంబంధమును తెలుపునది. లక్ష్మీదేవి కూడ పరమాత్మకు, జీవునికి తన పురుషకారము ద్వారా సంబంధమును కలుగజేయు లక్షణము కలది. చతుర్వ్యూహములలోని తైజస నామాత్మక ప్రద్యుమ్న వ్యూహము భగవంతునికి ద్వితీయ పాదము. ఐశ్వర్య వీర్యములు ప్రద్యుమ్న వ్యూహ గుణములు. లక్ష్మీదేవియందు ఇవి గలవు.

ఐశ్వర్యమనగా సమస్త వస్తు నియమన సామర్థ్యము.[27] ఐశ్వర్యమునకు అధిదేవత లక్ష్మీదేవియే. వీర్యమనగా జగదుపాదానమైనను స్వరూప వికారము లేకుండుట.

తన ప్రియురాలైన లక్ష్మీదేవిని అలరించుటకై శ్రీమన్నారాయణుడు తన లీలల ద్వారా సృష్టి స్థితి లయములు చేయునని శ్రీవైష్ణవ సంప్రదాయజ్ఞులు భావింతురు.

"శ్రీగుణరత్నకోశము"న పరాశర భట్టరువారు ఈ విధముగానే భావించిరి. ఇట్లు లక్ష్మీదేవి ఈ విధముగా జగదుపాదాన కారణమగుచున్నది. స్వరూప వికారము లేకుండా అన్నివేళలా పరమాత్మనే ఆశ్రయించి ఉండునట్టిది. తైజస నామము గల ప్రద్యుమ్న వ్యూహాత్మక ద్వితీయ పాదమును ఓంకారములోని ఉకారముగా ఉపాసించిన జీవునికి జ్ఞాన సంతతి కలుగును. అతని వంశములో ఎవ్వరును బ్రహ్మవిద్య తెలియని వారు జన్మించరు. లక్ష్మీదేవి పురుషకారము వలన జీవుని పరమాత్మ అనుగ్రహించి పై ఫలితముల నిచ్చును. కనుక లక్ష్మీదేవిని ద్వితీయపాదముగా భావించవచ్చును.

## తృతీయ పాదము - భగవన్నిష్ఠ :

ఆచార్యోపదేశము వలన మోక్షమునకు అర్హత పొందిన జీవుడు అమ్మగారి పురుషకారము వలన భగవంతుని అనుగ్రహమునకు పాత్రుడగును. ఆ అనుగ్రహమును నిలుపుకొనుటకై భగవదుపాసన ముఖ్యమైనది. పరమాత్మ తృతీయ పాదము ప్రాజ్ఞము. ఇది అనిరుద్ధ వ్యూహాత్మకము. శక్తి, తేజస్సులు అనిరుద్ధ వ్యూహ గుణములు. ప్రాజ్ఞమును ఓంకారములోని మకారముగా ఉపాసించవలయును. మకారము జీవుని తెలుపును. జీవుడు భగవంతుని మనోమయునిగా ఉపాసించుటను తృతీయ పాదము తెలుపుచున్నది. అనిరుద్ధ వ్యూహ గుణములైన శక్తి, తేజస్సులు భగవంతునివే.

శక్తి యనగా అఘటిత ఘటనా సామర్థ్యము. భగవంతుడి లక్షణమే యిది. తేజస్సనగా సహకారి నపేక్షించకుండుట లేదా పరాభిభవన సామర్థ్యము. ఇది కూడ భగవంతుని ప్రధాన గుణమే. ఇట్టి భగవంతుని తృతీయ పాదమును అనిరుద్ధ వ్యూహాత్మక ప్రాజ్ఞముగా ఉపాసించిన జీవునికి ఏకీభావము కలుగును.

## చతుర్థ పాదము - భాగవత నిష్ఠ :

ఆచార్యోపదేశము, లక్ష్మీపురుషకారము, భగవంతుని అనుగ్రహములున్ననూ ఉజ్జీవించుటకు జీవునికి ముఖ్యమైన సాధనము భాగవతనిష్ఠ అని శ్రీవైష్ణవ సంప్రదాయ నిర్ణయము. ఈ భాగవత నిష్ఠ జీవునికి చరమోపాయముగా సాంప్రదాయికులు తెలిపిరి. భగవంతుడు కూడ "తన భక్తులను సేవించువాడే తన అనుగ్రహమునకు పాత్రుడని" స్వయముగా తెలిపినాడు. పరమాత్మ యొక్క నాల్గవ పాదము వాసుదేవ వ్యూహాత్మక తురీయము. చతుర్వ్యూహములలో వాసుదేవ వ్యూహాత్మక స్థితి షాడ్గుణ్య

పరిపూర్ణమైనది. మిగతా మూడు వ్యూహములందు షడ్గుణములలో రెండేసి గుణములే ప్రధానముగా ప్రకాశించునవి.[28] ఇది మాత్రా రహితమైనది. వాసుదేవ వ్యూహమును తురీయముగా ఉపాసించువారికి మోక్షరూప భగవత్సాయుజ్యము శాశ్వతముగా లభించును.

శ్రీవైష్ణవమున భాగవతులు వాసుదేవ స్వరూపులు. ముముక్షువుల నుజ్జీవింప జేయగల పరమాత్మ గుణములన్నీ వీరియందు గలవు. ముముక్షువులు ఉజ్జీవించుటకు సులభోపాయము భాగవతనిష్ఠ. భగవంతుని చతుర్థ పాదమగు తురీయ నామక వాసుదేవమును భాగవత నిష్ఠగా భావించవచ్చును. ఇట్లు భావించిన అన్నమయ్య తన భాగవతనిష్ఠను వివిధ విశేషములతో వివిధ రీతులలో తన కీర్తనలలో ప్రకటించినాడు. భగవంతుడు భక్తులను పాయకుండుననియు, భాగవతులు భగవంతుని రూపులే అనియు, కొన్ని సందర్భములలో భగవంతునికంటె భక్తులే అధికులనియు, భాగవతులు భగవంతునివలె కృపా స్వరూపులనియు, అందరికంటె గొప్ప వారనియు, భాగవత శేషత్వము అనుసంధేయమనియు, జీవుడు భాగవతులయందు దాసానుదాస్య భావము కలిగియుండవలయుననియు, తనను వారి పాదరేణువుగా భావించవలెననియు, నైచ్యానుసంధానము కలిగియుండవలెననియు, భాగవతులనే తన బంధువులుగా భావించవలెననియు, అన్నింటికంటె భాగవత సేవే గొప్పదనియు, అదే తారకమనియు, భక్తునియందు ప్రేమ కలిగియుండుట వలన భగవంతుని అనుగ్రహం లభించుననియు, భాగవత సేవే జీవునికి ఉపాయ స్వరూపమనియు, అన్నమయ్య తన కీర్తనల ద్వారా భాగవత నిష్ఠను తెలిపియున్నాడు.

**భగవంతుడు భక్తులను విడిచి యుండడనుట :**

**"నీకంటే మాకు జాడ నీ దాసులే మేలు**
**పైకొని వారున్నచోట పాయకుందువు**
**చేకొని శ్రీవేంకటేశ చెప్పగానే వారిచేత**
**నీ కథలు విని విని నే మీదేరితిమి"** (2-161)

అని భగవంతుడు భక్తుని విడచియుండడనియు, అందువలన ఆ భక్తుల నాశ్రయించుటయే మేలనియు, వారివల్ల కడతేరితిమనియు, అన్నమయ్య -

"మానక శ్రీవేంకటేశ మహిలో నీ దాసులుండే
దేనెలవైనా నీకిరవే కదా ...." (2-168)

అని భాగవతులు నివసించే స్థలమే భగవంతుని నివాసస్థానమనియు,

"భాగవతాధీనమైన పరమపురుషుడు" (3-281) అనియు,

"దాసవర్గముకెల్లా దరిదాపు మీరే" (2-176)

అనుయు భగవంతుడు భక్తులకు అధీనుడని, దాసవర్గమునకు అందుబాటులో నుండెడి వాడని భక్తపరాధీనతను కీర్తించినాడు.

## భగవంతునికన్న భక్తులే అధికులనుట :

"కానవచ్చె నిందులోనె కారుణ్య నరసింహా
చానకమై నీకంటే దాస్యమే పో ఘనము ॥పల్లవి॥

యెనసి ప్రహ్లాదుడు ఎక్కడ జూపునోయని
వనిచి లోకమెల్ల నరసింహ గర్భములై
పనిపూని వుంటివటు భక్తపరతంత్రుడవై
తనిసి నీవధికమో దాసులే యధికమో ॥కాన॥

మక్కువ బ్రహ్మాదులు మానుపరాని కోపము
ఇక్కువై ప్రహ్లాదుడు యెదుట నిలిచితేను
తక్కక మానితివట్టె దాసుని యాధీనమై
నిక్కి నీ కింకరుడే నీకంటే బలువుడు ॥కాన॥

అరసి క్రమ్మర ప్రహ్లాద వరదుడని
పేరుపెట్టుకొంటివిట్టే బెరసి శ్రీవేంకటేశ
సారె నీ శరణాగత జనుని కాధీనమైతి
వీరీతి నీ దాసునకే యిదివో మొక్కేము" ॥కాన॥ (2-449)

నారద శుకాదుల మార్గమును తాననుసరించెదనని చెప్పుకున్న అన్నమయ్య ఈ కీర్తనయందు భాగవతములోని ప్రహ్లాద కథారూపముగా భగవంతునికన్న భక్తుడే అధికుడని నిరూపించుచున్నాడు.

పై కీర్తనలోని మొదటి చరణమున భక్త పరతంత్రుడైన భగవంతుడు-ప్రహ్లాదుడు తనను ఏ ప్రదేశములో చూపునోయని భావించి తానే పూనుకొని ప్రపంచ మందంతటను వ్యాపించియుండుటవలన భక్తునే అధికముగా భావించితినని అన్నమయ్య తెలిపినాడు.

రెండవ చరణమున బ్రహ్మాదులచే కూడా మానుపరాని ఉగ్ర నరసింహ రూపము ప్రహ్లాదుడు ఎదుట నిలుచుటచే మానుటవలన దాసునికి అధీనమైన భగవంతునికన్న భక్తునే బలవంతునిగా భావించుచున్నానన్నాడు.

శరణాగతునకు అధీనమై "ప్రహ్లాద వరదుడని" పేరుపెట్టుకొన్నవాడు భగవంతుడు. కనుక భక్తుడే అధికుడని కనుక ఆ భక్తునే మొక్కుచున్నానని మూడవ చరణమున భక్తుని ఆధిక్యమును సుస్పష్టముగా అన్నమయ్య ప్రకటించినాడు. మరొక కీర్తనయందు -

**"ఇదియే మర్మము హరి యిందుగాని లోనుగాడు**
**పదబడి జీవులాల బదుకరో ॥పల్లవి॥**

**హరి గానలేరు మీరు అరసెందు వెదకినా**
**గరిమ బ్రత్యక్షముగాడు దేవుడెవ్వరికి**
**ధర ప్రత్యక్షము హరి దాసుల కొలువరో ॥ఇదియే॥**

**అంతరంగమున నున్నాడందురు విష్ణుడు గానీ**
**అంతట నున్నారు వైష్ణవాధికులు**
**చెంతల తదియ్యుల చేతి యనుజ్ఞ వడసి**
**సంతతము శ్రీవేంకటేశు శరణము చొరరో" ॥ఇదియే॥ (5-243)**

అని భగవంతుని లోబరచుకొనవలెనన్న భగవద్దాసులను కొలుచుటయే మర్మమనియు, ఎందు వెదకినా హరిని దర్శించలేరనియు, భగవంతుడు ఎవ్వరికీ ప్రత్యక్షము గాడనియు, హరిదాసులైతే ప్రత్యక్షులు గనుక వారిని కొలిచి హరిని లోబరుచుకొనుమనియు అన్నమయ్య జీవులకు బోధించుచున్నాడు. అంతరంగమున ఉన్నాడనే విష్ణుని కన్న అంతట కన్పించే వైష్ణవాధికుల అనుజ్ఞ పొంది భగవంతుని శరణము పొందమని చెప్పుచు భగవంతుని శరణు పొందుట భక్తుల చేతిలో నున్నదని భాగవత ఆధిక్యమును ప్రకటించినాడు.

**భాగవతులు కృపాస్వరూపులనుట :**

**"పట్టపు హరిదాసులు ప్రత్యక్షమై ఉండగాను**
**యిట్టె వారి కృప చేరుటెన్నడో యీ జీవులు"** (3-279)

అని అన్నమయ్య ప్రత్యక్షులైన, కృపాస్వరూపులైన భాగవతులను జీవులు ఎప్పుడు పొందుదురో అని వారి కృపా లక్షణమును తెలిపినాడు.

**"మిక్కిలి జపతపాలు మించిన ప్రపన్నుల**
**చిక్కని కృపాకటాక్ష సీమమున్నదిదివో"** (3-450)

అని గొప్పనైన జపతపాల వల్ల లభించు ఫలము ప్రపన్నుల కృపతో కూడుకున్న చూపులయందే కలదని భావించినాడు.

**"అయ్యో పదామత్తుడను హరి నీ దాసులు నన్ను**
**ఇయ్యెడనే దయజూచి యీడేర్చిరి గాక"** (3-108)

అని మత్తుడైన తనను హరిదాసులు దయతో అనుగ్రహించి ఇచ్చుటనే తరింపజేసినా రనియు,

**"యెడయక శ్రీవేంకటేశుపై భారము వేసి**
**కడు వైష్ణవుల కృపగలిగి సుఖించుట"** (3-212)

అని భగవంతునిపై భారమువేసి వైష్ణవుల కృప కలిగిఉంటే చాలు సుఖము కలుగునని, భాగవత కృప సుఖకరమని భావించినాడు. మరియు,

**"పరమ భాగవత భవ్యమతులు**
**పరమ బోధ సంభావకులు**
**తిరువేంకటగిరి దేవు సేవకులు**
**కరుణాధికులివి గాదందురు"** (1-122)

అని వేంకటేశ్వరుని సేవకులు పరమభాగవతులనియు, భవ్యమతులనియు, పరమ బోధ సంభావకులనియు, అన్నింటికి మించి కరుణాధికులనియు అన్నమయ్య భాగవతోత్తములను స్తుతించినాడు.

## భాగవతులు అందరికంటె గొప్పవారనుట :

**"అన్నిటాను హరిదాసులధికులు**
**కన్నుల వంటివారు కమలజాదులకు"** (2-170)

అని అన్నమయ్య హరిదాసులన్నింటిలోను అధికులని, చతుర్ముఖ బ్రహ్మ మొదలగు వారికి కన్నులవంటివారు అనగా ముఖ్యమైనవారు అనియు,

**"అన్నిటా శాంతుడైతె హరిదాసు తానే**
**సన్నుతి తానె పో సర్వదేవమయుడు"** (2-460)

అని హరిదాసును సర్వదేవమయునిగా భావించి,

**"ఇహము పరము జిక్కె నీతని వంక**
**అహి శయనుని దాసులంత వారు వీరే"** (3-34)

అని భాగవతుల వలన ఇహ పరాలు చిక్కును గనుక వారియంతవారు లేరని తెలిపినాడు.

## భాగవత శేషత్వము అనుసంధేయమనుట :

"చిన్న మర్రిగింజలో మహావృక్షమయ్యే శక్తి ఇమిడియున్నట్లు, ఓంకారములో సమస్త శబ్దరాశి అంతర్భవించియున్నట్లు తదీయులే నాకు స్వాములు అనే భావన సిద్ధిస్తే అందులోనే సర్వ పురుషార్థాలు యిమిడియున్నవి"[29] అనియు,

ముముక్షువు తాను భాగవతులకు దాసుడనను భావము కలిగియుండక, భగవచ్ఛేషత్వబుద్ధి కలిగియున్నను ఫలితము లేదనియు, అష్టాక్షరీ మహామంత్రార్థము ఇదేననియు శ్రీవైష్ణవ సంప్రదాయము స్పష్టపరచినది.

**"అచ్చుగ మునులు ఋషులందరును నీబంట్లే**
**తచ్చిన యేలికలు నీ దాసులు మాకు"** (3-321)

అని అన్నమయ్య నమ్మాళ్వారులు భాగవత సంబంధమును అనుసంధించుకున్న విధంగానే[30] తానుకూడా భాగవత శేషత్వమును భావించినాడు, మరియు

**"అంది నీకు భక్తులైన యల మహానుభావుల**
**చందపు వారిపై భక్తి చాలదా నాకు"** (8-23)

అనియు,

"అచ్యుత మిమ్ము దలచే యంతపని వలెనా
యిచ్చల మీవారె మాకు నిహపరాలియ్యగా

మిమ్ము నెరిగిన యట్టి మీ దాసుల నెరిగే
సమ్మతి విజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీ సేవ సేసుకుండేటి వైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు ॥అచ్యుత॥

విరతి నీకు మొక్కే నీ డింగరీలకు
పరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్ను బూజించే ప్రపన్నుల పూజించే
సరిలేని భాగ్యము చాలదా నాకు" (3-23)

అనుచు భగవద్భక్తులను ఇహపరాలు యిచ్చువారిగా పేర్కొనుచు, భగవత్తత్త్వము తెలిసిన భాగవతులను తెలుసుకునే విజ్ఞానము చాలుననియు, భగవంతుని సేవించు వైష్ణవుని సేవించుట తనకు చాలుననియు, భగవంతుని మొక్కే సేవకులకు మొక్కుటయే చాలుననియు, భగవంతుని పూజించే ప్రపన్నులను పూజించుటే సరిలేని భాగ్యమనియు, భగవంతుని భక్తులపై భక్తి చాలుననియు అన్నమయ్య భాగవతులపై తనకు గల భక్తిని, వారితో తనకు గల శేషత్వమును ప్రకటించినాడు.

## దాసానుదాస్యాను సంధానము ఉండవలెననుట :

భగవద్భక్తులతో శేషత్వమునే గాక అన్నమయ్య దాసానుదాస్య భావమును కూడా అనేక కీర్తనలలో ప్రకటించినాడు.

"కందువ శ్రీవేంకటేశ కదు నీబంటు బంటుకు
పందడి బంటవవుటే చాలదా నాకు" (3-23)

కులశేఖరాళ్వారులు తమ ముకుముందమాలా స్తోత్రమున అనుసరించిన దాసానుదాస్య భావము అన్నమయ్య ఈ భావనయందు ప్రతిఫలించినది.

"ధరలో శ్రీవేంకటేశ దాసానుదాసుడయి
పరవితో నడచేటి శాంతమే సుఖము" (2-159)

అని దాసానుదాస్య సంబంధము సుఖదాయకమనియు,

"వెలసై శ్రీవేంకటేశ నీ దాసానుదాసుల
గొలిచితే చాలు గక్కున కృపసేతువు" (2-191)

అని దాసానుదాస్య పూజ్యభావము వలన భగవంతుడు వెంటనే అనుగ్రహించుననియు,

"పలుక వైష్ణవ వేషభాష లెందు నుండి నాను
వలనుగ మాకు సహవాస యోగ్యులే
తలకొన్న దాసానుదాస్య మెందు నుండినాను
అలకర్మ దూరులైన నంతరంగులు" (3-490)

అని వైష్ణవులే గాక వైష్ణవ వేషభాషలు ఎచ్చట ఉన్నా సహవాసమునకు తగినవనియు, దాసానుదాస భావము కలిగియున్నవారు కర్మములంటని అంతరంగములు కలవారనియు,

"బంటుకు బంటవుదురా పాపముగాక నీ
బంటుకు బంట్లమై బదికేము నేము" (10-225)

అని భగవంతుని బంటు బంట్లకు బంటు అగుట వలన బతికిపోవుదుమని తెలిపినాడు.

కీర్తన : "వెరతు వెరతు నింద వేడుకపడ నిట్టి
కురుచ బుద్ధుల నెట్లు కూడుదునయ్యా" ॥పల్లవి॥

ఇంటి వేలుపు వేంకటేశ్వరు దనవెంట
వెంట దిప్పెడు వాడు విభుడటా
దంటనై యాతని దాసానుదాసినై
వొంటి నుండెద నేమి నొల్లనో యయ్యా (5-138)

అని భక్తపరాధీనుడైన పరమాత్మను వెంట వెంట తిప్పుకునే భక్తుడే ప్రభువనియు, ఆ భక్తుని దంట అయి ఆతని దాసానుదాసియై అన్నమయ్య తాను ఏమియు ఒల్లక ప్రపన్న భావము పూని ఒంటిగా నుండెదనని మధురభక్తి పూర్వకముగా తన భాగవతనిష్ఠను చాటుకున్నాడు.

## భాగవత పాదరేణువుగా భావించవలెననుట :

"అచ్చపు నీ దాసులు అనంతము వారలకు
రిచ్చల నేనొక పాదరేణువ నింతే" (3-42)

అనియు,

"ఈ విభు దాసుల హిత పాదధూళి
పావనమై సోకి బ్రదికినం జాలు" (7-352)

అనియు అనంతమైన తత్త్వముగల భగవద్దాసులకు అన్నమయ్య తనను పాదరేణువుగా భావించుకొని, పవిత్రమైన వారి పాదధూళి సోకి తాను బ్రతికిన చాలునని తెలిపి ఆళ్వారులలో ఒకరైన "భక్తాంఘ్రిరేణువు"లను తలపింపజేసినాడు.

## నైచ్యానుసంధానము కలిగియుండవలెననుట :

భగవత్సన్నిధిలో క్రిందిస్థాయికి చెందిన కట్టకడపటి సేవ చేయుమని శ్రీవైష్ణవము సూచించును. అధోగతికి మూలమైన అహంకారము సమూలముగా నశించుటకు చరమావధి దాస్యమే యని ఆచార్యోపదేశము స్పష్టపరచినది. ఈ దాస్యభావము భగవంతునియందే గాక భాగవతులయందు కూడా వృద్ధినొందిన ఆ భక్తుడు భక్తాగ్రగణ్యుడగును.

"సొంపుల నీయానంద సుఖమేడ నేనేడ
పంపు శ్రీవైష్ణవ సల్లాపన చాలదా" (2-169)

అని తనను తాను తక్కువగా భావించుకొని శ్రీవైష్ణవ సల్లాపము తనకు చాలునని నిరహంకారమును ప్రదర్శించినాడు అన్నమయ్య.

"అద్దిరా వో యయ్య నేనంత వాడనా? వొక
కొద్ది నీ దాసుల సేవ కోరగల గాక" (3-26)

అని దాసుల సేవనే కోరినాడు.

"ఇన్ని జన్మములేటికి హరిదాసు
లున్న వూరం దా నుండిన జాలు" ॥పల్లవి॥

హరిభక్తుల యింట నన్నము గొనువారి
వరవుడై వుండవలె నన్నం జాలు

**పరమ భాగవత భవనంబుల జెడ్డ**
**పరవు దానయి పొడమిన జాలు ॥ఇన్ని॥**

**శ్రీ వేంకటేశు జూచిన వారి శ్రీపాద**
**సేవకుండై వుండ జేరినం జాలు"** (7-352)

అని జన్మములు లేక హరిదాసులు ఉన్న ఊరిలో ఉన్న చాలుననియు, హరిభక్తుల యింటిలో అన్నము తినువారియొక్క దాసుడై ఉన్న చాలుననియు, భాగవతుల యిండ్లలో తాను చెడ్డ పరువు అయినా చాలుననియు, అన్నమయ్య శ్రీవైష్ణవ సంప్రదాయములోని ప్రధానమైన దాస్యభావమును, నైచ్యానుసంధానమును చేసుకొని శ్రీవైష్ణవమును త్రికరణశుద్ధిగా విశ్వసించి, ఆచరించి దానియందు తనకు గల గాఢానురక్తిని తెలుపుకున్నాడు.

"సుఖము నొసగునట్టి నీ దాసుని యొక్క భవనము నందు కీటకజన్మమైనా చాలునని"[31] పూర్వాచార్యుల అనుసంధాన భావ సాదృశ్యమును అన్నమయ్య ప్రదర్శించినాడు.

## భాగవతులే బంధువులనుట :

**"రంగుగ బాంధవ మందరకు బంధుజనులందు**
**సంగతి నాకు నీ భక్తజనులయందు"** (2-224)

అని భగవద్భక్తజనులయందు మాత్రమే తనకు బాంధవ్యమని,

**"సకల బంధులు నీ దాసానుదాసులే నాకు"** (3-393)

అని భాగవత దాసానుదాసులే సకల బంధువులని తెలిపినాడు.

## భాగవత సేవే అన్నిటికన్నా గొప్పది యనుట :

**"తమితోడ వైష్ణవులు దాపు దండై యుండగాను**
**తెమలి తీర్థాలెల్ల ద్రిష్టించవలెనా"** (3-219)

అని వైష్ణవులున్న ప్రదేశమే పుణ్యతీర్థమని, అది అండనే ఉండగా మిగిలిన తీర్థాలు తిరుగ వలసిన అవసరం లేదనియు,

"వలికి నీ తీర్థము భావవలందేగాని
అల నీ దాసుల తీర్థమరచేత నిదివో" (3-475)

అని భాగవతుల అనుగ్రహము భగవంతుని అనుగ్రహముకన్నా దరిదాపై అరచేతిలోని దనియు,

"సామీప్యము వడుగ, సారూప్యము వడుగ
కామించి సాయుజ్య సాలోక్యము లడుగ
భూమింగాని, పాతాళంబువగాని దివింగాని
వమూవ నీ దాసులతో వహవాస మియ్యవే" (7-21)

అని అన్నమయ్య సామీప్య, సారూప్య, సాలోక్య, సాయుజ్యముల కోరననియు, త్రిలోకములలో నెక్కడైనను భగవద్దాసులతో సహవాసం చాలుననియు, అర్థించి భాగవత దాస్యము కన్న ఎక్కువైనవేమియు లేవనియు, భాగవతసేవయే అన్నింటికన్నా గొప్పదనియు భావించినాడు.

## భాగవత సేవయే తారకమనుట :

"తమితో శ్రీపతి నీ దాసుల జేరినపుడే
యమకింకర భయము లణగిపోయె" (3-12)

అని భాగవత సేవవలన మరణభయము తొలగిపోయినదనియు,

"తరి నిహపరము నీ దాసులిచ్చిరి
గురియైతి నిన్నిటికి గొంకకుడీ ఇకను" (3-99)

అని ఇంతకాలము ఎన్నింటికో గురియైనను ఇప్పుడు భాగవతులు ఇహపరము లిత్తురనియు, ఇక గొంకవలసిన పని లేదనియు,

"మొదలొకటే యిన్నిటికి ముందు వెనకా వచ్చేదీ
వొదుగుచు గోవిందుని దాసులకు వొక్కమాటే
మొక్కిన జాలు" (3-101)

అని అన్నింటికి మూలము కర్మపరిపాకమే అనియు, ముందు వెనుకా వచ్చేది దాని ఫలమే అనియు, అట్టి కర్మఫలములను జయించుటకు గోవిందుని భక్తులను ఒక్క

మొక్కు మొక్కిన చాలుననియు, వైష్ణవులకుండవలసిన ముఖ్యలక్షణమైన వినయమును "ఒదుగుచు గోవిందుని దాసుల ......" అని ప్రయోగించి అన్నమయ్య భాగవతుల యందు తనకు గల వినయమును ప్రకటించుకున్నాడు. కర్మఫల భోగములు జన్మములు. వాటిని తరించుటకు భాగవతులకు వినయపూర్వకముగా నమస్కరించుటయే మార్గమని తెలియజేసినాడు.

**భాగవతులయందలి ప్రేమవలన భగవంతుని అనుగ్రహం లభించుననుట :**

"పర్వి శ్రీ వేంకటపతి నీ దాసుల
పూర్వమనియెడు బుద్ధి నీ పూజ" (3-320)

అని తన భక్తులను పూజించినవాడే తనకు ప్రీతిపాత్రుడని తెలిపిన భగవంతుని గీతా వాక్యమును అనుసరించిన అన్నమయ్య "భగవంతుని దాసులయందు నిలిపిన బుద్ధియే భగవంతుని పూజ" అని తెలిపినాడు. ఇంకను,

"ఆవల నీతని దాసులందు ప్రేమ కలిగితే
కావరపు టితర సంగతులేలా" (11-128)

అని భాగవతులయందు నిష్ఠ ప్రేమ ఉండగా ఇతర విషయములతో పనిలేదని భగవద్భక్తుల యందు తన సంపూర్ణ ప్రపత్తిని ప్రకటించుకున్నాడు.

**భాగవత సేవయే ఉపాయమనుట :**

"నరహరి నీ దయ మీదట నా చేతలు గొన్నా
శరణాగతియును జీవుని స్వతంత్రము రెండా" ॥నర॥

మెఱయుచు నరకపు వాకిలి మూసిరి హరి నీ దాసులు
తెరచిరి వైకుంఠపురము తెరవుల వాకిళ్ళు
నరిపిరి పాపములన్నియు నుగ్గుగ నిటు తూర్పెత్తిరి
వెఱవము వెఱవము కర్మపు విధులిక మాకేలా ॥నర॥

పాపిరి నా యజ్ఞానము పరమాత్ముడ నీ దాసులు
చూపిరి నిను నామతిలో సులభముగా నాకు
రేపిరి నీపై భక్తిని రేయిని బగలును నాలో
వోపము వోపము తపముల వూరకె ఇక నేలా ॥నర॥

దిద్దిరి నీ ధర్మమునకు దేవా శ్రీవేంకటేశ్వర
అద్దిరి నీ దాసులు నీ యానందము లోన
ఇద్దరి నీనా పొందులు యేర్పేరచిటువలె గూర్చిరి
వొద్దిక వొద్దిక నాకిక వుద్యోగములేలా ॥నర॥ (3-368)

అని ఈ కీర్తనయందు శరణాగతి, జీవుని స్వతంత్రముకన్నను, భాగవతినిష్ఠ గొప్పదని చెప్పుచు, హరిదాసులు తనకు నరకపు వాకిలిని మూసి వైకుంఠపు వాకిళ్ళు తెరచిరనియు, పాపములన్నియు పిండిచేసి తూర్పార బట్టిరనియు, అందువలన కర్మ ఫలములకు (పాప-పుణ్యములకు) వెరవవలసిన అవసరం లేదనియు మొదటి చరణమున తెలిపినాడు.

రెండవ చరణమున - అజ్ఞానమును బాపి భగవంతుని మనస్సులో నిలిపి, ఎల్లవేళలా భగవద్భక్తిని కలిగి ఉండునట్లు చేసిరి నీ దాసులని, అందువలన వేరే తపములు చేయవలసిన పని లేదన్నాడు.

చివరి చరణమున భగవంతుని ధర్మములో ప్రవర్తించునట్లు భాగవతులు తనను దిద్ది తీర్చిరనియు, బ్రహ్మానందములో అద్దిరనియు తెలుపుచు తనకును పరమాత్మ అయిన శ్రీ వేంకటేశ్వరునికిని మధ్య నిలిచి, ఈ విధముగా ఇద్దరికి పొందులు ఏర్పరచి కలిపినారనియు, కనుక ఇతర ఉద్యోగములు అవసరము లేదనియు పేర్కొనుచు అన్నమయ్య భాగవతులను పురుషకార స్వరూపులుగా భావించి వారియందు తన నిష్ఠను ప్రకటించుకున్నాడు.

## భాగవతులు భగవద్రూపులే యనుట :

"నీవెంత నేనెంత నేడు నా యగ్గలికెంత
దేవ నీ దాసుల జూచితేనే నిన్నుగనుట" (2-330)

అని యిందు బహు ప్రయాసలు చేసి భగవంతుని దర్శించవలసిన అవసరం లేదనియు, ఎదుటనే ఉండే భగవద్భక్తులు పరమాత్మ రూపులే గనుక వారిని దర్శించినచో భగవంతుని దర్శించినట్లుగనే అన్నమయ్య భావించినాడు. ఇంకను,

వెన్న చేతబట్టి నేయి వెదకనేలా
యిన్నిటి నెంచి చూచితే నిదియే వివేకము

నీ దాసులున్నచోట నిత్య వైకుంఠమిదె
వేదతో వేరొక చోట వెదుక నేలా
ఆదిగొని వారి రూపులవియే నీ రూపులు
పొది నిమ్ము మది తలపోయ నేలా ॥వెన్న॥

వారల తోడి మాటలు వడి వేదాంతపఠన
సారె వట్టి చదువులు చదువనేల
చేరి వారి కరుణే నీ చేపట్టిన మన్ననలు
కోరి యింతకంటె మిమ్ము కొసర నేలా ॥వెన్న॥

నా విన్నపము విదె నారదశుకాదులును
యీ విధమువనే ఆనతిచ్చినారు
శ్రీవేంకటేశ నీవు చేపట్టిన దాసులకు
కైవశమే యీ బుద్ధి కడమేలా ॥వెన్న॥ (3-180)

అని ఈ కీర్తనయందు వెన్నవంటి భాగవతులు చేతనుండగా నేయివంటి భగవంతుని వెదుకవలసిన పనిలేదనియు, భాగవతులున్న ప్రదేశమే నిత్యవైకుంఠమనియు, ఇక వేదనతో ఇంకొకచోట వెదకవలసిన పనిలేదనియు, వారు స్వయముగా భగవంతుని రూపులే గనుక భగవంతుని మనస్సున తలపోయవలసిన పనిలేదనియు తెలిపినాడు.

శ్రీవైష్ణవమున వైష్ణవగోష్ఠి, వైష్ణవులతో సంభాషణలు ముముక్షువునకు అనుసంధేయములు. ఈ విషయమునే అన్నమయ్య తెలుపుచు వారితోడి మాటలు వేదాంత పఠనల వంటివనియు, ఇతర చదువులు అవసరము లేదనియు, వారి కరుణనే భగవంతుని పట్టి యిచ్చుననియు, ఇంతకంటె కోరవలసినది భగవంతునివద్ద యింకేమియు లేదనియు, భాగవతుల ఆధిక్యమును పొగడినాడు.

నారద శుకాదులు ఆనతిచ్చిన ఈ విధానమునే తాను విన్నపము చేసితి ననియు, శ్రీ వేంకటేశుని దాసులకు వశమగుటకంటే బుద్ధికి కడమ లేదనియు, భాగవతుల యందు వినయమును ప్రకటించినాడు. అందుకే భాగవత సేవ తురీయ భక్తి అన్నాడు అన్నమయ్య.

## అధస్సూచికలు

1. "మమ మద్భక్త భక్తేషు ప్రీతిరభ్యధికా భవేత్ ।
తస్మాన్మద్భక్త భక్తాశ్చ పూజనీయా విశేషతః ॥ పేజి-215-రహస్యత్రయ సారము, వేదాంతదేశికులు-సాంద్ర వ్యాఖ్యానము-కందాడై శేషాచార్యులు, వేదాంత ముద్రాక్షరశాలవారిచే ప్రకటితము-1928.
2. పేజి-215-పురుషార్థ కాష్ఠాధికార సందర్భమున ఉదహరించిన శ్లోకము - సాంద్ర వ్యాఖ్యానము - కందాడై శేషాచార్యులు.
3. "కస్తరతి మాయాం యో మహానుభాం సేవతే" -సూ-46-నారదభక్తిసూత్రములు.
4. పేజి-90, తత్త్వోపహారము - న.చ. రఘునాథాచార్యులు.
5. సూ॥ "ఉశ్ఇతుమ్ ఉన్నరి యార్క్కడియై, ఎన్గిరపడియే ఇతిలే భాగవత శేషత్వ మనుసంధాయమ్" - 89, ముముక్షుప్పడి - పిళ్లైలోకాచార్యులు.
6. పేజి-227, సూ-89, అష్టాక్షరీ మంత్రార్థము (ఆంధ్రానువాదము) అనువాదకులు, ప్రకాశకులు - గోపాలాచార్య - 1985.
7. ఇతు అకారాత్తిలే ఎన్టుం శొల్లువర్కళ్, ఉకారత్తిలే ఎన్టుం శొల్లువరకళ్" - సూ-19, ముముక్షుప్పడి.
8. సూ॥ చతుర్థియాలే ఆత్మా వినుడైయ భగవచ్ఛేషత్వత్తైశొల్లుకైయాలే, భగవచ్ఛేషత్వ కాష్ఠైయాన ఇన్ద భాగవత శేషత్వానుసంధానం అకారత్తిలే ఎన్టుం శిలర్ శొల్లువర్కర్" - సూ-90, వరవరమునుల వ్యాఖ్యానము - ముముక్షుప్పడి.
9. వరాహ పురాణము
"మద్భక్తం శ్వపచం వాపి నిందాం కుర్వంతి యే నరాః ।
పద్మకోటి శతేనాపి నక్షమామి వసుంధరే ॥
(రహస్యత్రయ సార వ్యాఖ్యాన సందర్భమున ఉదాహరింపబడినది)
10. శ్లో॥ "ఆరాధనానాం సర్వేషాం విష్ణోరారాధనం పరం ।
తస్మాత్పరతరం ప్రోక్తం తదీయారాధనం పరమ్ ॥"
పేజి-215, రహస్యత్రయసారము - సాంద్ర వ్యాఖ్యానము - శేషాచార్యులు.
11. "తదాశ్రయస్యా శ్రయణాత్ తస్యత్రప్యచ తస్యచ ।
సంసేవ నాన్నరా లోకే పూజయంతే సర్వపాతకైః ॥
పేజి-216, రహస్యత్రయ సార సాంద్ర వ్యాఖ్యానము - శేషాచార్యులు.

12. శ్లో॥ "యే యజన్తి పిత్ర్యాన్ దేవాన్ బ్రాహ్మణాన్ పహుతాశనాన్ ।
సర్వభూతాంతరాత్మానం విష్ణుమేవ యజంతి తే ॥"
పేజి-217, రహస్యత్రయ సార సాంధ్ర వ్యాఖ్యానము

13. శ్లో॥ "పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః ।
తేనైవ తే ప్రయాస్యన్తి తద్విష్ణోః పరమంపదమ్ ॥"
పేజి-241, సూ-205, సిద్ధోపాయాధికరణ సందర్భమున ఉదాహరింపబడినది.
శ్రీవచనభూషణ వ్యాఖ్యానము - కందాడై శేషాచార్యులు.

14. శ్లో॥ "యం యం స్పృశతి పాణిభ్యాం యం యం పశ్యతి
చక్షుషా! స్థావరాణ్యపి ముచ్యన్తి కింపునర్బాంధవాజనాః ॥
పేజి-241, సూ-205, శ్రీవచనభూషణ సిద్ధోపాయాధికరణము వ్యాఖ్యాన సందర్భ శ్లోకము - కందాడై శేషాచార్యులు.

15. సూ॥ "ఆతావతు - ఆచార్యతుల్యరెన్టుమ్, సంసారికళిలుమ్ , తన్నిలుమ్, ఈశ్వరనిలుమ్, అధికరెన్టుమ్, నినక్కై" సూ-223, ప్రక-2, శ్రీవచన భూషణము, పిళ్లైలోకాచార్యులు.

16. శ్లో॥ "వైష్ణవానాం విశేషోస్తి విష్ణోరాయతనం మహత్
జంగమ శ్రీవిమానాని హృదయాని మనీషిణామ్ ।
యః పశ్యతి శుభాచారం వైష్ణవమ్ వీతకల్మషమ్
యస్మిన్ - కస్మిన్ కులే జాతం ప్రణమేద్దండవద్భువి ॥"
పేజి-258, లింగపురాణశ్లోకము, సూ-226, వ్యాఖ్యాన సందర్భమున ఉదాహరణీయము. శ్రీవచనభూషణ వ్యాఖ్యానము - శేషాచార్యులు - శ్రీవచన భూషణము - పిళ్లైలోకాచార్యులు.

17. శ్లో॥ "ప్రాదుర్భావైః సురనర సమోదేవ దేశస్తదీయా
జాత్యావృత్తైరపిచ గుణ తస్తాదృశో నాత్రగర్హా
కిన్తు శ్రీమత్ భువన భవన త్రాణతోన్యేషు విద్యా
వృత్తప్రాయో భవతి విధవాకల్పకల్పః ప్రకర్ష ॥"
శ్రీవచన భూషణము - ప్రక-2, సిద్ధోపాయాధికారము, సూ-235నకు వ్యాఖ్యాన సందర్భమున ఉదాహరింపబడినది. శేషాచార్యులు.

18. పా॥ మాత్తెమ్ నత్తడి యవర్క్కిని నామాళాకవే ఇశై
యుంగోల్ ఊడి దోరూడి యో వాతే
పాశురము-3, తిరువాశిరియం - నమ్మాళ్వారులు.

19. శ్లో॥ "స్వతంత్ర స్వామిత్వా త్స్వబహుమతి పాత్రేషునియతం
శ్రియః కాంతో దేవస్సఖలు వినియుంక్తే చిదచిత్
యథాలోకామ్నాయం యతి పతి ముఖై రాహి తధియాం
తతో నః కైంకర్యమ్ తదభిమత పర్యంతమభవత్ ॥
పేజి-212, పురుషార్థ కాష్ఠాధికారము, రహస్యత్రయసారము - వేదాంతదేశికులు.

20. శ్లో॥ "నాథేన స్తృణమన్యదస్యపి వా తన్నాభినాళీకినీ
నాళీక స్పృహణీయ సౌరభముచా వాచాన యాచామహే
శుద్ధావాంతు లభే మహిస్థిర ధియాం శుద్ధాంత సిద్ధాంతినాం
ముక్తైశ్వర్య దిన ప్రభాత నమతో సక్తిం ప్రపత్తిః ముహుః ॥
పేజి-223, పురుషార్థ కాష్ఠాధికారము, రహస్యత్రయ సారము, వేదాంతదేశికులు.

21. పా॥ "కొడుమావి నయేన వనడి యూరడియే కొడు మితు
వల్లాల్ వియన్ మూవులకు పెరినుమ్ విడుమాటెన్న తన్నన్దో"
తిరువాయ్‌మొళి - 8-10-1, నమ్మాళ్వారులు.

22. శ్లో॥ "ఉచ్ఛిష్ట లేపాననుమోదితో ద్విజైః
సకృత్ స్మభుంక్తే తదప్రాప్త కిల్బిషః
ఏవం ప్రవృత్తస్య విశుద్ధ చేతస
స్తద్ధర్మ ఏవాత్మ రుచిః ప్రజాయతే ॥"
శ్లో-25, అధ్యా-5, స్కంధ-1, శ్రీమద్భాగవతము.

23. శ్లో॥ "సోయమాత్మా చతుష్పాత్" - మం.శ్లో-2, మాండూక్యోపనిషత్.

24. శ్లో॥ "వాసుదేవః సంకర్షణః ప్రద్యుమ్నః పురుషః స్వయం
అనిరుద్ధ ఇతి బ్రహ్మన్ మూర్తి వ్యూహోభిధీయతే ॥"
అధ్యా-11, స్కంధము-12, శ్రీమద్భాగవతము.

శ్లో॥ "సవిశ్వ తైజసః ప్రాజ్ఞః తురీయ ఇతి వృత్తిభిః ।
అధేంద్రియాశయ జ్ఞానైః భగవాన్ పరిభాష్యతే ॥"

శ్లో॥ అంగోపాంగా యుధాకల్పైః భగవాన్ తచ్చతుష్టయమ్ ।
బిభర్తి స చతుర్మూర్తిః భగవాన్ హరిరీశ్వరః ॥
అధ్యా-11, స్కంధము-12, శ్రీమద్భాగవతము.

25. పేజి-136, నవమోవతారం - యతీంద్రమతదీపికా.
26. పేజి-136, నవమోవతారం - యతీంద్రమతదీపికా.
27. పేజి-136, నవమోవతారం - యతీంద్రమతదీపికా.
28. పేజి-136, నవమోవతారం - యతీంద్రమతదీపికా.
29. శ్లో॥ "న్యగ్రోధ బీజే ప్రణవే శబ్దజాలవత్ ।
సిద్ధే తదీయ శేషిత్వే సర్వార్థాః సంభవంతిహి ॥"
పేజి-91, వైష్ణవ సిద్ధాంత సర్వస్వము - తత్త్వోపహారము -
న.చ. రఘునాథాచార్యులు.
30. పా॥ మాత్తెమ్ వత్తడి యవర్క్కెని నామాళాకవే ఇశై
యుంగోల్ ఊడి దోరూడి యో వాతే
పాశు-3, తిరువాయ్మొరియం, నమ్మాళ్వారులు.
31. శ్లో॥ "తవ దాస్యసుఖైక సంగినామ్ - భవనేష్వస్త్వపి కీటజన్మమే"
శ్లో-55, స్తోత్రరత్నములు - యామునాచార్యులు.

# అన్నమయ్య కీర్తనలలో శ్రీవైష్ణవ పారిభాషిక పదములు

## శ్రీవైష్ణవ ప్రసక్తి :

"చెలగి శ్రీపతి దలచి వైష్ణవుడనైతి" (3-379)

అని అన్నమయ్య తాను శ్రీపతిని తన దైవముగా నమ్మి వైష్ణవుడనైనానని తెలుపుకున్నాడు. అంతవరకు అద్వైతులుగా నున్న తన పూర్వీకుల మతమును వీడి తాను వైష్ణవము స్వీకరించిన వృత్తాంతమును స్పష్టపరచినాడు.

ఇట్లు శ్రీవైష్ణవుడయిన అన్నమాచార్యులు శ్రీవైష్ణవమునందు తనకు గల అభిమానమును, విశ్వాసమును వివిధ కీర్తనలలో ప్రకటించినాడు.

"ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువగ వలయు ॥పల్లవి॥

భగవదపచారము - భాగవతాపచారము
దగులక దేవతాంతరము మాని
నగధరు శరణము నమ్మి యాచార్యునికి
బగివాయనిదే పరమ వైష్ణవము ॥ప్రపన్నులకు॥

దురహంకారము దుఃఖము సుఖమును
బొరయక ప్రాకృతుల పొంత బోవక
దరశవాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమ వైష్ణవము ॥ప్రపన్నులకు॥

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడు తీర్థ ప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవేంకట నిలయుడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ॥ప్రపన్నులకు॥ (2-317)

అని భగవంతుని సర్వరక్షకునిగా భావించు ప్రపన్నునికి శ్రీవైష్ణవము పరమాచారమనియు, విపరీతాచారములు విడువవలయుననియు పల్లవియందు తెలిపినాడు.

శ్రీవైష్ణవుడు శ్రీమన్నారాయణుని తప్ప అన్యదైవమును ఆశ్రయించిన భగవదపచారము చేసినట్లు అగును. కనుక భగవదపచారము వలదనియు, "భాగవతుల యొక్క కులములను వృత్తులను గూర్చి విచారణ చేయుట - మాతృయోని విచారణ సదృశము" అనియు అదే భాగవతాపచారమనియు శ్రీవచన భూషణము నిశ్చయించినట్లుగా అన్నమయ్య భాగవతాపచారము చేయరాదనెను. శ్రీమన్నారాయణునే శరణముగా నమ్మి శరణాగతి ధర్మమును బోధించు ఆచార్యుని యొక్క అను సంధానమును విడువ కూడదనియు, అట్టిదే పరమవైష్ణవ ధర్మమనియు ప్రథమ చరణమున ప్రకటించెను.

శ్రీవైష్ణవులకుండవలసిన పరమ సాత్విక లక్షణముల వివరించుచు దురహంకారమును వీడవలెననియు, ప్రకృతి సంబంధముతో కొట్టుమిట్టాడువారికి దూరముగా నుండవలెననియు, మీమాంసాశాస్త్రము మొదలగు దర్శనముల యందు అభిమానము కలిగి అందలి ధర్మములను ఆచరించుచూ, పరిశుద్ధముగా నుండుటయే పరమవైష్ణవమనియు తెలిపినాడు.

భగవంతుని చేరుటకు యితర ఉపాయములను అవలంబించక భక్తితో ఎల్లప్పుడు పరమాత్మ తీర్థ ప్రసాదములయందు మాత్రమే ఆసక్తి కలిగి, శ్రీవేంకటేశ్వరుడే గతియని సంపూర్ణ ప్రపత్తిని ప్రదర్శించుటయే పరమవైష్ణవమని అన్నమయ్య సంపూర్ణ వైష్ణవ ధర్మమును ఆవిష్కరించినాడు. ఇంకను,

**"శ్రీవైష్ణవ ధర్మము దప్పక జెలగుటయే వైభవము"** **(2-209)**

అనియు,

**"విష్ణువొక్కడే విశ్వాత్మకుడు**
**వైష్ణవమే సర్వంబును"** **(2-345)**

అని వైష్ణవమే సర్వమనియు,

**"హితులము శరణాగతులము కేశవ**
**వ్రతులము వైష్ణవమతులము"**

..............................................

**"శ్రీవైష్ణవులము శ్రీవేంకటపతి**
**భావింపనితని పరికరము**
**యీ వలను వలని విహపరములకును**
**తోవ దొలగుమీ తొలి తొలి మాయ"** (2-399)

అని కేశవవ్రతులు, వైష్ణవమతులమయిన తమకు ఇహ-పరములను కలిగించు మాయ అడ్డు కాదనుచు, ఆ మాయను తోవ తొలగుమని అన్నమయ్య ఆజ్ఞాపించుచు వైష్ణవము యొక్క గొప్పదనమును చాటుచున్నాడు.

**"అందాకా వైష్ణవమటకటకే**
**నిందకు బాసిన నిర్మలుడగు"** (3-310)

అని శ్రీవైష్ణవుడు పాపములకు తొలగి నిర్మల చిత్తము కలవాడు కావలెననియు,

**"ఎదురులేక చరింతురెట్టైనా శ్రీవైష్ణవులు**
**మదించి వేమగులకు మట్టు మేరమున్నదా?"** (3-401)

అని శ్రీవైష్ణవులకు అడ్డు ఏమియు లేదనియు,

**"యేడ నిందలిక యేడ సంస్తుతులు**
**జాడల శ్రీవైష్ణవునికిని**
**యీడనే శ్రీవేంకటేశుడాత్మయట**
**యీడు లేని యతడెక్కుడే కాదా"** (3-539)

అని స్థితప్రజ్ఞుడైన శ్రీవైష్ణవునికి ఇహములోనే శ్రీ వేంకటేశ్వరుడు ఆత్మయగుట వలన అతనికి ఎవ్వరును సాటిరారని, ఆతడే ఘనుడని తెలుపుచూ,

**"ఇదియే శ్రీవైష్ణవులు యిల పూర్వాచార్యులు**
**వెదకి చదివి కన్న వివరమెల్లా**
**తుద మొదలెరుగని దుష్టుల కతలు మాని**
**పదిలమై యిట్టె నమ్మి బ్రతుకుట గాక"** (3-241)

అని కొస మొదలు తెలియని దుష్టులను నమ్మక, శ్రీవైష్ణవులు మరియు పూర్వాచార్యులు వెదకి చదివి చూచినదంతయు శ్రీవైష్ణవమే అనియు, దానినే నమ్మి తరించవచ్చు ననియు తెలిపెను. శ్రీవైష్ణవ ధర్మమునే బ్రతికెడి మార్గముగా ఈ కీర్తనలో అన్నమాచార్యులు నిశ్చయించి ప్రకటించినాడు.

## నైచ్యానుసంధానము :

శ్రీవైష్ణవమున వైష్ణవుడు తనను తాను అత్యంత హీనునిగా, దాసునిగా, పాపిగా, పరమపరతంత్రునిగా భావించుకొనుట జరుగును.[1] ఈ లక్షణమును అన్నమయ్య తన కీర్తనలలో అనేక తావుల ప్రకటించినాడు.

"వెండియు శ్రీవేంకటేశ వచ్చి మరలితి
వుండచోట నుండి నన్ను వూడిగాన కంపవే" (3-432)

అనియు, "శ్రీకాంత ప్రియ శ్రీవేంకటేశ్వర
కైకొన్న నీ కింకరులమయ్య" (3-435)

అని జీవులందరూ భగవంతుని సేవకులనియు,

"యెదరాడే వాడనా యెలయించే వాడనా
పదరాన నీకు మొక్కే జంతువ నేను" (2-492)

అనియు తాను భగవంతునికి నమస్కరించుట తప్ప అన్యమెరుగని అజ్ఞాన లక్షణము గల జంతువునని భగవంతుని గొప్పదనము, తన విధేయత్వమును, నైచ్యమును ప్రకటించెను.

"పెక్కు బ్రహ్మాండములు నీ పెను రోమకూపములు
వున్నవందొక కీటకమ నేను" (3-42)

అని తనను తాను కీటకముగా భావించుకొని

"యిన్నిటా నాకంటె హీనుడిక మరెవ్వడూ లేడు
వున్నతి నీకంటే ఘనులొకరూ లేరు" (3-45)

అని తన హీనత్వమును ప్రకటించి,

"భావించి నావంటి నీచుబట్టి కాచినప్పుడుగా
యేవంక నీ కీర్తి గడునెంతురు భువి" (3-48)

అని తన నీచత్వమును తెలుపుకొని,

"అయ్యో వేనేకా అన్నిటికంటే దీలు
గయ్యాళినై వృథా గర్వింతుగాని ॥పల్లవి॥

తడిపి వుదికి నట్టి ధౌతవస్త్రములునా
యొడలు మోచిన మీద యోగ్యములు గావు
వుడివోక వనములో నొప్పైన విరులునే
ముడిచి వేసినంతనే ముట్టరాదాయను ॥అయ్యో॥

గగనాన నుండి వచ్చే గంగాజలములైన
వొగి నా గోరంటి తేనె యోగ్యము గావు
నగు శ్రీవేంకటపతి నన్నే రక్షించిన దాకా
మొగడై యెరుక తుది ముట్టరాదాయను ॥అయ్యో॥

వెక్కసపు రచనల వేవేలు రుచులు నా
నొక్క నాలుకంటితేనే యోగ్యములు గావు
పక్కన దేవార్హపు బరిమళ గంధములు నా
ముక్కు సోకి నంతలోనె ముట్టరాదాయను" ॥అయ్యో॥ (2-80)

అని తనను తాను గయ్యాళిగా, గర్విష్టిగా, అయోగ్యునిగా చిత్రించుకొని వైష్ణవున కుండవలసిన అత్యంత ప్రధానమైన నైచ్యానుసంధానమును ఈ కీర్తనయందు అన్నమయ్య అనుసంధించుకొని తన వినయమును ప్రదర్శించినాడు.

"నీ దాస్యము గల నీచజన్మమైన మేలు
యేదియు యెరుగనట్టి యెక్కువ జన్మాన కంటె
వాదపు గర్వము లేదు వట్టి యాచారము లేదు
సాధించి నైచ్యానుసంధానమేగాని" (2-86)

అని ఏదియు తెలియని గొప్ప జన్మముకంటె భగవంతునికి దాస్యముచేయు నీచ జన్మమే మేలనియు, పాండిత్య ప్రకర్షను ప్రకటించు వాదగర్వముకంటెను, వట్టి ఆచారములకంటెను నైచ్యానుసంధానమే అతి ప్రధానమైనదని, దానివల్ల అహంకారము తొలగి భగవంతుని ఆధిక్యము గుర్తింపవచ్చునని, సదా ఆయన మహత్వము నుగ్గడించ వచ్చునని అన్నమయ్య భావించి ప్రకటించినాడు.

## కైంకర్యము :

శ్రీవైష్ణవమున విష్ణుకైంకర్యమే పరమార్థము. ఫలితముల ప్రమేయము పెట్టుకోక, పర్యవసానముల కొరకు ఎదురుచూడక, చేయుటయే జన్మకు చరితార్థముగా భావించి చేయువారిని కింకరులందరు. వారు చేయునది కైంకర్యము.

"మానవులందరూ కింకరులే. భగవత్కింకరులు. మనవారు కర్మను కైంకర్యం అన్నారు. కైంకర్యఫలం ఎప్పుడూ చేసేవాడికి కాదు. చేయించుకునే వాడికే. అందుకే మనవారు ఏ కర్మలాచరించినా భగవదాజ్ఞయా, భగవత్ప్రీత్యర్థం అనే సంకల్పిస్తారు. భగవంతుని ప్రీతికోసం, ఆయున ముఖోల్లాసం కోసం ఈ కైంకర్యం సమర్పించుకుంటున్నాం అని భావించి సమర్పిస్తాం. ఇది వట్టి చేయడం కాదు. సమర్పణం. అదీ భీతితో కాదు ప్రీతితో. ఆజ్ఞవల్లనే కాదు, ఆదరంవల్ల."[2]

"కైంకర్యమే చరమ పురుషార్థం - పరమ పురుషార్థం అన్న సూక్తిని చాలా విశాలంగా ఎంతో గంభీరంగా భావించాలి"[3] ఇట్టి పరమార్థమును భావించినవాడు కనుకనే అన్నమయ్య,

**"కైవల్యమున కంటె కైంకర్యమెక్కుడు**
**శ్రీవిభుడ నీవు మాకు జిక్కే మర్మమిదివో"** (2-4)

అని కైవల్యమునకంటే కైంకర్యమే అధికమనీ, ఆ కైంకర్యమువల్లనే విష్ణువు చిక్కునని,

"కలదు, కలదు శరణాగతులకు హరికైంకర్యమున మోక్షము" (3-446)

అని శరణాగతి ధర్మములో హరి కైంకర్యము చేసిన మోక్షము లభించునని అన్నమయ్య కైంకర్య ప్రాశస్త్యమును ప్రకటించినాడు.

"ఆగమోక్త మీ హరి కైంకర్యము" (3-259) అని కైంకర్యమునకు ఆగమ ప్రామాణ్యము కలదనియు,

**"తటుకున శ్రీవేంకటపతి నొకని దాస్యము భజియించిన వరుడు**
**ఘటవల వాతని కైంకర్యములకు కడుబాత్రుడుగాక మానునా"** (2-22)

అని హరిదాస్యము చేసినవానికే హరికైంకర్యమునకు పాత్రత కలదనియు,

**"వేళతో సుజ్ఞాని శ్రీవిష్ణు కైంకర్యాలు చేసి**
**కాలమందే యిందరిలో ఘనుడు కానోపడా"** (2-352)

అని వేళమీరక విష్ణుకైంకర్యాలు చేసిన నరుడు అందరిలో ఘనుడనియు,

**"నిర్మలులు వీరు నిత్య సుఖులు**
**కర్మదూరులు విష్ణు కైంకర్యపరులు"** (2-114)

అని విష్ణుకైంకర్యమునందే ఆసక్తి కలిగినవారు నిర్మలమైన చిత్తవృత్తితో, నిత్యమూ సుఖము అనుభవించుచూ, నిష్కామకర్ములైనందున కర్మకు దూరముగా నుందురని (అనగా కర్మఫలితములకు) విష్ణుకైంకర్యపరుల గొప్పదనమును వర్ణించినాడు.

## తిరువారాధన :

శ్రీవైష్ణవ సంప్రదాయమున భగవంతునికి సమర్పించెడి షోడశోపచారములతో కూడిన ఆరాధనమునకు తిరువారాధనమని పేరు. తిరు అనునది తమిళపదము. మంగళకరమైన, శ్రేష్ఠమైన అని అర్థము. మంగళకరమైన ఆరాధనము కనుక తిరువారాధనము అని సంప్రదాయమున ప్రసిద్ధమైనది.

**"నేనేమెరిగి సేసేనో దిరువారాధన**
**ఆని మున్నిట బ్రహ్మరుద్రాదులు సేయగలేరు"** (2-273)

అనియు,

**"తిరమై శ్రీవేంకటాద్రి తిరువారాధన గొని**
**వరుస నీ దాసులకు వరమిచ్చేవయా"** (3-314)

అనియు "తిరువారాధన" గూర్చి పేర్కొన్నాడు.

## ఆరగింపులు :

శ్రీవైష్ణవులు ఏ పదార్థమునైనను శ్రీమన్నారాయణునికి మొదట ఆరగింపు చేయనిదే గ్రహించరు.

**"వేకువ దిరుపళచ్చి విష్ణువునకు జేయరో**
**ఆకటి కొదగినట్టి ఆరగింపులు"** (3-298)

అని (తిరుపళచ్చి అనగా భగవంతుని నిద్రనుండి మేలుకొల్పుట) నిద్రనుండి మేల్కొనిన భగవంతుని ఆకలికి తగిన ఆరగింపులు చేయుడని కోరుచు,

**"వూరకే మా యింట నీవు వొదవిన పాటి నీ**
**వారగించవయ్య చవులేగాము లెంచక"** (2-60)

అని తనకు భగవంతుడు ప్రసాదించినదానిలోనే ఆరగింపులు సమర్పించినాడు అన్నమయ్య.

## తీర్థము :

**"యిల బావములుగా నిందరి జేసేనంటా**
**నెలమి పాదతీర్థమేరు చేసినాడవు"** (3-482)

అని లోకులను పావనులను చేయుటకు, భగవంతుడు తన పాద తీర్థమును ఏర్పాటు చేసినాడని అన్నమయ్య తీర్థమును భావించినాడు.

**"తీపులెన్నైనా గలవు తినదిన నాలికెకు**
**తీపు శ్రీహరి ప్రసాద తీర్థమని కోరదు"** (3-415)

అని సకల రుచులను కోరెడి నాలిక శ్రీహరి పాద తీర్థమును కోరుటలేదని చింతించుచూ,

**"తెచ్చి పునీతు జేయ నీ తీర్థమే చాలు"** (2-482)

అని పవిత్రము జేయు విష్ణుతీర్థ మహిమను ఉగ్గడించినాడు.

**"తీపుగ తులసి తీర్థము గొంటిమి**
**శాపము దీరెను సఫలంబాయ"** (2-322)

అని తులసీదళములతో భగవంతునికి అర్ఘ్యపాద్యాదికములు సమర్పించిన తీర్థమును స్వీకరించు సంప్రదాయ లక్షణము స్ఫురింపజేయుచు, తీర్థ మాహాత్మ్యమును ప్రకటించినాడు.

## ప్రసాదము :

భగవంతునికి సమర్పింపబడిన ప్రసాదమును అతి పవిత్రమైనదిగా వైష్ణవులు స్వీకరింతురు.

**"చెలగి అందరికి జిహ్వానందము**
**పలుమ గొను నీ ప్రసాదము"** (2-369)

అని ప్రసాదము జిహ్వానందమనియూ,

**"కడగి నీ ప్రసాదమే గొని కాయమూ దనియదు"** (2-375)

అని ప్రసాదము ఎంత స్వీకరించినను శరీరము తృప్తినొందదనియు,

**"చిందివ నీ ప్రసాదమే సిరులిచ్చే మాకును"** (3-321)

అని భగవత్ప్రసాదము సంపదల ప్రసాదించుననియు,

**"వుగ్గువలె నీ ప్రసాదమూనివది వొడల"** (3-460)

అని చిన్నప్పుడు తల్లి పెట్టిన వుగ్గు వొంటబట్టిన విధముగా హరి ప్రసాదము తన శరీరమున ఉగ్గువలె ఊనినదనియు,

**"ముట్టి నే భుజించివవి ముకుంద నీ ప్రసాదాలె"** (2-20)

అని తాను స్వీకరించినవన్నియు ముకుందుని ప్రసాదాలే ననియు అన్నమయ్య తన శ్రీవైష్ణవత్వమును చాటుకున్నాడు.

**"తదియ్య గురుప్రసాదపు పురోడాశమిచ్చి"** (2-148)

అని భగవంతునితోపాటు ఆచార్యునికి సమర్పింపబడిన ప్రసాదమును యజ్ఞఫలముగా భావించినాడు.

## సాష్టాంగ దండ ప్రణామము :

శ్రీవైష్ణవులు భగవంతునికి, సాష్టాంగ దండ ప్రణామము నాచరించి తమ ఆత్మ సమర్పణ భావమును ప్రకటింతురు.

**"యిట్టె మీకు రెండు చెతులెత్తొక మాటు మొక్కితే**
**గట్టిగా విహపరాలు గలిగె మాకు**
**దట్టముగ సాష్టాంగ దండము పెట్టిన ఫల**
**మట్టె నీమీద మున్నది అదిగోవయ్యా"** (2-51)

అని కేవలం రెండు చేతులెత్తి మొక్కితేనే ఇహపరాలు ఇచ్చెడి పరమాత్మపై సాష్టాంగ దండము ద్వారా ఆత్మసమర్పణము చేసి అంతకన్న గొప్పనైన ఫలమునిచ్చెడి భారమును మోపినాడు అన్నమయ్య.

## సర్వాపరాధి భావము :

"భయహేతువైన స్వదోషానుసంధానము[4] ప్రపన్నునికి ఎల్లవేళలా ఉండవలెనని శ్రీవచన భూషణము పేర్కొన్నది. ఈ భావముతోనే శ్రీవైష్ణవులు భగవంతునికి, యితర వైష్ణవులకు నమస్కరించునపుడు వినయపూర్వకముగా "సర్వాపరాధిని" అని విన్నవించుట ఆచారము.

**"అట్టి సర్వాపరాధి నపరాధాలెంచనేల**
**గట్టి రాళ్ళతో మలి గండ్లేర నేల"** (2-454)

అనియు, **"సంతతము వన్నెంచితే సర్వాపరాధి నేను"** (2-192)

అనియు, **"అనంతాపరాధి నేను అటుగా శరణంటిని"** (2-323)

అనియు అన్నమయ్య "సర్వాపరాధి"నని తన వినయత్వము ప్రకటించినాడు.

## తదీయుల ప్రసక్తి :

శ్రీవైష్ణవ సంప్రదాయమున తదీయులు లేక తదియ్యులు అనగా భాగవతులు. భాగవత భక్తిలేని భగవద్భక్తి నిరర్థకమని సంప్రదాయము నిర్ణయించినది.

**"ఇట్టి బ్రాహ్మణ్యమెక్కుడు యిన్నిటిలోన**
**దట్టమై తదియ్యులకె తగును బ్రాహ్మణ్యము"** (2-486)

అని తదియ్యులకె అనగా భాగవతోత్తములకె బ్రాహ్మణ్యము తగినది, అదియే బలమైనది, అధికమయినది అనియు,

**"వెదకవో చిత్తమా వివేకించి నీవు**
**అదన దదియ్య సేవ అంతకంటె మేలు"** (3-415)

అని తదియ్య సేవ అన్నిటికంటే మేలైనదనుచు,

**"సకల దేవతలచే సాధించే వరములు**
**మొకరి తదియ్యుల మూకనిదివో"** (3-450)

అని దేవతలందరికంటే తదీయులనే అధికులుగా అన్నమాచార్యుడు భావించినాడు.

## తిరుమంత్రము :

శ్రీవైష్ణవ సంప్రదాయమున అష్టాక్షరి, ద్వయము, చరమశ్లోకము అను మూడు మహామంత్రములు ఆచార్యునివలన ముముక్షువు గ్రహించును. ఇందు అష్టాక్షరీ మహామంత్రమునకు, మూలమంత్రము, తిరుమంత్రము అని సంప్రదాయమున వ్యవహారము. భగవదర్చన సమయమున తిరుమంత్రముతో ఆరాధన చేయుట సంప్రదాయము.

అన్నమయ్య తిరుమంత్రమును అనేక కీర్తనలలో మననము చేసినాడు.

**"తెలిసి శ్రీవేంకటేశు తిరుమంత్రము నాలికె**
**బలికి నాటనె దివ్యపదమబ్బు జుండీ"** (3-399)

అని తిరుమంత్రోచ్చారణ దివ్యపదమిచ్చుననియు,

**"ప్రకటించి బహువేద పఠవ చిక్కని నీవు**
**మొకరివై తిరుమంత్రమునకు చిక్కితివి"**

అని పరమాత్మ తిరుమంత్రమునకు చిక్కుననియు,

**"కలదు తిరుమంత్రము కలదిహము పరము**
**కలిమి గలుగు మాకు గడమే లేదు"** (3-531)

అని తిరుమంత్రము వలన ఇహపరములు, కలిమి కలుగునని, కడమ ఉండదనియు తెలిపినాడు.

## ద్వయమంత్రము :

తిరుమంత్రమువలెగాక ద్వయమంత్రము సర్వకాల సర్వావస్థలయందు భక్తుడు ఉచ్చరించుకొనుటకు యోగ్యమైనది.[5]

**"కొదదీర ద్వయమను కుండలంబులు బెట్టి"** (2-148)

అని ఆచార్యుడు ద్వయమంత్రమనే కుండలములు పెట్టి (ఉపదేశించి) తన కొదువను తీర్చినాడనుచు,

**"ద్వయాధికారులు తప్పరు బ్రాహ్మణ్యము"** (2-486)

అని ద్వయమునందు అధికారము కలిగినవారు ఎన్నడూ బ్రాహ్మణత్వము తప్పరని చెప్పుచూ అన్నమయ్య తన కీర్తనలలో ద్వయమంత్ర ప్రాధాన్యము నుగ్గడించినాడు.

**చరమము :**

స్వప్రయత్నములన్నింటినీ వదిలివేసి ఆత్మ సమర్పణము చేయుట చరమ లక్ష్యము.

**"నేనెంత పాపబుద్ధినై నేరమెంత సేసినాను**
**కానీలే నన్నేలే వాడు కావగలడు**
**ఆనతిచ్చె దొల్లె యాతడది చరమార్థమందు**
**మేని దోసమెల్ల బాపి మేలొసగే ననుచు"** (3-521)

అని భగంతుడు రక్షించెదనని చరమమునందు స్వయముగా తెలిపినందువలన తనకిక భయము లేదని

**"చరమార్థమందు నీవు చాటితివి గాన**
**ఇరవిది నమ్మితి నాకెదురెందు లేదు"** (3-462)

అని చరమార్థమును నమ్మినందువలన ఎందును ఎదురుండదని అన్నమయ్య విశ్వసించి ప్రకటించినాడు.

**తిరుమణి :**

పంచ సంస్కారములలోని పుండ్రము శ్రీవైష్ణవుని బాహ్య స్వరూపమును తెలుపునది.

**"నుదుట వ్రాసిన వ్రాత నూటికి నీ తిరుమణి**
**యెదురేది మాకు నేడు యేడు లోకాల"** (3-580)

అని తిరుమణి ధారణ వలన ఏడు లోకాలలో ఎదురుండదని,

**"అనువై నీకు మొక్కగనంటిన నొసలి మన్ను**
**పనివడి నాకు పట్టబద్ధము"** (3-393)

అని ఇందు స్వామికి మొక్కినపుడు నుదుటికి అంటిన మట్టియే తనకు పట్టబద్ధమని తెలిపినాడు. "పట్టబద్ధము"నగా వైష్ణవులు నుదుటన ధరించు "పట్టెవర్ధనాలు" అని వాడుకలో నున్న పుండ్రము.

**చక్రాంకితాలు :**

ఆచార్యునిచే చక్రాంకితములు పొందినవాడే శ్రీవైష్ణవుడు.

**"వ్రాతలు చక్రాంకితాలే వహికెక్కే ముద్రలు"** (3-415)

అని చక్రాంకితాలే గుర్తింపు తెచ్చే నిజమైన ముద్రలనియు,

**"చేతికి వచ్చిన సొమ్ము చేరె నీ శంఖచక్రాలు**
**ఘాతల మాకిక వేది గడమ లేదు"** (3-580)

అని చేతికి అందిన సొమ్ము వంటి శంఖచక్రాల వలన తక్కువ పాటు ఉండబోదనియు తెలుపుచు చక్రాంకితాలను స్మరించినాడు.

**పరికరము :**

శ్రీవైష్ణవమున చిదచిత్తులు భగవంతుని క్రీడార్థము ఆకృతులు కల్పింపబడి సృష్టింపబడిన పదార్థములు. ఈ పదార్థములకు "పరికరము"లని సంప్రదాయమున వ్యవహారము.

**"పెనగొన్న జంతువులు పెక్కులెన్నే గలవు**
**పనిగొన్న నీ దాస పరికరములే"** (3-544)

అని జంతువులు అనగా జీవులు నీకు దాసులనెడి పరికరములేనని, అవి భగవంతుని ఉపయోగార్థమేనని అన్నమయ్య జీవ దాసత్వమును ప్రకటించినాడు.

**"శ్రీవైష్ణవులము శ్రీవేంకటపతి**
**భావింప నితని పరికరము**
**యీవల నావల విహపరములకు**
**తోవ దొలగుమీ తొలి దొలి మాయ"** (2-399)

అని శ్రీవేంకటపతికి శ్రీవైష్ణవులు పరికరములనియు,

**"కాయములో నీవుండేది కడుమరుగులు గావి**
**యీయెడ నీ పరికర మిన్నిటా మున్నదివో"** (3-475)

అని అంతరాత్మ అయిన పరమాత్మ కంటే ఆతని పరికరమైన భాగవతుడు ఎదుట ఉన్నాడని భాగవత పరముగా పరికర శబ్దము అన్నమయ్య ప్రయోగించినాడు.

## ధనుర్మాసము :

"మాసములలో మార్గశీర్షమును నేను" అని భగవంతుడు స్వయముగా తెలిపినందున శ్రీవైష్ణవులకు అత్యంత ముఖ్యమైనది మార్గశీర్షము. దీనికే ధనుర్మాసమని వ్యవహారము.

**"పులుగాలు పచ్చళ్ళు బోనము వెట్టినదిదే**
**వెలయు ధనుర్మాస వేళయు నిదే"** (3-484)

అని పొంగలిని నైవేద్యముగా చేయు విధానము గల ధనుర్మాసమును గూర్చి తెలిపినాడు.

## తిరువాయ్‌మొళ్ళి :

శ్రీవైష్ణవమున ద్రవిడ వేద పారాయణము ప్రతి కార్యమునందును ఆచరించుట సంప్రదాయము. దీనినే "ప్రబంధ సేవాకాలము" అని వ్యవహరింతురు. ఆళ్వారులు ప్రవచించిన గ్రంథములకు, సూక్తులకు "దివ్యప్రబంధము"లని పేరు. తిరువాయ్‌మొళ్ళి ఆ ప్రబంధములలో ఒకటి.

**"చదివేరు వైష్ణవులు సారె దిరువాయిమొళ్ళిదె"** (3-484)

అని వైష్ణవులు పారాయణము జేయు "తిరువాయ్‌మొళ్ళి"ని గూర్చి అన్నమయ్య స్మరించినాడు.

## నిర్మాల్యము :

భగవంతునికి ధరింపజేసి తీసిన మాలలు శ్రీవైష్ణవులకు పరమ పవిత్రము లైనవి. వీనికే నిర్మాల్యములని పేరు.

**"మంచి నిర్మాల్యపు దండ మంగళసూత్రము నాకు"** (3-393)

అని భగవంతుని నిర్మాల్యమును తన మంగళసూత్రముగా భావించి భగవంతుని యందు తనకు గల మధురభక్తిని ప్రకటించినాడు.

## వనమాలలు :

తులసి మాలలు కంఠమున ధరించుట శ్రీవైష్ణవ సంప్రదాయము.

**"వనమాలలున్న గ్రీవము కంబుగ్రీవము"** (2-450)

అని వనమాలలు ధరించిన మెడ శంఖమువంటి అందమైనదని అన్నమయ్య వర్ణించెను.

## పరమపదము :

పరమాత్మ నివాసస్థానమును, ముక్తుడు పొందు గమ్యస్థానమును "పరమపదము" అని శ్రీవైష్ణవులు వ్యవహరించెదరు.

**"యెక్కువ సంకీర్తన మెచ్చోట నుండినాను**
**అక్కడ పరమపదమది భాగ్యము"** (3-490)

అని హరి సంకీర్తనమున్నచోటే "పరమపదము"గా అన్నమయ్య భావించినాడు.

## రామానుజ సంబంధము :

రామానుజ సంబంధములేని భగవత్సంబంధమును శ్రీవైష్ణవులు కోరుకొనరు. ప్రతి వైష్ణవుడు తాను రామానుజ సంబంధికునిగానే భావించుకొనుట సంప్రదాయము. రామానుజులు పరమగురువులు. శ్రీవైష్ణవ మతమునకే రామానుజ మతమని నామాంతరము. అన్నమయ్య అనేక కీర్తనలందు రామానుజులను ప్రస్తుతించి యున్నాడు.

**"ఇట్టి శ్రీవేంకటేశ యిన్నిటికి ఉపాయము**
**మట్టులేని రామానుజ మతము చేకొనుటే"** (2-334)

అని రామానుజమతము చేకొనుటే భగవంతుని చేరుటకు ఉపాయమని తన రామానుజ సంబంధమును ప్రకటించినాడు.

ఈ విధముగా అన్నమాచార్యులు శ్రీవైష్ణవ సంప్రదాయమును ఆచరించుట వలన సంప్రదాయములోని అనేక పారిభాషిక, వ్యావహారిక పదములు ఆతని కీర్తనలలో చోటుచేసుకొన్నవి.

## అథస్సూచికలు

1. శ్లో॥ "అమర్యాద: క్షుద్ర: చలమతి: అసూయా ప్రసవభూ:
కృతఘ్ను: దుర్మానీ స్మరపరవశ: వంచన పర:
నృశంస: పాపిష్ఠ: కథమహం ఇతో దు:ఖజలధే:
అపారాదుత్తీర్ణ: తవ పరిచరేయం చరణయో:"
స్తోత్రరత్నము - యామునాచార్యులు.
2. పేజి-25,26 - భక్తినివేదన మాసపత్రిక ఫిబ్రవరి సంచిక, 1998, సంపా. రామచంద్రాచార్యులు.
3. పేజి - 26 - భక్తినివేదన మాసపత్రిక ఫిబ్రవరి సంచిక, 1998, సంపా. రామచంద్రాచార్యులు.
4. సూ॥ "స్వదోషానుసంధానం భయహేతు:"
సూత్రము-366, ప్రకరణము-3, శ్రీవచనభూషణము.
5. "ద్వయం అర్థానుసంధానేన సహస దైవమ్ వక్తా....."
గద్య-20, శరణాగతి గద్యం - రామానుజులు.

# ఉపయుక్త గ్రంథములు


1. అన్నమాచార్యులు - తాళ్ళపాక : I, II, III, V, VII, IX, XXI, XII, IXV, XV, XVIII, XIX, XXII, XXIII, XXIV, XXV, XXVI, XXVII, XXIX, XXX సంపుటములు.
2. ఆనందమూర్తి-వేటూరి : "తాళ్ళపాకవారి కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు" ప్రభాకర ప్రచురణము-1974.
3. గంగప్ప-ఎస్ : "అన్నమాచార్య సంకీర్తన సుధ" - శశి ప్రచురణలు సుధర్మ-సి.73, శ్రీనివాసనగర్ కాలని, గుంటూరు-1995.
4. గోపాలకృష్ణ-అబ్బూరి : "అన్నమయ్య జనన వత్సర నిర్ణయము" - భారతి - ఫిబ్రవరి,1981.
5. గోపాలాచార్య-కం. : "అష్టాక్షరీ మంత్రార్థము" - ఆంధ్రానువాదసహితము, ప్రకాశకులు-గోపాలాచార్య, 1985.
6. చినతిరుమలాచార్యులు-తాళ్ళపాక : "సంకీర్తన లక్షణము".
7. చిన్నన్న తాళ్ళపాక : "అన్నమాచార్య జీవిత చరిత్రము" - తి.తి.దే.ప్రచురణ, 1982.
8. తిరుమాలాచార్య-రఘునాథాచార్య-చ : "గద్యత్రయమ్" తెలుగు అనువాదము, ధనలక్ష్మీ ప్రింటర్స్, లష్కర్‌బజార్, హన్మకొండ.
9. తిరుమలాచార్యులు-తాళ్ళపాక : "అధ్యాత్మ సంకీర్తనలు-2"
10. దామోదరనాయుడు-గార్లపాటి : "అన్నమయ్య శ్రీవేంకటేశ్వర శతకము - పరిశీలన" విద్యార్థి మిత్ర ప్రచురణము, కర్నూలు-1989.
11. నమ్మాళ్వారులు : 1) తిరువాశిరియం, 2) తిరువాయ్‌మొళి
12. పార్థసారథి-ఆర్ : "రామానుజాచార్యులు" నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, జాతీయ జీవిత గ్రంథమాల - 1969.
13. ప్రభాకరశాస్త్రి-వేటూరి : "అన్నమాచార్య చరిత్ర - పీఠిక" 1949.
14. మనువు : మనుస్మృతి.
15. మళయాళ స్వాములవారు : నారద భక్తిసూత్రములు - వ్యాఖ్యానము, వ్యాసాశ్రమము.
16. యామునాచార్యులు : స్తోత్రరత్నములు.
17. రంగాచార్యులు-చలమచర్ల : "రామానుజకీర్తికౌముది"-శ్రీలక్ష్మీనారాయణపురం, గుంటూరు.
18. రఘునాథాచార్యులు-న.చ. : "తత్త్వోపహారము" - సత్సంప్రదాయ పరిరక్షణ సభ - వరంగల్, 1989 - "ముండకోపనిషత్" వ్యాఖ్యానము - శ్రీమదుభయవేదాన్తాచార్యపీఠము, శ్రీరంగం-1973.
19. రామచంద్రాచార్యులు : "కైంకర్యము" వ్యాసము - భక్తినివేదన వేదాంత మాసపత్రిక, ఫిబ్రవరి,1998.
20. రామానుజస్వామి తి.ప. : "శ్రీవైష్ణవాచార న్ణియము" - 1974 - వేంకటరమణ ముద్రణాలయము, జె.పి.యన్. రోడ్, వరంగల్.

21. రామసుబ్బశర్మ-గౌరిపెద్ది : "పీఠిక - అధ్యాత్మ సంకీర్తనలు - 1, 2, శృంగార సంకీర్తనలు-12.
22. రామానుజాలు : "గద్యత్రయమ్" ధనలక్ష్మి ప్రింటర్స్, హన్మకొండ, 1926.
23. లోకాచార్య-పిళ్లై : శ్రీవచన భూషణము, వేదాంత ముద్రాక్షరశాల, 1923, "ముముక్షుప్పడి".
24. లీలావతమ్మ-పొన్నా : "అన్నమయ్య కీర్తనలలో జానపద గేయ ఫణితులు" - పొన్నా పబ్లికేషన్స్, పొనకం, 1986.
25. వరదాచార్యులు ధనకుధరం : "రామానుజ కీర్తికౌముది"-శ్రీలక్ష్మీనారాయణపురం,గుంటూరు.
26. వాణి-కె : "తాళ్ళపాక అన్నమాచార్య జీవిత చరిత్ర" - తి.తి.దే. ప్రచురణ, 1997.
27. వ్యాసుడు : "భగవద్గీత, విష్ణుపురాణం, శ్రీమద్భాగవతము"
28. వేంకటేశ్వర్లు-బులుసు : "భారతీయ తత్త్వశాస్త్రము" - తి.తి.దే. ప్రచురణ, 1981.
29. వేంకట నరసింహ భాష్యకారాచార్య-శ్రీభాష్యం : "యతీంద్ర మతదీపిక" తెలుగు అనువాదం, మూలం : శ్రీ శ్రీనివాసాచార్యస్వామి - శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి ప్రచురణ, 1975.
30. వేంకటాచార్య-కె : "ఆముక్త మాల్యద - తత్త్వావలోకం" - సిద్ధాంతవ్యాసం (అముద్రితం), 1990, కాకతీయ యూనివర్సిటీ.
31. వేదాంత దేశికులు : "న్యాస వింశతి".
32. శాండిల్యుడు : "భక్తిసూత్రములు".
33. శేషాచార్యులు-కందాడై : 1. "రహస్యత్రయసారము-సాంద్రవ్యాఖ్యానము" - వేదాంత ముద్రాక్షరశాల-మద్రాసు, 1928. 2. "ఆచార్య హృదయము" - వేదాంత ముద్రాక్షర శాల- మద్రాసు, 1927. 3. "శ్రీవచన భూషణ" - సాంద్ర వ్యాఖ్యానము - వేదాంత ముద్రాక్షర శాల- మద్రాసు, 1927.
34. శ్రీనివాసులు-కామిశెట్టి : "ఉపోద్ఘాతము" - అన్నమాచార్య సాహితీ కౌముది - 1931.
35. శ్రీ హరికృష్ణదాస గోయందకా : "శ్రీ రామానుజ గీతాభాష్య హిందీ అనువాద సహితం- గోరఖ్‌పూర్ ప్రెస్.
36. సత్యనారాయణ గుప్త - గట్టె : "ఉపనిషత్ కల్పతరువు" - 1,2,3 సంపుటములు, ప్రార్థనా గాన ప్రచార సంఘం, సత్యనారాయణపురం, విజయవాడ, 1992, 1993. 1)అవ్యక్తోపనిషత్, 2)వాసుదేవోపనిషత్, 3)తారసారోపనిషత్, 4)కఠోపనిషత్, 5)ముండకోపనిషత్, 6)ఛాందోగ్యోపనిషత్, 7) తైత్తిరీయోపనిషత్, 8)బృహదారణ్యకోపనిషత్, 9)మాండూక్యోపనిషత్, 10) శ్వేతాశ్వతరోపనిషత్, 11)అమృతబిందూపనిషత్, 12)సుబాలోపనిషత్, 13)నిరాలంబోపనిషత్, 14) ప్రశ్నోపనిషత్, 15) మహోపనిషత్, 16)ఈశావాస్యోపనిషత్, 17)నారాయణోపనిషత్, 18)త్రిపాద్విభూతిమహానారాయణోపనిషత్, 19)బ్రహ్మవిద్యోపనిషత్, 20)ముక్తికోపనిషత్.
37. సర్వోత్తమన్-కె : "అన్నమయ్య-త్యాగయ్య" - 1983.
38. సాంబశివరావు-గుమ్మ : "అన్నమయ్య సంకీర్తనలలోని వర్ణనలు" - సిద్ధాంతగ్రంథము, కళాసుషమా వారి ప్రచురణ - 1990, భారతీనగర్, విజయవాడ.